# గ్రంథాలయసర్వస్వము.

ప్రథమ సంపుటము

నాల్గవభాగము

ఆంధ్రదేశ గ్రంథభాండాగారసంఘ పక్షమున సంవత్సరమునకు నాలుగు సంచికలుగా ప్రకటింపఁబడు గ్రంథము.

"వాయువెల్లవారికి నెట్లు స్వాధీనమై యున్నదో జ్ఞానముకూడ నట్లు స్వాధీనము కావలయును. ఉదక మెల్లవారికి నెట్లు సేవ్యమై యున్నదో జ్ఞానమట్లు సేవ్యమై యుండవలెను. సూర్యచంద్రమండలముల తేజస్సు నెల్లవారికి ఎట్లు సౌఖ్యప్రదముగా నున్నదో జ్ఞానమట్లు సౌఖ్యప్రదముగ నుండవలయును."

—చిలకమర్తి లక్ష్మీనరసింహము.

కార్యస్థానము : బెజవాడ.

బెజవాడ వాణీ ముద్రాక్షరశాలయందు

బి. కే. స్వామిచే ముద్రింపఁబడియె.

వార్షికమూల్యము రు ౨-౬-౦] ౧౯౧౬. [విడిసంచిక వెల అ. ౧౦.

# Rare Books in Telugu.

చక్కని అచ్చు. **అపూర్వగ్రంథములు** చక్కనివిషయములు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 సతీదేవి | వెల 0—8—0 | | 4 భక్తియోగము | వెల 1—0—0 |
| 2 సావిత్రీదేవి | ,, 0—8—0 | | 5 తుకారాంచరిత్ర | ,, 0—8—0 |
| 3 మల్లికాగుచ్ఛము | ,, 1—0—0 | | 6 విదుషీమణులు | ,, 1—0—0 |

వలయువారిట్లు వ్రాయవలెను:—

మేనేజరు సరస్వతీనిలయము, మచిలీపట్నము.

---

# The Telugu Romantic Poetry.

## గ్రంథాలయముల నలంకరింపవలసిన పంచరత్నములు

రాయప్రోలు సుబ్బారాయ కవీంద్రునిచే రచియింపబడినవి.

1 తృణకంకణము వెల 0—4—0

(మైసూరు యూనివర్సిటీవారిచే బి. ఏ., పరీక్షకు పఠనీయగ్రంథముగ నిర్ణయింపబడినది).

| | | | |
|---|---|---|---|
| 2 కష్టకమల | వెల 0—4—0 | 4 తెనుగుతోట | వెల 0—4—0 |
| 3 స్నేహలతాదేవి | ,, 0—4—0 | 5 స్వప్నకుమారము | ,, 0—4—0 |

వలయువారిట్లు వ్రాయవలెను:—

మేనేజరు అభినవకవితామండలి, బెజవాడ.

---

## శ్రీరామవిలాసగ్రంథమాల.

చిత్రాడ : పిఠాపురము.

ఇందు మనోహరములగు నవలలు, దేశాభివృద్ధికరములగు చరిత్రములు, విమర్శనములు, రాజనీతిగ్రంథములు, పద్యకావ్యములు (ఆధునికభావసంపూరిత గీతావళులు) ప్రకటింపబడును. ఇందు సర్వవిధముల వలసిన ధనసహాయమును మా సంపాదకులగు శ్రీ చెలికాని లచ్చారావుగారు (జమీందారు, ఎర్నగూడెము వగయిరా) చేయుచుండుటచే గ్రంథములు చౌకగ నీయబడుచున్నవి. ఇంతవరకు వెలువడిన గ్రంథములు:—

| | | | |
|---|---|---|---|
| 1 స్త్రీనీతి పద్యరత్నావళి | వెల 0-4-0 | 6 ఐరోపామహాసంగ్రామము | వెల 0-3-0 |
| 2 ప్రభాతము (ఆంధ్రదేశ నవల) | ,, 0-12-0 | 7 మల్లెమొగ్గ—ఉచితము | |
| 3 రాయల రాజనీతి | ,, 0-4-0 | 8 రోహిణి (నవల) | ,, 0-2-0 |
| 4 వినోదిని (నవల) | ,, 0-12-0 | 9 రత్నపురి (వేశ్యలనవల) భీభత్సము, కరుణము) | ,, 0-2-0 |
| 5 కాంచనమాల (చిన్ననవల) | ,, 0-3-0 | | |

పై గ్రంథములన్నియు మాచందాదారులకు పోస్టుఖర్చులు ప్రవేశరుసుము మున్నగునవన్నియు మేమే భరించి రు 2-0-0 లకు మాత్రమే పంపుదుము. పుస్తక భాండాగారములన్నియు త్వరలో జేరినయెడల "సహృదయ" యను 100 పేజీల నవల కానుకగా నీయబడును. ఇతరులకు పోస్టుఖర్చులతో పైగ్రంథములన్నియు రు 2-14-0 లగును. 'సహృదయ' రాదు. వలయువారిట్లు వ్రాయవలెను.

శ్రీరామవిలాసగ్రంథనిలయము, చిత్రాడ : పిఠాపురము.

RSVM01A104



# గ్రంథాలయ సర్వస్వము.

## ప్రవాస రాధిక.

[చండీదాసు మాతృకనుండి అనువదింపబడినది.]

చం. చదలు పయోదమాలికల ♦ శ్యామలమయ్యెఁ దమాలపంక్తులన్
కోదమవనమ్ము చీకటుల ♦ కున్ నెలవయ్యెఁ, గుమారభీరుఁ డీ
యదుసుతుఁ డిల్లుఁజేర్పు మని ♦ యాడెడి నందనిదేశ మాలకిం
చి దెసలుసూచుచుం జనియె ♦ స్నేహతపస్విని రాధ యొంటిమై.

మ. కడలంగాల్నడ నేగు గ్రోవరుల సైఁ ♦ గల్ గానఁగా రావు, చే
పెనుపాలిండ్లరుచుల్ మరుల్ గొలుప గో ♦ బృందమ్ము పోలేదు, పెం
పుతులే లైనఁ గదంబకుంజములదా ♦ పుంజేరఁ వీసంజరా
యొడి వీథీముఖమందు నొందలసితో ♦ యీ! ముగ్ధగోపాలకా!

గీ. చెదరివిరిసిన యాఁబెయ్య ♦ కదుపులెల్ల । మందఁ గొనఁగ నాకర్షించు ♦ సుందరాను
రాగ రాగగీతిక లైన ♦ రావు కృష్ణ!। యొంత చెవియొగ్గివినిన ♦ నీప్రాంతమందు.

ఉ. పచ్చనియాకుజొంపముల ♦ పైఁబసు నందంపుసందెవన్నియల్
విచ్చినసీసిగన్ ప్రతిఫ ♦ లించిన మించులు నేని దోఁప వి
ముచ్చటయైనతోఁపున వి ♦ ముగ్ధుఁడ! దట్టపు చెట్లనీడలం
జొచ్చితొ? యల్లికొన్నసాగ ♦ సుం బొదలంగనుచాటులైతివో!

చం. పొనపొనఁ బూలపిండికణ ♦ ముల్ కణముల్ దొరలంగ పూఁతమో
చిన యెలదీవయిండ్లకడఁ ♦ జిక్కని నీ చరణాంక రేఖకల్
గనఁబడ వార్ద్రదర్భలు స ♦ గమ్ముసగమ్ము గ్రసించు చావలన్
జనిన కురంగపుత్రికలు ♦ సైతము చూపవు నీదుజాడలన్.

ఉ. పాదములొత్తుకో నిసుక ♦ వాగులరేవుల కాలఁద్రిప్పి యా
యాదరులం బ్రదోషసమ ♦ య ప్రియరాగములాలపించి వే
ణూదయభాగ్య మొందణఁగె ♦ నోయి? కుమారయశస్వి! పల్లవ
స్వేదములై కఱంగిన స ♦ సిన్ వెలయింపవు పో వనస్పతుల్.

—రాయప్రోలు సుబ్బారావు.

# కథ — కలాపము.

ప్రథమ ఆంధ్రదేశ గ్రంథభాండాగార ప్రతినిధుల సభ ౧౯౧౪ సం. ఏప్రియలు నెల ౧౦ వ తేదీన బెజవాడ పట్టణమున, ద్వితీయ సభ ౧౯౧౫ సం. మే నెల ౭, ౮ తేదులయందు రాజమహేంద్రవరమున జరగినవి. ద్వితీయ సభ జరగినది మొదలు నేటిదనుక గ్రంథాలయోద్యమము ఆంధ్రదేశమునం దెటుల వ్యాపించినదియు ముచ్చటించుకొందము.

* * *

ఈ వత్సరము బరంపురమునందును, కడప జిల్లా ప్రొద్దుటూరునందును జరగిన మండల సభలకు గ్రంథభాండాగార సంఘపక్షమున కార్యదర్శి పోయి అచట ఈ యుద్యమమును గూర్చి పలువురకో ప్రసంగములను సల్పి అభిమానముకలుగునటుల చేసెను. ప్రొద్దుటూరునందు జరగిన మండలసభయందు గ్రంథాలయములు ఆజిల్లాయందంతటను స్థాపించుటయొక్క ఆవశ్యకతను గూర్చి తీర్మానమొకటి పెట్టబడెను. అందులనుగూర్చి పలువురు ఉపన్యాసములను ఒసంగిరి. కర్నూలు, చిత్తూరు, కృష్ణాజిల్లా రాచపట్నము-లయందు జరగిన మండల సభలకు ఈ సంఘపక్షమున కొడాలి శివరామ కృష్ణారావుగారు పోయి ఆయాసభలందు గ్రంథభాండాగారోద్యమము యొక్క ప్రాముఖ్యమునుగూర్చి జనుల కెల్లరకు బోధించిరి; గ్రంథాలయములా యా జిల్లాలయందు స్థాపించుటయొక్క ఆవశ్యకతను గూర్చియు, ప్రభుత్వమువారు వాటికి చేయదగు సహాయమును గూర్చియు తీర్మానములు జరుగుటకు కారణభూతులైరి. మఱియు గోదావరిజిల్లా రామచంద్రపురమున జరగిన మండలసభకు ఈ సంఘపక్షమున దంటు కృష్ణమూర్తిగారు పోయి యుండిరి.

* * *

కడపజిల్లా ప్రొద్దుటూరు నందు మండల రాజకీయసభ జరగినప్పుడే, మండల గ్రంథాలయ ప్రతినిధుల సభకూడ గాడిచర్ల వేంకట్రావు పంతులుగారి ఆధిపత్యముక్రింద జరగినది. ఆసభయందు గవర్నమెంటువారిని ద్రవ్యసహాయముకొఱకు ప్రార్థించుచు రెండు తీర్మానములును, కడపజిల్లాకు గ్రంథభాండాగార సంఘమును ఏర్పాటుజేయుచు మరియొక తీర్మానమును చేయబడినవి. ఈ వత్సరము ఏప్రియలు నెల ౨౧ వ తేదీన గుడివాడయందు జరగిన మండలసభతో పాటు, కృష్ణామండల గ్రంథాలయసభకూడ వల్లూరి సూర్యనారాయణరావు బి. ఏ. బి. ఎల్. ఎల్. టి; గారి అగ్రాసనాధిపత్యము క్రింద కూడినది. ఈసభయందు కృష్ణాజిల్లాకును గుడివాడ తాలూకాకును గ్రంథాలయసంఘము లేర్పాటు గావింపబడినవి. కృష్ణాజిల్లా గ్రంథాలయ సంఘమునకు ౧ భూపతిరాజు తిరుపతిరాజుగారు ౨ కొడాలి సత్యనారాయణగారు 3 దుగ్గిరాల వేంకటసుబ్బయ్యగారు కార్యదర్శులుగ నేర్పాటుగావింపబడిరి. గుడివాడతాలూకా గ్రంథాలయ సంఘమునకు దాసరి లక్ష్మీనారాయణ.

గారిని కార్యదర్శిగ నేర్పాటుగావించిరి. ఈ సభాధ్యక్షుల యొక్కయు, ఆహ్వానసంఘాధ్యక్షుల యొక్కయు ఉపన్యాసములు సంక్షేపములుగా ఈసంచికయందే వేరొకచో ముద్రింపబడినవి. గోదావరిజిల్లాకు గ్రంథాలయ సంఘమేర్పాటుగాకపోయినను, రాజమహేంద్రపురవాస్తవ్యులును వసురాయ పుస్తకభాండాగారమునకు కార్యదర్శియునగు శ్రీఅద్దంకి సత్యనారాయణ శర్మగారు ఆజిల్లాయందు సంచారముచేయుచు గ్రంథభాండాగార సంఘమేర్పాటు గాని లోటును తీర్చుచున్నారు. ఈవత్సరము మే నెలయందు గుంటూరు మండల గ్రంథాలయ ప్రతినిధుల సభ తెనాలియందు కూడి, అందు ఆమండలమునకు గ్రంథాలయ సంఘమేర్పాటు గావింప బడినది. ఈ సంఘమునకు ౧ చట్టి నరసింహారావుగారు ౨ తాడంకి వెంకయ్యగారు 3 కర్లపాలెం వేంకటనారాయణప్పగారును కార్యదర్శులుగ ఉన్నారు.

* * *

బెజవాడతాలూకాకు ఈసంవత్సరప్రారంభము నందే గ్రంథాలయ సంఘమేర్పాటుగావింపబడినది. దీనికి ౧ చిరుగుపాటి వేంకటసుబ్బారావుగారును ౨ బొడ్డపాటి హనుమంతరావుగారును కార్యదర్శులుగను, బండి వేంకటకృష్ణయ్యగారు అధ్యక్షులుగను ఉండియున్నారు. గుడివాడయందు జరగిన కృష్ణామండల గ్రంథాలయసభకుపూర్వమే ఈసంఘము పనిచేయుటకు ప్రారంభించినది. కార్యదర్శిగారగు బొడ్డపాటి హనుమంతరావుగారు ఈతాలూకా యందున్న గ్రంథాలయము లెటుల పనిచేయుచున్నదియు స్వయముగాచూచివచ్చి మండలసభయందు చెప్పిరి.ముందుకూడ విశేషముగ పనిజరగుసూచనలు కనుపించుచున్నవి.

ఈ వత్సరముననే రామచంద్రపురం తాలూకా గ్రంథాలయ సంఘముకూడ ఏర్పడియున్నది. ఈ సంఘమునకు దంటు కృష్ణమూర్తిగారును, బిక్కని వెంకటరత్నముగారును కార్యదర్శులుగను, యర్లమిల్లి జగన్నశాస్త్రిలుగారధ్యక్షులుగను ఉన్నారు. కొలది కాలముక్రిందటనే ఏర్పడియున్నను, కార్యదర్శియగు దంటు కృష్ణమూర్తిగారి కార్యోత్సాహము వలనను పట్టుదలవలనను విశేషముగ పని జరగినది. తాలూకాయందున్న గ్రంథాలయములను తఱచుగ దర్శించుచు, వాటియొక్క పనినంతను ఏకముఖమున బెట్టుటకై వీరు నిరంతరము పాటుపడుచున్నారు. "గ్రంథాలయ పాలనము"ను గుఱించి వీరిచే వ్రాయబడిన వ్యాసము ఈ సంచికయందే వేరొకచోట ప్రకటింపబడినది. దానిని బట్టి వారు గ్రంథాలయ ఉద్యమమునం దెంత బాధ్యతను వహించి పని చేయుచున్నదియు బోధపడగలదు.

గుంటూరుజిల్లాయందున్న తెనాలి తాలూకాకుగూడ గ్రంథాలయ సంఘమును ఏర్పాటు చేయుటకై ఇదివర కనేక ప్రయత్నములు సలుపబడినవి; కాని, తుదకు మే నెలయందు తెనాలియందు కూడిన మండల గ్రంథాలయ ప్రతినిధుల సభాసమావేశ సందర్భమునందు ఆ ప్రయత్నము కార్యరూపముగా సఫలమైనది. ఈ సంఘమునకు సత్తెనపల్లి హనుమంతరావుగారు కార్యదర్శిగను, అంచే శివయ్యగారును నూదురుగుచ్చి శేషాచల శర్మగారును సహాయ కార్యదర్శులుగను ఏర్పాటు గావింపబడిరి. గ్రంథాలయ సంఘము ఇదివరకు లేకున్నను, ఈ తాలూకాయందున్న గ్రంథాలయముల అభివృద్ధికై శ్రీ

హనుమంతరావుగారిదివరకే విశేషముగ శ్రమపడుచున్నారు. ఇంతేగాక కొన్ని గ్రంథాలయములయొక్క సహాయముతో నీరును శ్రీభాగవతుల సుబ్బయ్యగారును కలసి ప్రారంభ విద్యాసంఘమును స్థాపించి మూడుసంవత్సరములనుండియు తదేకనిష్ఠతో పనిచేయుచున్నారు. ఒంగోలు తాలూకాకుగూడ గ్రంథాలయసంఘ మేర్పడినది. దీనికి ౧ వసుమతి౯ నరసింహంగారును ౨ పొన్నలూరి రాఘవయ్యగారును కార్యదర్శులుగ ఉన్నారు.

* * *

తెనాలి తాలూకా అనంతవరం గ్రామమున భారతీ విలాస గ్రంథనిలయమును ఆ గ్రామవాస్తవ్యులగు శ్రీకుప్పా శ్రీరామశర్మగారు స్థాపించిరి. ఈ గ్రంథాలయమునందున్న అమూల్యములగు అనేక గ్రంథములను వీరే స్వయముగ కొని ఇచ్చి యున్నారు. దీనికి నివేశనస్థలమును కొని యిచ్చి, భవన నిర్మాణమును వీరే ప్రారంభించియున్నారు. ఇటీవల ఈ సంఘమును ౧౮౬౦ సం-౨౧నెం "ఆక్టు" ప్రకారము రిజష్టరుచేసి యున్నారు. ఈ సంఘమును "రిజష్టరు" చేయించుటకై కావలసిన నింబంధనలు మొదలగు వాని నేర్పాటు చేయుటకై గ్రంథాలయ సంఘకార్యదర్శి ఆ గ్రామమునకు పోయి సహాయమును చేసెను. మఱియు కృష్ణాజిల్లా కుముదవల్లి గ్రామమునందున్న వీరేశలింగ సమాజమును గుంటూరుజిల్లా సంగంజాగర్లమూడి గ్రామమునందున్న సర్వజనవిద్యా ప్రదాయినీ పుస్తకభాండాగారము వారును "ట్రస్టుడీడు"లను వ్రాయించుకొనుటకై వచ్చి గ్రంథాలయసంఘము వారి సహాయమును కోరిరి. ఆ సంఘముయొక్క ఉపాధ్యక్షులగు శ్రీసూరి వేంకట నరసింహంగారు వారిద్దరికిని వారి గ్రామములయందలి స్థితిగతుల కనుకూలముగ నుండునటుల దస్తావేజులను వ్రాసి పెట్టిరి. ఇంతేగాక అనేక గ్రంథాలయములు నిబంధనలు చేసికొనుటకు కార్యదర్శులు సహాయపడిరి; భవన నిర్మాణవిషయమై అనేక మందికి సలహాలనిచ్చిరి; మరియు అనేక గ్రంథాలయములయొక్క వార్షికోత్సవములకు పోయి గ్రంథాలయోద్యమమును గూర్చియు గ్రంథాలయములను ఎక్కువ ఉపయోగకరముగ చేయుటకు గల విధానములనుగూర్చియు విపులముగ బోధించిరి. ఒంగోలు తాలూకాయందు శ్రీ ఎం. వి. ఏన్. శర్మగారు పలుచోట్ల సంచరించి గ్రంథాలయోద్యమమును బోధించి కొన్ని స్థలములయందు నూతన గ్రంథాలయములను స్థాపించిరి.

* * *

ప్రథమ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ కగ్రాసనాధిపత్యము వహించిన శ్రీచిలకమర్తి౯ లక్ష్మీనరసింహం పంతులుగారు గ్రంథాలయోద్యమ విషయమై పనిచేసినట్లు ఇంకెవ్వరును చేసియుండలేదని చెప్పవచ్చును. ఎండాకాలమనక వానాకాలమనక- దూరమనక దగ్గరయనక, సకలశ్రమలకోర్చి ఈమూడు వత్సరములనుండియు వీరు షుమారు నూరుగ్రామములకుపోయి తమగంభీరవాక్కులచే గ్రంథాలయోద్యమమును ఆంధ్రదేశమునందంతట నుచాటిరి. సమర్థులగువారు పదిమందిగూడి చేయదగినపనిని వీరొక్కరే చేయగలిగిరని తెల్పినఅందు అతిశయోక్తి ఎంతమాత్రమును లేదు.

* * *

ఈ సంవత్సరమున ఆంధ్రదేశ గ్రంథభాండాగార సంఘముయొక్క కార్యనిర్వాహక

సభలు రెండు మాత్రము జరిగినవి. మొదటిది బెజవాడ యందును, రెండవది గుంటూరు-నందును జరగినవి. కార్యనిర్వాహక సభలు తక్కువగ జరగినప్పటికిని, జరగవలసిన పనులకు మాత్రము ఆటంక మెంతమాత్రమును కాలేదు.

* * *

ఈ వత్సరమున కార్యదర్శులలో నొకరు షుమారు అరువది గ్రంథాలయములను దర్శించి, ఉపన్యాసములిచ్చియు, సలహాల నొసంగియు ఉద్యమ ప్రచారమునకై పాటు పడియున్నారు.

* * *

౧౯౧౪ సం. యొక్క గ్రంథాలయచరిత్ర ముద్రింపబడిన సంగతి చదువరులందరికిని తెలిసినవిషయమే. దానిని ప్రచురించుట వలన అమితముగ ఉత్సాహము జనించి, రాగలవత్సరము విశేషముగ అభివృద్ధిని జూపవలెనను పట్టుదల కలిగినది. దీనిని గ్రహించి ౧౯౧౫ సంవత్సరమునకు గూడ గ్రంథాలయచరిత్రను ప్రకటించినాము.

* * *

ఈవత్సరమున గ్రంథాలయ ఉద్యమవ్యాపనమునకై "గ్రంథాలయ సర్వస్వము"ను ప్రారంభించిన సంగతి చదువరులందరు ఎఱుగుదురు. దీని ప్రచురమువలన ఈ ఉద్యమవ్యాప్తికి గొప్ప సహాయము కలిగినదని చెప్పవచ్చును. దీనియొక్క జమాఖర్చులు ఈసంచికయందే వేరొకచో ప్రకటింపబడినవి.

* * *

ఒంగోలు తాలూకా కొప్పెరప్పాడు నివాసులగు శ్రీ పొన్నలూరి రాఘవయ్యగారు వారి గ్రామమునందున్న గ్రంథాలయ పక్షమున ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘకార్యదర్శులను ఆహ్వానముజేసి, "గ్రంథాలయ సర్వస్వము"నకై ఏబదిరూప్యముల బహుమతి నొసంగి సన్మానించిరి. దీనివలన గ్రంథాలయోద్యమమునందు పల్లెలయందుండు జనులకుకూడ ఎట్టియభిమానము కలుగుచున్నదియు ధ్వనింపగలదు. ఈ గ్రామమునందు రు ౪౦౦౦ లను ఖర్చుపెట్టి గ్రంథాలయమునకు భవనమును నిర్మించిరి; ఆయావరణయందే పాఠశాలనుగూడ కట్టిరి.

* * *

ఆంధ్రదేశ గ్రంథభాండాగార సంఘమునకు ౧౯౧౫ సం॥ మే నెల మొదలు ౧౯౧౬ సం॥ మే నెల వరకును రు ౨౫౨-౧౨-౬ లు ఆదాయమువచ్చినది. ఇందు గతవత్సరపు తాలూకు నిల్వ రు ౪౭-౪-౬; విరాళములు రు ౧౫౨ ద్వితీయ గ్రంథాలయ ప్రతినిధులయొక్క సభ ప్రతినిధుల కట్నములు రు ౫౩-౮-౦; విరాళములయందు న్యాపతి సుబ్బారావు పంతులుగారు రు ౧౦౦ లను, వేమూరి రామచంద్రరావుపంతులుగారు రు ౧౦ లను, వల్లూరి సూర్యనారాయణరావు పంతులుగారు రు ౧౦ లను, జంధ్యాల గౌరీనాథ శాస్త్రులుగారు రు ౧౦ లను, భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు రు ౫ లను, కోపల్లె హనుమంతరావుగారు రు ౫ లను, జి. శేషగిరిరావుగారు ౫ లను, దుగ్గిరాల సూర్యప్రకాశ రావుగారు రు ౪ లను, కట్టమూడి చిదంబరరావుగారు రు ౩ లను, ఒసంగిరి.

* * *

ఆంధ్రదేశ గ్రంథభాండాగార సంఘమునకు ఈ వత్సరమునందయిన ఖర్చు రు ౨౦౮-౧౧-౯ లు. అంశలవివరము:- పోస్టేజి రు ౨౧-౮-౩;

టెలిగ్రాఫ్ ౦-౧-౨-౦; కవర్లు, కాగితములు రు౩-౨-౦; అచ్చు రు౯-౬-౬; ప్రయాణముల ఖర్చు రు౬౩-౧౫-౦; బహుమతిగ్రంథములు తెప్పించుటకు రయిలు ఖర్చు రు౨-౪-౦; బ్లాకు రు ౫; ప్రథమవత్సర వృత్తాంతమును ముద్రించుటకును, "బ్లాకులు" ముద్రించుటకును అయిన ఖర్చులు ౨౭-౧౨-౦; గ్రంథాలయ సర్వస్వము తాలూకు గతవత్సరము వాడుకొన్న సొమ్ము తిరిగి ఇచ్చివేసినది రు ౭౫. ఈ ప్రకారము ఖర్చుపోను ౧౯౧౫ సం. మే నెలవరకు నిలువ రు ౪౪-౦-౯.

* * *

బరంపురం వాస్తవ్యులగు శ్రీ వెలిదెండ శ్రీనివాసరావు పంతులుగారు ఆంధ్రభాషయందుగల గ్రంథములను విషయములను బట్టి విభజించుచున్నారు. వారు ఇంతవరకును దాదాపు ౪౦౦౦ గ్రంథములను ఈ ప్రకారము విభజించి యున్నారు. ఇంకను విభజింపవలసిన గ్రంథములు అధమము ౨౦౦౦ వరకైన నుండునని మాతలంపు. ముందుచేయవలసిన పనికి గాను ఎవరైనను ఒకరు మద్రాసునందుండి "రిజిస్ట్రారు ఆఫ్ బుక్సు" ఆఫీసునందు కొంతకాలము పరిశీలించుట ఆవశ్యకమై యున్నది. ముందు చేయవలసిన పని నంతను తాముచేసి, గ్రంథమునంతను సిద్ధముచేసి, అచ్చువేయించెదనని శ్రీపురాణం సూరిశాస్త్రులుగారు వాగ్దాన మొనర్చి యున్నారు. వీరి సహాయము వలన ఈపని త్వరలోనే పూర్తి కాగలదు.

* * *

నెల్లూరునందు తృతీయ గ్రంథభాండాగార ప్రతినిధుల మహాసభ కడచిన మేనెల ౧౨ ౧౩ తేదులయందు జరగినది. ఈ సభా వృత్తాంతమును వేరొకచో కానవగును. ఇది వరలో జరగిన రెండు సభలకంటె ఈ సభ జయప్రదముగ జరగినదని చెప్పవచ్చును. అనంతపురం జిల్లాయందు రయిలుస్టేషను నుండి షుమారు ఇరువైయైదుమైళ్ళ దూరముగల "ఉర్వకొండ" "చినముష్టూరు" గ్రామముల నుండి ప్రతినిధులే తెంచిరి మరియు దగ్గరగా ఉన్న కృష్ణా, గోదావరి, గుంటూరు జిల్లాల నుండియేగాక దూరమునందున్న విశాఖపట్నము, గంజాం, చిత్తూరు, మండలములనుండి కూడ ప్రతినిధులే తెంచిరి. విశాఖపట్నము జిల్లాయందు రయిలుస్టేషనునకు షుమారు ఇరువదిమైళ్ళ దూరమునందున్న మాడగుల నుండి కూడ ప్రతినిధులే తెంచిరి. రయిలు స్టేషను దగ్గరలేకపోయినను, సకలశ్రమలకోర్చి దూరప్రదేశములనుండి వచ్చిన ఈప్రతినిధుల ఉత్సాహమెంతయు ప్రశంశనీయము. ఈ వత్సరము సభయందు పలుభాగములనుండి వచ్చిన ప్రతినిధులందరును ఆయాభాగముల యందలి గ్రంథాలయములను గూర్చి తమ స్వానుభవములను విపులముగా చెప్పిరి. ఇట్లు పరస్పర అనుభవములను వెళ్ళడించుకొనుటవలన ప్రతినిధులందరును ఈయుద్యమమునందు ఎక్కువ జ్ఞానమును సంపాదింప గలిగిరని చెప్పుట కెంతమాత్రమును సందియముండదు. మొదటి దినమున సభ సావకాశముగ జరిగినది. కాని రెండవ దినమున ఆహ్వానసంఘాధ్యక్షుడును, అధ్యక్షుడును, సభాకార్యములు ప్రాతఃకాలముననే ముగింపవలయునని తొందరపడుటవలన, సభ ౧౧ గంటలవరకును సాగి, కొందరకు విసుకు జనించినది. మధ్యాహ్నమున కూడ జరపిన రెండవదినమున కూడ వలయునంత సావకాశముగ సభ జరగి యుండెడిది.

* * *

ఈ సంవత్సరమున నెమలి సుబ్బారావుపంతులుగారు కూడ ఉపాగ్రాసనాధిపతిగ ఏర్పాటుచేయబడిరి. వీరు శ్రీ వేంకటగిరి కుమారరాజాగారికి కార్యదర్శులు. విద్యాశాలలను స్థాపించుటకై పలువిధముల పరిశ్రమ జేసిన ధీరులు శ్రీ పురాణం సూరిశాస్త్రిలుగారును అవసరాల వేంకటరెడ్డి పంతులుగారును సహాయకార్యదర్శులుగ నేర్పడిరి. శ్రీ సూరిశాస్త్రిలుగారు ఇదివరకే భాషాసేవను జేయుచు వన్నెకెక్కియున్నారు. శ్రీ రెడ్డిపంతులుగారు ధనవంతులును విద్యాధికులునై యున్నారు. వీరిద్దరిని సహాయకార్యదర్శులుగ నేర్పాటు జేయుటవలన గ్రంథాలయోద్యమ ప్రచారమునకు గొప్ప లాభము చేకూరినదని చెప్పవచ్చును.

* * *

గంజాం జిల్లా "బారువ"నుండి శ్రీ తిత్తిబలరామయ్యగారు, శ్రీ జగన్నాధపాడి ఖడంగారును సభకు విశేషశ్రమకోర్చి వచ్చియున్నారు. వీరిలో శ్రీ ఖడంగారికి 'ఉత్కలము' మాతృభాష. అయినప్పటికిని, వీరికి ఆంధ్రభాషయందును ఆంధ్రదేశమునందును గల అభిమానము మెండు. ఆయభిమానముచేతనే, దూరదేశమైనను నెల్లూరునకు వచ్చి, గ్రంథాలయ ప్రతినిధుల సభను తమ గ్రామమునకు ఆహ్వానము చేసిరి.

* * *

ఆహ్వాన సంఘాధ్యక్షులగు శ్రీ మైదవోలు చెంగయ్య పంతులుగారి ఉపన్యాసము మొత్తముమీద బాగుగనే యున్నది. ప్రతివత్సరమును సభ జరపుటకు ఆవశ్యకమగునంత పనిలేదని వారి యభిప్రాయము. గ్రంథాలయములు తగినన్ని లేక పోవుటవలనను, ఉన్నవియైన సరియైన స్థితియందు లేకపోవుటచేతను గదా తగినంత పని లేకున్నది! ఈ హీనస్థితిని పోగొట్టుటకే యిట్టిసభను ప్రారంభింపవలసిన యావశ్యకతయు, ప్రతివత్సరమును జరపవలసిన యావశ్యకతయు, కలిగినది ప్రథమసభ జరిగినప్పటినుండియు ఆంధ్రదేశమునందు ఈ ఉద్యమమునుగూర్చి విశేషముగ ఉత్సాహము, అభివృద్ధి కలిగినవి; ఈ విషయమును గమనించిన వారెవ్వరును, ప్రతివత్సరమును ఈ సభ జరపుటయొక్క అవశ్యకతను గ్రహింపకపోరు.

* * *

'దేశాభిమాని' పత్రిక "ఆంధ్రావబోధ"మను శీర్షికయందిట్లు వ్రాయుచున్నది:- "నెల్లూరులో జరగిన ఆంధ్ర గ్రంథభాండాగార ప్రతినిధుల సభగూడ ఆంధ్రోద్యమ వ్యాప్తికై పని చేయుచున్నది. గ్రంథాలయములయొక్క ప్రయోజన మీ యుద్యమము మొదలిడిన దినములలో స్పష్టముగ కనుపింపక పోయినను గ్రంథాలయ సర్వస్వము ప్రచురణమగుచున్న తరువాత గ్రంథాలయము లెంత ప్రయోజనకారియో, తెలుపకయే తెలుపుచున్నది. గ్రంథాలయములు పఠనమందిరములే గాక, ప్రజాహితజీవనమునకును, పంచాయితీల విషయమయ్యును సహకారసంఘముల స్థాపించుటలోను ప్రారంభోచిత విద్యను వ్యాపింప జేయుటకును నిమ్నజాత్యుద్ధరణమునకైయ్యును- ఇది యది యననేల- ప్రతి గ్రామమునందును స్వపరిపాలనా స్వాతంత్ర్యమునకు పునాదినైచుటలో గ్రంథాలయములు ముఖ్యముగ తోడ్పాటు జేయగలవు."

* * *

గ్రంథాలయోద్యమముయొక్క సంపూ

ర్ణావికాసమును దేశీయుల దృష్టి పథమున పెట్టుటకు గాను పలువిధములైన వ్యాసములు "గ్రంథాలయ సర్వస్వము"నందు ప్రచురింపబడు చున్నవి. ఐనప్పటికిని దేశీయులలో కొందరికి గ్రంథాలయోద్యమ తత్వము సరిగా బోధపడకుండుట మిక్కిలి విచారకరము. అట్టివారు "దేశాభిమాని" పత్రికయొక్క అభిప్రాయమును తిలకించెదరు గాక!

* * *

శ్రీ వేమూరి విశ్వనాథశర్మ, ఎమ్. ఏ.గారు ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికయందు "విద్యావ్యాపకము" అను శీర్షికయందిట్లు వ్రాయుచున్నారు:- "జనసామాన్యముయొక్క విద్యకై గ్రంథభాండాగారములు చేయదగిన పనులు చాలగలవు. ప్రస్తుతము గ్రంథభాండాగారోద్యమ కార్యనిర్వాహకులు ప్రతి గ్రామమునందును భాండాగారములు స్థాపించుటకును, ఉపన్యాసము లిచ్చుటకును ప్రయత్నము చేయుచున్నారు. ఈ ప్రయత్నములు నెరవేరుటకు కొన్ని మార్పులు గావలసియున్నవి. భాండాగార సంఘపక్షమున ప్రత్యేకించి సంచారికోపన్యాసకు లుండవలెను. గ్రామమున కొక యుపన్యాసము వంతున నిచ్చినచో నుపయోగముండదు గాన, ఏదోయొక విషయము పూర్తియగు దనుక, ఆ గ్రామములోనుండి బోధచేసినయెడలలాభకారిగానుండును. భౌతిక శాస్త్రాదివిషయము లీసాంచారికోపన్యాసకులు నేర్పదగినవి. ఏలయన, విశేష ధనవ్యయమగు పరికరములు ప్రతి పల్లెకూటమునను దొరకుట దుర్లభము. ఒకమ్యాజికు లాంతరు కొనుటకు దాదాపు వేయిరూపాయలుగావలసియుండును. ఉపన్యాసకులదగ్గఱ ఒక్క లాంతరుండినచో ననేక గ్రామములు దానిలాభమును పొందగలవు. ఇట్లే విశేషము ఖరీదుగల పటములు గ్లోబులు మున్నగు పరికరములు రెండు మూడు పెట్టుకుండిన ప్రస్తుతముపకరించును. భాండాగారోద్యమ నిర్వాహకులు ప్రతిగ్రామమునను గ్రంథాలయములు స్థాపించుటకు ప్రయత్నింపఁగూడదు. అట్లు ప్రయత్నించినను సాధ్యముగాదు. ఏవో పదిపుస్తకములుపెట్టి భాండాగారమనిన లాభముండదు. జ్ఞానదాయకములగు పుస్తకములు మాత్రమే గ్రంథాలయముల నలంకరింపవలెను. ఇట్టి గ్రంథాలయములు ధనసాధ్యములు గాని కోరికెలకును మాటలకును లోపడవు. బెజవాడ రామమోహన పుస్తకాలయము వంటిది ప్రతియూరను సాధ్యమగునా? అంతమాత్రమైననులేని భాండాగారములున్నను జ్ఞానాభివృద్ధికై లేనివానిలోనే జమ. ప్రతిగ్రామమున పుస్తకాలయములను స్థాపించుటకు ప్రయత్నము చేయుటకంటె గ్రంథాలయములను స్థాపింపలేని యూళ్లను చందాదారులుగ చేసికొని యొక గొప్ప భాండాగార కూటమును ఏర్పఱచుట సులభము. గ్రామము మీఁద సాలునకు ఇరువదిరూపాయల వంతున పోగుచేయుట యసాధ్యముకాదు. చిన్నగ్రామములు పదిరూపాయలిచ్చినచాలును. గ్రంథాలయకూటములనుండి సంచారోపన్యాసకుల ద్వారా పుస్తకములను చందా గ్రామములకు పంపవచ్చును. తడవకు ౫౦ పుస్తకములు పంపి, నెల రోజులు గడువు పెట్టినయెడల చాలును. ఈ నెలరోజులు ఉపన్యాసకులు తమ కార్యముల నెరవేర్చుచుండ వచ్చును. చందాదారులగు గ్రామములకే పుస్తకములు పంపబడును. గ్రామములమీఁద చందాపద్ధతి యేర్పడిన యెడల గ్రంథాలయకూటము శీఘ్ర

కాలములో నభివృద్ధి చెందుటయేకాక పుస్తకదానములకై గ్రంథకర్తలను పీడించుట కూడ తగ్గిపోవును."

* * *

శర్మగారు చెప్పిన విషయములలో మొదటిది సంచారోపన్యాసకుల నేర్పాటు చేయుట. అట్టివారిని ఒక్కరినైన ఏర్పాటు చేయుటకై గ్రంథభాండాగార సంఘము వారు ప్రథమగ్రంథాలయప్రతినిధులసభ జరగిన నాటినుండియు ప్రయత్నించుచున్నారు. కాని ద్రవ్యాభావముచే వారి ప్రయత్నము సఫలము కాలేదు. రెండవది మ్యాజిక్కులాంతరు; సంచారోపన్యాసకుని ఒక్కనినైన ఏర్పరచిన పిమ్మట దీనికై ప్రయత్నించుట యుక్తము. ప్రతిగ్రామమునందును గ్రంథాలయములను స్థాపించుటనుగూర్చి తృతీయ గ్రంథభాండాగార ప్రతినిధుల సభయొక్క ఆహ్వాన సంఘాధ్యక్షులు శర్మగారికి ఇట్లు ప్రత్యుత్తరమిచ్చియున్నారు:-

"ప్రతిగ్రామమునందును ఒక గ్రంథాలయ ముండునటుల చేయుట కష్టసాధ్యమనియు గ్రామస్థులయొక్కయు ప్రభుత్వము వారియొక్కయు సహాయములేనిది సాధ్యముగాదనియు జెప్పవచ్చునే గాని, ఇట్లు చేయుట యాదేశముగా నుండగూడదనుటకు కారణములు గోచరింపవు. అసలే గ్రంథాలయము లేకుండుటకన్న ఎట్టిదైననొక గ్రంథాలయముండుట శ్రేయస్కరమని స్పష్టముగా జెప్పవచ్చును."

* * *

తృతీయ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభకు అగ్రాసనాధిపతు లగు నాగేశ్వరరావు పంతులుగారి ఉపన్యాసమును గ్రంథాలయ ఉద్యమాభిలాషులందరును మననము చేయుదురని కోరుచున్నారము. గ్రంథాలయ ప్రతినిధుల సభయొక్క అవసరములను గూర్చి వారిట్లు చెప్పిరి:—

"మనకు గల యవకాశములను పరిస్ఫుటము చేయుటకు నూతన గ్రంథాలయములను స్థాపించుటయును, స్థాపితములైన గ్రంథాలయములకు కార్యనిర్వహణమునకు దగినసాధనములను గలుగజేయుటయును అవసరము. ఈ యవసరములను గ్రహించి గ్రంథాలయసభ నిర్వహించుచున్న కార్యక్రమము శ్లాఘ్యము."

ఇతర సభలకును ఈ సభకును వారిట్లు తారతమ్యమును చూపిరి:-

"రాజకీయ సభలయందును సాంఘిక సభలయందును క్రియలేని భావములు వివాదములకుం గారణంబులుగ నున్నవి. సభాసమావేశములు భావప్రకర్షముతో నారంభమై భావనిర్ణయముతో నంతము నొందుచున్నవి. గ్రంథాలయ సభలు కార్యక్షేత్రములతో నారంభమై కార్యవ్యాపనమునకు సోపానంబు లగుచున్నవి. గ్రంథాలయ సభకు ప్రతినిధులు గ్రంథాలయ నిర్వాహకులు. గ్రంథాలయముల ప్రతినిధులు కార్యశూరులు గాని వాక్శూరులు గారు. స్వయం సహాయావలంబనులు గాని నివేదనావలంబనులు గారు. త్యాగపరులు గాని స్వార్థపరులు గారు. సేవానిరతులు గాని లాభార్థులు గారు. వ్యగ్రోత్సాహభరితులైన యువజనులు గాని సుస్థిరమతులైన స్థవిరులు గారు. మాతృభాషాభిమానులు గాని మాతృభాషా నిరపేక్షకులు గారు."

గ్రంథాలయముల ప్రయోజనములనుగూర్చి వారు చెప్పిన సంగతు లెంతయు సంస్తవనీయములుగ నున్నవి:-

"జాతీయ వికాసంబున కవసరంబైన వివిధవ్యవహారంబులందును గ్రంథాలయములకుం బ్రమేయముండినం గాని గ్రంథాలయములు దేశమునకును భాషకును ప్రజలకును సాధ్యమైన ప్రయోజనకారులు గావు. వ్యక్తివికాసమున కవసరములైన వివిధోద్యమములను నిర్వహించుటకు గ్రంథాలయములు సాధనములుగ నుండవలయును. గ్రంథపఠనము పత్రికాపఠనము గ్రంథాలయములవలనం

గలుగఁగల ప్రయోజనమునం దొకవంతు మాత్రముగ నున్నవి. గ్రంథాలయంబులు పఠనమందిరంబులు వ్యాయామ నిలయంబులై కళాక్షేత్రంబులై సేవాసదనంబులై విద్యాలయంబులై సుందరమందిరంబులై నాటకరంగంబులై ధర్మసంరక్షణసాధనంబులై విరాజిలునపుడు జాతీయ వికాసంబునకు మహత్తరంబైన సాధనంబులు కాగలవు."

శ్రీ పంతులుగారు చెప్పిన ఈ క్రింది వాక్యములను గ్రంథాలయ నిర్వాహకులందరును ముఖ్యముగ గమనింపవలెను:-

"గ్రంథాలయములను సాంఘిక జీవన వికాసమునకు దగిన సాధనంబులను జేయుట సమంజసంబైనను, ఉపాహార గృహంబులు గా నుండనటులు గ్రంథాలయ నిర్వాహకులు నియమించుట యవసరము. ఫలహారములకును విజ్ఞానమునకును మిత్రత్వము దుర్లభము."

# గీతప్రపంచము

గానంపు రెక్కలు ♦ గట్టి యా తన్వి
పైనన్ను గొంపోయెఁ ♦ బరమసంప్రీతి
రెక్కలల్లనవిచ్చి ♦ రివ్వున నేగ
నెక్కడికో గాని ♦ యేఁజూడనైతి
కనుదోయి వాలె రె ♦ క్కల గాలి సాఁగ
చనినాడనల్ల యా ♦ చానతో గూడ
దూదిమెత్తలబొత్తి ♦ తో బోలు మబ్బు
లై దారు దూరినా ♦ మటుచీల్చికొనుచు
ఆనందమార్గమం ♦ దటులేగి తరుణి
తానల్లకాలూని ♦ తామాయమయ్యె.

* *

నేను కన్నులు విప్పి ♦ నిలచి చూచితిని:
పూదోటలే కాదు ♦ పూవులే కాదు
నాదప్రవీణ నా ♦ నా శకుంతములు
మేదురమకరంద ♦ మిళితోదకములు
ఈదలాడెడు తావి ♦ స్వేచ్ఛావిహార
మై యెడాపెడవీచి ♦ యలరించె నన్ను.

* * *

సాయం సమయమయ్యె ♦ సాగినడచితిని
లావైన మావి నె ♦ ల్లంజుట్టుకొన్న
తీవె యొక్కరితె న ♦ ల్దిక్కులందున్న
వింతబంగరుకాంతి ♦ వింతనీరెల్ల
సొంతపూగిన్నెలోఁ ♦ జేర్చిపై జిమ్మ
చిమ్మ జక్కిలిగింత ♦ చేబోలె బెదరి
కొమ్మఁజూడనది ప ♦ క్కున నవ్వెయాఁడె.

* * *

మేలైనసావాసమే ♦ యంచు డాసి
చాలముద్దొలుక పు ♦ వ్వుఁబు గిల్లితిని.
గాలిచేఁగదలి యొ ♦ క్కసుమంపు గుత్తి
కేళినాకనులఁ జె ♦ క్కిలి ముద్దుగొనియె
నేఁటిసంగతులు జ్ఞ ♦ ప్తికివచ్చినవ్వ
ఏదైన మఱచిపో ♦ యి వెదకునట్లు
ఏదైన ప్రతిబింబ ♦ మెదగాంచినట్లు
తలయెత్తిచూతుఁ గ ♦ దా? చెంత మేఘ
లలనపూర్ణేందు లీ ♦ లాగతులచేత
గిలిగింతపడుచు క్రుం ♦ గియు. స్పర్శసుఖము
వెలికుబ్బగా నవ్వ ♦ ప్రేమాబ్ధినుండె.

* * *

ఒకచెట్టు గూటిలో ♦ నుండి కిచకిచల
సుఖమారగానుండెఁ ♦ జోడుశారికలు
ఇచ్చోట నాకులెం ♦ తే వీచుచుండ
నచ్చోటను లతాంత ♦ మాహ్వానమొసఁగ

పిల్లగాడ్పులు వెరు ♦ వెంట నేతేర
పిల్లడనై యలరి ♦ పేరెమెత్తి తిని
ఆటలాడితినెంతో ♦ హర్షాన నవ్వి.
నాటి నవ్వెల్ల వి ♦ న్నది నే నొకడనె
పండువెన్నెల నెల్లఁ ♦ బర్వెనల్లడల
నిండిన మనసుతో ♦ నే లేశ రీతి
పరువెత్తి తుద లతా ♦ భవనంబుఁగంటి.

*          *          *

పసువైన పంఙ్లు పు ♦ ష్పములు దలెత్తి
చందమామను కాన్క ♦ చందాననుండె
నందులో రమ్య ప ♦ త్రాది పుష్పముల
నొనరింపబడె నొక్క ♦ యున్న తాసనము
ననుదెచ్చిపెట్టి క ♦ న్యా శిరోమణియె
చెదరి యందముగ బా ♦ సిన ముంగురులును
బెదరినాగెడు చూపు ♦ వెలుగు దీగెలును
సంపూర్ణ సౌందర్య ♦ శక్తియుగ్గృహము
సంప నందందుచిం ♦ దినరీతి చంద్ర
కాంతులు వింత చ ♦ క్కదనాలొసంగ
సంతోషరసములో ♦ స్నాతయైనట్లు
ఏవేవొ పూమొగ్గ ♦ లేవొ పూరెమ్మ
లేవొ కిసలయంబు ♦ లేవొ పూవులును
సుకుమారగతి చవి ♦ జూచి యంచవలె
నింకకొన్నిట్ల దేనె ♦ లింతింతయాసి
కొన్నింటిమెసవుచు ♦ కూర్చుండియెంతో
నన్నిరీక్షించి యు ♦ న్న దనంగనుండె

*          *          *

దగ్గరకేగఁ జే ♦ తం దాకి నన్ను
అగ్గలంబగు ప్రేమ ♦ నారసి ప్రక్క
గా చోటొసంగి నఁ ♦ గాంచి నెమ్మదిగ
నాచిరు చెమ్మట ♦ నాయమ్రుబిందు
వును కొంగుచేనొత్తి ♦ పోద్రోచెఁ; దాఁదిన
నిన వెన్క మిగులు, చి ♦ న్నిపువ్వు నొక్కటిని
దినుమంచు నోట కం ♦ దించె నాతరుణి
తిని కృతజ్ఞతఁ జూచి ♦ తిని యానెవ్వైపు
చూచుచుండగ మోము ♦ సొంపారవంచి
వైచె నాకందోయి ♦ పై జంటముద్దు.

*          *          *

“ఏమోయి! చూచినా ♦ వే వనంబెల్ల
నేమనుకొంటి న ♦ న్నీక్షింపలేక
అదిగో! వినుచున్నావె ♦ యారాగ ఫణితి:
అది నదీ కూలంబు ♦ లంటి నీగములు
కడు సుఖకరమ్మృదం ♦ గ ధ్వనిస్ఫురణ
నడచి యొప్పించు స ♦ నాట్యరాగంబె
రా! చూతుగాని మా ♦ రాగప్రణాళి
చూచెదు, తత్పావన ♦ శోభనంబులును”

*          *          *

అనినన్ను గొనిపోయి ♦ యానదీ నీర
మును ద్రావుమనె నట్లె ♦ యొనరించినాడ
కడుచిత్రరీతి నా ♦ ల్కకుకచుల్ దగిలె!
పుడమి దేనికిని నే ♦ బోల్పలేనింక
ఒకవేళ నెలపొడుపు ♦ నకు బొత్తవెట్టి
యకలంక సారంబు ♦ లందిపైపైన
మన్మథు చేతి ప ♦ ద్మములోని తేనె
లన్మెదిపి తెచ్చి నా ♦ ల్కకుఁ జూపి తేని;
యాపూవుఁదిని గ్రుక్క ♦ డానీరుఁ ద్రావి!
యేపాల్కనుఁటినో యెఱుగంగవచ్చు!

*          *          *

“పుచ్చుకొంటి వతీత ♦ పుణ్యపుష్పంబు!
పుచ్చుకొంటివి నదీ ♦ పుణ్యనీరములు!
పుచ్చుకొన్నట్లె సు ♦ మ్ము కవిత్వగీతి!”
స్వచ్ఛాన్న పానముల్ ♦ బాగుపడుమనియె

*          *          *

విచ్చిన త్రొక్కలే ♦ పీఠంబొనర్చి
చెచ్చెఱ పయనంబు ♦ చేసినానంత
చలువల మార్గంబు ♦ సరిలేనివడియు
గలుగుటచే వీడఁ ♦ గాలాడె నచట

నాగీతధాత్రి వి ◆ న్నాణంపు తెక్క
పైగూరుచుండ నె ◆ ప్పటిహాయిగంటి
ఎన్నెన్ని గతులొకో ◆ యెంతపాంకంబో!
చన్నట్లు చనని యి ◆ చ్ఛా విహారంబు!
రివ్వు రివ్వున మించు ◆ క్రిందకై మరలి
యవుర! గాంచితిని మ ◆ హా చిత్రములను!
మనుజునట్లొకకొన్ని ◆ మఱి మృగంబట్లు
ఘనకామ రూపులై ◆ కనుపించుకొన్ని
కనుమూయునంతలో ◆ కడు దవ్వులగుచు
కనుకట్టొ యనఁగ మే◆ఘములొప్పెనహహా!
కొంతసేపునకులో ◆ గోర్కె మీఱఁగ
చెంతగాఁ జేరి రా ◆ చికొని పోఁ బోయి
మృగశాబ రూపంబు ◆ మేనిచామనయు
నిగనిగల్ గలిగి మించె ◆ డి మబ్బునొడిసి
పట్టి గుప్పెడునీళ్ళు ◆ పట్టినా నహహ.
మాప్రయాణపు సంభ్ర ◆ మము పోనె లేదు!
మబ్బు నర్ఘ్యములందు ◆ మదిదీర లేదు!
అబ్బురంబుగ దృష్టి క ◆ గుపించెనంత
(గుట్ట చెట్లిండ్లను ◆ గోపురంబులును)
తూర్పుచుక్కల్లదే ◆ తోతెంచదొడఁగె!
నార్పుల్ వినవచ్చె ◆ నలకులాయముల
కీటకంబులవోలె ◆ కిటకిటమంచు
నాటకుల్ నరులాడు ◆ నాట్యరంగంబు
కనుచుండఁగా నొక్క ◆ క్షణము లోపలనె
కనుగొంటినన్ను ని ◆ క్కడనేలపైన
తనువుకు భూమి గం ◆ ధముసోకె నకట!
ననుజూచి యనెనిట్లు ◆ నాగీతధాత్రి—
"నీకృతజ్ఞతఁ జూపి ◆ నెఱిచిరంబుండు!"
తలవంచి "కాంత! యిం ◆ తటిభాగ్యమీవు
గలుగుట" చేనంచు ◆ కడగాంచనెవరు
గనుపింపరైరి! య ◆ క్కజమంచుచిరము
తలఁచి నాదు కృతజ్ఞ ◆ తనుజూపగా, మొ
దలుపెట్టితిని లతాం ◆ తము తిన్నకతన
రాగప్రవాహ నీ ◆ రముఁ ద్రావుకతన
నేగిల్లిదాచియుం ◆ చిన పూవుకతన.

—పాటిబండఅప్పారావు.

## గ్రంథాలయములు-పౌరజీవితము *

మనదేశమునందు ప్రజాహితజీవితము తగిన వికాసము జెందియుండలేదు. దానిని పోషించి పెంపొందించుటకు తగిన దోహదములు దేశమం దుద్భవించలేదు. కేవలము రాజకీయ సంబంధములేని యుద్యమములలో, ఆంధ్రదేశోద్ధారణకై గ్రంథాలయోద్యమము సాయపడుచున్నటుల మరి యేయుద్యమము సాయపడుట లేదనిన అతిశయోక్తి కానేరదు. ఈ యుద్యమమును నడుపుచున్నవారి పట్టుదల, కార్యైకదీక్ష, దేశసేవానిరతి, స్వార్థత్యాగము నిరుపమానము. దేశసేవ విషయమై వారు ఆంధ్రులకెల్ల మార్గదర్శకులై రనుట నిశ్చయము. ప్రతివత్సరమును గ్రంథాలయ సమావేశములను జరపుటయే గాక, కుగ్రామములలోగూడ గ్రంథాలయములను స్థాపించి వత్సరమంతయు నిరంతర కృషి జరపుచు

* ఆంగ్లమునందు పబ్లిక్ లైఫ్ అనుదానికి పౌరజీవితము లేక ప్రజాజీవితమని సుప్రసిద్ధులగు వంగమహారాష్ట్రులు వాడుచున్నారు. దానినే మేమిందు గ్రహించితిమి. గ్రం. స. సం.

న్నాను. గ్రంథాలయోద్యమ మనవసరమని మొదట తలంచిన వారిలో నే నొకడను. కాని కార్యనిర్వాహకుల కృషియొక్క ఫలితముల గమనించగను, గ్రంథాలయ సర్వస్వములో విద్యాధికులు వ్రాసిన వ్యాసములు చదువగను, సంశయములెల్ల వీడి, ఇట్టి యుద్యమమే దేశమునందు ప్రజాహిత జీవనము నభివృద్ధి పఱచుటకు ముఖ్యసాధనమను నమ్మకము కలిగినది.

పాఠశాలలో విద్య నేర్చుకొనునపు డలవడు జ్ఞానము స్వల్పము. జ్ఞానసముపార్జనమునకు గ్రంథాలయములే ముఖ్యసాధనములు. గ్రంథాలయములలో రాజకీయ, ధార్మిక, సాంఘిక, ఆర్థిక, సాహిత్య విషయములు తెల్పు గ్రంథము లన్నిటిని జేర్చియుంచవలెను. ఆ గ్రంథములలోని సారమును గ్రహించుటకు గ్రంథాలయ సభ్యు లందఱకు సాధ్యము గాకుండవచ్చును. అట్టితఱి విద్యాబుద్ధులలో వికాసము గాంచిన వారు జ్ఞానమును తమతోడి సోదరుల కుపన్యాసముల మూలకముగను, సంభాషణ పూర్వకముగను బోధించవలెను. సామాన్యముగ గ్రంథభాండాగారియే ఇట్టి పనికి బూనుకొనుట సమంజసము. ఏలయన, గ్రంథభాండాగారియొక్కసామర్థ్యముమీదనే గ్రంథాలయాభివృద్ధి యాధారపడి యుండును. అతను విద్యాధికుడుగను, జనరంజకుడుగను, ఓర్పు పట్టుదల గలిగి దేశాభివృద్ధికై పాటుబడ నిచ్ఛ గలవాడుగనుండవలెను. రాజకీయవిషయములు బోధించు పుస్తకముల జదివిపౌరత్వ మన నేమియో, బ్రిటీషు సామ్రాజ్యములో మన దేశమే స్థాన మాక్రమించుచున్నదో, మనగమ్యస్థాన మేద్దియో, మనయాదర్శఫల ప్రాప్తికై మనమేయే కార్యముల జేయవలయునో, ఇట్టి విషయములను గ్రంథాలయముల కరుదెంచువారికి జక్కగ బోధపడునటుల జేయవలయును. గ్రామపంచాయతులవలని లాభములను, ప్రతి స్వల్ప విషయమునకొఱకై న్యాయస్థానముల కెక్కుటవలన గలుగు నష్టములను బోధింపవచ్చును. అటులనే సాంఘిక, నైతికసంబంధమగు గ్రంథములనుండు ముఖ్యోద్దేశములను ప్రజలయందు వ్యాపింప జేయవచ్చును. ఈ యుద్దేశముల నెరవేర్చుటకై గ్రంథాలయములు సాధ్యమైనంతవరకు ఉచితపఠనమందిరములుగ నుండవలయును. అటులుండినగాని ప్రజల ననేక సంఖ్యాకుల నాకర్షింప వీలు గలుగదు.

జ్ఞానార్జనమునకై ప్రజా సామాన్యమందుత్సాహమును పురికొల్పుటకు ధర్మపుస్తకభాండాగారములే సాధనములు. ఉపన్యాసములకన్నను అనుదినము సాయంకాలమునందుచేయు సంభాషణాది ప్రసంగములే విశేషలాభ మొసగును. ప్రతి దినమునను ప్రజాహిత జీవనమున కనువగు సంభాషణలను, చర్చలను, వాదప్రతివాదములను జరపుచుండినయెడల ప్రజాసామాన్యమం దున్నతాదర్శములు మొలకలెత్తును. క్రమక్రమముగ సంకల్పములు కార్యరూపముగ పరిణమించును. ప్రతిగ్రామమందును గ్రంథాలయమే ప్రజాహిత జీవనమునకు దోహదమొసగ జాలియుండును. రాజకీయ, సాంఘిక, నైతికసంస్కరణముల గావించుటకు గ్రంథాలయసభ్యులే మార్గదర్శకులు కాగలరు. దేశాభివృద్ధి కనువగు యుద్యమము లన్నిటికిని గ్రంథాలయమే కేంద్రస్థానముగ పరిణమించ గలదు. గ్రంథాలయముల సౌష్ఠవముమీదనే

గ్రామపురోభివృద్ధి యాధారపడి యుండును. ప్రతిగ్రామమందును పాఠశాలల స్థాపించుటకును, పంచాయతుల నేర్పఱచుటకును, రాజకీయసంఘముల నెలకొల్పుటకును, సంస్కరణబీజముల నాటుటకును - ఇదియది యననేల, గ్రామౌన్నత్యమునకు వలయు సాధనముల నన్నిటిని సమకూర్చుటకు గ్రంథాలయములే మున్ముందు నాధారభూతములగు ననుటకు సందియము లేదు. వివిధ విషయములందును శ్రద్ధతీసికొని పాటుబడుచున్న గ్రామస్థులందరును గ్రంథాలయమునందు జేరినపుడు వారు జేయుచున్న దేశహితైక కార్యములఁగూర్చి చర్చించికొని లోపములున్న సవరించుకొనుటకును, ఇంకను ముందంజ వేయుటకు మార్గముల నరయుటకును, తమగ్రామముల బాగుపరచి యితరులకు మార్గదర్శులగుటకును అవి సదుపాయములు కలుగఁ జేయవలయును. ఇటుల ప్రతిగ్రామమందును దేశహితైక కార్యతత్పరులు బయలువెడలి గ్రామాభివృద్ధిని గావించుచున్నపుడు ఆంధ్రదేశాభ్యుదయము త్రుటికాలములో నెరవేరగలదు. ఆంధ్రరాష్ట్రము, ఆంధ్రవిశ్వవిద్యాలయము, స్వపరిపాలనము మొదలగు శుభములన్నియు దేశమునకు త్వరలో చేకూరును.

గ్రామమును పునాదిగ జేసికొని ప్రజాహిత జీవనము ప్రారంభింపక పోయిన కారణము చేతనే, ఇదివరకు మన దేశములో దేశీయ మహాజనసభ సంఘసంస్కరణసభ మొదలగు ప్రతిష్టాపనలు చేయ తగినంత యుపకారము దేశమునకు గావించి యుండలేదు. గ్రామములలో రాజకీయ, సాంఘిక సంస్కరణాలనుగూర్చిన జ్ఞానము కాంగ్రెసు మొదలిడినప్పటినుండియు, గ్రామసంఘముల మూలమునను, గ్రామసభలమూలమునను వ్యాపించియుండినయెడల, స్వపరిపాలనము ఇప్పటికే జనులకు లభించియుండెడిది. గ్రామపంచాయతులు దేశమందంతటను వెదజల్లఁబడియుండెడివి. మనపరిశ్రమ లభివృద్ధిజెంది యుండెడివి. సంఘసంస్కరణము తీవ్రముగ వ్యాపించియుండెడిది. రాజకీయ, సాంఘికసంస్కరణములు ఇప్పటివలె హాస్యాస్పదములై పరిణమించి యుండకుండెడివి. పునాదిని బలపరచక గోపురము కట్టువిధమున ప్రజాహిత జీవనము ప్రస్తుతము నిరాధారమై యొప్పుచున్నది. గ్రంథాలయ స్థాపనమువలన ప్రతిగ్రామము దేశమునకు బలకరమగు పునాది కాఁగలదు. మనజాతీయ ప్రతిష్టాపనలన్నియు దేశౌన్నత్యమునకు శాశ్వతసాయ మొసఁగగలవు. కాన ప్రజాహిత జీవనమున కంతయు గ్రంథాలయములలోనే బీజములు మొలకలెత్తవలయును. ఆతకన్నను ప్రస్తుతస్థితిలో ప్రజాహిత జీవనాభివృద్ధికి సాయపడు ప్రతిష్టాపనలు కానరావు. గ్రంథాలయము లిట్టి మహాశయములను, యాడంబరరహితముగ, త్వరలో ఫలోన్ముఖమునకుఁ దేఁగలవు.

ఈ యుద్దేశము లన్నియు పూర్ణముగ సిద్ధింప వలెనన్న గ్రంథాలయముల యందు జ్ఞాన సముపార్జనమునకు పనికిరాని కార్యములఁ జరుగనీయఁ గూడదు. చీట్లాట, బిలియర్డ్సుయాట, మొదలగు ప్రయోజన రహితమైన కాలక్షేపములు ప్రజలమనస్సులను గ్రంథాలయములయొక్క పవిత్రోద్దేశములనుండి మరలించి, ప్రజాహితజీవనమనినవారికి వెగటుగ తోఁచునటులఁ జేయును. గ్రంథాలయములు సరస్వతీనిలయముల ను పవిత్రభావము, వానిని ప్రవేశించు ప్రతి

మనుజుని మానసవీధియందును ఎల్లప్పుడును బొడగట్టుచుండవలెను. దేవాలయములం బ్రవేశించునప్పుడెట్టి పవిత్రోద్దేశములు మనస్సునందుదయించునో, యటులనే గ్రంథాలయములయందుఁగూడ యట్టి పవిత్రములగు తలంపులే ఉదయమొందుచుండవలెను. శరీరసౌఖ్యమే ప్రధానముగ జేసికొని మనోవికాసమందలక్ష్యముండువారలకు "క్లబ్బు"లు ప్రత్యేకముగనుండవలెను. గ్రంథాలయములలో ఇట్టి స్వల్పవిషయములకు తావొసంగఁ గూడదు. గ్రంథాలయములో వార్తాపత్రికలను తెప్పించి ఉంచవలెను. వానియందలి వృత్తాంతముల జదివికొని, గ్రంథాలయ సభ్యులొకరితో నొకరు ముచ్చటించుకొనుటవలన, ప్రపంచములో ఎప్పటికప్పుడు జరుగుచుండు సంగతులను గ్రహించుటయేగాక, ఇతరదేశము లెటులభివృద్ధి నొందుచున్నదియు, మనమెట్టిమార్గము లవలంబింప వలసినదియు నాలోచింపనగును. ప్రాపంచికవార్తల తెలిసికొనుటవలన జ్ఞాననేత్రము వికాసము జెందుటయేకాక, నాగరికప్రపంచముతో మనమును తులదూగుటకు అభిలాషజనించును.

ప్రజాహితజీవనమునకు గ్రంథాలయములు నిజముగ తోడ్పడవలసినంతగ తోడ్పడకపోయినను, గుంటూరు పౌరజీవనమునకు ఆ పురియందు స్థాపింపఁబడిన యువజన సాహితీ సంఘము కొంతవరకు సాయపడినదని చెప్పకతప్పదు. ఈ సంఘము ౧౯౦౧ సంవత్సరములో విద్యార్థులచే స్థాపింపఁ బడినది. ఆ కాలమున గుంటూరునందు సంఘసంస్కరణ విషయమై పట్టుదల మిక్కుటముగ నుండెను. ఇందలి సభ్యులలో సంస్కరణేచ్ఛ ప్రబలగా ఆకాలమందు జరగిన స్త్రీ పునర్వివాహములకు కొందరు సభ్యులు క్రియారూపముగ సాయమొసంగిరి. గుంటూరు జిల్లాలో ప్రథమమున విదేశగమన మాచరించిన వారీసంఘ సభ్యులే. అప్పటినుండియు ఇందలి సభ్యులొక్కరొక్కరే విదేశముల కేగి యున్నత విద్య నభ్యసించి సంస్కరణాభిమానమును జూపిరి. వీని యన్నిటికన్నను ముఖ్యముగ గమనింపఁ దగినది ఈ సంఘమునకును ఆంధ్రోద్యమమునకును గల సంబంధము. ౧౯౧౧ సంవత్సరాంతమునుండియు ఈ సంఘ సభ్యులు తమలో తాము ఆంధ్రరాష్ట్రమునుగూర్చి పలుచర్చల నొనర్చి ప్రథమాంధ్ర మహాజన సభను నిర్విఘ్నముగ జరుపుటకు కారణభూతులైరి. గుంటూరులో ప్రజాహిత జీవనమునకై పాటుబడుచున్న సంఘముల కిందలి సభ్యులే కార్యనిర్వాహకులుగను, ఉత్సాహముతో పనిచేయువారుగను ఉన్నారు. పట్టణమునకు సంబంధించిన సమస్యల గూర్చి జనసామాన్యము ఈసంఘసభ్యుల యభిప్రాయామోదములకై ఎదురుఁ జూచుచుండును. ఈ సంఘమును నిదర్శనముగ దీసికొని గ్రంథాలయములకును ప్రజాహిత జీవనమునకును గల పరస్పర సంబంధమును దృష్టాంతరీకరించితిని. ఇటులనే ఆంధ్రదేశమునందు గ్రంథాలయ సంఘము వారిచే స్థాపింపఁ బడుచున్న పుస్తకాలయములన్నియు ప్రజాహిత జీవనమునకు దోడ్పడి ఆంధ్రదేశోద్ధరణమునకు చేయూతను ఒసంగు గాక యని గోరుచున్నాడను.

— చల్లా శేషగిరిరావు (బి. ఎ.)

# జనసామాన్యమునందు విద్య వ్యాపింపఁజేయుటెట్లు?

ఈయంశమునుగూర్చి ముచ్చటించునపుడు ముందు విద్యయన నేమో స్పష్టముగాఁ దెలిసికొనుట యావశ్యకము. ఇందునుగూర్చి వివిధదేశముల విద్వాంసులు వివిధ కాలములందు వేరువే రభిప్రాయముల నిచ్చియున్నారు.

పాశ్చాత్యదేశములలో మొట్టమొదట నాగరికతను వహించి జ్ఞానాధిక్యముచే వన్నెకెక్కినవారు గ్రీకులు. వీరు సద్వర్తనమును గూర్చియు సౌందర్యమునుగూర్చియు సభ్యతను గూర్చియు ధృఢతరజ్ఞానమును గల్గియుంట విద్యయని నిర్వచనముచేసిరి. ఇట్టివిద్య శరీర వ్యాయామముచేతను, సంగీతము మొదలగు చిత్రకళలచేతను అభివృద్ధి నొందునని వారి మతము.

గ్రీకుల పిమ్మట పాశ్చాత్యఖండమునందభివృద్ధికి వచ్చినవారు రోముదేశస్థులు. ఈదేశపు విద్వాంసులు, న్యాయముతోను విచక్షణతోను ఔదార్యముతోను స్వకీయమైనట్టియు జనసామాన్యమునకు సంబంధించినట్టియు, విధులను నిర్వర్తించగలశక్తిని సంపాదించుకొనుటయేవిద్యయని నిరూపించిరి. ఆంగ్లేయదేశ విద్వాంసుఁడగు "మాంటేయిను" మనుష్యతత్వమునం దిమిడియున్న యుత్తమమగు గుణములనన్నిటిని వ్యక్తపఱచుటయే విద్యయని రూఢిపఱచెను.

ధృఢమైన దేహమున ధృఢమైన బుద్ధినికల్గియుండుట విద్యయని "లాకు" చెప్పెను. "బెయినను" మహాశయుడు న్యూనాతిరిక్త భేదము లేక మనుష్యుని యందిమిడియున్న శక్తులన్నియు, సమముగ నభివృద్ధిని పొందుటయే విద్యయని వక్కాణించెను.

ఇఁక మనభారతీయులు విద్యాశబ్దమున కేమియర్థము చెప్పిరో తెలిసికొనవలసి యున్నది. నాగోజీభట్టు "పరమోత్తమ పురుషార్థసాధనీవిద్యా" అనియును "బ్రహ్మజ్ఞానరూపా విద్యా"అనియునిర్వచించినాఁడు. శిక్షా, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వవేదము, మీమాంస, న్యాయము, ధర్మశాస్త్రము, పురాణము, ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వవేదము, అర్థశాస్త్రము- అనునవి యన్నియు విద్యాశబ్దముచే గ్రాహ్యములని విష్ణుపురాణమందు తెల్పఁబడియున్నది.

పూర్వపశ్చిమ విద్వాంసులందఱు విద్యాశబ్దమున కిచ్చిన యర్థములన్నిటిని కలిపిచూచినచో విద్యాశబ్దార్థమునుగూర్చి మనకేమి బోధపడుచున్నది? మనుష్యతత్వమునం దిమిడియున్న గుణములన్నిటిని న్యూనాతిరిక్తభేదములేకుండ వృద్ధిపొందించునది విద్యయని మనకుఁ దెలియుచున్నది. ఈ మనుష్యతత్వమునందిమిడియున్న గుణములేవో మనము తెలిసికొన వలసియున్నది. శారీరకము, ధార్మికము బౌద్ధము, రాజకీయము, చిత్రకళానైపుణ్యము ఆధ్యాత్మికము- అను నీయాఱు తత్వములు మనుష్యత్వము నందిమిడియున్నట్లు చెప్పవచ్చును కావున ఈతత్వములనన్నిటిని న్యూనాతిరిక్తభేదములేకుండునట్లు అభివృద్ధి చేయుటయేవిద్యయని మనమిదివఱకు చేసినచర్చకు

ఫలితార్థమై వెలయుచున్నది.

ఈగుణముల నభివృద్ధిలోనికి తెచ్చుటకు వివిధదేశముల వారు వివిధములగు ప్రతిష్ఠాపనల నేర్పఱచి యున్నారు. ఈప్రతిష్ఠాపనలయొక్క స్వరూప స్వభావములు ఆయాదేశముల వారి పరమావధులమీఁద యాధారపడియున్నవి.

గ్రీకుల పరమావధి సౌందర్యము. ఈసౌందర్యాన్వేషణాభిలాషయే వారిని వివిధశాస్త్రములయం దసమాన ప్రజ్ఞావంతులుగాఁ జేసినది. వారిప్రతిష్ఠాపనలన్నియునీపరమావధిని పొందుటకు సాధనములుగా నేర్పఱుపఁబడినవే. అట్లే రోమనుల ప్రాప్యము శరీరదార్ఢ్యమునుసంపాదించి కట్టుదిట్టములకు లోఁబడి రాజ్యాంగమును సమర్థతతో నిర్వర్తించుటయైయున్నది. వారిప్రతిష్ఠాపనలన్నియు ఈప్రాప్యమును కార్యరూపముగ పరిణమింపఁజేయుట కుద్దేశింపఁబడినవే అయియున్నవి.

ఇఁక మనదేశీయుల ప్రాప్యము మొదటినుండియు ఇహలోకజీవనము పరలోకసౌఖ్యమునకు సాధనముగాఁ జేసికొనుటయై యున్నది. మనదేశీయుల ప్రాప్యము ఇట్టి మహత్తరమైనదగుట చేతనే ఇతర ప్రాచీన నాగరిక దేశములన్నియు నామమాత్రావశేషమైయుండ మన దేశము మాత్రము అవనతపదవియందుండినను సజీవముగా నుండుటకు కారణమని విద్వాంసులు చెప్పుచున్నారు.

పైన చెప్పఁబడిన పరమావధిని కార్యాచరణలోనికి తెచ్చుటకు మన పూర్వులేర్పఱచిన ప్రతిష్ఠాపనలెవ్వి? ఈవ్యాసముయొక్క మొదటిభాగమందు చెప్పబడిన మనుష్యతత్త్వము నందిమిడియున్న యాఱుతత్త్వములనువివిధట్లు వ్యక్తీకరించును?

ఈవ్యాసమునందు, మనపూర్వులచే నేర్పఱచఁబడిన ప్రతిష్ఠాపనలను మూటిని మాత్రము పేర్కొనెదను. ఆప్రతిష్ఠాపనలు మనుష్యతత్త్వమును వ్యక్తీకరింపఁజేయుట కెట్లుసాధనములాయెను? వర్తమానదశయందు మనదేశమున ఏర్పడిన మార్పులలో ఆప్రతిష్ఠాపనలు పూర్వపు జవసత్త్వములనుగలిగి వాని నిర్ణీతమగు విధులను నిర్వర్తింపుచున్నావా? అట్లు నిర్వర్తింపనిచో అందుకు ప్రతిక్రియ ఏమిచేయవలయును? ఈసంగతులనెల్ల నిర్ధారణచేయుటకు ప్రయత్నింతును.

గ్రామసంఘములు — ఈ గ్రామసంఘములు మన దేశమునందు నాగరికత ప్రారంభమయినది మొదలు పురపాలనా సంఘములుగా నేర్పడి, గ్రామస్థులకు సౌఖ్యముల నొనఁగూర్చుటయే గాక జ్ఞానబోధకములుగ కూడనుండెను. అనగా పైన చెప్పిన మనుష్యతత్త్వము నందిమిడియున్న గుణములనాఱింటిని యభివృద్ధి నొందించుటకుఁ బరమ సాధనములుగనుండెను.

క్రీ. పూ. నాల్గవశతాబ్దమున చంద్రగుప్తుని రాజ్యకాలములో మన దేశమును చూడవచ్చిన "మెగాస్తనీసు" మగధరాజ్యమందలి పురపాలక సంఘముల స్వరూప స్వభావములగూర్చి విపులముగా వ్రాసి యున్నాఁడు. అందువలన "పాటలీపుత్రనగరము" ముప్పదిమంది సభ్యులు చేరిన సంఘముచే పరిపాలింపఁబడుచుండెననియు, ఈ సంఘము తిరుగ నాఱు ఉపసంఘములుగా విభజింపఁబడి ప్రతియుపసంఘమునకుఁ ప్రత్యేకప్రత్యేకవిధులేర్పడియుండెననియు మనకుఁ దెలియుచున్నది. మొదటి యుపసంఘమువారు చేతిపనులు చేయు పనివాండ్ర కియ్యవలసినకూలి యొక్క రేట్ల నిర్ణయిం

చుట విధిగాఁ గలవారు. రెండవ ఉపసంఘమువారు దేశాంతరమునుండి వచ్చెడివారికి సదుపాయము లొనగూర్చుట విధిగాఁ గలవారు, మూడవ ఉపసంఘమువారు జనన మరణముల లెక్కలుంచుట విధిగా కలవారు, నాల్గవ యుపసంఘమువారు వాణిజ్యము సరియైనకట్టు దిట్టములో నుంచువారు అయిదవ ఉపసంఘమువారు దేశమందలి చేతిపనులను సరియైన మార్గముల నభివృద్ధి నొందించుట విధిగా గలవారు ఆఱవయుపసంఘమువారు సుంకములు వసూలుచేయుంచుట విధిగాగలవారని మనకుఁ దెలియుచున్నది.

ఇట్లే దక్షిణహిందూదేశమందుకూడ పురపాలక సంఘములున్నట్లు తెలియుచున్నది. కొన్ని శాసనములవలన, చోళదేశమునందు పురపాలక సంఘములుండి యుండెననియు అందలి సభ్యులు ఇప్పటికాలపు పురపాలకసంఘ సభ్యులవలెను శాసననిర్మాణ సభ్యులవలెను ప్రజలచే నెన్నుకొనఁబడుచుండిరనియు-అట్లు ఎన్నుకొనువారును ఎన్నుకొనబడువారును, ఎట్టివారుగా నుండవలయునో అదియంతయు చట్టములవలన నిర్ణీతమై యుండెననియును మనకు తెలియుచున్నది.

అప్పటికాలమున "వోటు"ల నిచ్చుటకు నిర్ణీతమైన స్థలము దేవాలయము. "వోటు"లను లెక్కపెట్టువారు దేవాలయాధ్యక్షులు. ఈసంఘములు గ్రామమునకు సంబంధించిన దేవాదాయములను ధర్మాదాయములను పరిపాలన చేయుచుండెను- న్యాయపరిపాలనాధికారముగూడ కొంతవఱకీ సభ్యులందే యుండెను- గ్రామముమీఁద రాజునకు చెల్లవలసిన శిస్తునంతయు ఈ సంఘములే వసూలుచేయించి రాజునకు కప్పము కట్టుచుండువారు- శిస్తు ఇవ్వక బాకీపడిన వారి పొలములను ఈ సంఘమువారు స్వాధీనపఱచుకొని మఱియొకని కిచ్చుచుండెడివారు.

దేవాలయములు రెండవ ప్రతిష్ఠాపనము. మనపూర్వుల శిల్పవిద్యానైపుణ్యమును ఇప్పటికిని మనదేవాలయములే కదా మనకు స్మృతికి తెచ్చుచున్నవి. ఏకవీశ్వరుఁడైనను నూతనముగ తాను రచించిన కావ్యము దేవునికే కదా యంకితము చేయును. ఏ గానవిద్యావిశారదుఁడైనను తనవాగమృతధారలను దేవాలయమునందు భగవన్నామమును గానముచేసినప్పుడే తనవిద్య సఫలమైనదనియెంచుచుండెడివారు. శాస్త్రవేత్తలందఱు తమశాస్త్రసిద్ధాంతములను దేవళమున తమసాటివారలతో చేరి వాక్యార్థము చేసినప్పుడేగదా ధన్యులమని యనుకొనుచుండిరి. దేవాదాయసొమ్మునుండియే గదా విద్యార్థులును విద్వాంసును పోషింపఁబడుచుండిరి. దేవాలయమున జరుగునుత్సవముల సందర్భమున జనసమూహము యొక్క యానందపరిమితి శ్రోత్రపేయమగు తూర్యనినాదములతో, పారవశ్యము కలుగజేయుభక్తగీతములతో, నేత్రపర్వంబగు నలంకారములతో, ఘ్రాణతర్పణంబగు చందన కుసుమాగరుసౌరభములతో, ఆబాలగోపాలమనోల్లాసకారులగు దేవోత్సవంబులు ప్రతిగ్రామమందున నేరికిసుఖకరములు కావు! కవులు, పండితులు, పౌరాణికులు, వైదికులు, శిల్పశాస్త్రప్రవీణులు, గాయనీగాయనమణులు, ఛత్రచామరధరులు, పరివారము రాజసభనెట్లో యట్లు దేవాలయమందుకూడ పోషింపఁబడుదురు.

వివాహములకు సాక్షి; ప్రమాణములకు రచ్చ. ధర్మశాస్త్ర చర్చలకు సభాభవనము; పరదేశీయునకు ధర్మశాల; పనివాండ్రకు ప్రా

పు. సన్యాసులకు మఠము, భక్తవరుల కునికిపట్టు. ఇదియదియన నేల-ప్రజలకు జీవనాధారమై, విద్యాపోషకమై, జ్ఞానదాయకమై, సౌందర్యస్థానమై, ఆనందాంబుధియై దేవళంబు విరాజిల్లుచుండు.

ఇక మూడవ ప్రతిష్ఠాపనము జాతీయోత్సవములు. ఈయుత్సవములు పుణ్యతీర్థములకును పుణ్యదినములకును సంబంధించినవిగ నున్నవి. పుణ్యతీర్థములకు సంబంధించిన యుత్సవములన్నియు మనుజుని మనమును సృష్టివైచిత్ర్యముమూలమున నాకర్షించి జ్ఞానాభివృద్ధిదాయకములగునట్లు నేర్పఱుపఁబడినవి. ఇంతేగాక ఈయుత్సవసమయములందె ఏకఫలాపేక్షతో వివిధాంతరములుగల జనాళి ఏకత్రసమావేశమగుటచే. వీరందఱియందు సమిష్టిభావమంకురించుటకును అభివృద్ధినొందుటకును ఇవి ముఖ్యసాధనములుగా నుండియుండెను. పుణ్యపురుష ప్రయుక్తములగు ఉత్సవసమయములు ఆయాపుణ్యపురుషుల చరిత్రలందలి పవిత్రాంశములను మనుజుడు తనజీవితమునందు చేర్చుకొను తీవ్రవాంఛకులుగ చేయుటకు సాధనములుగా నుండియుండెను. ఈయుత్సవములుగూడ వివిధాంతరములు గల ప్రజలు ఏకత్రసమావేశమై ఐక్యభావము నభివృద్ధి బొందించుకొనుట కుపయుక్తములుగా నుండియుండెను.

ఇప్పుడు దేశకాలపాత్రములు మాఱినవి. పై ప్రతిష్ఠాపనలన్నియు పూర్వకాలమునందువలె మనుజుల మనంబుల నాకర్షించుట లేదు. కావున మనము దేశమందంతటను ప్రజలయందు జ్ఞానాభివృద్ధికలుగుట కే యుపాయములు పన్నవలెను? పైన చెప్పిన ప్రతిష్ఠాపనలను పునర్జీవితములుగా చేయుట ఒకమార్గము. అదియటుండనిచ్చి మఱియే ఇతరమార్గమునకూడ ఇట్టిపని జరుగుటకు అవకాశము లున్నవాయని యాలోచించినచో - దేశమందంతటను గ్రంథాలయస్థాపన చేసినచో మనుజుని యందిమిడియున్న తత్వములన్నిటిని న్యూనాతిరిక్తభావములేకుండ వృద్ధిపొందించుటకు ముఖ్యసాధనమగునని చెప్పవచ్చును.

గ్రంథాలయములనఁగా గ్రంథములు భద్రపఱుచు స్థలములనియు, గ్రంథాలయాధికారియనగా గ్రంథముల కాపరియనియు కొందఱనుకొనిన ననుకొనవచ్చును. ఆధునిక కాలమందు గ్రంథాలయముల విధులును గ్రంథభాండాగారికుని విధులును పూర్తిగ మాఱినవి. జనులందఱికిని వారివారి యధికారములనుబట్టియు వారివారి రుచులనుబట్టియు వారికి కావలసిన అన్ని విధముల జ్ఞాన మలవడునట్లు చేయుటయే గ్రంథాలయముల విధియైయున్నది. ఇందు, గ్రంథములను గ్రంథాలయమునచేర్చి వాటిని సర్వజనుల యుపయోగమునకొఱకిచ్చుట ఒకభాగము మాత్రమైయున్నది. ఇంతటితో గ్రంథాలయములవిధి పూర్తికాలేదు. ఇంక నెన్ని యోజనలు ఈప్రతిష్ఠాపనల యాజమాన్యము క్రింద జరుగవలసియున్నవి. ఈగ్రంథాలయాధికారులు వీనియాజమాన్యముక్రింద నాటకము లాడించియు, సంగీతసభలు జరపియు, హరికథలు చెప్పించియు, బొబ్బిలికథలు మొదలగునవి వినిపింపనేర్పాటులు చేయించియు, చిత్రపటములను చేర్చియు, సమస్తజనులకు జ్ఞానదాయకమగునట్టి ప్రతిష్ఠాపనలను చేయవచ్చును. ఈప్రతిష్ఠాపనలన్నియు కట్టుదిట్టములకు లోఁబడియుండునవై యున్నవి. కనుక ఆ కట్టుదిట్టములన్నియు స్వయంపరిపాలనాధికారములను చెలా

యించుటకు సంబంధించినవగుటచేతను ఈసంఘములయందు సభ్యతపొందుటవలన ఇట్టి జ్ఞానముకొంత యలవడకతప్పదు. కావున గ్రంథాలయములు జనుల విద్యను పలువిధముల అభివృద్ధి నొందించుటకు ముఖ్యసాధనములుగా నున్నవి. అందుచే గ్రంథాలయముల నభివృద్ధి పొందించి దేశమందంతను జ్ఞానదీపము ప్రకాశించునట్లుచేయుట ప్రతి దేశాభిమానియొక్కయు భాషాభిమానియొక్కయు ముఖ్యకర్తవ్యము.

—సూరి వేంకటనరసింహశాస్త్రి (బి.ఏ.)

# ఆంధ్రదేశ చరిత్రాంశములు

## ఆంధ్రశబ్ద వ్యుత్పత్తి

ఆంధ్రదేశమనఁగా నేమి? అనునది మనము ముందుగావిచారించవలసియున్నది. దీనికి రెండు విధములైన వ్యుత్పత్తులు చెప్పుచున్నారు.

(౧) మొట్టమొదట మనుష్యులు నివసింపశక్యముగాని అంధకారమయమైన ప్రదేశమగుటచేత, దీనికీపేరు వచ్చిన దందురు.

(౨) ఆంధ్రులు నివసించు ప్రదేశమగుటచేత, దీనికీపేరు వచ్చినదని కొందఱందురు.

ఎల్లలు : ఉ॥ ఉత్కలరాష్ట్రము, తూ॥ బంగాళాఖాతము, ద॥ ద్రావిడ కర్ణాటదేశములు, ప॥ కర్ణాట మహారాష్ట్రదేశములు.

విస్తీర్ణము ౧,౧౭,౦౦౦ చదరపుమైళ్ళు.

ఉత్తరమున గంజాములోని శ్రీకాకుళము నుండి, తూర్పుసముద్రతీరమున చెన్నపట్టణమునకు ఉత్తరమునందుండు ప్రళయ కావేరివఱకుఁ బోయి, అటనుండి బెంగుళూరు, అచ్చటనుండి బళ్లారి, పిమ్మట ఉత్తరముగా హైదరాబాదు, తరువాత నాగపురమువఱకు గల ప్రదేశము ఆంధ్రదేశమనఁబడును.

అనగా : గంజాము, విశాఖపట్టణము, గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాలు; చెంగల్పట్టు జిల్లాలో కొంచెము; చిత్తూరు, అనంతపురము, కడప, కర్నూలు జిల్లాలు; బళ్లారి జిల్లాలో కొంత; నైజాము రాష్ట్రములో (నల్గొండ, ఓరంగల్లు, ఖమ్మమెట్టు, మహబూబ్ నగరము, మెతుకు, ఎల్లందజిల్లాలు; ఇందూరు, బీదరుజిల్లాలో కొంతభాగము); నాగపురం, గోండ్వా దేశములలో కొంత భాగమును కలిసిఆంధ్రదేశమగును.

## ప్రాచీనత

ఇప్పటికి 3 వేల యేండ్లక్రిందట రచింపఁబడినదని పాశ్చాత్య పండితులచేత ఒప్పుకొనఁబడిన, ఋగ్వేదములోని ఐతరేయ బ్రాహ్మణమునందు ఆంధ్రుల ప్రశంస గలదు.

ఆంధ్రదేశమును గుఱించియు, ఆంధ్రులను గురించియు పురాణములలో ప్రశంసగలదు.

(౧) శ్రీరాముఁడు వచ్చిన దండకారణ్యము ఆంధ్రదేశమున కలదు.

(౨) ఉత్తర రామాయణమున, అగస్త్యుఁడు శ్రీరామునకుఁ జెప్పిన కొల్లేరు సరస్సు ఆంధ్రదేశమందలి కృష్ణా మండలములో నున్నది.

(3) గోదావరి జిల్లాలోని భద్రాచలమందలి పర్ణశాలయే పంచవటి.

(౪) ఆంధ్ర రాజులు, మగధరాజ్యమును

పాలించుచుండిన కాణ్వవంశజులను జయించి, ౪౫౬ సంవత్సరములు రాజ్యము చేసినట్టు విష్ణుమత్స్య పురాణములయందుఁ గలదు.

### తక్కిన పేర్లు

ఆంధ్రదేశమునకు ఒకప్పుడు (౧) కళింగదేశము, (౨) త్రికళింగదేశము, (3) త్రిలింగదేశము, (౪) తెలుఁగుదేశము, (౫) తెనుఁగుదేశము, (౬) వేఁగీదేశము అను ఆఱు పేర్లుండెను.

(౧) కళింగదేశము : గంజాములోని మహేంద్రగిరి మొదలు గోదావరివఱకు చంద్రవంశపు రాజగు కళింగుఁడు రాజ్యమేలెను. అందువలన ఈ దేశమునకు కళింగదేశమని పేరు వచ్చెను. ఆంధ్రులు దీనిని జయించి తమ రాజ్యములో కలుపుకొనిరి. కనుక దీనికి ఆంధ్రదేశము, కళింగదేశము అని పేర్లుండెను.

(౨) త్రికళింగదేశము : అనఁగా మూఁడవ కళింగము.

(i) గంగ మొదలు కటకము వఱకు : ఉత్తరకళింగము.

(ii) కటకము మొదలు మహేంద్రగిరి వఱకు : మధ్యకళింగము.

(iii) మహేంద్రగిరి మొదలు గోదావరి వఱకు : త్రికళింగము.

(3) త్రిలింగదేశము : దీనికి రెండు విధములైన వ్యుత్పత్తులు చెప్పుచున్నారు.

(i) త్రికళింగము త్రిలింగమయ్యెనని కొందఱందురు.

(ii) మూఁడు ప్రసిద్ధలింగ క్షేత్రముల మధ్యనుండుటచేత, త్రిలింగదేశమయ్యెనని పలువుర యభిప్రాయము.

౧. కర్నూలుజిల్లా మార్కాపురము తాలూకాలోని శ్రీశైలము,

౨. గోదావరి జిల్లా రామచంద్రపురము తాలూకాలోని ద్రాక్షారామమనబడు భీమేశ్వరము,

3. హైదరాబాదు సంస్థానములో, "నెలగందరి" మండలమున, గోదావరి, ఇంద్రానతి నదులు కలియుచోటనుండు కాళీశ్వరము,

అను మూఁడుచోట్ల 3 ప్రసిద్ధలింగములు గలవు. వీనిమధ్య ప్రదేశము త్రిలింగదేశమయ్యెను.

(౪) తెలుఁగుదేశము :

౧. త్రిలింగదేశము తెలుఁగుదేశమయ్యెనని కొందఱందురు.

౨. తెనుఁగుదేశము తెలుఁగుదేశమయ్యెనని మఱికొందఱందురు.

(౫) తెనుఁగుదేశము :

౧. ఉత్తరమున గంజాములోని మహేంద్రగిరి,

౨. పడమట బళ్లారికి ప్రక్కనున్న ఋష్యమూక పర్వతము,

3. దక్షిణమున తిరుపతియందలి శేషశైలము,

అను ఈ మూఁడు నగములకు మధ్యనుండు ప్రదేశము త్రినగరదేశమని, తెనుఁగుదేశమని కొందఱభిప్రాయము.

(౬) వేంగీదేశము : అనగా మొదట నిర్జనమై పులులు సంచరించెడి స్థానమగుటచే దీనికీపేరు వచ్చెను.

ఈ ఆఱుపేర్లలో, ఇటీవల, త్రిలింగదేశము, తెలుఁగుదేశము, తెనుఁగుదేశము, వేంగీదేశము అను పేర్లుమాత్రమే మిగిలినవి.

### ఆదిమ నివాసులు

ఈ దేశపు ఆదిమనివాసులు, మొట్టమొదట అనార్యులు; తరువాత ద్రావిడులు వచ్చిరి.

అటు తరువాత ఆర్యులు వచ్చిరి. ఆర్యులలో మొదటివారు (౧) అగస్త్యుడు (౨) శ్రీరాముడు.

ఆంధ్రులనఁగా ఎవరు ? ఉత్తరదేశమందలి ఆర్యులలోని కొందఱు మిగిలిన తమ వారితో పోరాడి దక్షిణ దేశమునకు వచ్చి, అనార్యులతోను, ద్రావిడులతోను కలిసిపోయి ఆంధ్రులనఁబడిరి.

వీరిని గుఱించి మూఁడు వేల వండ్ల క్రిందట ఐతరేయ బ్రాహ్మణమునందు పేర్కొనఁబడినను, క్రీస్తుకు పూర్వము 3 వందల సంవత్సరముల క్రిందట మగధ నేలిన చంద్రగుప్తుని కాలము వఱకు ఆంధ్రులను గుఱించి లోకమున కంతకు బాగుగా తెలియదు.

ఆర్యులు పశ్చిమోత్తరమునుండి క్రమక్రమముగా ఉత్తరహిందూస్థానమున, అంగ, మగధ, కాశి, కోసల, వంశ, కురు, పాంచాల, మత్స్య, శూరసేన, అశ్వక, అవంతి, గాంధార, కాంభోజాది రాజ్యములను స్థాపించుటయే గాక, వారిలో గొందఱు క్షత్రియ వంశస్థులు దక్షిణహిందూస్థానమునుగూడ, ఆంధ్ర, పాండ్య, చోళ, కేరళాది రాజ్యములను స్థాపించిరి. అట్లు స్థాపించునపుడు అచ్చటి ప్రజలను ద్రావిడులతో చాలవఱకు కలిసిపోయిరి.

ఆంధ్రులు దక్షిణమున తమరాజ్యమును స్థాపించుటకు పూర్వము ఈ దేశమును, అప్పటికే నాగరికులైన ద్రావిడ జాతిలోని నాగవంశమువారు పరిపాలించుచుండిరి. ఈ నాగులే నాగకులము. అర్జునుఁడు ఖాండవదహనమున జంపినది ఈ అనార్యరాజులగు నాగులనే. ఉలూపి ఈ నాగరాజుల కన్యకయే. పరీక్షిత్తు ఈ నాగవంశములో నొకఁడగు తక్షకునిచే చంపబడెను. జనమేజయుఁడు సర్పయాగమనుపేర ఈ నాగవంశమునే నిర్మూలము చేసెను. వీరికి నాగము (పాము) ధ్వజముగానుండుటచే నాగులనఁబడిరి. వీరుపాములను పూజించుచుండిరి. వీరి యాచారమునే మనమిప్పుడు నాగులచవితి యను పేర అనుసరించుచున్నాము.

## ఆంధ్రరాజ్యము.

మనకు తెలిసినంతవఱకు చరిత్రనుబట్టిచూడగా సుమారు రెండువేలసంవత్సరములకన్న నెక్కువ కాలము ఆంధ్రరాజ్యము మహోన్నత దశయం దుండినట్లు గానవచ్చును.

౧ క్రీస్తుకు పూర్వము నాలుగవ శతాబ్దమునందు మగధ నేలిన చంద్రగుప్తుని యాస్థానమునందుండిన మెగస్తనీసు అప్పటి ఆంధ్రరాజ్యమునుగూర్చి మిక్కిలి ప్రశంసించియుండెను. ఈ ఆంధ్రరాజ్యమునకు మూల పురుషుఁడు చంద్రుని కొమరుఁడగు ఆంధ్ర విష్ణువు. ఇతనిరాజధాని కృష్ణాజిల్లాలోని బందరుకు పడమట, కృష్ణానదిమీఁదనున్న శ్రీకాకుళము. ఈ ఆంధ్రులు మొదట జైన మతస్థులుగనుండి తరువాత బౌద్ధమతము నవలంబించిరి.

౨ క్రీస్తుపూర్వము ౧౭౦ సం॥రమున కళింగదేశపు రాజగు ఖారవేలుఁడు మగధరాజగు "పుష్యమిత్రుని" ఓడించునపుడు, శాతకర్ణియను ఆంధ్రరాజు కళింగరాజుకు సహాయముచేసినట్లు చరిత్రవలనఁ దెలియుచున్నది.

3 క్రీస్తుకు పూర్వము ౨౭ వ సంవత్సరములో "శ్రీముఖుఁడ"ను ఆంధ్రభృత్యవంశపు రాజొకఁడు, ఆ కాలమున మగధరాజ్యము నేలుసుశర్మ యను కాణ్వవంశజాతీయుని జయించి తద్రాజ్యమును స్వాధీనము చేసికొనినట్లుకనఁబడును. ఆంధ్రభృత్య వంశమునకు, శాత

వాహనవంశమనికూడ పేరుగలదు. ఈ వంశము క్రీస్తుకు తరువాత ౨౧౮ సం॥ రములవఱకు రాజ్యము చేసెను. శాలివాహనుఁడు ఈవంశములోనివాఁడే. ఈ ఆంధ్రవంశమువారి రాజ్యమొకప్పుడు ఉత్తరమునగంగానది మొదలు దక్షిణమున మైసూరువఱకు వ్యాపించియుండెను. ఆ కాలమున రాజధానులు, కృష్ణాజిల్లాలోని అమరావతి, ధాన్యకటకము.

౪ ఆంధ్రభృత్య వంశానంతరమున, దేశములోని అనేక భాగములను అనేక పరవంశము లాక్రమించుకొనెను. ముఖ్యభాగమగు కృష్ణామండలమును, కళింగమును, ఆంధ్రవంశములోఁ జేరిన పల్లవవంశరాజుల స్వాధీనమయ్యెను. ఈవంశపు మొదటిరాజు "శివస్కంధవర్మ". ఈవంశీయులు క్రీస్తుపుట్టిన తర్వాత 6 వ శతాబ్దమువఱకు రాజ్యమేలిరి. వీరి కాలములో అప్పుడప్పుడు (1) కాంచీపురము, (2) గుడివాడ, (3) ఏలూరువద్ద వేంగీపురము, (4) పిఠాపురము; రాజధానులుగా నుండెను.

౫ ఈ పల్లవ వంశీయులను ౭ వ శతాబ్దారంభమున చాళుక్యులు జయించి వేంగిదేశమును పరిపాలించినట్లు తెలియును. వీరును, ఆంధ్రభృత్యులవలెను, పల్లవులవలెను, ఆంధ్రులే. ఈ చాళుక్య వంశీయులు ౧౨ వ శతాబ్దమువఱకు నేలిరి. వీరిలో మొదటివాఁడు "కుబ్జవిష్ణువర్ధనుడు". ఈ వంశీయరాజులలో నొకఁడగు "విమలాదిత్యుఁడు" ఆకాలమున తంజావూరును పాలించుచుండిన చోడచక్రవర్తి కుమార్తెయగు "కుందమాంబా" దేవిని వివాహమాడెను. నన్నయభట్టారకుని చేత భారతము నాంధ్రీకరింపించిన "రాజరాజనరేంద్రు"డీ దంపతులకు గలిగిన పుత్రరత్నమే. ఈ చాళుక్యరాజులకాలములో రాజమహేంద్రవరము ముఖ్యపట్టణముగా నుండెను. చోడరాజ దౌహిత్రుఁడగుటచేత రాజరాజనరేంద్రుఁడు చోడరాజనికూడ పిలువబడుచుండెను. ఈ వంశీయులలో నొకఁడగు "కులోత్తుంగచోడదేవుని" కాలములో వేంగిరాజ్యము (1) వెలనాటిచోడులు, (2) పశ్చిమచాళుక్యులు, (3) కాకతీయులు అను ఆంధ్రవంశములో జేరిన ఇతర వంశీయులకువశమయ్యెను.

౬ వెలనాటి చోడులు:—వీరు ఈవఱకు చాళుక్య రాజులకు ప్రతినిధులుగానుండి రాజ్యమేలుచుండిరి. ఈ వంశమునకు మూలపురుషుఁడు "మల్లవర్మ." వెలనాటిచోడుల కాలములో ఒకానొకప్పుడు ఆంధ్రరాజ్యము మహేంద్రపర్వతము మొదలు కాళహస్తివఱకు వ్యాపించెను. ఈ వంశీయులలో కడపటివాఁడగు పృథ్వీశ్వరరాజు నెల్లూరును పాలించుచుండిన చోడతిక్కరాజుచే యుద్ధమునఁ జంపఁబడెను. వీరి కాలమునను తరువాతను రాజ్యము భిన్నభిన్నములై సామంతరాజుల పాలయ్యెను.

౭ పశ్చిమచాళుక్యులు: వీరు మరల ౧౧ వ శతాబ్దమునందు త్రిలింగదేశములోని పశ్చిమ భాగమును స్వాధీనపఱచుకొని కొంతకాలము రాజ్యమేలిరి.

౮ కాకతీయులు: వీరు మొట్టమొదట వీరులుగానుండి మహారాజులకడ నధికారపదవుల సంపాదించి మండలాధిపతులై, చాళుక్య చక్రవర్తులకు సేనాధిపతులు, మంత్రులునై, వారలకు కప్పములు చెల్లించుచు, కొంతకాలము గడపి, క్రమక్రమముగా బలవంతులై వారల యధికారమును పోఁద్రోచి, త్రైలింగ్య సామ్రాజ్య సంస్థాపకులై ౩౦౦ సంవత్సరములు పరిపాలన మొనర్చిరి. ఈ వం

శమునకు మూలపురుషుఁడు మాధవశర్మ. వీరిలో పదవవాఁడగు కాకతిప్రోలరాజు ౧౧౧౯ సంవత్సరము వఱకు రాజ్యమేలెను. ఈతని కాలమున ఆంధ్రరాజ్యము ఉత్తరమున కటకము వఱకును, దక్షిణమున శ్రీశైలము వఱకును, తూర్పున సముద్రమువఱకును, పశ్చిమమున పడమటి కనుమలలోని మాల్యవంతము వఱకును వ్యాపించియుండెను.

౯ కాకతి ప్రోలరాజు మనుమఁడగు గణపతిరాజు, దేవగిరి యాదవరాజు నోడించి, ఆతని పుత్రిక యగు "రుద్రమ" దేవిని వివాహమాడెను.

౧౦ గణపతిదేవుని తదనంతరము, రుద్రమదేవియే ౧౨౫౭ మొదలు ౧౨౯౫ వఱకు అనఁగా సుమారు ౪౦ సంవత్సరములు ఆంధ్రరాజ్యము నేలి తన యపరిమిత సద్గుణములచే మిక్కిలి విఖ్యాతి జెందెను.

౧౧ రుద్రమదేవి తరువాత, ఆమె దౌహిత్రుఁడు ప్రతాపరుద్రుఁడు ౧౩౨౩వఱకు రాజ్యమేలెను. ఈతనిని గూర్చినకథయే ప్రతాపరుద్రీయ నాటకము. ఈతఁడు ఆంధ్రభాషను మాటలాడిన ప్రజలనెల్ల నేకచ్ఛత్రము క్రిందికిఁ గొనివచ్చెను. ఈ వీరప్రతాపరుద్రదేవ చక్రవర్తి కాలమున మహమ్మదీయులాంధ్రదేశముమీఁదికి నాలుగైదు సారులు దండయాత్ర లొనర్చి, పలుమాఱు ఓడిపోయి, చివరకు ౧౩౨౩ సంవత్సరములో ఆతనిని బంధించి ఢిల్లీకి తీసికొనిపోయిరి గాని, మంత్రియగు యుగంధరుని చాకచక్యముచే ప్రతాపరుద్రుఁడు చెఱనుండి విడిపింపఁబడెను. అల్లాయుద్దీన్ దక్షిణదండయాత్ర చేసినది ఈతనికాలములోనే. మహమ్మదీయులతో పోరాడునప్పుడు ఆంధ్రులుచూపిన ధైర్యము, సాహసము వర్ణనాతీతము. ఆకాలమున ఓరుగల్లు రాజధానిగాఁ గలిగిన ఆంధ్రరాజ్యము ఢిల్లీచక్రవర్తులకు పక్కలోని బల్లెమై నిదురపట్టనీయక భయంకరమై యొప్పుచుండెను.

౧౨ ప్రతాపరుద్రుఁడు మరణమునొందిన వెనుక, ఆంధ్రసామ్రాజ్యము భగ్నమై, ఏ సైన్యాధిపతి స్వాధీనమందుండిన భాగమునకు ఆసైన్యాధిపతి ప్రభువని ప్రకటించి యాభాగమును పరిపాలనచేయుట సంభవించెను.

౧౩ ప్రతాపుని ఓరుగంటి రాజ్యము తురుష్కులచే ధ్వంసమైన తర్వాత, యాతని ధనాగారాధిపతులగు "హరిహర రాయులు," "బుక్కరాయలు" అనగొంది సంస్థానమున జేరిరి. కాని ఢిల్లీచక్రవర్తి ఆనెగొందిమీఁదికి దండెత్తి, ఆరాజు నోడించి సంహరించినప్పుడు చెఱఁబట్టి ఢిల్లీకిఁ గొనిపోయిన అష్టరుముఖ్యులలో హరిహరరాయలు, బుక్కరాయలు గూడ నుండిరి. అనగొందియందు ఢిల్లీచక్రవర్తికి ప్రతినిధిగా నుంచబడిన మాలిక్ సాహెబ్ మీఁద, పారతంత్ర్యములో నుండనొల్లని అనగొందిప్రజలు తిరుగబడినందున, ఢిల్లీ చక్రవర్తి తనవద్ద ఖైదులోనున్న హరిహరరాయలకు అనగొంది రాజ్యమొసఁగి తనకు సామంతరాజుగానుండ నొడఁబఱచి, అతని తమ్ముఁడగు బుక్కరాయలకు అనగొంది మంత్రిత్వమిచ్చి పంపి వేసెను.

౧౪ ఇట్లుహరిహరరాయలు ౧౩౩౬ సంవత్సరములో అనగొంది రాజ్యములో చేరిన విజయనగర సింహాసనమెక్కెను. అతని తదనంతరము బుక్కరాయలు రాజయ్యెను. ఆకాలమున హిందూ విజయనగర రాజ్యమునకు మహమ్మదీయ బహమనీరాజ్యమునకును జరిగిన అత్యద్భుత యుద్ధములు అనన్య సామా

న్యములు.

౧౫ బుక్కరాయల వంశీయులలో నొకఁడగు విరూపాక్షరాయలు విషయాసక్తుఁడై, దుర్మార్గుఁడైనందున, అతని దండనాయకుఁడగు సాళువ నరసింహరాజు ౧౪౮౨ సం॥ములో విజయనగర రాజ్యమును స్వాధీనము చేసుకొనెను. తరువాత ఈసాళువ వంశములో నంతర్భాగమగు తుళువవంశమునకుఁ జేరిన నరసరాజు రాజ్యమునకు వచ్చెను. ఈ నరసరాజు పుత్రుఁడే సుప్రసిద్ధుఁడైన శ్రీ కృష్ణదేవరాయలు. దక్షిణహిందూదేశములో ఇంతటి వైభవపరాక్రమశాలియగు చక్రవర్తి మఱియొక్కఁడు పుట్టలేదు.

౧౬ శ్రీ కృష్ణదేవరాయలు ౧౫౦౬ సం॥ములో రాజ్యమునకు వచ్చెను. ఈయన యొనర్చిన యనేక దిగ్విజయయాత్రలు, ఆంధ్రభాషాపోషణోద్యమములు, నిరుపమానములు. కృష్ణానదికి దక్షిణముననున్న దక్షిణహిందూదేశమంతయు ఈ రాజేకచ్ఛత్రాధిపత్యముతో నేలెను. ఇదిగాక తూర్పున కటకమువఱకును పశ్చిమోత్తరదిక్కుల బీజపూరు మొదలగు పట్టణములవఱకును దాడివెడలి శత్రురాజుల జయించెను.

౧౭ కృష్ణదేవరాయని తదనంతరము రాజ్యముచేసిన వారలలో అంతఃకలహములు పుట్టినందున, రాజ్యము తుదకు మంత్రియగు రామరాజు స్వాధీన మయ్యెను. ఇతనిని ౧౫౬౫ సం॥ జనవరి ౨౩ తేది మంగళవారమున, రాణికోట మహాయుద్ధమునందు, అహమ్మదునగరు, బీజాపురము, గోలకొండ, బీడరు నవాబులు నల్వురు గలిసి యోడించి సంహరించిరి. తరువాత ౬ నెలలవఱకు తురుష్కసైన్యములు విజయనగరమును కొల్లగొని అనేక ఘోరకృత్యము లొనర్చిరి. ఇంతటితో విజయనగర రాజ్య భాస్కరుఁ డస్తమించెను.

౧౮ ఈ కాలమున సామంతరాజులుగా నున్న చెన్నూరు, మైసూరు, మధుర, తంజావూరు మొదలయిన రాజులు స్వతంత్రులైరి.

౧౯ రామరాజు తమ్ముఁడగు తిరుమలరాజు కొంతకాలము పెనుకొండకు రాజుగా నుండెను. అతని వంశజులు కొన్ని ఏండ్లవఱకు చంద్రగిరిలో రాజ్యము చేయుచుండిరి.

౨౦ వారిలో నాఱవవాఁడగు శ్రీరంగరాయలే ౧౬౩౯ సం॥ మార్చి నెలలో ఈస్టిండియాకంపెనీవారికి చెన్నపట్టణమున కోట కట్టుకొనుటకు స్థలము కవులుకిచ్చెను. అరాజు వంశీయులే ప్రస్తుతమున ఆనగొంది సంస్థానాధీశ్వరులు.

ప్రస్తుతపు స్థితి. ఈ విధముగా ఒకప్పుడు కన్యాకుమారి మొదలు గంగానది ప్రాంతమువఱకును వ్యాపించియుండిన ఆంధ్రరాజ్యము చివరకు తురుష్కులకు స్వాధీన మయ్యెను. హిందూదేశమంతటితోపాటు ఆంధ్రదేశమును ఆంగ్లేయ ప్రభుత్వముక్రిందికి వచ్చినది. భారత దేశాభిమానమును, భారతజాతీయోద్యమమును ప్రబలుటచే ఆంధ్రులకును దేశాభిమాన మంకురించినది; ఆంధ్రోద్యమము జరుగుచున్నది; ప్రత్యేకాంధ్రరాష్ట్ర ప్రయత్నమును ప్రారంభమైనది. ఇట్టి స్థితి మన భావి యౌన్నత్యమునకు శుభసూచకము.

—వెలిదండ శ్రీనివాసరావు.

# సఖీసంవరణం

(రవీంద్రమహాకవి భానుసింహ పదావళినుండి తెనిఁగింపఁబడినది.)

ఎంతవింతలె నాడు ♦ కాంతుని వగలు
సెగలయి నాయెద ♦ తెగదహియించు
కనికర మెఱుఁగఁడె ♦ కపట నాటకుఁడె
ఆడుదాని రహస్య ♦ మరయఁగ లేఁడె
అబలల కతిథిగా ♦ నరుదెంచు ప్రియుఁడు
సందెలు గ్రుంకక ♦ ముందేల రాఁడో?
చీరగట్టక మెయి ♦ సింగారములు
సవరింపక పూల ♦ సరులు ముడువక
ప్రాలుమాలికలతోఁ ♦ బవళించి యుండ
బిరబిర వచ్చునె ♦ ప్రేయసుఁడంత;
ఏమని వలదందు ♦ నా మోహనుని
కాదని పల్లెత్తి ♦ వాదాడలేనె;

* * *

దినమంతయు తరి ♦ తీపికోఁగడపి
సందెలఁ బిలచుచు ♦ సఖులను బంపి;
నగలు పెట్టికొని యం ♦ దంబులు దిద్ది
సన్నపావడ సాగ ♦ సారగఁగట్టి
కర్పూరపు దీపి ♦ కలు వెలిగించి
పరిమళములు చిమ్మ ♦ పాన్పు లమర్చి

* * *

పన్నీరొలికెడి ♦ పందిలిచాయ
రాయంచలాడు స ♦ రస్సుల కెలన
వీణతంతుల నాల ♦ పించుచుఁగొంత
వేణుగీతల వల ♦ పించుచుచుఁగొంత
తనకోసము విరాళి ♦ తాళఁగ లేక
ప్రణయవేగము మది ♦ భరియింప లేక
బేలతనంబున ♦ వేచిన నాఁడు
నాచాయ రాఁడేమి ♦ నా నాయకుఁడు
నన్నుజూచుచు వద ♦ నంబట్టు త్రిప్పి
తొలఁగిపోవును "చీర ♦ తోడ్డే" చెలియ!

* * *

సైపఁజాలక తమి ♦ దీపము దీసి
శయనింపఁ బోయెడు ♦ సమయము నందు
చోటిమ్మని సోలు ♦ చునువచ్చు సఖిరో!
లేదని పల్లెత్త ♦ లేనపుడైన
వాకిటి పొంతనా ♦ వల్లభుఁడుండ
జూచియోర్వఁగలెదె ♦ సుదతి! నామనసు.

* * *

తోడివారల నేను ♦ త్రుళ్ళుచు నుండ
పెడత్రోవల తాను ♦ నడుచునె ప్రియుఁడు
వంచిన మొగమెత్తి ♦ కాంచఁడెయొకల!
పరితాప మించుక ♦ పలుకఁడె హితుఁడు.
నాథుని చేష్టల ♦ నామదిఁజూచి
ఆనందమే మిథ్య ♦ యని తలపోతు.

* * *

ఒక్కొకమాటు వి ♦ యోగపు వగల
హృదయ మింతింతలై ♦ చెదరితపింప;
తీయనిప్రేమకుఁ ♦ దోయిలిఁ బట్టి
ఆసవెట్టిన యడి ♦ యాసకు మ్రొక్కి;
"అబలల హృదయము ♦ లధివసియించి
పరిపాలించు నో ♦ ప్రణయతపస్వి!
పరులఁ బ్రేమించుట ♦ పాపమునుస్మి!
అంతకన్నను కష్ట ♦ మవనిని లేదు.
జగముల నేలెడి ♦ సర్వమయుఁడవు
సొగసులఁ గరగెడి ♦ సుందరాంగుఁడవు
ఆనందసాగర ♦ మందందమయిన
గడుసుబంగరునావ ♦ నడుపఁగ లేవె?
అన్నెముపున్నెము ♦ నరయంగ లేని

ఈయబలల భ్రమి • యింపగనేల?
నీవునీ వని లాల • నీయపుగతుల
నమ్మువారిని వగ • కమ్మఁగనేల?
ఈయాడుంబుట్టు • వీఁకనాకుఁ జాలు
పూలదండఁగ నను • బుట్టింపవ్రాయి?
తమ్మిపూవుగ నను • దయజూడవోయి?
కనకచేలముగ నన్ • గరుణింపవ్రాయి!"

* * *

అని తలపోసెడి • యర్ధరాత్రముల
విసివి వేసారిన • విసమపు నిశల
ప్రాణముపైఁ గాంక్ష • వదలినవేళ,
ప్రేమపైన విరక్తి • ప్రామినయెడల,
కిలకిల నవ్వుచు • కేళీనిరతి
నందగాడై చెల్వు • చిందెడు వగల
ననుడాయఁగవచ్చి • నానిద్రలేపి
నేను పరవశఁజేయు • నానాగతుల;
తహతహఁదార్చు వి • రహబాధలెల్ల
అప్పు డసత్యము • లని యెంచికొందు.

* * *

ఎన్నితిప్పలు వెట్టి • యెంత వేచినను
ఎడబాయఁ జాల దీ • హృదయం బతని
పలుభవముల యందు • పలువేసములను
ననుగరగించిన • నాయకుఁ డితడె,
అభిమాన మెడలిన • నవమానమయిన,
అఖిలలోకమ్ములు • నాడిపోసినను,
నాథునిపైనిల్చి • నగ్నంబయిన
నాయనురాగము • మాయదె చెలియ!

* * *

# రవీంద్రనాథ ఠాకూరు

## కవి

లోకసేవకులలో మహాకవు లగ్రగణ్యులు. పూజ్యవేదికయందు వీరి కీప్రథమస్థానమెందుకువచ్చినదో! ఎవరును జెప్పలేదు. ఎవరిచ్చిరో? ఎందును గానరాదు. కాని కవులీ యగ్రగణ్యమయిన పదవిని చిరంతనముగా నాక్రమించుకొని యేయున్నారు. కాలమువారి కీర్తిని మాపలేక పోయినది. పతనమువారి తేజోదీపము నార్పఁజాలినదికాదు. కారణమేమి? వారి జీవితము లానంద పోషితములగుటయే. కవియానందముతోఁ బుట్టును. ఆనందములోఁ బెరుఁగును. ఆనందముగ బరిణమించును. అతఁడే యానందము. ఆనందమేయతఁడు. అందు వలననే ప్రకృతియతనికిఁ బూర్ణసాక్షాత్కార మిచ్చుచున్నది. చైతన్యము తన యావద్విలాసములను విప్పి ప్రదర్శించుచున్నది.

ఆహా! ఈఆనంద పుత్రులపైఁ బ్రకృతిచైతన్యములకుగల మమతామాధుర్యము! ఎంతని వ్రాయగలము? అపారము, అతీతము. చందమామలో నున్న వెన్నెల కవిపలుకులలో నెఱ్ఱనినిప్పులుగా మారుచున్నది. చెట్టు చివరనున్న చిగురాకులు కవిమాటలతోఁ గలసి మన్మథశరము లయినవి. అట్లని యతఁడనెను. ఔనని ప్రపంచమొప్పి కొనియెను. ఇఁక దీని యాథార్థ్యమును ప్రశ్నిం

చువారెవరు? ఒక్కరును గానరారు! కవులు ప్రాణముపోయనిచో జగత్తొక శుష్కకంకాళముకంటె నందముగఁ గానఁబడి యుండదని ఒక చీనాకవి వచించెను.

ఈవాక్యమందెంత యర్థమున్నదో? సీజరు సాహసాగ్ని చల్లారి పోయినది. యుగములు గడచినవి, కాని కవి వాక్కులు ప్రాణమిచ్చిన సీజరు బ్రతికియే యున్నాడు. పరశురాముఁడు విడిచిన రక్త తర్పణము లేవీ? ఎప్పుడో యెండిపోయినవి, కాని వాల్మీకి వాఙ్మయ లోకమునందు పచ్చినెత్తురు వాసనలు చిమ్ముచునే యున్నవి. శకుంతల నీళ్లుపోసిన కణ్వాశ్రమ ద్రుమములు లెప్పుడో కూలిపోయినవి; కాని కాళిదాస రచనయందు మాత్రము నవనవలాడుచునే యున్నవి. సుకవికి ఆనందము కంటె స్థాయిలేదు. శిశువువలె ప్రకృతి అంకమున నెక్కును. అందుఁ బానముచేసిన అమృతధారలను రుచిరవచనములతోఁ దెలుపును. సంతప్తుని గతిచంద్రసహవాసమునర్థించును. అచట పైఁబడిన జ్యోత్స్నాసారమును 'విషపుష్పక్షీర'మని ఆడిపోసికొనును. క్లాంతములైన కాంతాకపోలములయందు కఠిన విరహాశ్రుకములు చదువును. అనంతములైన శిశుహాసములలో సీశ్వరవర్చస్సు నుపలక్షించును. ఇది యంతయును గవికి నిత్యక్రీడ. కాని బలత్కార కల్పనకాదు. కవుల యతీతశక్తి ప్రజ్ఞాసాధ్యమని చాలమంది భ్రమపడుదురు. అట్లుకాదు. అది ప్రతిభాదత్తమగు జీవకళాప్రభ. అందువలననే కవిశిల్పమునకు అనన్యసామాన్యలక్షణత్వమున్నది. చూడుడు. చిత్రలేఖ రచించి ఉషకుఁ జూపిన అనిరుద్ధుని బింబము నశించినది. కాని కవి దిద్దిన అనిరుద్ధ భావము చావలేదు. యక్షుడు నివసించిన అలకాపురి సౌధము నష్టమైనది. కాని మేఘసందేశమునందు ఆప్రాసాదము సమస్త శోభలతో రాణించుచునే యున్నది. ఈయనశ్వర స్థాయినిగల్పించుటకుఁ బ్రజ్ఞకు సత్తాలేదు. ప్రతిభకు మాత్రమే పాటవము కలదు. అందువలననే వేదరుక్కులు.

'కవిరకవిషు రమృతంనిధాయి'.

అని అర్థోన్ముక్తమగు సూక్తి నిచ్చుచున్నవి. ఈక్రింది పంక్తులలో అట్టి మహాకవి జీవిత మొకటి యనువదింపఁ బడుచున్నది.

## వంశము

మహాకవి రవీంద్రుఁడు ఠాకూరు వంశస్థుఁడు. ఠాకూరులనగా బ్రాహ్మణులని యర్థము. ఈయన తండ్రి దేవేంద్రనాథ ఠాకూరు. తాత ద్వారకనాథ ఠాకూరు. ద్వారకనాథుడు మహారాజులతోఁ బోల్పఁదగినవాడు. కాని సామాన్యజీవి కాడు. ద్వారకానాధ ఠాకూరును 'ప్రిన్సు' అని పిలుచుచుండిరి. ఆనుపూర్వికమగు ఐశ్వర్యమును ద్వారకనాథుఁ డనేకవిధముల విస్తరింపఁ జేసెను. ఆయన గౌరవముగూడ అసాధారణమైనది. ద్వారకనాథుని కాలము నాఁటికి ఆంగ్ల సామ్రాజ్యము భారతవర్షమునందుస్థాయిఁ గల్పించుకొనలేదు. వారి అధికారమును ఐశ్వర్యమును శైశవావస్థ యందుండెను. పరిపాలనా సూత్రములు కంపెనీవారినుండి విక్టోరియా రాణి చేతులలోనికి వచ్చిగూడ ఎంతోకాలము కాలేదు. ఆంగ్లుల వసతి వ్యాపారములకు కలకత్తా ప్రధాన నగరముగనుండెను. ఆ కాలమునందు వాణిజ్యప్రచారకులైన యైశ్వర్యవంతులలో ద్వారకనాథఠాకూరు ముఖ్యుఁడు. అందువలన ఆంగ్లిదేశీయులనేకులు ద్వారకనాథునకు బరిచయులైరి. ఈ పరిచయము క్రమాగత

ముగా వర్ధిల్లెను. తుదకు ద్వారకనాథ ఠాకూరు శ్రీ విక్టోరియా మహారాణిని లండను నగరమందు సందర్శించి, గౌరవమందుటతోఁ బరిణమించెను. రవీంద్రుని వంశమునకు ఖండాంతర గౌరవము తాతలనాఁడే యబ్బినది గదా! ఇఁక తండ్రుల కాలము నవలోకింతము. దేవేంద్రనాథ ఠాకూరు జీవిత చరిత్ర మిగుల విచిత్రమైనది. ఆయన శైశవము స్వర్ణ డోలికలలో నానందించెను. యౌవనము సంపన్న గృహస్థాశ్రమమున ధన్యమయ్యెను. కౌమారము బ్రహ్మ సాధనయందు మగ్నమయ్యెను. అనంతర దశలో సంప్రాప్త జ్ఞానియై మహర్షిగా నస్తమించెను. చరమ దశలు రెండును కుమార రవీంద్రుని కన్నులయందు జరిగినవి. ఆ తండ్రి జీవిత మీకుమారుని మనోవృత్తుల కెట్టి శిక్షా సంస్కారముల నిచ్చెనో, పాఠకులుముందు గ్రహింపఁగలరు. దేవేంద్రనాథ ఠాకూరు కించిత్ స్ఖలనముచే భ్రష్టుఁడైన మహాతపస్వి. ఆయన బ్రహ్మసాధనను సమగ్రముగ జర్చించుట కిందు పొందు పొసఁగదు; కాని యొకమాట చెప్పక విడువరాదు. రెండు మూడు శతాబ్దముల మధ్య సంకల్ప సన్న్యాసముఁజేసి మహాకర్మయోగులుగా ధన్యులైన మహనీయులలో మహర్షి దేవేంద్రనాథుఁ డగ్రగణ్యుఁడు. ఈయనకుఁ గామ్య బంధములెట్లు తెగెనో, మూఢవిశ్వాసములు నట్లే శిథిలము లయ్యెను. జ్ఞాన పిపాస యెంతయధికమయ్యెనో, స్వాతంత్ర్య కాంక్ష యంత నిశితమయ్యెను. వేదములు చదివెను. భాష్యశాంతిఁ జేసెను. ఉపనిషత్తులు పరిశోధించెను. ఇదియె ఆయన సాధనకాలము. దేవేంద్ర నాథుని ప్రథమమునఁ బ్రబోధించిన మహావాక్యము మిగుల సొగసైనది. అది

"త్యక్తేన భుంజీథా"

ఈయుపనిషత్సూక్తి ఆయనఆత్మపైఁజూపిన ప్రభావ మనన్యము. ఒకదినము మేడమీద నిలచి పరివారమునంతను బిలచెను. వచ్చిన వారికి చేతికివచ్చిన దెల్ల నిచ్చుచుండెను. 'త్యక్తేన భుంజీథా' యను వాక్యము నాయన అన్వయించుకొనిన తెఱఁగు ఇంతటితో మనకు బోధపడదు. దాదాపు నూఱులక్షల విలువఁజేయు ద్వారకనాథ ఠాకూరు ఐశ్వర్యము మహర్షి యస్తమించు నరికి ౫, ౬ లక్షలకంటె మిగులలేదు. ఇది యంతయు దేవేంద్రనాథుని 'త్యాగసాధనా' ఫలితమె. దేవేంద్రనాథ ఠాకూరునకు ఉపనిషత్తులు ప్రమాణసూక్తులు. అందలి యనేక ఋషి వాక్యములను ఆప్తభక్తితోఁ బఠించుచుండెడివాడు. జీవితమనఁగా మహర్షుల దేజీవితము. మహర్షులనెట్టివారు?

సంప్రాప్యైనం ఋషయో జ్ఞాన తృప్తాః
కృతాత్మానో వీతరాగాః ప్రశాంతాః
తే సర్వాఁగః సర్వత ప్రాప్యధీరాః
యుక్తాత్మానా సర్వమేవా విశంతి!

దేవేంద్రనాథ ఠాకూరు పలుమారీవాక్యములు చదువుచుండెడి వారఁట. మానవాదర్శ మిదియే యనియు, ప్రతివ్యక్తియు ఋషి కల్పుఁడు కాదగుననియు నాయన నమ్మెను. అట్లే సాధనా బలంబున సాధించెను.

"ఏకంసత్! విప్రా బహుధావదంతి"
అనునది మహర్షికి లక్ష్యసూత్రము.

### బాల్యము—గృహశిక్ష

రవీంద్రుఁడు ఐశ్వర్య దేవతల స్వర్ణహస్తములలోఁ బుట్టెను. బాల్యము చాలవఱకు పద్మానదియొడ్డున గడచెను. షిలయిదానంటి కొని వీరి జమీందారీ గ్రామములు పెక్కులు

గలవు. మహర్షి సంవత్సరమునందుఁ గొన్ని మాసములు పద్మాతీరమున గడుపుచుండు వాడుక యుండెడిది. రవీంద్రుని శైశవము పిమ్మట దా యందే వర్ధిల్లెను. త్రికాలములయందును మహర్షి గృహమున ఉపనిషత్పఠనము జరుగుచుండెను. జ్ఞాన గోష్ఠి యధికము. రవీంద్రునికి తల్లి పాడిన లాలిపాటలును, పద్మానది పాడిన భావపదములును, మహర్షి పాడిన ఉపనిషద్గీతములును స్తన్యముతోఁ బాటు అవ్యక్త సుఖపానీయము లయ్యెను. ఉగ్గుబాలతోఁగూడ నిట్టి ఆనంద పారవశ్యము న చవిఁ జూచిన వాడగుట చేతనే తరువాత రవీంద్రుఁడు

"ఆనందాద్ధ్యేవ ఖల్విమానిభూతాని జాయంతే
ఆనంద జాతాని జీవంతి
ఆనందం సంప్రయ న్త్యభిసం విశంతి."

అను ఉపనిషద్భావ మధువును తన కవితావేణువున నార్ద్ర శ్రుతులలోఁ నెలికించెను. కుమార రవీంద్రుని విద్యాధ్యయనమును గూర్చి ప్రత్యేకమెత్తి చూపవలసినదంతగాఁ గానరాదు. ఈయన యెనిమిదేండ్ల వాఁడగు సరికే అన్నలందఱును సుప్రసిద్ధ విద్వాంసు లని పేరుఁ గాంచిరి. ద్విజేంద్రనాథ ఠాకూరు అప్పటికే 'స్వప్న ప్రయాణ' మను గంభీరకావ్యమును వ్రాసి వేత్తయని, వన్నె కెక్కెను. సత్యేంద్రనాథ ఠాకూరుగారు ఐ. సి. యస్. పరీక్షయందుఁ గృతార్థుఁడై కలక్టరు హోదాలోఁ బ్రకాశించుచుండెను. జ్యోతీంద్రనాథ ఠాకూరు 'రాగిణీర్ నాచే' యను సంగీత రహస్య దర్పణమును స్వతంత్రముగా రచించెను. మృచ్ఛకటికను బంగ్లా భాషయం దనువదించుట మాత్రము కుమార రవీంద్రుఁడెఱుఁగును. రవీంద్రుఁడు బాల్యమున కడుగడుసరి. చదువుటయనిన ఆయనకు గండక త్తెరగ నుండెడిది. ఉన్నతములగు సౌధాగ్రములపై నెక్కి ఆకాశము నవలోకించుట ఆయనకు మిగుల ప్రియము. పింజలు పింజలుగా మేఘపుంజములు లేచు దినము కుమార రవీంద్రునకు బండుగ వంటిది. చిన్నతనమునుండియు జ్యోత్స్నానిశీథములలోఁ నావప్రయాణము చేయుటయందుల్లాస మధికము. ఇంటియందు ఈయన వాదులాడనివారు లేరు. రవీంద్రునకు సాహిత్యమందభిరుచి పుట్టించినవారిలోఁ పెద్దక్కగారు ముఖ్యులు. ఆయమ వాత్సల్యము నుద్దేశించియే తరువాత

"మమచిత్తే నవనాచే చిరరసతవవాణీ"?

యను గీతమొకటి రచింపఁబడినది. తనపాలిటి కాయుదారవర్చస్విని సరస్వతియే యని యిప్పటికిని చెప్పుచుందురు.

### ఛందోరచన

రవీంద్రుఁడు ప్రథమపద్యము వ్రాయుసరికి ఆయన వయసెంతోలేదు. ఎనిమిది యేండ్లు మాత్రమే గడచెను. ఆపద్యమేదో యెందును బ్రకాశింపఁబడలేదు; కాని వారొకమాఱు స్వయముగఁ జదివిరి. ఆపద్యరచనను గుఱించి 'జీవనస్మృతి' యందిట్లు వ్రాసికొనిరి;

> క్రొత్తగా మొలచు కొమ్ములతో ఇక్కడనుండి యక్కడకును అక్కడనుంచి ఇక్కడకును గంతులువెట్టు కుమారకురంగమువలె నా ప్రారంభ పద్యరచనతో, నేనింటియందెల్లెడల అల్లరి మొదలువెట్టితిని.

దానికి 'ద్విరేఫ' మనిశీర్షిక. బంగ్లాభాషయందు ద్విరేఫము అప్రయుక్తముగా నెంతురు. వారిభాషయందు వాడుకతక్కువ. కేవల సంస్కృతముగాఁ దీసికొనుటకు అభిమానపడుదురు. ఎవ్వరును సామాన్యముగాఁ బ్రయోగింపని ద్విరేఫశబ్దమును తాను వాడఁగలిగితి

నని సుకుమార రవీంద్రుఁడు ఎంతో సంతోషించెనఁట. ఈమహాకవి అధ్యయన తరుణమునఁ పఠించిన గ్రంథములు మిగుల నల్పసంఖ్యాకములు. బంగ్లాభాషా ప్రవేశమునకు "మేఘనాథవధ" నారంభించెను. ప్రచారబాహుళ్యమునుబట్టి మేఘనాథవధ మనదేశమందలి మనుచరిత్రకుఁ బోల్పవచ్చును. కాని మనుచరిత్రయందలి రచనాసౌందర్యము మేఘనాథవధయందు లేదు. మేఘనాథవధలోని భావోద్ధతి మనుచరిత్రయందు లేదు. మనదిసరళరచనగల మృదుకావ్యము. వారిది ధీరరచనగల భారగ్రంథము. రవీంద్రునకు ఉపనిషదధ్యయనము చిన్నతనమునందె లభించెను. సంగీత ప్రసక్తియును తోడ్తోనబ్బెను. మానిసి యవస్థలలో బాల్యము పసితమలపాకు వంటిది. అపుడెంత సుకుమారపు రేఖలంటినను అవి శాశ్వతముగ స్ఫుటపడును. కలంకరహితమైన రవీంద్ర శైశవ మేయేఛ్ఛాయా తేజస్సుల నాహరించెనో, అవియే అనంతర వికాసదశయందు నానాకళలతోఁ బరిణమించెను. ఆయన ధర్మజీవితమునందు ఉపనిషదవబోధము చక్కఁగాఁ గాన్పించుచున్నది. ఆయన కవితయందు సంగీతోత్కర్ష తేటగా వినఁబడుచునేయున్నది.

బంకిం చంద్రుని దీవన

వంగజాతీయావబోధమునకు బంకించంద్రుఁడు మూలపురుషుఁడు. సాహిత్యసూత్రము లీయన చేతిలో నిరంకుశ నిశితాస్త్రములై యొప్పినవి. ఈమహనీయుని ప్రతిభాశక్తులు అత్యద్భుతములు. ఈయనరచన నెట్లు కావలసివచ్చిన నట్లుపయోగించుకొనవచ్చును. ఈమహాకవి సాహిత్యరచనను గూర్చి రవీంద్రుఁడు వ్రాసిన పంక్తులే యర్థవంతములు.

"హే! ఆనందధాతా! అమృతపుత్ర! నీకవితాస్రోతము లేశక్తి గర్భమునుండి లాగి తేలితివి. నిద్రాక్షుద్రులను సదాయుంచి లేపుటకు కొంగడాచిల్లలకుచున్నవి. తుచ్ఛకోలాహలాలసులను కడతేర్చుటకు ఉరిత్రాళ్ల యుచ్చులకుచున్నవి. సేవావ్రతులు రక్షాబంధములని ధరించుచున్నారు. నిష్కామ దాసజనము విసర్జనకంకణములని కట్టికొనుచున్నది. ధన్యము. ధన్యము. ఏకన్య చేతికి పవిత్రమాంగల్యమును నుంచిచ్చితివో, ఆధన్యచేతనే యొందిన తోరము పావనము చేయుచున్నావు. ఆర్ద్రిశయ్యయందు ఏ ప్రణయము కంఠసీమ పూలమాలయని. వేసితివో, వాడే యుత్తేక్షణమందు దానిని త్రెంచి త్రాడుపాముని వెలిసించునట్లు యంత్రించుచున్నావు. నీ కావ్యకన్య కడగన్నులవెంట బాష్పకణములు రాలుచున్నవో, రక్తబిందువులు స్రవించుచున్నవో యన్వయించుట దుర్లభము. హే! హాస్యవేత్తా! జ్వాలాపతీ! ప్రభిన్నవాచే! నీవాణికి జయము. నీభావమునకు స్ఫూర్తి."

రవీంద్రుఁడు మొట్టమొదట రామమోహనరాయ వర్ధంతి సందర్భమున బయటికి వచ్చెను. ఆనాఁడొక చక్కని యుపన్యాసమును వ్రాసి చదివెను. మహాకవి బంకిం చంద్రుఁడు అగ్రాసనమందుండెను. రవీంద్రుని యుపన్యాసము సంమోహనాస్త్రమయి సదస్యసహస్రమును బంధించెను. బంకిం చంద్రుఁడు గూడ ఆపారవశ్యమును బూర్ణముగాఁ దప్పించుకొనలేకపోయెనఁట. బంకించంద్రుఁడు మహావక్తలలోనివాఁడు కాడట. ముక్తసరిగ సంభాషించు ప్రియవాఙ్మి. నాఁడు రవీంద్రుని యుపన్యాసముతోఁ గరఁగిపోయి, అసలేమాటలాడ లేదఁట. రామమోహనుని యశస్సును గానముచేసి, వాత్సల్యవివశమయిన హృదయముతోఁ సుకుమార రవీంద్రుని శిరస్సు దువ్వె.

వత్సా! 'వాణీకటాక్షములు నీపై రాణింపనున్నవి. మాతృ తేజస్సు నీమూలమున దిగంతవ్యాప్త మగును గాత'

అని ఆశీర్వదించెను. మహాకవి బంకించంద్రుని మహాదాశీస్సు నేటికి సంపూర్ణసాఫల్యము నందినది.

### వైష్ణవ కీర్తనలు

అప్పటినుండియు రవీంద్రునకు భాషాతృష్ణ తీవ్రించెను. దొంతులు దొంతులుగా అద్దపు బీరువాలోనున్న పుస్తకములను జదువనారంభించెను; రాత్రిలేదు, పగలులేదు, స్నానములేదు, అన్నములేదు, ఒకటేదీక్ష. ఇట్టి పుస్తకపఠన మవలంబించిన కుమారుని యభ్యాసమునుఁ దప్పింపవలెనని తల్లిచాలఁ బ్రయత్నించెను, కాని ఫలితమేమి; ఒకపద్యము.

"తల్లీ! నీ స్తన్యముల నాను కాలమం దేయానంద మనుభవించితినో, ఇప్పుడును అట్టియానందము ననుభవించుచున్నాను. నీపూర్ణాంకమునుండి నన్ను విడఁదీయుట కెవరైన సాహసించిరా? ఇప్పుడే పుస్తకవక్షస్థలములనుండి ఎడబాపు పాపము నీకేల?"

ఈ అధ్యయనావసానమున రవీంద్రుని వాణిప్రౌఢ ఛందోమయియై గుబ్బటిల్లెను. అపుడు వ్రాసిన గీతములే భానుసింహపదావళి. రవీంద్రుఁడు స్వీయనామముతో నీపదావళిని బ్రకటింపలేదు. భానుసింహయను ప్రచ్ఛన్ననామమును ధరించి సహృదయలోకమును బ్రవేశించెను. భానుసింహ పదావళినుండియే నేను మత్ప్రాకచోఁ దెనిగించిన సఖిసంవరణము దీసికొనఁబడినవి. మచ్చునకై దీనిని అనువదించితిని. భానుసింహపదావళి యిపుడు ప్రకటింపఁబడినది సంపూర్ణముకాదు. పెక్కుగీతములింకను నిలచియున్నవి. కొన్నిపోయినవి. ఈవిషయమును గూర్చి జీవనస్మృతియందు ఇట్లున్నది:—

"నేను వ్రాసిన పద్యములను నాయంతట నేనే వసారాలలోను, గాలిలోను, విసరి పారవేయుచుంటిని. శిశిరఋతువునందు తనపత్రములను తానే చెల్లాచెదరగా రాల్చిపారవేయు వనస్పతుల పగిద్ధను నాకాగోపించునో వచ్చును.

ఈపదావళియందు వైష్ణవకవులయనుకరణము స్పష్టముగాఁ గానఁబడును. ఆత్మను నాయికగా దీసికొని పరమాత్మను నాయకునిగా సంబోధించుట వైష్ణవకవుల మూలభావము. వీరిరచన యతీవసరళము. భావములు అతిసుకుమారములు. రసస్ఫూర్తియును మిగులనిశితము. ఎక్కువరసవంతముగా వ్రాయఁబడిన వైష్ణవగీతములలో 'దాస్యస్నేహ' భావములు ప్రధానములుగాఁ గానవచ్చును. రసోదయమునకును ఆనంద ప్రేరణకును వైష్ణవకవిత పెట్టినపేరు. రవీంద్రుని భావనాదృష్టిని ప్రప్రథమమున నాకర్షించినవి వైష్ణవగీతములె. ఒక్కొకప్పుడీ మహాకవి విద్యాపతి పదములను కంఠమెత్తి తన ఆనమేడలును అల్లల్లాడునట్లు పరవశుఁడై పాడుచుండెడివాఁడట. ఇప్పటికిగూడ వీధి భిక్షుకులు పాడు వైష్ణవపదములు వీరిమనసును మరులెత్తించుచుండును. భానుసింహ పదావళియంతయు వైష్ణవగీతానుకరణమే. ఐనను రసికప్రపంచము దీపదావళికిఁ గలిగిన ఆదరము మాత్ర 'మసామాన్య' మని చెప్పకతప్పదు. 'అభినవజయదేవుఁ'డొక డుదయించెనని యుల్లాసపడిరఁట.

### ప్రణయము

ఈకాలమందో ఇంకకొంచెము తరువాతనో రవీంద్రునకు వివాహమయ్యెను. చిన్నతనమునుండియు నీసుకుమారునకు సౌందర్యరక్తి యధికము. రవీంద్రుఁడు సహజముగ స్ఫురద్రూపియనుట నిర్వివాదము. అందు యౌవనతారుణ్యము లీయనలావణ్యమునకొకచకిత వర్చస్సునిచ్చెను. వయసునం దందగాండ్రలో

వందగాడని పేరుమోసెను. స్వచ్ఛములయిన ధవళ దుకూలములుదక్క అన్యములు కట్టి యెఱుఁగరు. పూలయందు మమకారమెక్కువ. ఈవిషయమునుగూర్చి వ్రాయుచు దేవీస్వర్ణ కుమారి మా సోదరుని 'పుష్పప్రియుఁ' డని మా జనకులు పేరువెట్టిన సమంజసముగనుండెడి దని నుడివెను. ఈతరుణమున తీగలుసాగిన రచనయంతయు 'ప్రణయభావ' పూర్ణమై రాణించెను. షెల్లీకవిత్వమునం దనురక్తిమొలచి వర్ధిల్లెను. అపుడు బయలువెడలిన పుస్తకములలో 'సొనార్ తెరి' అనగా బంగారునావ ప్రశంసనీయమయినది. తరువాత 'చిత్ర'ను జేర్పనవచ్చును. షెల్లీకవి 'ఇంటలెక్చ్యుయల్ బ్యూటీ' అనగా మేధాసౌందర్యము అనుపేరుతో వ్రాసిన కావ్యఖండమును బంగ్లాభాషయందనువదించిరి. ఇది వ్రాసిన ౨౦ సంవత్సరములకుఁ బ్రాచీన 'సాహిత్య'మను విమర్శ గ్రంథమందు మఱలఁ జర్చకుఁ దెచ్చిరి. భగవాన్ శంకరుని సౌందర్యలహరికిని షెల్లీ 'ఇంటలెక్చ్యుయల్ బ్యూటీ'కిని విచిత్రమైన సూక్ష్మసాదృశ్యమున్నదని కొన్ని సొగసులు చూపిరి. కాని ఇప్పుడు మహాకవికి షెల్లీకవితయందు 'వాస్తవికరుచి' లేదని యభిప్రాయము. ఆ యాదరము తప్పిపోయినది. సొనార్ తరియందు మన ఆలంకారికులు పిలచిన 'కావ్యకాంతి' మాత్రమత్యంత సమృద్ధముగ నున్నది. నూత్నప్రణయ ప్రచారమును, తదవస్థాగమనమునందు క్షణక్షణ భ్రమణమును గల్పించు ప్రకృతివిలాసములను, ఇందు కవిమనోదృష్టియందు గాఢముగ బింబించినట్లగపడును. ఇందలి కావ్యపవనము తారాపథమునకును చంద్రమండలమునకును మధ్యవీచుచుండును. కిన్నరీ గాంధర్వము వినవచ్చును; గాని మానవకలస్వనమునందుఁ గిన్నరీకల కంఠము సూచించు నవకాశములు లేవు. అప్సరసలను జూచు దృష్టియేయున్నది; కాని ప్రత్యక్షప్రణయినీ జనమందు అప్సరో విలక్షణత్వము నవతరింపఁజేయు నైజరుచి కానరాదు. ఈయుగమందు వ్రాసిన యితరవ్యాసములను బ్రసక్తికిఁ దెచ్చుటకు ఈలేఖకున కధికారము చాలదు.

### పత్రికా సంబంధము

వంగదర్శని అనుమాసపత్రిక బంకించంద్రునిచే నిర్వహింపఁబడుచుండెను. ఆమహాశీయుని యవసానానంతర మాపత్రికకు రవీంద్రుడు కొన్ని యేండ్లు సంపాదకుఁడయ్యెను. అదియే వీరి వచన రచనకుఁ బ్రారంభమనుకొందును. వంగదర్శనిలోని రచనల నిపుడు పరిశీలించితిమేని మహాకవుల ప్రథమ భావావతరణ నిర్ఘోషము బాగుగ వ్యక్తమగును. రచనయందొకబిగువు, పోకడయందొకానొకవిధమయిన పిక్కటి బిఱ్ఱు. భావముల రాపిడిచే పిగులుపదములు; పదముల త్రుళ్ళింతలతో సుళ్లుతిరుగు వాక్యసంధులు; ఒకపరుసనైన నిరంకుశావేగము; మన్నగుననేక ప్రక్రమప్రౌఢిమలు గానవచ్చును. రవీంద్రుని ప్రథమరచనకుఁ జక్కనివిలక్షణతయొకటి మొదటినుండియునంటియుండెను. అందు వాదప్రకోపనమును, నూత్నభావప్రాగల్భ్యమును గణనీయములు. వంగదర్శని రవీంద్రుని హస్తములయందున్నప్పుడు పొంగులుపోవు ఉడుకుపాలతోడి పెంపఁబడెను. విషయ పక్షమున ఈతరుణవాఙ్మయమందు ఖండనవివాదము లెక్కువ.

### చిన్న కథలు

రవీంద్రుని పద్మాతీర నివాసముచాల ముఖ్యమయినది. ముప్పదియేండ్లు దాటీదాటని వయసున జమీందారీభూముల పరిపాలన

ము బరిశీలించుటకు మహర్షి దేవేంద్రుడీ కుమారునిబంపెను. అపుడు కొంతకాలము పద్మాతటమందె నివసించిరి. తరువాత నాప్రాంతమందె ఆ ప్రకాంక్ష యంకురించెను. నావలకు తెరలెత్తించి పద్మానదిమీఁద ఈయనతటచు ప్రయాణము చేయసాగెను. జ్యోత్స్నా చకితమయిన నిశీథములును, పచ్చికగుబురులచే నయనపర్వములైన యేటిగట్లును, రవీంద్రుని భావములకొక శ్రోత్రమాధుర్యస్వరూపముల నద్దుచుండెను. వీనికిఁ దోడు నావికులు పాడు పాటలహరహమును వీనులకు విందుసేయసాగెను. రవీంద్రుడు, ఆర్ద్రహృదయము గలవాడు. ఆయన మొట్టమొదట ఈజానపదుల పాటలను వినోదార్థము వినసాగెను; కాని అందు గ్రహింపఁదగిన యమూల్యభావములు గుప్తములైయున్నవని తలఁచి యుండలేదు. పడవపాటలు వినినకొలది వింతయధికమయ్యెను. ఒక్కొక్కప్పుడు అగీతభావములకు నిలువునీరుగాఁగరఁగి కన్నులనీరునించు వాఁడట. ఈవిషయమునుగూర్చి అనంతర స్మరణయందిట్లు వ్రాసిరి.

"వారి పాటలలో రాగిణీ వైచిత్ర్యములులేవు. శబ్దపిడంబనములేదు. సామాన్యములయిన భావములు. మాయామర్మములులేని తేటమాటలు. అంతేకాని ఆరహస్యమేమో తెలియదు. ఆపదములలోఁ జిత్రింపఁబడిన భావములు సజీవకళలతో మనముందు నిలువఁబడును. ఆమె యేడ్చిన మనమేడ్తుము. ఆమె నవ్విన మనమునవ్వుదుము. ఇంతయేల? ఆమె మానసికావస్థలె మనకును లటుస్థించును. తనభావముల నితరుల మానసములలో యథార్థవర్ణనీయముగా నద్దఁగలనేర్పు; తన రసోదయము నన్యునియందును మొలిపింపఁగలచతురిమ; ఆ గ్రామగీతారచయితలకుఁగలదు. వారె మహాకవులు. వారి వాణియే ధన్య"

ఈతరుణమున రవీంద్రునకు లభించిన యనుభవము ఆయన మనోవృత్తములయందొక మార్పును గల్పించెను. రచనాపరిపాటికిఁగూడ నీవాసన తగులకపోలేదు. రవీంద్రుఁడంతట గ్రామములకు స్వయముగా వెళ్ళుట మొదలిడెను. వారి సామాన్యజీవితములను సాభిముఖదృష్టితోఁ బరికింపసాగెను. వేయేల? వారి కష్టనష్టములయెడ నావేదనయు, సుఖశోభనములపట్ల నామోదమును పొందుచుండెను. అపుడే 'కథారచన' తలయెత్తినది. ఇందు సామాన్యజనుల వేడుకలును, వేదనలును ధారాళపు ఇతివృత్తములుగఁ దీసికొననారంభించెను. కూర్పునందు జాతీయముల నుద్ధరించి సాంస్కృతములను ద్రోసి రాజనను. ఇదియే వీరిభాషావాదమునకు ఆది. రవీంద్రుని చిన్నికథలు సాంగముగఁ జదువుటకుఁ గొంతకష్టము లేకపోలేదు. ఈరచనయందుఁ బ్రాంతీయముల కెక్కువ ప్రాధాన్యమీయఁబడినది. జనసామాన్యమందున్న సాంప్రదాయములు అవిరళముగా వాడఁబడినవి. కాని కొన్ని యద్భుతరసోత్తరములగు కథలున్నవి. సామాన్యపాఠకునకు కల్పనానిపుణిమయు, రసపోషణమును ప్రధానములుగా గణింపఁబడినట్లు తోఁచును. కాని పాత్రౌచిత్యమందెప్పుడును రవీంద్రుఁడేదోయొక మానసిక న్యాయమును దృష్టిపథమునందుంచుకొని రసనిర్వహణమును సాధించును. ఇది కడుగడు సయిన ప్రజ్ఞ. ఈకథలలోని కన్యానాయికలు కొందఱు ఖేచర తాళతళ్యములతోఁ బ్రకాశించుచు పాఠకులను విమర్శనాంధులఁజేసి, ఏ స్వప్న స్వర్గములకో యీడ్చికొని పోదురు.

## జాతీయత

రవీంద్రుఁడు సౌందర్యప్రియుఁడని చెప్పియుంటిని. కాలికములగు నాజూకునాగరక

ములను ఈవర్ధస్వీ యిచ్చువచ్చినట్లు త్రిప్పె
ను. కాని ఎంతోకాలమిూ విజాతీయరంజన
ములకు రవీంద్రుఁడు దాసుఁడై యుండలేదు.
తండ్రి వైరాగ్యసాధన మారంభమైనప్పటి
నుండి మఱల వేషభాషలయందు జాతీయపక్ష
మభిమానముతో త్రోలకరించెను. క్రైస్తవ
నాగరికతకుఁ దలవంచిన దేశములలో వంగదే
శము మొట్టమొదటిది. బెంగాలీపుత్రుల వేష
భాషలుపూర్తిగా మాఱిపోయెను. ఈవిష
వాసనయింతటితో నాగలేదు. ఆహారపరిస్థితు
లకుఁ గూడ తగిలెను. గొప్పవారియింట
విందులు జరిగినపుడు పక్కా-దొరలపద్ధతులవ
లంబింపఁబడుచువచ్చెను. మహర్షి యీసాం
ఘికపారతంత్ర్యమును మిగుల గర్హ్యముగ నిర
సించుచుండెను. కాని కొంతకాలము బాల
భాస్కరులవంటి కుమారులయెడ నదియంత
గా ప్రయోజనకారి కాకపోయెను. దినములు
గడచినకొలఁది విద్యాధికులలో నీ నికృష్టా
చారము ప్రబలుచుండెను. రవీంద్రుఁడే ఈదు
రాక్రాంతిని నిరోధించుట దైవసంకల్పముకాఁ
బోలు. ఒక్క-మాఱుగా విజాతీయవేషమును
బరిత్యజించెను. లాంఛనములను ద్రోసివేసె
ను. అంతటితో నూరుకొనక శక్తిప్రయుక్త
మగు తనలేఖిని నుత్సాహముతో నీస్వధర్మర
క్షణమునకుఁ ద్రిప్పెను. అపుడే, గోరాయను
సాంఘిక నవల బయలుదేరెను. రవీంద్రుని
హృదయమెంత పవిత్రోద్ధతికలదో, భావమెం
త బలవత్తరమైనదో, రచనయందెంత దు
ర్వారప్రభకలదో, అదియెల్ల 'గోరా' యందు
బయల్పడఁగలదు. గోరానాయకుఁడు. వివేకా
నందుని జీవితచ్ఛాయలుకొన్ని యీనాయక
పోషణమందుఁ గలవని కొందఱయభిప్రాయ
ము; కాని గోరా అన్యుఁడుకాఁడు. రవీంద్రుని
చఖోర్‌బాలీ (Eyesore) ఇంతకుముందే ర
చింపఁబడినది. ఇందలి 'వినోదిని' రవీంద్రుని
కల్పనావాస్తవవాదమునకు నిదర్శనము. శాం
తినికేతన ప్రతిష్టాపనముగూడ నీకాలమందే
జరిగెను.

### వియోగము

రవీంద్రునకుఁ గళత్రవియోగమునకుఁ బూ
ర్వమె పుత్రవియోగముగూడఁగలిగెను. ఈమ
హాకవికి ఇరువురు కుమారులును ఇరువురు
కుమారికలును ఉదయించిరి. అందొక పు
త్రుఁడు నష్టమయ్యెను. ఆకుమారుఁ డతి
సుందరుఁడని మహాకవియే అప్పుడప్పుడు
తలపునకువచ్చిన సందర్భమునఁ జెప్పుచుం
డును. మహాకవికి బాలురపైప్రేమ మెండు.
అందు ఆకుమారునిమీఁద ననన్యమయిన మ
మకారము మల్లుకొనెను. శైశవము గడవక
మునుపే ఆపుత్రుని ఋణానుబంధములు తెగి
పోయెను. మహాకవి అఱచేతులలోనే ఆకుమా
రుఁడ స్తమించెను. ఆసమయ మాక్రందన బం
ధురమై సన్నిహితబంధులోకమును తల్లడిం
పఁజేసెను; కాని ఒకచిత్రము. మహాకవికి
మాత్రము మహత్తరమయిన 'జ్ఞానోషస్సు,
గా దర్శనీయమయ్యెను. ఆయన ఆక్రందింప
లేదు; కాని ఆనందించెను. భారహృదయుఁడు
కాక ముక్తభారుఁడయ్యెను.

మానవుని జ్ఞాననేత్రము నున్మీలనముఁజేయుటకు మృ
త్యువువంటి యుషస్సు వేఱొకటిలేదు.

అని తరువాత వ్రాసిరి. ఈసందర్భమున
మహాకవి రవీంద్రుని యువస్థానుభవములను
జర్చించుటకిది స్థలముచాలదు.

### జాతీయవ్యక్తి

రవీంద్రునకుఁ జిన్నతనమునుండియు దేశభక్తి
మిగుల నధికము. ఈసుగుణ మీయనయందే

గాక ఠాకూరువంశమునం దెల్లెడలను గాఢము గ లీనమైయున్నది. మహర్షిసైతము భారతవర్షము పేరుఁదలఁచినపుడెల్ల భావపులకితుఁడగు చుండువాఁడు. రవీంద్రునిజాతీయవ్యక్తి శైశవమునుండియు స్వీయరచనావేశికయందు అందందుఁదొంకిసలాడు చుండినను, వంగవిభాగ తరుణమున ననంతముఖముల నుబికి యుద్వేగించెను. వంగదేశము మహత్తరాందోళనమున మునిగికొట్టుకలాడిన ౧౯౦౬ సంవత్సరములును రవీంద్రునివాని శ్రాంతి విశ్రాంతులనెఱుఁగదు. పాటలుపాడెను. పద్యములువ్రాసెను. వ్యాసములుకూర్చెను. కథలుకట్టెను. ఉపన్యాసములిచ్చెను. ఏపదమునఁ జూచినను మాతృదేశభక్తి ఉట్టిపడుచున్నది. ఏపద్యమునుజదివినను జాతీయత్రాణ నిర్జీవిని పునరుజ్జీవితునిజేయును. భారతీయ మహర్షుల జ్ఞానజ్వాలలు, భారతవీరుల ఖడ్గధారలు, భారతకవుల యుదాత్త రసోపాసన, భారతధర్మముల అనంతస్థాయి, భారతదేశముయొక్క అపార సంపత్సమృద్ధి, మున్నగు ననేక భావములు రవీంద్రుని రచనయందు లీనములై వీర్యప్రకోపమున కాధారములయ్యెను. భారతవర్షమునందలి మహానదులలో నీమహాకవి మహర్షుల తపోక్షీరముల నాస్వాదించెను. ఆకాశమును జీల్చు భూకిభూధరములమీఁదఁ నతీతమైన మాతృగభీరసమృద్ధిని సందర్శించెను. సస్యశ్యామలములయిన ప్రభూతక్షేత్రములయందు నిత్యకళ్యాణమయిన దేశభాగ్యమును దిలకించెను. స్వరమయములయిన శ్రావ్యగీతములయందు జగన్మోహనమయిన సరస్వతి యందెలచప్పుడు నాలకించెను. వేయేల! పూచినపూలతోటలును, కాచిన కనకవనస్పతులును, ఆకాశమందలి తారకలును, పాతాళమునందలి రత్నములును, మాతృతేజస్సునకు బహిరంతరచ్ఛాయా లాంఛనము లనిపాడెను. శోభనచిహ్నమొందుఁ గానఁబడినను తల్లికాళ్ళకుఁబూసిన పసుపని పూజించెను. కార్తికజ్యోత్స్నలలో తల్లియానందహాసమును, వసంతపల్లవములలో జనయిత్రి కుంకుమాభిషేకమును గుర్తించి గారవించెను. ఈతరుణమందు రవీంద్రతపస్వి దేశభక్తిచే నున్మాదుఁడయ్యెననుట స్వభావాభివర్ణనకు అత్యుక్తిదోషము నుతేఁజాలను ఒకయపూర్వశక్తి ఆయనకలము నావహించెను. పూబాతులతో నెట్లు సయ్యాటలాడెనో, కఱుకుకోలలతోఁగూడ నట్లెసాముఁజేసెను. వంగదేశావబోధమునకును రవీంద్ర వాఙ్మయమునకును సన్నిహితమయిన సంబంధము నన్వేషింపవచ్చును. వీరపురుషుల సంకీర్తనమును లేవఁదీసి జాతియొక్క చేతోదైన్యమును విచ్ఛేదించెను. మాతృదేశమునందలి సహస్రశోభావైభోగమును బాడి పతనపరితాపము నరికట్టెను. "నిర్వేదము క్షుద్రభావము. నిశ్చింత స్థవిరజాడ్యము. చాలనయే చైతన్యవృత్తి.జగత్తుయొక్క రసమేప్రాణము. కామ్యదాస్యము అనార్యజుష్టము. భావదారిద్ర్యము అస్వర్గ్యము. ధర్మక్లీబత్వము అకీర్తికరము.పురుషార్థములు దీక్షాసాధ్యములుకాని అప్రయత్నదత్తములుకావు; కర్మఫలితములు కానిసన్న్యాసనంగతములుకావు. భారతవర్షచైతన్యము వసి వాడినది కాని చచ్చిపోలేదు. ప్రాక్తన ప్రాభవమెంత భువనప్రశంసనీయముగ మెరసెనో భావిభాగ్యోదయముకూడ నంత దిగ్దీప్తము కాగలదు." అనుమహత్తరమయిన ఆదర్శమును జాతీయదృష్టి వీధియందుఁ జూపించెను. ఆభారతరుణమున దేశమెంతకలవరపడెనో, జాతీయహృదయ మంతవేదన నొందె

ను; మహాకవి హృదయమును సంతరీవరించెను. ఇదియంతయు నాకాలపు వంగవాఙ్మయమునందు స్పష్టముగఁ గన్పట్టును. రవీంద్రుఁడు సమయజ్ఞుఁడైన భావపుత్రుఁడు. రక్షాబంధనమునకుఁ గారకుఁడీతపస్వియె. నాఁడు తానుగట్టికొనిన రక్షాబంధనము వంగసంతానమంతయు ననుకరించినది. అదియిప్పుడు జాతీయాచారముగఁ బరిణమించినది. విశ్వమానవలోక మంతయు నేక కుటుంబముగఁ జాటించు రవీంద్రుఁడు స్వీయజాతి విభాగమును నిరోధించెనన్నచో వింతయేమి!

చీకటి

రవీంద్రుఁడుజ్జీవింపఁజేసిన జాతీయాదర్శములను సహచరనాయకు లనుష్ఠానమునకుఁ దేఁజాలకపోయిరి; అందువలన మహాకవి మనోదృష్టి 'వెలుగునుండి చీకటిలో' బడెను. ఈతరుణమందు వ్రాసిన గీతములు కొన్ని యీ భావభ్రమణమును యథావిధిగా సూచించుచున్నవి.

"తండ్రీ! దీపము! దీపము' ఈచీకటిని దాటింపుము."

అని మహాకవియంతరాత్మ యాక్రోశించెను.

సాహిత్యవిమర్శ

వెనుక చెప్పిన సంధి తరుణమున రవీంద్రుని హృదయము దుర్వారమయిన సంక్షోభ పడినదని పాఠకు లూహింపకపోరు. తచ్ఛాంతిగా ధర్మవాఙ్మయ పరిశీలనము నందుకొనెను. ఈకాలమందే మహాకవి అనేక పూర్వగ్రంథములను స్వతంత్ర దృష్టితోఁ బరిశీలించెను. అప్పటిరచనగూడ భావాన్వేషణ రక్తిని విడచి, భావసమన్వయ పథమునకు వచ్చినది. ఈయుగలేఖనమె వంగదేశ విద్వల్లోకమందుఁ బ్రచండమైన విమర్శన నుద్రేకించెను. తత్ఫలితముగా సహృదయలోక గర్భము చీలి రెండు తెగలు బయలుదేరినవి. క్షణిక, ఖేయ, మున్నగు సుప్రసిద్ధ కావ్యము లీయుగమున నవతరించినవే. భావప్రౌఢిమయు, నిరంకుశ వ్యాఖ్యాభిరుచియు నిందు విశేష గుణములు. స్వీయచర్చకు నాకు అధికారము చాలదు.

ధర్మవాఙ్మయము

మహర్షి తన సంతానమునకు ఉత్తమమయిన ధర్మశిక్ష నిప్పించెను. అది అందఱపట్లకంటె రవీంద్రుని యెడల గాఢమయిన ఆత్మసంస్కారము నొనర్చెను. పూర్ణమయిన భక్తితో నీమహనీయుని యంతరాత్మ ధర్మోపాసన నవలంబించెను. ఈసాధనచే బవిత్రములయిన తపోవాటికలలో శాంతినికేతనము మొదటిది. ప్రతి బుధవారమును ఉపాసనామందిరమున నుపన్యసించిన ధర్మవ్యాసంగముం గొంతపోఁగా గొంత యిప్పుడు ప్రచురింపఁబడినది. ఆంగ్లమందనువర్తించిన 'సాధన' యందీధర్మోపన్యాసముల సారాంశము చాలఁగలదు. రవీంద్రుఁడు ఉపనిషదుపాసకుఁడని మఱువఁగూడదు. ఆయన బోధయందన్నిటికంటె,

"ప్రాణోవిరాట్"

అనుసూత్ర భావమునకుఁ బ్రాధాన్యమున్నట్లు దోఁచును. సన్నిహితులయిన ఛాత్రులకు దక్క ఆయనభూతదయామయత్వము చక్కగా బోధపడదు. ఈయన జ్ఞానయోగియైనను కర్మ సన్యాసమును జాతీయధర్మముగ నొప్పికొనువాఁడు కాఁడు. మహాకవి ధర్మాదర్శము ద్వైతమా అద్వైతమా అని చాలమంది ఈ రచయితను బ్రశ్నించిరి. ద్వైతము కాదు,

అద్వైతము కాదు; బ్రాహ్మము; కాని ద్వైతాద్వైతస్పర్శలు లేకపోలేదు. కవితయందుఁ బారవశ్యము కనుపించును. దానియంతస్సు నన్వేషించినచో వైష్ణవభావము విశదమగును;—కాని అంతటితో ద్వైతసమ్మతమని భ్రమపడఁగూడదు.

'ఏకంసత్ విప్రాబహుధావదంతి' అను ఉపనిషదర్థమును గంఠమెత్తి సర్వతోముఖముగాఁ బాడియున్నాఁడు. ఈసందర్భమున నొక చిత్రమయిన యంశమున్నది. దానిని జెప్పక విడవరాదు. గీతాంజలియందు,

"ప్రియుఁడా! నన్ను నీలో నైక్యము జేసికొనుము. కాని నీతో నైక్యమయితినను ఆనందస్పర్శ ననుభవింపఁగల యంతటి స్వల్పస్వస్వరూపమాత్రమునాకు నిలుపుము."

అని యొకగీతము కలదు. ఈమాత్రాంశమునె ద్విజేంద్రనాథఠాకూరు వేదాంతి గూడ నిటీవల గ్రీకుతత్వశాస్త్రములను జర్చించుచు సిద్ధాంతీకరించెను. అయినను ఈవిషయమును గుఱించి నేనిదమిద్ధమని నిర్ణయింపలేను.

యోగి

మహాసీయులగు యోగుల జీవితము లసామాన్యములు. రవీంద్రుఁడు యోగి. అనగా ఫలనిస్పృహుఁడని నాయర్థము. ఈతపస్వికి ఏబదియయిదు సంవత్సరములు కడచినను అత్మమాత్రము నిత్యకౌమారమునందే యున్నది. ఇది ఆయన నడవడియందు తేటతెల్లముగఁ బ్రమాణ మిచ్చుచుండును. కొమ్మమీఁది కోయిలవలె స్వచ్ఛందముగాఁ బాడును.. లజ్జాసంకేతము లెఱుఁగని బాలునివలె నాట్యముసేయును. అందువలననే అమాయకులగు బాలురపై నాయనకుఁ బ్రేమ యమితము. తానుగొప్పవాఁడని యితరులు జంకఁగూడదు. తనయందేమో యున్నదని యితరులు సంశయింపరాదు. ఇవి రెండును రవీంద్రునకు మిగులఁ బ్రియములు. ఈద్వంద్వవికారములు లేనివారు బాలురు. రవీంద్రుఁడు వచ్చినను వారు పచ్చిమామిడిపిందెల కొఱకు రాళ్లు విసరుచునేయుందురు. ఆయన నిలచియున్నను వారు ఉయ్యాలలూగుచునే యుందురు. తమహృదయములను దాచుట యెఱుగరు. ఈయవ్యక్తలీలను మహాకవి మిక్కిలి ప్రేమించును అందువలననే ఆయన కాలము చాలవఱకు పిల్లలచెల్లాటలలో గడచును. ఆయన కానందముకూడ నిదియే! రవీంద్రుని జీవితము యాత్మసిద్ధికిని లోకసేవాధర్మమునకును నిదర్శనము. ఉదయభానునకభిముఖుఁడై ఒక్కొకపుడు పద్మాసనము వేసి కూర్చుండును. కనులవెంట ధారలుగట్టి బాష్పములు కారుచుండును. ఒక్కొకపుడు దరహాసతరంగములుబ్బుచుండును. కంఠమెత్తి పాడుట ప్రారంభించినపుడు ఈగీతాపుత్రునకు యామములు గనఁబడవు. ఆకలిదప్పులు గోచరింపవు. ఈశ్వరసంకీర్తనమునకు ఆద్యంతము లెక్కడ గలవని ఆశ్చర్యపడును. అధోగతియందుఁ గ్రుంగిన ఈశ్వరసంతానమునకై ఆయనహృదయము పడుబాధ భగవంతుఁడే యెఱుఁగును. లోకము ప్రేమమయముగావలెనని కోరును. తానుముక్తిబొంది కృతార్థుఁడు కావలెనను వాంఛలేదు. జన్మజన్మాంతరముల యందిట్టులే పుట్టవలెను. ఈశ్వరగానమును వినిపింపవలెను. లోకతరణోపాయము నన్వేషింపసాధనఁజేయవలెను. స్వాతంత్ర్యమయమయిన ధర్మప్రపంచమును నిర్మింపవలెను. ఆనందింపవలెను. ఆనందదాతయగు ఈశ్వరుఁడప్పుడే ఆనందించును. ఈపుటలలో నొకమహాపురుష

జీవితము స్మరింపఁబడినది. పాఠకులొక విషయము మఱువరాదు. మహాపురుషుల తేజస్సు సహస్ర ముఖవిహారము కలది. అన్ని ఛాయలను బట్టికొనుట అసాధ్యముకాకపోయినను దుస్సాధ్యమనక తప్పదు. ఇందు రవీంద్రుని జీవితము ఆయన కవితాపీఠసాన్నిధ్యమందుండి స్వీకరింపఁబడినది. ఇతర చ్ఛాయలనేకము లింకను నిలచియేయున్నవి.

సీ. రాగిణీరాగోప ♦ భోగలీలలనుతీ
  రిచిగంగునుడులఁ జి ♦ త్రించినావు
శిశువుల చెక్కిళ్ళ ♦ జిగిరించునవ్వుల
  నానందసూత్రము ♦ లల్లినావు
తెగిన వీరకిరీట ♦ దివ్యమణులఁ గూర్చి
  దేశకంఠమున బంధించినావు
ప్రియుఁడైన పరమాత్మ ప్రేమోపగూహన
  ములఁగవితాపుత్రి నిలిపినావు
గీ. భావపదము గీతాసఖి ♦ వాణినునిచి
  జాగ్రదుత్సాహబలరుచిఁ ♦ జల్లినావు
  జన్మభూమిని స్వర్గవా ♦ సనలువీవ
  సాంద్రముగఁ బాడినావు రవీంద్రసుకవి.

—రాయప్రోలు సుబ్బారావు.

## "శ్రావణ భాద్రపదములు"

వడ్డాది సుబ్బారాయ కవిగారిచే వ్రాయఁబడినది.

మ. ఇలఁ బాలింపఁగ రాజమంత్రు లెటు ల ♦ క్ష్మి యిల్లు పాలింపఁగా
  వలయుం బూరుషుఁడుం బురంధ్రియు; నెటుల్ ♦ వారల్ స్వకీయక్రియల్
  సలుపంగాఁ దగుశక్తి గాంతురు యథా ♦ జాతస్థితిన్ వర్తిలన్?
  దెలివిం బొందుట కభ్యసింపవలె వి ♦ ద్దెం బాలురుం బాలికల్.

చ. కడిఁదికుటుంబభార మను ♦ కాఁడిని బుద్ధిబలంబునం బదం
  పడి వహియింపఁగా వలయు ♦ బాలురు బాలిక; లట్లు గావునన్
  బడఁతులు విద్య నేరువని ♦ పక్షమునన్ బరు వొక్కప్రక్కనే
  పడి భరియింపరాని బహు ♦ బాధ గృహస్థునకున్ దటస్థమౌ.

చ. వెలుతురుఁ దోడుపాటునను ♦ వెల్పలి కన్నదురం దనర్చు వ
  స్తుల నెటు చూడఁగల్గు నటు ♦ చూడఁగ నేరుచు ముజ్జగంబులన్
  వెలయు సమస్తచిత్రముల ♦ విద్యసహాయత లోనికన్ను; లో
  పలివెలుఁ గైనవిద్దియ య ♦ వశ్యము గాదె యదృశ్యమధ్యకున్?.

సీ. పాఱుఁ డొక్కఁడు తొల్లి ♦ పరదేశ మరుగుచు–"వచ్చు శ్రావణభాద్ర ♦ పదము లింక
  నిబ్బంది పడు" దని ♦ యింట నన్నియుఁ గూర్చి–యిల్లాలితోఁ జెప్పి ♦ యేఁగె; నప్పు
  డీమాట విని ధూర్తు ♦ లిరువురు మఱునాఁడు–దావళాల్ నీర్కావి ♦ దోవతులును
  సాలులు దర్భాస ♦ నాలు జారీల్ భూతి–పెండెకట్లు ధరించి పేద మొత్తై

చమఁ బుట్టొంపు వచ్చి • చాపఁ గూర్చుండ - నెవరు మీర" లనియె • నింటియాపె;
"జంకుఁ గొంకు లేక • శ్రావణభాద్రప - దముల" మనిరి మాయ • దారు లంత.

ఉ. వారల కర్ఘ్యపాద్యములు • బ్రాహ్మణి భర్త నొసంగి "మేలు చే
కూరిచె మీదు రాక" యని • గొబ్బున సిద్ధము చేసి కూడునుం
గూరలుఁ బప్పుఁ జారు వరు • గుల్ వడియంబులు నప్పడంబు లిం
పారఁగ నారగింపు లిడె • నయ్యల కాజ్యదధిప్లుతంబుగన్.

ఉ. ఓరగ నిల్చివారి కనె • నుగ్మలి "మా యజమాను లూరలే
రీరలు వారు వచ్చువఱ • కిచ్చట నుండుఁడు" నాగ మేకొనన్
గారవ మంతకంత కధి • కంబుగ నట్లను చిట్లు, బూరెలన్
గారెల బాఁపలం దినము • గట్టునఁ ద్రేఁపఁగ నాపె మేపఁగన్.


సీ. శిష్టుని బూజింపఁగా • దవ్వసట్లు దంచి గం-పల నించు ప్రాసంగుఁ • బ్రాలు సెల్లెఁ
బెసలు విసిరి యొండఁ • బెట్టి పొట్టుడలించి-బానఁ బోసినచాయ • పప్పు సెల్లెఁ
జేమున్క యూటలోఁ • జేవదేరుచు నున్న-కడవలలో నావకాయ సెల్లెఁ
గమ్మగా వెన్నను • గాఁచి పెందుత్తల-నిండఁ గూర్చినయావు • నేయి సెల్లె
సన్నముగఁ జీల్చి యటుక • వెన్నవఱకు । నిఱుకుగాఁ జేరిచినవంట • చెఱకు సెల్లెఁ
దొన పైనెచ్చుమన కీడ్డ • దుడ్డు సెల్లె । నేమి సెప్పుదు? సంబార • మెల్లఁ జెల్లె.

ఉ. గడ్డపెరుఁగుఁ గమ్మనెయి • గజ్జము లాదిగ దొడ్డ బండముల్
వడ్డన కబ్బవిన్ గొలఁది • పటిగి నాఁకటి కున్న దేదియో
యడ్డము వేయునెడ్డెకడ • నత్తులవల్ సెలవొంది "వెండియున్
జడ్డన వత్త" వచఁ • బలచల్లగ దాఁటేరి సల్పి దీవనల్.


ఉ. ఇంటను భర్త గూరిచిన • యెల్లపదార్థము చెల్లి పోవుటం
దింటకు లేక తా బయలు • దేఱెను బోరన వాన మొత్తఁ బ
య్యంట ముసుంగు వేసికొని • యందఱియిండ్లకుఁ జేటయప్పుకై
నంటను మాన్పఁకోవలసెఁ • బాఱుత కెందది నాఁడు పుట్టమిన్.

తే. గీ. బురదకాళులు తడిపుట్ట • ములు వడఁకు । మేనునై యాజడిన గృహ • మేధి వచ్చి
వస్తు పడి యున్న స్థితిఁ గాంచి • కర్తిఁ జెందె । యామె చే నింటి వృత్తాంత • మంత దెలిసి.

క. "మాఁడు కడుపున కుండెడు । బూడిద" యన్నట్లు వెడలఁ • బుచ్చి యెటో యా
నాఁడు తమబోసము ల; నతఁ । "డాఁడుది మొగ్గాట యింటి • కాపద" యనియెన్.



సహస్రస్తంభమంటపమునకు ఎదుటగల నంది విగ్రహము.



సహస్రస్తంభమంటపమునందలి గర్భాలయ ద్వారము.

332

# సహస్ర స్తంభముల మంటపము:—హానుమకొండ.

హానుమకొండ పట్టణము ఆంధ్రరాజ్యలక్ష్మీవైభవమునకు మూలస్థానమయ్యుండుటచే, నాంధ్రుల పురోభివృద్ధి యందించుకేని యాసక్తిగల ప్రతిమానవునియొక్క హృదయమును ఆకర్షింపకమానదు. చారిత్రికాంశములం దెలుపు విశేషసాధనము లీపట్టణమునందు లేకయున్నను, కాలగతిచే వికృతమై శిథిలమై జీర్ణావస్థయందు నిలచియుండిన యొకటి రెండు జ్ఞాపకచిహ్నములైనను, ప్రేక్షకుల వ్యసనోద్ధారమునకు మాత్రము వలయు నంతకన్నను విశేషమయ్యున్నవని చెప్పవచ్చును. ఈశిథిలములందు సహస్రస్తంభ మంటపము ముఖ్యమైనదిగానున్నది. రుద్రదేవరాజు పితృవధకై పరితపించుచు పుణ్యక్షేత్రముల దర్శించినపిదప విజయయాత్ర సలిపి తన రాజ్యమునకు మరలివచ్చు సమయమున అనేక దేవాలయముల స్థాపించుచు వచ్చెను. ఆకాలముననే ఈదేవాలయమును నిర్మించెను. తన నివాసస్థానము ఓరుగల్లు పట్టణమయ్యున్నను, రాజధానికి నాల్గుమైళ్ళదూరమున నుండు నీపట్టణము తన తాతముత్తాతలకు ముఖ్యపట్టణమయ్యుండుటచే అతిప్రేమచే నిక్కడనొక గొప్పదేవాలయమును నిర్మించెను. అందు వాసుదేవరను, సూర్యదేవరను, ఉమామహేశ్వరను ప్రతిష్ఠ చేయించెను. ఈయన మతమున వీరశైవుడయ్యును శివునితోం బాటు విష్ణువును ప్రతిష్ఠించుటయేగాక అగ్రస్థానమొసంగెను. రాజులు జాతిమతభేదములను బాటించుట యనర్థదాయకంబను ముఖ్యసూత్రమును గ్రహించి సర్వమతా దర్శములను సమానముగా గౌరవించి యిట్లుజేసెను.

ఈదేవాలయగర్భమున ఉత్తరముఖులమై ప్రవేశింతుము. ఎదుట వాసుదేవరయు, కుడివైపున సూర్యదేవరయు, ఎడమవైపున రుద్రేశ్వరుడును కలరు. ఇప్పుడుమాత్రము ఎడమవైపుననుండు గుడియందు లింగముతప్ప తక్కిన రెండు ఆలయములలోనుండు శిలాపీఠములపైన ఎట్టివిగ్రహములును లేవు. ఈవిగ్రహములను కొంతకాలమైనపిమ్మట అసూయాపరవశులగు మానవులు గొందరు బగులగొట్టియుండవచ్చును. వాసుదేవర గర్భాలయద్వారముపై శంఖచక్రగదాధారియగు నరసింహవిగ్రహమును, సూర్యాలయద్వారముపై గజారూఢయైన లక్ష్మీవిగ్రహమును, శివాలయద్వారముపై త్రిశూలధారియగు రుద్రుని విగ్రహమును చెక్కబడియున్నవి. ఈమూడుద్వారములయందుగల విగ్రహములకునుగూడ రెండు పార్శ్వములయందు, సర్వాలంకార భూషితములయి తలలపైకెత్తి నోరులు తెఱచుకొని నిలువబడియుండు వరాహవిగ్రహములు నెలయుచున్నవి. వానినోటినుండి చిత్రవిచిత్ర ఫల పుష్పపత్ర సమన్విత లతాపుంజము బయలువెడలి, అతిమనోహరముగ నానాముఖముల యల్లిబిల్లికలతో పైకెగబ్రాకి, తమమధ్య నుండు విగ్రహముచుట్టు వ్యాపించియుండును; ఈసుందర శోభాయమానమైన లతాకుంజములు దర్శనీయములుగనున్నవి. పత్రములయొక్క కాండములు ఉపకాండములు చక్కగాం

కనుపించునట్లు చిత్రింపఁబడియున్నవి. పుష్పములరెక్కలు ప్రకృతినిర్మిత పుష్పములభాతి విడివిడియై తొడిమెలు మాత్రము లేకుండ నంటియున్నవి. ద్వారబంధముల క్రిందిభాగమునందు చిత్రవిచిత్ర యలంకారములుగల సుందరస్త్రీపురుష విగ్రహములు నిర్మింపబడియున్నవి. ద్వారములకు రెండుపార్శ్వములయందు బ్రాతీలతయును, మత్స్యముల గిరటలును, గంటలవరుసయు, ఒకదానిపైనొకటి నిలువబడియుండు సింహముల పంక్తియును, చిన్న చిన్న ప్రతిమలయొక్క వరుసలును నిలువున బహురమ్యముగా ఒకదానితరువాత నొకటి చెక్కబడియున్నవి. ఈవరుసల మధ్య శిల్పకళానైపుణ్యము సంపూర్ణముగా జూపఁబడిన రెండు స్తంభములును, వాని నిరుగడల పూలదండలు వ్రేలాడఁగట్టినట్లుగా నిర్మింపఁబడినవి. మధ్యమంటపమునకును, గర్భాలయమందలి స్తంభములకును మధ్యనుండు స్థలమంతయు ఒక్క వ్రేలైన నిడుటకు స్థలములేనట్టుల అతిరమ్యముగా చిత్రములు చెక్కఁబడినవి. ఈ స్తంభములలో నొకదానియందు తలక్రిందుగానుండు మనుష్యప్రతిమయు ఒకచేపయు చిత్రింపఁబడియున్నవి. ఇయ్యవి దృష్టిదోషపరిహారమునకు గాబోలని జనులూహించెదరు. ఈమంటపముయొక్క యుఱుగులక్రిందిభాగమున నొకవైపు ఆంజనేయవిగ్రహమును, వృశ్చికమును దనపాదముక్రింద నణిమిపట్టిన సింహమును చిత్రింపబడియున్నవి.

ఈదేవాలయమునకు ఎదురుగా ఒక నంది విగ్రహము 7½ అడుగులు పొడవును, 4½ అడుగులు ఎత్తును, చట్టకొలతలో ముడువైపులు మాత్రము 9½ అడుగులుగలిగి, జూలు, డెక్కలు, మూతిపై నరములు, నాసికారంధ్రములు మొదలుగాగల అంగములన్నియు స్ఫుటముగా నిర్మింపబడియున్నవి; తనుందికి పట్టుకుచ్చులతో కట్టబడిన రుద్రాక్షల దండయును, గంటలయొక్కయు శంఖములయొక్కయు హారములును, మెడలో వేయబడియున్నవి. ఈహారములన్నిటికి, పట్టుత్రాళ్ళతో మెడపైన కట్టినట్లు బహుస్పష్టముగా వేసియుండు ముడులు కనుపించుచుండును. ఈశిల్పకళాచాతుర్యము ఎట్టివానినైనను విస్మయమునొందింపకమానదు. ఈదేవాలయము నిర్మింపబడి ౭౫౦ సంవత్సరములు గడచినను సానబట్టిన శిలాప్రతిమలును, స్తంభములు మున్నగునవి నేటికిని అద్దములవలె ప్రకాశించుచున్నవి.

ఈయాలయమున చారిత్రికాంశములదెలుపు మూడుశాసనములు కనుగొననగును. గర్భాలయమంటపమునందలి స్తంభమునకు "శ్రీయోగకంటితిమ్మాచరాజు పరిజన శ్రీగిరిశ్యంగవాసి పండితారాధ్యకృపాశ్య" యని వ్రాయబడియున్నది. ఈమాచరాజు యెవ్వడో తెలిసికొనుటకు ఆధారములు గానరాకున్నవి. గోసగి ఈశ్వరదేవుడు కాకతీయ రాజుల రాజ్యాభివృద్ధికిగాను చతుర్ముఖ దేవరను ఉమామహేశ్వరను, ఆదివరాహదేవరను, వేయిలింగములను ప్రతిష్టచేయించి కొంతభూదానముఁ జేసినట్లు దేవాలయములోని గోడయందు వ్రాయఁబడియున్నది. కాలము తెలిసికొనుటకు సాధనములేమియుఁ గానరాకున్నవి. అక్షరములనుఁబట్టి యూహించిన ౬౦౦ సంవత్సరములకు ముందు వ్రాయఁబడినట్లు దెలియుచున్నది. ఈయాలయము పేరుఆకాలమున రుద్రేశ్వరమని వ్యవహరింపఁబడుచున్నటులీశాసనమునుఁబట్టి తేలుచున్నది. ద్వారము

కడ నిలుపఁబడిన శాసనము రుద్రదేవునిచే స్థాపించఁబడినది దీని లో త్రిభువనమల్లుని కాలమునుండి ఇటీవలి వారినామములుఁ దెలుపఁబడియున్నవి. వడ్డెపల్లి చెఱువుయొద్ద శిథిలమై పడియుండు శాసనములో త్రిభువన మల్లుని తండ్రి ప్రోలరాజు యని వ్రాయబడియున్నది; శ్రీ చిలుకూరివీరభద్రరావుగారు సహా పాఖాలశాసనమునుఁబట్టి యిట్లే యూహించియున్నారు. కాబట్టి త్రిభువనమల్లుని తండ్రి మొదటి ప్రోలరాజు, రుద్రదేవరాజు తండ్రి రెండవ ప్రోలరాజు అని నిశ్చయింపవచ్చును. రెండవ ప్రోలరాజు పరాక్రమమును యాతఁడు జయించిన రాజుల నామములుకుఁ దెలిపిన పిదప రుద్రదేవుఁడు జయించిన రాజులనామములుఁ దెలుపఁబడియున్నవి. ఈశాసనములో

"ఈడే మేడవిడంబడంబరభరే క్షేదక్షుమంక్ష్మాభృతాం దుర్వారోద్ధుర వీరమంత్ర సమయారావైక దీక్షాగురుః శ్రీమన్మైలిగి దేవసంగసమయె ప్రోద్భూత దర్పాపహం ప్రాప్త శ్రీపోలవాస దేశవిభవం శ్రీరుద్రదేవం సదా॥

అని రుద్రదేవరాజునుఁగూర్చి వ్రాయఁబడియున్నది. ఈశ్లోకమునందు బేర్కొనఁబడిన మేడరాజు నైజామ్ రాష్ట్రములో పాఖాల్ తాలూకాకు చేరిన కురువపల్లి మొదలుకొని గోదావరీతీరము వరకుఁ గల ప్రదేశమును పాలించుచుండినటుల కొన్ని శాసనములవలన దెలియుచున్నది. ఇతని మంత్రియైన నాగదేవరాజు పార్శ్వజినేశ్వర దేవాలయము నిర్మించి కొంతభూదానముఁ జేసినట్లు పాఖాలతాలూకాలోని గోవిందాపురగ్రామముయొక్క పెద్దచెఱువులో ఒకశాసనముపైన వ్రాయబడియున్నది; దీనిలో మాధవవర్మవంశమున దుర్గరాజు జన్మించెనని వ్రాయబడినది. ఇతనికి మేడరాజు జగ్గరాజను నిరువురు పుత్రులుండిరని తెలియుచున్నది. వీరు మతమున జయినులయినట్లే క్రిందిశ్లోకము శాసనమునకు మొదట వ్రాయఁబడినది.

"శ్రీమన్నతేంద్ర మకుటోజ్వల రత్నభూషా నాంగేంద్రహస్త సరసీరుహ కర్ణపూరా విద్యాధరేంద్ర రచితోత్తమ కుంకుమా (హి)వీ భూభూత్సు భాయజినదేవ పదాంబుజశ్రీః.

ఈమేడరాజు మంత్రియైన నాగదేవరాజుచే నీశాసనము స్థాపింపఁబడియుండుటఁబట్టి విశేషించి తన్నుగూర్చి యెక్కువగాఁ దెలుపుకొనియున్నాఁడు. మేడదేవరాజు కాకతీయులకు లోఁబడియున్నట్లీ శాసనమందెక్కడను దెలిపియుండలేదు. ఈశాసనము శా. శ ౧౦౪౫ అనగా క్రీ. శ. ౧౧౨౩ ప్లవసంవత్సర ఫాల్గుణమాస శు॥ 3 దినమున లిఖింపఁబడినది. హనుమకొండ శాసనమునకు 3౯ సంవత్సరముల క్రింద నీగోవిందాపురశాసనము వ్రాఁయబడినది; ఈకాలమునకు రుద్రదేవరాజు రాజ్యమునకు వచ్చియుండఁడు. కాబట్టి ఈశాసనము ప్రోలరాజు కాలమున వేయించఁబడినట్లూహింపవలసియున్నది. ఈశాసనమునకన్నను ౭ సంవత్సరములకుముందు మానుకోట తాలూకాలోని మాటేడుగ్రామమున ప్రోలరాజుయొక్క సామంతుఁడు వేమచోల బొడ్డమమల్లనాయకుఁడు అమరేశ్వరదేవాలయము నిర్మించి భూదానము లనేకములుఁ జేసి శాసనమును వేయించి యున్నాఁడు. ఈశాసనము శా. శ. ౧౦౩౯ న వ్రాయించఁబడినది. కాఁబట్టి ఇంచుమించుగా మేడరాజుమంత్రియొక్క శాసనముసహా ప్రోలరాజు కాలములోనిదే యని నమ్మవలసియున్నది. ఇట్లు ఊహించుటకు ఇంకనెన్నియో సాధనములుఁగలవు. ఈచర్చలన్నియు ముందు నేను ప్రకటించఁబోయెడు మేడ

రాజు శాసనములందువివరముగాఁ దెలుపఁగలను.

ఇదేవిధమున కరీమునగరము జిల్లాయందలి జగ్త్యాంతాలూకా ప్రాంతమున మైళిగిదేవుఁడు పోలవాస రాజ్యమునేలుచుండెను. ఈరాజ్యముపేర యిప్పటికిని పోలాసయను గ్రామమొకటి ఆప్రాంతమునందున్నది. ఆగ్రామమున పోలస్తేశ్వర దేవాలయమొకటియున్నది. మైళిగిదేవుని శాసనము లీప్రాంతమున కొన్నికన్పట్టుచున్నవి. ముందుముందు ఈశాసనములను గూడ ప్రకటింపగలను. రుద్రదేవరాజులచే జయింపఁబడిన రాజులయొక్క రాజ్యములు వంశములు దెలుపు శాసనములను ఒకటితరువాత మఱియొకటి పరిశీలింప వలసియున్నది. ఇప్పుడుమనము పరిశీలింపవలసిన దోమానాయకుఁడు గూడ రాజు ఈప్రాంతము వారయ్యున్నారు.

ఈహనుమకొండ దేవాలయముయొక్క ధూపదీప నైవేద్యములకుగాను మద్దిచెఱువలనెడి గ్రామము దానముఁజేసినటు లీశాసనమున వ్రాయఁబడియున్నది. ఈగ్రామమిప్పుడు పర్కాలతాలూకాలోఁ జేరియుండు ప్రదేశమందున్నది.

—ఆలూరి గురురాజారావు.

## మిక్కిలి మల్లిఖార్జునకవి.

ఈనడుమ నేనొక తాళపత్ర గ్రంథముల కట్ట నొకగ్రామమునం జూచితిని. ఆగ్రంథములన్నియు పాడుపడినయింట వర్షమునకు తడిసి యెండ కెండి మిక్కిలి జీర్ణావస్థలోనుండుట విచారమును కలిగించెను. ఆజీర్ణగ్రంథసంచయమున "మిక్కిలి మల్లిఖార్జున" ప్రణీతమగు "విక్రమార్కచరిత్ర" మను ప్రబంధము కాన్పించెను. ఈగ్రంథము 5 ఆశ్వాసములు కలది. ఈమల్లిఖార్జునకవి పెక్కుగ్రంథములను రచించి నేటికి నలువదియేండ్లక్రితము గతించెను. ఈయన మత్పితృసఖులు. ఈయన కుమారులు గోదావరిమండలమున ప్రసిద్ధికెక్కిన పండితులలో నొకరగు "మిక్కిలి దుర్గయ్య"శాస్త్రులవారు. మల్లిఖార్జున కవి గారికిని వారిపూర్వికులకునుగూడ "ఏనుగు లక్ష్మణకవి" నివాసమగు "పెద్దాడ"గ్రామమే నివాసస్థానము. ఈకవిపేరు కవులచరితమున కెక్కలేదు. ఆధునికుడగుటచేత నందుమా? ఈయన తరువాతగతించిన "నడకుదుటి రామకవి"పేరం దుదాహరింపబడియుండెను. ఆలోచింప ఈయనగ్రంథములు శ్రీవీరేశలింగంపంతులవారికి దొరుకకపోవుటే కారణమైయుండును.

మల్లిఖార్జున కవికృత గ్రంథములు.

విక్రమార్కచరిత్ర గ్రంథము నంకితము నొందిన "నందూరి కామయమంత్రి" తన్ను గూర్చి యిటుల పలికెనని ఆ గ్రంథమున గలదు.

సీ. రచియించితివి నీవు ♦ రామచంద్ర చరిత్ర
మఖిల బుధశ్లాఘ్య♦మైదనర్ప
బ్రీతిసల్పితి నాచి♦కేతుచరిత్రంబు
గద్యపద్యములచే ♦ హృద్యముగను

విరచించితివిగదా ♦ భేతాళపంచ విం
శతి యనుకావ్యంబు ♦ జనులు మెచ్చ
విక్రమార్కచరిత్ర ♦ విపులప్రబంధంబు
నిర్వచనంబుగా ♦ నెగడఁజేసి
గీ. తహహ నీధన్యత గణింప ♦ నలవియగునె
భువిని మిక్కిలి సత్కులాం♦భోధి చంద్ర
సకలసద్గుణసాంద్ర వా♦చాఫణీంద్ర
వినుతవిబుధేంద్ర మల్లిఖా♦ర్జునకవీంద్ర.

అనుటవలన ౧ రామచంద్ర చరిత్రము ౨ నాచికేతూపాఖ్యానము ౩ భేతాళపంచవింశతి ౪ విక్రమార్కచరిత్రములను రచించెనని తెలియవగును. ఈకవి చరమదశయందు భగవద్గీతను పద్యాత్మకముగా వ్రాసెనట. ఈయన నాచికేతూపాఖ్యానమును పిఠాపురపు రాజావారగు శ్రీగంగాధర రామారావుగారిదగ్గర మంత్రిత్వముచేసిన వాడ్రేపు చలమయ్యగారికి కృతినిచ్చెనట. ఈయన రచించిన గ్రంథ మొక్కటియు దక్కకుండ నగ్నియెత్తుకొనిపోయెనని వీరికుమారులు చెప్పిరి. వీరి 1,2 గ్రంథములు పెద్దాపురంతాలూకా "లింగంపర్తి"లో కలవనియు వానిని తెప్పింతుమనియు చెప్పుచున్నారు. వానినెప్పుడుచూడగలుగుదునో? విక్రమార్కచరితమును వ్రాసిన సంవత్సరము గ్రంథాంతమునం దిటుల వ్రాయబడెను.

క. కలివర్షంబులు "ఋతుశర
జలజోద్భవ వేదసంఖ్య" జరుగుపిదప మి
క్కిలి మల్లిఖార్జునుం డతి
సలలితముగ విక్రమార్క చరితము జెప్పెన్.

అనుటవలన విక్రమార్క చరితము ౧౮౫౭ సం॥రమున పూర్తి చేయబడుట స్పష్టమగుచున్నది. ఈ విక్రమార్క చరిత పీఠికవలన ఏనుగు లక్ష్మణకవి "జాహ్నవీమాహాత్మ్య" మను కావ్యమును రచించెనని తెలియవచ్చుచున్నది. కృతిపతి కవిత్తో నిటుల ననుచున్నాడు.

సీ. మున్నొకవేళ మా♦ముత్తాతయగు కామ
రాజు తానేనుఁగ ♦ లక్ష్మణసుక
వి ప్రణీతము బురా♦ణ ప్రసిద్ధమ్మును
జాహ్నవీమాహాత్మ్య ♦ సరసకావ్య
మిలవేలుపైన సో♦మేశ్వరుపేర నం
కితముగాఁగ నిరుప ♦ సత్కృతముగాఁగ
తత్కావ్యమున మత్పి♦తామహాంతంబుగా
వర్ణింపబడియె ♦ మద్వంశ్య వితతి
గీ. గాన మత్పితామహ ♦ కామసచివు
డాదిగా మత్కులక్రమం♦బగఁగ జెప్ప
విక్రమార్క చరిత్ర స♦ద్వినుత కావ్య
మున ఘటింపగవలయు బ్ర♦హ్మోదయ లో.

ఈకవి డెబ్బదియేండ్లు జీవించి ౧౮౭౫ సం॥ర ప్రాంతమున మృతినొందెనని దుర్గయ్యశాస్త్రులవారు చెప్పుచున్నారు. కాన ౧౮౦౫ సం॥ర ప్రాంతమున జన్మించియుండును. విక్రమార్కచరితమును కృతినొందిన నందూరి కామయమంత్రి ౧౮౫౭ సం॥రము నందుండుటచే నాతని ప్రపితామహునకు గృతినిచ్చిన యేనుగు లక్ష్మణకవి కాలము స్పష్టము. "జాహ్నవీమాహాత్మ్య" కృతి కర్త భర్తృహరిం దెనుగించిన లక్ష్మణకవియే యనిస్పష్టమగుచున్నది. జాహ్నవీమాహాత్మ్యము నాకు దొరకు సూచనలును కలవు. అపుడు కొన్ని విశేషములు బయల్పడగలవు. మల్లిఖార్జునకవి కవిత్వము నాతి కఠినమై మృదుమధుర గంభీరవాక్కులతో కూడియుండును. కవిత్వశైలి తెలియుటకు ౨ పద్యములను వ్రాసివిరమించుచున్నాను.

చ. అని యెరిగించుకాలమున
హాయని తచ్చిర మాసభాంతరం
బున బడె నయ్యనంతరము
భూగతమయ్యెను దక్కబంధముల్

మనుజకులోత్తమా యతని
మానిని మానని తీవ్రవేదనం
గొని మదితత్సమీపమున
కుంజని దా విలపించి భూపతిన్.

చ. కనుగొని యానృపాలక శి
ఖామణి నన్భవదంతికంబునం
దునిచి మదీయభర్త ముద
మొప్ప నభస్థలిజొచ్చి యచ్చటం
దనుజులతోడఁబోరి వీత
తంబగు తచ్చతురంగ వాహినిం
దునిమి తదుగ్రకాండ నిహ
తుండయికూలె ధరాతలంబునన్.

క. కావున మత్పతి కమర
స్త్రీవరణము కాకమున్నె ♦ జెందెద నేత
త్పావన పదసాన్నిధ్యము
బావకమున మేనువైచి ♦ పార్థివముఖ్యా.

ఆశ్వాసాంతముల గద్యలను వ్రాయక యీక్రింది విధమున పద్యములనే వ్రాయుచుంట మరియొక విశేషము.

మ. ఇదిరాజిల్లును పంచమంబగుచు సా
హిత్య స్ఫురన్మార్దవా
స్పదగంభీర తరార్థ భావకవితా
సామ్రాజ్యధౌరేయతా
పదసన్మిక్కిలి మల్లికార్జునకవి
ప్రౌఢప్రణీతంబుగా
గ దనర్చున్భువి విక్రమార్కచరిత
గ్రంథోత్తమాశ్వాసమై.

— పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి

## కాపుపాట

ఉ. ప్రేయసి! లేచిరమ్ము, చివు ♦ రించినమావులక్రింద శీతల
చ్ఛాయలలోన యౌవన వ ♦ సంత శుభోదయమయ్యె నవ్వుచున్
చేయికిఁజేయిఁజేర్చి పెర ♦ చింతనలన్ మరపించు రాగముల్
దీయుచు వాసనల్పరిమ ♦ ళించెడు చోటుల యందు బోవగన్.

ఉ. వ్రాలినసంజల న్మరలివచ్చెడు ♦ గోవులఁ బాలు తీయఁగా
దోలెడుదాక, త్రాడులును ♦ దుత్తలు నావలఁబెట్టి సిగ్గులన్
బోలెడుచిన్నదాన! యెటు ♦ చూచిన నెవ్వరు లేని-చోట ను
య్యాలల నెక్కి యూగ మన ♦ సయ్యెడు నీవును నేను వేడుకన్.

ఉ. పాడుటకొప్పవేని పడ ♦ వల్నడిపించెడు యేటిత్రోవలే
చూడగవద్దు, లేతమన ♦ సుల్ తడిసేసెడు చెట్లచాటునన్
గూడినమేను లానుకొన ♦ కొమ్మలకాకులువోలె నెక్క మా
టాడకఁ గూహుచుంద మను ♦ వైన పొలమ్ములగట్టునీడలన్.

—అబ్బూరి రామకృష్ణారావు.

# క్షాత్త్రయుగము నాఁటి హిందార్యులు
# వారి సాధారణ రాజ్యాంగస్థితి

అయోమార్గ మొకటి ఒకస్థలమునుండి వెడలి కొంతదూరమువఱకు ఒకవిధముగా సాగిపోయి, అచ్చటి నుండి రెండు శాఖలుగాఁ జీలి రెండు భిన్నదేశములఁ బోయి పోయి అట నాగిపోవుటయు, శాఖలాగిపోయిన భిన్న అంతిమస్థానము (terminus) లను నడుమ ఎన్నియో మైళ్లు ఎడమేర్పడుటయు మనము చూచుచున్నాము. హిందార్యుల నాగరకతయు, గ్రీకార్యుల నాగరకతయు, ఈ యయోమార్గపుగతిని పోలియున్నవి. ఈరెండు నాగరకతలును ఆరంభమున నొకస్థలముననే యుద్భవించెను; ఒకవిధముగానే వృద్ధిచెందెను. తరువాత నవి భిన్నమార్గముల ననుసరించి పోయిపోయి, తుదకు రెంటికిని ఏమాత్రమును సామ్యములేని యవస్థకు వచ్చినవి. ఇట్టియంతరము వారిరెండు నాగరకతల యవస్థాంతరములలో వాటిల్లినట్లే, క్షాత్త్రయుగము నాఁటికి వారి సాధారణ రాజ్యాంగదశయందును సంభవించియుండుట మనమీవ్యాసమునఁ జూడఁగలము.

క్షాత్త్రయుగమున హిందార్యుల రాజ్యాంగస్థితి ఎట్లుండెనని మనము కొంత సూక్ష్మదృష్టితోఁ బరిశీలించితిమేని వారి స్థితియు, గ్రీకార్యుల స్థితియు ఒకటిగానే మనకుఁ గానవచ్చును. గ్రీసుదేశములోవలెనే మనదేశమునందును చిన్నచిన్న పట్టణ రాజ్యములు (City states) ఏర్పడియుండెను. వీనిలో నొక్కొక రాజ్యమొక్కొక తెగవారి పాలనమునకు లోనైయుండెను. ఇట్టి ప్రతిరాజ్యము ఆతెగవారిలో ప్రముఖుఁడుగానుండిన ఎవరైన రాజుపేరుననో, ఆరాజ్యమునందలి ముఖ్యపట్టణము పేరుననో పిలువఁబడుచుండెడిది. ఇప్పటికాలపు పెద్దరాజ్యములను చూచుచున్న మనకు గ్రీసువంటి చిన్న దేశమున నన్ని స్వతంత్రములగు పట్టణ రాజ్యము లెట్లుండెనో కదా యని యబ్బురము తోచును. మనదేశము గ్రీసుకంటె వైశాల్యమున నెన్నియో రెట్లు పెద్దది కనుక ఆకాలమున మనదేశమందుండిన పట్టణరాజ్యములు గ్రీసుదేశపు వానికంటె విశాలతరములుగానే యుండవచ్చును. అయినను, అంతమాత్రమున నవి యిప్పటికాలపు రాష్ట్రములతోఁ దులఁదగినవని తలంపఁగూడదు. గ్రీసుదేశములోవలెనే మనదేశమున నివసించుచుండిన వివిధతెగలు ఒకవిధమైన దేవతలనే యారాధించుచు, ఒకభాషయొక్క భిన్నశాఖలనే మాట్లాడుచుండిరి. ఆచారవ్యవహారములందును, మతవిశ్వాసములందును వారియందు విశేషభేదముండలేదు. వారిలో పరస్పర వివాహములు జరుగుచుండెను. ఇట్లుండియు రాజ్యాంగవిషయములందు మాత్రము వారు స్వతంత్రులై ఒండొరుల యెడ నసూయాపరులై యుండిరి. కనుక వారు సర్వదా యుద్ధములు చేయుచుండిరి. అయినను వారు పరరాజ్యముల స్వాతంత్ర్యమును మాత్రము గౌరవించుచునే యుండిరి. మనదేశమున నీస్థితి క్షాత్త్రయుగమునకు పూర్వమే మొదలై దాదాపు బౌద్ధయుగమువఱకు నిల్చియుండెను. ఆరంభమున వచ్చిన యార్యులతెగలు పశ్చిమోత్తర ద్వారముల ఈదేశముఁ బ్రవేశించి ఇప్పటి సింధుప్రదేశములో పంజాబునుండి కోసల, విదేహదేశములవఱకు హిమాలయ పరిసరములలో నివసించిరి. ఇక * రెండవ మారు దేశమునఁ బ్రవేశించినవారు తమకంటె పూర్వము వచ్చినవారిని కదలింపక యమునాగంగల నడుమ నదీతీరములందు మధ్య భారత ప్రదేశములలో నావాసముల నేర్పఱచుకొనిరి. ఈవిధముగా లెక్కకుమించిన తెగలు అనఁగా రాజ్య

* వైద్యాగారు ఈదేశమునకు ఆర్యులు రెండుమారులు వచ్చిరని చెప్పుచున్నారు. ఇయ్యది [illegible] తము దాకియుండలేదు. ఒక క్రొత్తదేశమునకు [illegible] రెండుమారులు మాత్రమే [illegible]

...లు ఈ దేశమున నేర్పడెను. ఇట్టి రాజ్యముల పేళ్ళు గ్రంథములందు పలుమారు వచ్చియున్నవి. మెగస్తనీసు ఇట్టిరాజ్యములను ౧౧౮ అని పేర్కొనియున్నాఁడు. ఈసంఖ్యను మనమొప్పుకొనవలసిన పనిలేదు. ఎట్లనఁగా ఒక్క సింధు పంజాబుదేశములలోనే నూటికి మిక్కిలియగు వేర్వేరు తెగలవారి రాజ్యముల నలెగ్జాండరు గెలువవలసిన వాఁడయ్యెనని మనము వినియున్నాముకదా! అది యట్లుండె. పురాతన హిందూరాజ్యములుకూడ గ్రీకులవలెనే విస్తీర్ణములగు రాజ్యములను స్థాపించుట ఎఱుఁగరని తోఁచుచున్నది. మనవారి రాజ్యమనఁగా, కొన్ని వేళల, గ్రీకువారి రాజ్యమువలెనే, ఒక పట్టణమును ఆపట్టణవాసులు వ్యవసాయము చేసికొనుటకు అవసరమగునంత వైశాల్యముగల చుట్టుప్రదేశమే యైయుండెను. ఐదూళ్ళు మాకిచ్చినఁ జాలునని ధర్మరాజు దుర్యోధనునకు సంధి సందేశమంపియుండెను. అనఁగా ఐదుగురు సోదరులకును ఐదురాజ్యములు వచ్చినఁ జాలుననియు, అంతమాత్రము లభించెనేని క్షత్రియుఁడగు వానికి మనస్సునందుండు అధికారాసక్తి నెరవేరుననియు ధర్మరాజు తలఁచియుండెను. అప్పుడేకాదు, నేఁటికిని క్షత్రియుఁడగువాఁడు ఒక గ్రామమునైనను సరే రాజై స్వతంత్రుఁడుగా నేలఁ గోరుచున్నాఁడు. చరిత్రారంభమున ప్రతిపట్టణమునకు నొకరాజుండినట్లు ఈక్రింది శ్లోకములను దెలియుచున్నది. * "తమ స్వామియు ప్రియము చేసికొను రాజులు ప్రతిగృహమునను గలరు. కాని వారిలో నొకఁడను సామ్రాట్టు కాలేడు. అట్టి బిరుదు సంపాదించుట కష్టము" అని భారతవర్షమునకు చక్రవర్తి కాఁగోరుచుండిన ధర్మజుఁడు పలుకుచున్నాఁడు. ప్రతిపట్టణమునకును రాజొకఁడుండెనను నంశమునుబట్టి చూచినచో, అట్టిరాజులకు పైవాఁడగు సామ్రాట్టు ఈ చిన్నరాజ్యములను రూపుమాపక వారినుండి కప్పములనుగాని బహుమానములనుగాని గొని సంతృప్తినొందుచుండెననికూడ తోఁచుచున్నది. ...ఓడిన రాజును పదభ్రష్టుని జేయఁగూడదనియు, అతని మరల స్వస్థానమున నిలుపవలయుననియు, అతఁడు మృతుఁడైనచో అతని కుమారునకుగాని బంధువునకుఁగాని రాజ్యమియ్యవలయుననియు విధింపఁబడియున్నది. దుర్యోధన యుధిష్ఠిరుల దిగ్విజయములవలన వారిరాజ్యము విస్తరిల్లినట్లెక్కడను కానరాదు. చుట్టుపట్టులనున్న రాజ్యములుమాత్రము వారి సార్వభౌమత్వము నొప్పుకొనవలసినవయ్యెను. అల్పరాష్ట్రముల స్వాతంత్ర్యమును గౌరవించునట్టి యిట్టి యాచారములవలననే బ్రాహ్మణములలోను, ఉపనిషత్తులలోను పేర్కొనఁబడిన రాజ్యముల నేకములు బౌద్ధయుగమున మాత్రమేకాక, దాదాపు తద్యుగాంతము నాఁటివఱకును మనకు కానవచ్చుచున్నవి. కాశీ, కోసల, విదేహ, చేది, శూరసేన, కురు, పాంచాల, మత్స్య, వృష్ణి, భోజ, మాలవ, క్షుద్రక, మద్ర, కేకయ, గాంధార, సింధు, సౌవీర, కాంభోజ, ఉశీనర, కిరాత, ఆనర్త మున్నగు అనేక రాజ్యముల పేళ్ళు బ్రాహ్మణములకాలమునుండి బౌద్ధయుగముకడకు వచ్చుచున్నవి. రాజ్యపు పేరు సాధారణముగా నచ్చట వసించు తెగవారి పేరునకు బహువచన రూపముగానుండెను. కాశీరాజ్యనామము మాత్రము పట్టణపు పేరునుబట్టి వచ్చినది. తక్కినవారిలో ననేకముల పేళ్ళు రాజుల నామములనుండి వచ్చినది. ఉదాహరణము, కురురాజ్యము; శూరసేనరాజ్యము.

అసంఖ్యాకములగు నీ చిన్నరాజ్యముల నొక్కొకరాజు పాలించుచుండువాఁడు. గ్రీసుదేశమందు, చరిత్రారంభకాలమున పట్టణమున కొకరాజుండెనని మనకుఁ దెలియును. గ్రీసులోవలెనే మనదేశమందును జనులు (ముఖ్యముగా బ్రాహ్మణులు) రాజుల యధికారమునకుఁ బూర్తిగా లొంగినవారుకారు. ముఖ్యములగు నన్నిసమయములందును, జనులందఱు రప్పింపఁబడి యాలోచింపఁబడుచుండిరి. రామాయణమునందు మనకట్టి యుదాహరణము దొరకుచున్నది. దశరథుఁడు శ్రీరాముని యువరాజుఁ జేయఁదలఁచినపుడు బ్రహ్మ, క్షత్రియ, వైశ్యులను రావించి వారి నీ విషయమున నభిప్రాయమడుగును. ¶

* గృహే గృహే హి రాజానః, స్వస్యస్వస్య ప్రియంకరాః । నచసామ్రాజ్యమాప్తాస్తే, సామ్రాట్ శబ్దో హి కృచ్ఛ్రభాక్ ॥ సభా ॥

¶ నానానగరవాస్తవ్యాన్, పృథక్ జానపదానపి । సమానినాయ మేదిన్యాం, ప్రధానాన్ పృథివీపతిః । బ్రాహ్మణాబల ముఖ్యాంశ్చ, పౌరజానపదైః సహ ॥ [illegible] అయో. [illegible]

రామాయణమందీ సందర్భమున నిచ్చినవర్ణనము నిజమైనది గాఁ బొడకట్టుచున్నది కాని ఊహాకల్పితముగాఁ దోచుటలేదు. ఈవిషయమున నేమైన సందేహముండినను, మరియొక సందర్భమునందలి వర్ణన దానిని తొలఁగించుచున్నది. శ్రీరాముఁడరణ్యమున కేగినపిదప దశరథుని మరణానంతరము భవితవ్యమును నిర్ణయించుటకు మరియొక సభ సమావేశమయ్యెను. ఈసభయందు ద్విజులుండిరి. వీరు మంత్రులతో సమాలోచనము సల్పిరి. * రాముఁడును భరతుఁడును (ఇరువురును) లేరు; కనుక వేరొక రాజు నెన్నుకొనవలయునని పై సభ్యులు సూచించిరి. ఈయంశములను మనసునందుంచికొని విచారించితిమేని రాజు అధికారము నిరంకుశమైనది కాక, ప్రజాభిప్రాయమునకు—ముఖ్యముగా ఆర్య ప్రజాభిప్రాయమునకు—లోఁబడినదై యుండెను. అప్పటికింకను రాజసత్తాక పద్ధతి (Monarchy) ఆరంభదశయందుండెను; అవసరమున్న పక్షమున జనులు తామే రాజును ఏర్పరచుకొనఁ గలిగి యుండిరి.

సాధారణముగా రాజసత్తాకపద్ధతియే నాయకయందుండినను, అన్నిచోట్లను ఈపద్ధతియే సాగుచుండెనని మన మూహింపఁగూడదు. గ్రీసులోవలెనే మనదేశమందును నాయకసత్తాక రాజ్యములు (Oligarchies) ను, ప్రజాసత్తాక రాజ్యములు (Republics) ను ఉండెను. రాజసత్తాకములలో రాజుచేయవలసిన కార్యములనన్నిఁటిని పైనఁజెప్పినరాజ్యములలో కులవృద్ధుల సభ(లేక, శిష్టసభ Council of Elders) చేయుచుండెను. వీరకార్యములలోనిట్టిపరిపాలనమునకు స్పష్టములగు నుదాహరణములు కానరావు; కాని మనదేశమున ప్రజాసత్తాకరాజ్యము లనేకము లుండెనని గ్రీకుచరిత్రకారులు వ్రాసియున్నారు. కపిలవస్తునగరమందు శాక్యులలో నీవిషయమున నెట్టియాచారములుండినదియు బౌద్ధగ్రంథములలో కానవచ్చుచున్నది. పలుతెగలలోని వృద్ధులసమావేశముచే నేర్పడినసభవలన జరుగుచుండిన పరిపాలనము-అనగా నాయకసత్తాకపరిపాలనము మనదేశమందుండెనని కూడ స్పష్టముగాఁ దెలియుచున్నది. మహాభారతమునందు "గణములు" "గణపతులు" అనుశబ్దములు పలుమారు వచ్చియున్నవి. వీనికి క్రమముగా, నాయకసత్తాక ప్రజాసత్తాక పరిపాలనగల తెగలు, వానివలన నెన్నుకొనఁబడిన రాజులు అనియేయర్థమని మాకు దోచుచున్నది. మహాభారతములో ననేకమారులువచ్చిన "గణానుత్సవసంకేతాన్" అనుశబ్దముల యర్థమేమో మాకు నిశ్చయముగాఁ దోఁచుటలేదు. అర్జునుఁడు ఉత్తరదిగ్విజయయాత్రయందు వీరిని జయించెను. ¶ ఈ యేడుకుటుంబములు బహుశః ద్రోణపర్వమున వచ్చిన సంశప్తకు లేమైయుందురు. పర్వతప్రాంతవాసులగుటవలనను, స్వతంత్రాభిలాష కలవారగుటవలనను, వీరు ఇప్పటికాలపు ఆఫ్రిదిలును (Afridis ) పశ్చిమోత్తరపు సరిహద్దునందు ఇతరతెగలవారునునై యుండవచ్చును. ఏలయనఁగా, ఈతెగలవారు అతిపురాతనకాలమునుండి శూరులుగను స్వతంత్రాభిలాషులుగను ప్రసిద్ధిఁజెందియుండుటే కాక ప్రజాసత్తాకపరిపాలనము కలిగియుండిరి. మహాభారతవ్యాఖ్యాతకు నాయకసత్తాకమన నేమియో ప్రజాసత్తాకమన నేమియో తెలియక కాఁబోలు పైశబ్దముల యర్థమును వివరింపలేదు. "గణము"నకు నాయకుఁడు కాఁగోరువాఁ డేమిచేయవలయునో పలుతావుల నాగ్రంథమున వచ్చినది. కనుక "గణపతి"యను నదొక గొప్పపదవియనియు, దానిబొందుటకు జనులు యత్నించుచుండిరనియు స్పష్టముగా గానవచ్చుచున్నది. ఈకారణములవలన "గణము" "గణపతి" యనువాని యర్థము పైన మేము సూచించినదేయై యుండవలయునని మాయాశయము.

రాజ్యాంగ విషయమున గ్రీకులకును మనకును ఇంతవఱకు సామ్యమే యుండినది. ఇచ్చటినుండియే గ్రీకార్యహిందార్యనాగరికతయను అమోఘమార్గము రెండు భిన్నశాఖలుగాఁజీలి రెండుభిన్నదశలకుఁ బోయినది. మనదేశమున రాజులయాధిపత్యము క్రమక్రమముగా వృద్ధియై వారిని నిరంకుశులుగను, ఈశ్వరాంశసంభూతులుగను జేసి ప్రజలహక్కులను నానాఁటికి నశింపఁజేసెను.

* సమేత్యరాజకర్తారః, సభామీయుర్ద్విజాతయః॥ అయోధ్యాకాండ॥

¶ పౌరవంయుధినిర్జిత్య, దస్యూన్ పర్వతవాసినః । గణానుత్సవసంకేతాన్ జయత్సప్తపాండవః॥

ఇఁక పశ్చిమమున గ్రీకులు రాజ్యాంగవిషయమున దమ
భావముల వృద్ధిపఱచికొనిరి. అది యెట్టివృద్ధియనుకొనె
దరు? నిరుపమానమైనది. ఆనాఁటిమాటయేకాదు; నేఁటి
కిని అథెన్సు ప్రజాసత్తాకరాజ్యమే ప్రపంచమందలి
సకలప్రజాసత్తాకరాజ్యములకును ఆదర్శమై యొప్పుచు
న్నది. ఇట్టి ప్రచండభేదమునకును వారికిని కలుగుటకుఁ
గలకారణములను వెదకుట చాలకష్టము; ఆప్రయత్నము
ఈవ్యాసముయొక్క యుద్దేశమునుకాదు. ప్రాయశః
కారణములు ఈక్రిందివైయుండవచ్చును:— ౧ జాతిభే
దము లేకపోవుటవలన జనసామాన్యము రాజ్యాంగమున
దమవిధుల మరచిపోయినందున క్షత్రియులుమాత్రమే
ఈవిషయమున జోక్యము పుచ్చుకొనఁ దగినవారైరి.
౨. ఆర్యులు బహుళసంఖ్యాకులగు శూద్రులను సంఘ
మున ప్రవేశపెట్టికొనిరి; కాని వారిని కాయకష్టమునకు
పాలుచేసినందున జనసంఘములోని గొప్పభాగమును రా
జ్యాంగవిధులకు అనర్హముగఁజేసిరి. 3. మైదానములలో
జనావాసము విశేషమగుటవలన, రాజ్యములు చిన్నవిగా
నుండినప్పుడు జనాభిప్రాయమును దెలిసికొనుటయందు
గల సౌకర్యములు తరువాత లేకపోయెను. ఇప్పటికాల
మున విశాలములగు దేశములందు జనాభిప్రాయమును
కనుగొనుటకు ఏర్పడిన పద్ధతులు ఆకాలమున జనులెఱుఁ
గరు.

ఇఁక పశ్చిమమున గ్రీసుదేశ పర్వత ప్రాంతములలో
వసించిన తెగలవారు అందఱు ఒకవిధమైనవారుగను,
దాదాపుగా అందఱు ఆర్యులుగను, ఆదిమనివాసులసం
బంధము మిగులతక్కువగా గలవారుగను నుండుటచేత
వారు స్వాతంత్ర్యస్వభావులై నాయకసత్తాకరాజ్యముల
నేర్పరచుకొనఁగలిగిరి. మనదేశమందలి తూర్పుభాగము
లోని మగధవంటివిశాలదేశములలో అనార్యజాతులును
ఆర్యానార్యసంయోగమువలనఁ గలిగిన మిశ్రమజాతులును
మెండుగా నుండుటచేత అట్టిదేశములు ఎక్కువనిరంకుశ
పరిపాలనము కలవయ్యెను. 'దత్తు'కృతమగు "పురాతన
హిందూదేశసభ్యత" యను గ్రంథమునందుల్లేఖింపఁబడిన
ఐతరేయబ్రాహ్మణములోని ఈక్రిందివచనమువలన నై
యంశమే స్థిరపడుచున్నది. ఈయర్థమునఁగాక మరేయ
ర్థమునను ఈవచనమును సమన్వయించుటకు వలనుపడదు.

"తూర్పుదిశయందలి రాజులు సామ్రాట్టులను బిరుదముల
నందిరి. దక్షిణదిశవారుభోజులని పిలువఁబడుదురు. పశ్చిమ
దేశీయులకు రాజులే లేరు. మధ్యదేశముల రాజులు
రాజులనియే పిలువఁబడుచున్నారు." అనఁగా తూర్పుదే
శపురాజులు క్రమక్రమముగా నిరంకుశులగుచుండిరని
యు, పశ్చిమదేశప్రజలు ఇంకను స్వతంత్రులుగానుండి
స్వపరిపాలనము కలిగియుండిరనియు తేలుచున్నది.

విదేహదేశపురాజగు జనకుని పేరుతో ఉపనిషత్తుల
యందు వాడఁబడియున్న సామ్రాట్టు బిరుదము కాల
క్రమమున 'రాజాధిరాజు' అను నర్థమున నుపయోగింపఁ
బడసాగినది. తూర్పుదేశమునందలి రాజులు బలవంతు
లగుటతోఁ దృప్తిఁజెందక "సామ్రాట్టు" బిరుదమును
గూడ కాంక్షింపసాగిరి. ఇంద్రప్రస్థమునకు రాజైన
యుధిష్ఠిరుఁడిట్టి బిరుదమును బొందఁగోరిన సందర్భమున,
మహాభారతమునందు, ఈబిరుదమె టుత్పత్తియైనదియు
కృష్ణుఁడు వివరించియున్నాఁడు. క్షాత్రయుగారంభము
ననో, బౌద్ధయుగారంభమునకుఁ గొంచెము పూర్వమో
యుండిన మనవారి రాజ్యాంగస్థితిని వర్ణించుటకు నదగుటచేత
ఆవివరము నీక్రింద వ్రాయుచున్నాము. "పరశురాముని
బారినుండి తప్పించుకొనిన క్షత్రియులు ఏకమై ఈనియ
మము నేర్పరచుకొనిరి. ఈవిధిని సూర్యచంద్రవంశముల
వారిరువురును ఒప్పికొనిరి. ఇళకును ఇక్ష్వాకునకును జనిం
చినవారందఱు నూర్గురని మీరెఱుఁగుదురు. యయాతి
వంశజులగు భోజులు నలుదిశలయందును లెక్కకు మిక్కి
లిగా నున్నారు. ప్రస్తుతము రాజులందఱును తమలో
నెల్ల మిగుల బలవంతుఁడగు జరాసంధుని సామ్రాట్టుగా
నెన్నుకొని యున్నారు. కనుకనే అతఁడు మధ్యదేశము
ననుభవించుచున్నాఁడు. శూరుఁడగు శిశుపాలుఁడు అత
ని సర్వసేనాని యైనాఁడు. కరూశరాజగు వక్రదంతుఁ
డు అతనికి సహాయుఁడై యున్నాఁడు. పశ్చిమమునను
న్న యవనులరాజగు భగదత్తుఁడు అసంఖ్యసేనలు కల
వాఁడు, మురనరకులను తనకులోఁబరచుకొని తటస్థుఁడు
గా నున్నాఁడు. పశ్చిమ దక్షిణ దిశలయందున్న కుంతి
భోజపురుజిత్తు ఒకడు మాత్రము నీకు మిత్రుఁడు. వంగదే
శమునకును, పౌండ్రక కిరాతులకును, రాజగు వాసుదే
వునితోఁగూడి భీష్మకుఁడు జరాసంధపక్షపాతియైయు

న్నాఁడు. ఉత్తరదేశపురాజులలో ననేకులు— పాంచాల, శూరసేన, మత్స్యదేశాధీశులును తగినిరులును— జరాసంధునకు భయపడి దక్షిణమునకుఁ బారిపోయినారు. ఎంతబలగముగలవారమైనను, ఎంతిసమర్థులమైనను మేముకూడ మధురవదలి దుర్భేద్యమైనదియు, స్త్రీలవలననైనను రక్షింపఁబడనీలైనదియునగు కుశస్థలిదుర్గమునకువచ్చియున్నాము. మధ్యదేశమునుండు భాగ్యములేక ఇచ్చటికి వచ్చినందున కెంతయు వగచుచున్నాము." * పైవచనమున నుల్లేఖింపఁబడిన మధ్యదేశము హింద్వార్యులకు చాలప్రియమైనదిగా నుండెను. ఇచ్చట నిలువకుండ కృష్ణుని జరాసంధుఁడు తరిమివేసెను. తక్కినరాజులందఱును అతనికిలోఁబడి తదాజ్ఞానుసారము వర్తించుచుండిరి. సామ్రాట్టునెన్నుకొను పైపద్ధతికొంత విచిత్రముగా గానవచ్చుచున్నది. బ్రాహ్మణులబారినుండి తప్పించుకొనుటకింతటి ప్రబలప్రయత్నము కావలసియుండుటఁజూడ ఆకాలమున బ్రాహ్మణులు గొప్పస్థితియందుండిరని తోఁచుచున్నది. మనవారి సార్వభౌమత్వముకూడ జర్మనీసార్వభౌమత్వమువలెనే అందఱివలన నెన్నుకొనఁబడునదిగను, చిన్నరాజ్యముల స్వాతంత్ర్యము నడఁగఁద్రొక్కనిదిగను ఉండెను. ఇట్టిపద్ధతి ఎప్పుడు ఏకారణమువలన మార్పుఁజెందెనో చూపుటకు వలయు సాక్ష్యము వీరకావ్యములందు లభింపదు. కాని చిన్నరాజ్యములను నాశనముచేసి మగధరాజ్యము విస్తరిల్లినరీతియు, కోసలులు కాశీరాజ్యమును మ్రింగివేసితరువాత తాముకూడ మాగధులనోటఁబడినవిధమును, బౌద్ధగ్రంధములందు మనకుఁ గానవచ్చుచున్నది. ఇదిబుద్ధుని మరణానంతరము జరిగినట్టిదియును, పారసీకసామ్రాజ్యస్థాపనమునకు సమకాలీనమునునగు వార్త. పెద్దపెద్దరాజ్యములను స్థాపించుపద్ధతి నుపక్రమించినవాఁడు సైరసు (Cyrus) అనియు, పెద్దరాజ్యములను ఆధేయరాష్ట్రములుగాఁ జేసికొని వానిని సాత్రపుల(Satraps)ను ప్రతినిధులపాలనముక్రింద నునిచి వారిని ఇచ్చవచ్చినట్లు మార్చుచు రాజ్యముచేయు పద్ధతినారంభించినవాఁడు డేరయసు (Darius) అనియు తోఁచుచున్నది. అస్సీరియనులు(Assyrians) గాని ఇజిప్షనులు (Egyptians) గాని ఇట్టి యత్నము చేయలేదనియు, ప్రపంచమందలి మొట్టమొదటి నిజమైన నిరంకుశచక్రవర్తి (Autocratic Emperor) డేరయసేయై యుండవచ్చుననియు మాతలంపు. కనుక సింధునదికి పశ్చిమముననున్న దేశమును వశపఱచుకొని, దానిని తన పారసీకసామ్రాజ్యమునఁ గలుపుకొని యొకసాత్రపునిక్రిందనుంచియుండిన డేరయసుయొక్క పద్ధతిని మనవారు— అందును ముఖ్యముగా విశాలరాష్ట్రముల కధినాథులగు తూర్పుప్రాంతములవారు— ఆదర్శముగాఁ గొనియుండినసందాశ్చర్యమేమియులేదు. బహుశః ఇట్లే చిన్నచిన్నరాజ్యములను పట్టఁబెట్టికొని నిరంకుశుఁడగు చక్రవర్తిపాలనముక్రింద మనదేశమున మొట్టమొదట మగధ గొప్పరాజ్యమయ్యెను. ఈక్రొత్తసామ్రాజ్యపు రాజధాని 'రాజగృహ'మునుండి పాటలీపుత్రమునకు మార్పఁబడెను. ఈపాటలీపుత్రమునందే మొట్టమొదటి హిందూదేశచక్రవర్తియగు సాండ్రకోటసు అనిగ్రీకులచే పిలువఁబడినచంద్రగుప్తుఁడు రాజ్యముచేసెను. ఈతని యాస్థానముననే మెగస్తనీసు (Magasthanes) అను చరిత్రకారుఁడు రాయబారిగా నుండెను. వీరకావ్యములందు పాటలీపుత్రముమాట ఎచ్చటను లేదు. మగధరాజ్యమునకు రాజగృహపట్టణమే రాజధానియని రెండుకావ్యములందును పలుమారువచ్చినది. తరువాతికాలమున నుద్భవించిన సామ్రాజ్యములమాటకూడ వీరకావ్యములలో లేదు. అప్పటివఱకింకను ప్రబలరాజ్యములు దుర్బలరాజ్యములనుండి కప్పములఁగొనుటతోనే తృప్తినొందియుండెను. రాజ్యములను విశాలముచేసికొను నాచారము వాడుకలోకి వచ్చియుండలేదు.

అయినను, అప్పటికి రాజసత్తాకపద్ధతిమాత్రము సంపూర్ణముగాను నిరంకుశముగాను వ్యాపించి యుండెను. వెనుక మేము చెప్పినప్రకారము ప్రజాసత్తాకపద్ధతియు, ప్రజతో నాలోచించి పరిపాలనసేయు పద్ధతియు, అచ్చటచ్చట నుల్లేఖింపఁబడియున్నను, మొత్తముమీఁద వీరకావ్యములం దెచ్చటఁ జూచినను రాజునధికారము ఎదురులేనిదిగాను, ప్రజల విధేయులఁ జేసికొనునధికార

* సభాపర్వమున ౧౪ అధ్యాయము.

ము రాజునకు దైవదత్తముగాను ప్రశంసింపఁబడియున్నది. "రాజునకిట్టి యధికార మెట్లువచ్చె" ననుప్రశ్న హిందూవిజ్ఞానులమనసులను పలుమారు కలవరపెట్టెను. వారట్టి ప్రశ్నకు తమయిచ్చవచ్చినట్లు సమాధానము చెప్పుకొనిరి. అయినను రాజునకుఁ గొన్ని కర్తవ్యములు కలవనుమాటనుమాత్రము వారు మరచిపోలేదు. శాంతిపర్వములోని రాజధర్మవివరణమున, ఆరంభముననే యుధిష్ఠిరుఁడు భీష్మునడుగును. "రాజశబ్ద మెట్లువచ్చినది? తక్కిన యందఱివలెనే రెండుచేతులును రెండుకన్నులును కలిగి వారితో తుల్యమగు జ్ఞానమును మాత్రమేకల మనుష్యునికి తక్కినవారిని పాలించు నధికార మెట్లువచ్చెను?" దీనికి భీష్ముని ప్రత్యుత్తరమిది. "కృతయుగమున రాజే లేఁడు. ఆకాలమున జనులందరు స్వతంత్రులై ధర్మమును తామే నడపుచుండిరి. తరువాత మనుజులు కామక్రోధాదులకు వశులై అధర్మమార్గానువర్తులై పాపకార్యములఁ జేయసాగిరి. పాపము మిక్కుటమగుటవలన దేవతలకు బాధలు కలిగినందున వారు బ్రహ్మయొద్దకుఁ బోయి ఈయాపదను తొలఁగింపుమని వేడుకొనిరి. అంత బ్రహ్మ దండనీతిని పెద్దగ్రంథముగా రచించి, దానిని శంకరునకు నేర్పెను. శంకరుఁ డింద్రునకిచ్చెను. అతఁడు దానిని బృహస్పతికిచ్చెను. బృహస్పతిదాని క్లుప్తపఱచి ౩౦౦౦ అధ్యాయములుకలదిగాఁ జేసెను. దీనికి బృహస్పతినీతియని పేరు. శుక్రుఁడు దానినింకను సంగ్రహపఱచి ౧౦౦౦ అధ్యాయములతో నిమిడ్చెను. ప్రజాపతియాశాస్త్రమును అనంగునకిచ్చెను. ఈ యనంగుఁడు తద్గ్రంథానుసారము ప్రపంచమును పాలించిన మొదటి రాజు. అతనిసుతుఁడు అతిబలుఁడగువాఁడు తండ్రిమార్గము ననుసరించెను; కాని వానికుమారుఁడగు వేనుఁడు ధర్మాతిక్రమణముతో భూపరిపాలన మొనర్చి స్వేచ్ఛావర్తనుఁడయ్యెను. కనుక ఋషులాతనివధించి అతని కుడితొడనుండి పృథువనువానిని సృజించిరి. పిమ్మట బ్రాహ్మణులును దేవతలును అతనితో నిట్లనిరి: "ఈభూమిని ధర్మశాస్త్రానుసారము నిష్పాక్షికముగా సమదృష్టితోఁ బాలింపుము. బ్రాహ్మణుల శిక్షింపననియు వర్ణసాంకర్యమును ఆపెదననియు వాగ్దత్తముచేయుము" పృథువట్లే వాగ్దత్తముచేసి తదనుసారము న్యాయముగా నేల యేలెను. బ్రాహ్మణులును దేవతలును స్వవచనానుసారము అతనికి శ్రేష్ఠవస్తువుల నిచ్చిరి. అతఁడు భూమిమీఁది రాలను తీసివేయించి యది పదునేను విధములగు గడ్డిని, మనుష్యులకును యక్షులకును ఇతరులకును కావలసియున్న వృక్షవర్గమును ఇచ్చునట్లు చేసెను. ప్రజారంజకుఁడగుటచేత అతఁడు "రాజు" అని పిలువఁబడెను. * "తనయాజ్ఞ నెవరును మీరఁగూడదని విష్ణువుశాసించి తాను స్వయముగానే రాజుశరీరమును జొచ్చెను. ¶ కావుననే ప్రపంచమంతయు దేవునకువలె రాజునకును మ్రొక్కెదరు. రాజగువాఁడు విష్ణువునంశముతోను దండనీతియొక్క జ్ఞానముతోను పుట్టును." పురాతనహిందూదేశపు జిజ్ఞాసువులు రాజుయొక్క నిరంకుశాధికారము నీవిధముగా సమర్థించిరి. రాజువిష్ణ్వంశ సంభూతుఁడయినను, ఈశ్వరదత్తమగు దండనీతి ననుసరించి న్యాయముగా ప్రజను పాలించుట అతనివిధియనియు వారు నమ్ముచుండిరి. ఆకాలమున బ్రాహ్మణులు సాధారణశిక్షలనుండి తప్పించుకొన యత్నించిరి. కనుకనే స్మృత్యాదులందు బ్రాహ్మణుల దండించువిషయమున ప్రత్యేక నియమములు కలవు. ఈప్రకారము రాజులు, ప్రజనురంజింపఁజేయవలయునను తమకర్తవ్యమును ఈశ్వరదత్తముగా భావింపఁబడిన దండనీతి నియమములను నిర్లక్ష్యము చేసి క్రమక్రమముగా నిరంకుశులైరి.

రాజుయొక్క నిరంకుశాధికారము సత్పరిపాలనానిర్బంధముతోఁ గూడియుండెనని వెనుకఁ జెప్పియుంటిమి. ఈ యభిప్రాయమే మహాభారతమందు వేరొక యధ్యాయమున మరియొక విధముగా సూచింపఁబడియున్నది. రాజునకును ప్రజకును జరిగిన యొడంబడికను బట్టి వారికిట్టి సంబధమేర్పడినదని ఈ యధ్యాయమున సాధింపఁబడినది. ఇట్టి యభిప్రాయమే పాశ్చాత్య విద్వాంసులలోఁ గొందఱు-హాబ్సు(Hobbes)మున్నగువారు-సూ

* రంజితాశ్చ ప్రజాః సర్వాస్తేన రాజేతి శబ్ద్యతే। శాంతి।

¶ స్థాపనం చాకరోద్విష్ణుః, స్వయమేవ సనాతనః। నాతివర్తిష్యతే కశ్చిద్, రాజంస్త్వామితి భారత। తపసా భగవాన్విష్ణు, రావివేశ చ భూమిపం। శాంతి।

చించియున్నారు. "పూర్వకాలమున రాజనువాఁడు లేకపోవుటవలన ప్రజకనేక కష్టములు సంభవించెను. అందువలన జనులందఱేకీభవించి ఇతరుని దూషించినవాఁడును, కొట్టినవాఁడును, పరునిభార్యను చెఱచువాఁడును, శిక్షింపఁ బడవలయునని నియమము చేసికొనిరి. కాని యానియమమును అమలులోఁ బెట్టుటకు వలయుశక్తిలేనందున, వారందఱు ప్రజాపతికడకుఁ బోయి, తమకొక పాలకుని నియమించుమనియు, అట్టిపాలకుని తాము గారవింతుమనియు, అతఁడు తమ్ముఁ గాపాడవలసియుండునని యు, వేడికొనిరి. బ్రహ్మ మనువును ప్రజాపాలనము చేయుమని కోరెను. కాని మనువు అందునకొప్పుకొనక, జనులు పాపాత్ములు కనుక వారిని పాలించుట పాపహేతువనియు, ప్రజాపరిపాలనము కష్టకార్యమనియు, చెప్పెను. అంత జనులు మనువుతో నిట్లనిరి. 'తమరు భయపడవలసిన పనిలేదు. పాపాత్ములగువారే తమ పాపఫలము ననుభవింతురు. మీకు మాయొద్దనున్న పశువులలోను బంగారములోను అయిదవ భాగమును మాధాన్యములో పదియవ భాగమును ఇచ్చెదము. వివాహ ఋతువులో ఒక సుందరిని మీకిచ్చెదము. మాలో ముఖ్యులగువారు సాయుధులై మీకడ వర్తింతురు. మమ్ము సుఖముగాను నియమబద్ధముగాను పాలింపుఁడు. మాకు లభించు పుణ్యమున నాల్గవభాగమును మీకిచ్చెదము. అంత మనువు వారి విన్నపము నంగీకరించి కార్యారంభ మొనర్చెను. అతఁడు శత్రువులనందఱ నిర్మూలపఱచి జనులను ధర్మ మార్గమున నడిపించెను. కనుక జనులు సదా తమకొఱకొక రాజు నేర్పరచుకొనవలయును." ధర్మమును నడపెదనని మనువును, దానికి ప్రతిగా పన్నులఁ జెల్లింతుమని ప్రజలును ఒడంబడిక చేసికొనిరను నభిప్రాయము చాల శ్రేష్ఠమైనదే. కాని నిరంకుశప్రభువులు, మనదేశమందేమి ఇతరదేశములందేమి తమ వాగ్దత్తమును చెల్లించుకొనియుండుట అరుదుగా గానవచ్చుచున్నది.

ఎంతటి నిరంకుశుఁడైనను, ఎంతటి భోగపరాయణుఁడైనను, రాజు, మొత్తముమీద శాంతిని స్థాపించుటయందును, న్యాయము చేయుటయందును సామాన్యముగా శ్రద్ధాళువై యుండెను. రాజపాలనమున నున్న జనులు అరాజకముగానున్న దేశములోని ప్రజలకంటె సర్వదా ఎక్కువ బలవంతులుగను, ఎక్కువ సుఖులుగను ఉండుచు వచ్చిరి. అరాజకమువలన నష్టములు ఉభయ వీర కావ్యములందును విస్పష్టముగా వర్ణింపఁబడియున్నవి. బహుశః జనులకుఁగల అరాజక భయమే రాజుల యధికారమును బలవత్తరముగఁ జేసియుండవచ్చును. అయోధ్యకాండములోని ౬౭ వ అధ్యాయమున, దశరథుఁడు మృతినొంది రాముఁడును భరతుఁడును దేశమున లేని సమయమున కర్తవ్యమును నిర్ణయించుటకు జనులు సభ చేసిరి. ఆసందర్భమున నిట్లున్నది. "రాజులేని దేశమున మేఘములు వర్షింపవు. పిడికెడు ధాన్యమైనను విత్తరు. పుత్రులు జననీజనకులకును, భార్యలు భర్తలకును విధేయులుగానుండరు. ఏమనుజుఁడును తనసొత్తునుగాని తన భార్య సహవాసమునుగాని యనుభవింపఁజాలఁడు. సత్యమునకు గౌరవముండదు. వేదాధ్యయనపరులగు బ్రాహ్మణులు యాగాదులఁ జేయరు. ఇఁక పండుగల మాటయు, సాంఘిక సమావేశముల మాటయు చెప్పవలెనా? ఆభరణాలంకృతలగు జవ్వనులు సాయంత్రములందు పురము బయటి తోటలకు పోజాలరు. జనులు తలుపులఁ దెఱచి నిదురింపఁజాలరు. వేగముగల బండ్లలో అడవులకుఁ బోవ నేరరు. వర్తకులు దేశసంచారము చేయలేరు. జనులు ధనుర్విద్యాభ్యాసము చేయ నేరరు. ఊరూరఁ దిరుగుచు ఎచ్చటకోరిన నచ్చట విశ్రాంతిఁగొను జ్ఞానులు కానరారు. వసంతకాలపు నవనవలాడు వృక్షములవలె ప్రకాశించుచుండు యౌవనులగు రాకొమరులు కనబడరు. జలములేని నదివలెను, పచ్చికలేని యడవివలెను, పసులులేని కాపరివలెను (?) రాజులేని రాజ్యముండును. శరీరమునకు నేత్రములెట్లు ప్రధానములో, దేశమునకట్లే రాజు ధర్మపాలనార్థమవసరము. అహో! మంచిచెడుగులను వేరుపఱచు రాజు లేనిచో, ఎచ్చటజూచినను అంధకారము నిండియుండును; ఏమియు కనుపడదు." ¶ రామాయణములోని సమస్తవర్ణనలవలెనే అరాజకమునుగూర్చిన వైవర్ణనకూడ చాలమనోహరముగా నున్నది. దుర్మార్గ

¶ అహోతమ ఇవేదంస్యాన్న ప్రజ్ఞాయేతకించన । రాజాచేన్నభవేల్లోకే విభజన్సాధ్వసాధునీ॥ అయో॥

లగువారి పోకలనడఁచుటకు రాజులేని పక్షమున కలుగు అనర్థములను గూర్చి మనవారెంత భయపడుచుండిరో సైవర్ణనయే చెప్పుచున్నది. ఈభయము అతివిస్తారమైనందున జనులు రాజ్యాంగమున శ్రద్ధగొనక, పరదేశీయులైనను పరదేశమున శాంతిని నెలకొల్పుదుమని ధైర్యమిచ్చు ఎవ్వారికైనను విధేయులైయుండ సిద్ధపడియుండిరి. రాజు లేకపోవుటవలనఁ గలుగు నష్టములు మహాభారతము నందలి శాంతిపర్వములోని ౬౭-౬౮ అధ్యాయములలోఁ గూడ వర్ణింపఁబడినవి. ఈవర్ణన రామాయణములోని వర్ణనయంత రమ్యముగా లేకపోయినను, ఎక్కువ ప్రత్యక్షముగాఁ గానవచ్చుచున్నది. అచ్చట నిట్లున్నది. "రాజు అసలే లేనట్టిగాని, దుర్బలుఁడుగానున్నట్టిగాని దేశమును జయించుటకై సమర్థుఁడగు నను జుఁడెవఁడేని కోరుచుండెనేని జనులాతనికి స్వాగతమిచ్చుటయే మంచిది. ఏలయన, అరాజక దోషములకంటె భయంకరములు మరేవియు లేవు. అతఁడు సంతసించెనేని అంతయు బాగుగా నడచును; ఆగ్రహించెనేని అతఁడు సర్వనాశము చేయును. తిప్పలపెట్టక పాలిచ్చు ఆవు నెవరును బాధింపరు; కాని బాధపెట్టి పాలిచ్చు ఆవును బాధింతురు."* రాజ్యాంగమునందు రాజునకు ఆలోచనచెప్పు నధికారము తమకుఁ గలదనుమాటను జనులెట్లు మరచిరో మనకిచట స్పష్టముగాఁ గానవచ్చుచున్నది. జనులు తమ్ముఁ దామే బలవంతుఁడగు వానికి పాలివ్వవలసిన యావులుగా భావించిరి. ఈవిధముగా క్షాత్ర యుగాంతమునాఁటికి హిందూర్యుల రాజ్యాంగదశ విషాదకరముగా నేలఁగూలెనని దెలియుచున్నది.

రాజగువానిని ఎవరును అంటనైనఁ గూడదనియు, అతని వచనములు దేవవాక్యములనియుఁగూడ తలఁచు నర్థము ఆకాలమువారు పాల్పడిరి. రాజు విషయమున దురుద్దేశములు కలవాఁడు ఈలోకముననేకాక పరలోకమునగూడ శిక్షననుభవించునని వారి తలంపు. † సుప్రసిద్ధమగు నీశ్లోకము శాంతిపర్వమునన్నది. ‡ "మనుష్యుఁడేకదా యని రాజును చులకనగాఁ జూడఁగూడదు. రాజనగా నరరూపముననున్న గొప్పదేవత." "అధర్మ్ములను శిక్షించునప్పుడను, సధర్మ్ములను రక్షించునప్పుడును, "రాజు" యముఁడుగాను, "ఒకనియొద్దినుండి ధనమును లాగికొని మరియొకని కిచ్చునపుడు కుబేరుఁడు"గాను ఎంచఁబడుచుండెను. రాజు చేయు పనులు సక్రమములా యక్రమములా యని ప్రశ్నించు అధికారము ఎవనికని లేదు. రాజద్రవ్యాపహారి ఈ లోకమున శిక్షనొందుటయే కాక అతిఘోరమైన నరకరూపమునఁ గూడ కూలునని నమ్మఁబడుచుండెను. వేయేల? రాజుయొక్క దైవాంశ జనుల మనములందు దృఢముగా నాటుకొనినందున, వారాతనికిఁ జూపు విధేయత దాస్యమునకు సమానమగు స్థితికి వచ్చెను.

రాజునకుఁగల యధికారములలో నెల్ల గొప్పది జనులను శిక్షింపఁ గల్గుట. మహాభారతమున దీనిని "దండ" మని వాడఁబడి యున్నది. కాలక్రమమున మూఢాభిప్రాయము లెన్నొగా ఈ "దండ"ముయొక్క యథార్థమగు నర్థము చుట్టును మూగెను. శాంతిపర్వములోని ౧౨౧-౧౨౨ అధ్యాయములలో నీ"దండ"ముయొక్కయు, తదాకారముయొక్కయు, దాని యుత్పత్తియొక్కయు వర్ణనలు కలవు. ఈ "దండ"ము ప్రజాపతివలన సృష్టింపఁబడెననియు, సర్వజనులయెడ నిష్పాక్షికముగా వాడఁబడదగినదనియు మేమిదివఱకే వ్రాసియున్నాము. బ్రహ్మ దీనిని క్షత్రియులకే యిచ్చెను. రాజు దీనిని యథేచ్ఛముగా ప్రయోగింపఁ గూడదు. బ్రహ్మవిధించిన నియమముల ననుసరించి దీనిని వాడవలయును. "మానవజీవితము స్వల్పకాల పరిమితమగుటవల్లన ప్రపంచలాభముకొఱకు బృహస్పతియు శుక్రుఁడును దీనిని క్రమముగా 3000 అధ్యాయములలోను ౧౦౦౦ యధ్యాయ

* అథచేదభివర్తేత, రాజ్యార్థీబలవత్తరః । అరాజకాణిరాష్ట్రాణి హతవీర్యాణివా పునః ॥ ప్రత్యుద్గమ్యాభిపూజ్యస్స్యాత్, ఏతదేవసుమంత్రితం । నహిపాపాత్పరతరమస్తికిఞ్చిదరాజకం ॥ సచేత్సమనుపశ్యేత సమగ్రంకుశలంభవేత్ । బలవాన్హిప్రకుపితఃకుర్యాన్నిశ్శేషతామపి ॥ భూయాంసంలభతేక్లేశం యాగౌర్భవతి దుర్దుహా । అథయాసుదుహారాజ నైనాంవితుదంత్యపి ॥ శాంతి॥

† యస్తస్యపురుషఃపాపం, మనసాప్యనుచింతయేత్ । అసంశయమిహక్లిష్టః, ప్రేత్యాపినరకంవ్రజేత్॥

‡ నహిజాత్వవమంతవ్యో, మనుష్యఇతిభూమిపః । మహతీదేవతాహ్యేషా, నరరూపేణతిష్ఠతి॥

ములలోను రచించిరి. మహాభాగవతముయొక్క తుది ¶ నిర్మాణకాలమున నీ రెండు గ్రంథములు ఉండియుండ వచ్చును. ఇప్పటికిని ఇట్టిపేర్లుగల గ్రంథము లున్నవి కాని యవి సౌతి † కాలముననుండినవి కాకపోవచ్చును. శాంతిపర్వములోని రాజధర్మఘట్టము పై గ్రంథముల సారాంశమై యుండవచ్చును. దండ నీతి ఈశ్వరదత్తుని యొప్పుకొనఁబడుటవలన, రాజుల నిరంకుశ వర్తనమునకు కొంత యాటంకము కలిగి యుండవచ్చును. మత సంబంధమగు భయమువలన, రాజులు ప్రజాపతి విధించిన నియమముల ననుసరింప వారలవలుకు బద్ధులుగా నుండియుండవచ్చును.

—మాడపాటి హానుమంత రావు.

# గ్రంథాలయములు

గీ. రాష్ట్రమును బాలనముసేయు రాజుబోలె । గృహముపాలన మొనరించు గృహిణిబోలె
గ్రంథభాండార పాలనాక్రమము నెఱుఁగు । వాఁడు భాండారకుఁడొకండె వసుధయందు.

సీ. వివిధజాతుల గ్రంథవితతి వేర్వేరుగా జాబితాలను మీరు సల్పుడయ్య
చదువంగ నేతెంచు జనములకా గ్రంథసమితి నోపికతో నొసంగుడయ్య
చదువలేనట్టి యజ్ఞానులకా పొత్తముల యర్థముల లెస్స దెలుపుడయ్య
గ్రంథాలయోపయోగము లెఱుంగనివారి కభిరుచి కలిగింప నరయుడయ్య
బాలురకు స్త్రీలకును గ్రంథపఠనమందు । ఘనతరాసక్తి గలిగింపఁ గడగుడయ్య
జ్ఞానభిక్షను జనుల కొసంగుడయ్య । ఆంధ్రసోదరులార మహాత్ములార!

సీ. పఠనమందిరములఁ బటుసమర్థత కోడ నెలకొల్పి పెంపఁగాఁ దలపరయ్య
ఘనసమాజముల మీ గ్రంథాలయములలో స్థాపించి చర్చల సలుపరయ్య
ఆంధ్రముఖ్యుల జ్ఞాపకార్థమా బహుమానసమితి ప్రోత్సాహంబు సల్పరయ్య
పురుషులకునుబోలె తరుణీమణులకును జ్ఞానమీయఁగ శ్రమ సలుపరయ్య
వేరుకార్యంబులఁ బ్రసక్తి విడువరయ్య । చేతఁ బూనిన కార్యంబు శీఘ్రగతిని
జయము నందింప యత్నముల్ సలుపరయ్య । ఆంధ్రసోదరులార మహాత్ములార.

—మైనంపాటి హానుమంతకవి.

¶ మహాభారతము మూఁడుమారులు నిర్మితమయ్యెననియు, ప్రస్తుతాకారము తుదియనియు 'వైద్యా'గారిభావము. మా. హ.

† మహాభారతము తుదిమారు నిర్మించినవాఁడు 'సౌతి'యని 'వైద్యా'గారియాశయము. (వైద్యాగారి "మహాభారతసమీక్షణము" అను గ్రంథమును జూడుఁడు.) మా. హ.

# శ్రీశంకరాచార్యుల కాలము

శంకరాచార్యులకాలమునుఁగూర్చి విచారింతము. దీనివిషయమై పూర్వపాశ్చాత్త్య విపశ్చితులు భిన్నాభిప్రాయులయిరి. శంకరాచార్యులను గుఱించి కేరళోత్పత్తి బృహచ్ఛంకరవిజయము, ఆనందగిరికృత శంకరవిజయము, మాధవకృత సంక్షేపశంకరవిజయము, సదానంద కృత విజయము, గలవు. కేరళోత్పత్తి లాంటిగ్రంథములకు విరుద్ధముగ నుండుటంబట్టి దానినిఁ బూర్వులే ప్రక్షిప్తగ నిరి; దానిలో నౌత్తరీయులు పూర్వ మీమాంసాచార్యులు నగు భట్టపాదులు, కేరళదేశమగు మళయాళదేశములో బౌద్ధులపై విజయముఁగొని వారి నాదేశమునుండి తఱిమి తామక్కడ నివసించినట్లు ప్రమాణవిరుద్ధముగ నున్నది. భట్టపాదులకు కుమారిలభట్టను నామము గలదు. వారు ప్రయాగలో దేహమును త్యజించినట్లు మాధవాభిప్రాయము. మాధవేతర కృతగ్రంథంబులలో విజిగీషుకథ విశేషముగ నుండుటంబట్టియు, చరిత్రవిషయమై స్వల్పము గను, పౌర్వాపర్యవిధురముగ నుండుటంబట్టియు, వానినిఁ బ్రమాణంబులుగ నవీనచరిత్రకారు లంగీకరింప లేరు. ఆనందగిరిచే సెనని కలకత్తాలోఁ బ్రకటింపఁబడిన శంకరవిజయమున నమ్మవీలులేని సంగతులున్నవి. సాయనమాధవకృతమగు నధికరణరత్నమాలలోని యొక శ్లోకమునకు శంకరులు కర్తగ వ్రాయఁబడె. తమకంటె నర్వాచీనులచేఁ బ్రపంచితములును తమమతమునకు విరుద్ధములును తమగీతా భాష్యాదులలో స్పష్టముగ దూషితములును నగు ద్వైతవిశిష్టాద్వైతములను జనులకు బోధింపుమని శిష్యద్వయమున కుత్తరవు శంకరులిచ్చినట్లున్నది. మఱియు దీనిశైలి మిగులఁ బేలవముగ నున్నది. మండనమిశ్రులు, సురేశ్వరాచార్యులు, భిన్నులనికూడ విరుద్ధముగ నున్నది. కాన నిది శంకరసాక్షాచ్ఛిష్యులచేఁగాని, తద్భాష్యత్రయవ్యాఖ్యాతలును శ్రీశుద్ధానందపూజ్య పాద శిష్యులును ఆనందజ్ఞానాపరనామధారులు నగు నానందగిరులచేఁగాని వ్రాయబడి యుండలేదు. తక్కిన రెండు గ్రంథములలో శంకరోత్పత్తికాలము నృగ్యంబు. మాధవకృతగ్రంథములో నిట్లు వర్ణింపఁబడినది:—"లగ్నే శుభే శుభయుతే సుషువే కుమారం శ్రీపార్వతీవ సుఖినీ శుభవీక్షితేచ, జాయాసతీ శివగురోర్నిజతుంగసంస్థే సూర్యే కుజే రవిసుతేచ గురౌచ కేంద్రే. (2-అ-71) దీనివలన నిప్పటికే జ్యోతిష్కులు కాలనిర్ణయముఁ జేయలేదు. ద్వైత విశిష్టాద్వైత గ్రంథంబులు పక్షపాత యుక్తంబులగుటం జేసి వానిలోనున్న శంకరకాల మంతగ నమ్ముటకు వీలు లేదు. వానివలన శంకరు లిప్పటికి ౧౫౦౦ యేండ్లక్రింద నవతరించిగనియున్నది. బొంబాయిలో౧౮౬౦ సంవత్సరమందు జనార్దన రామచంద్రజీ ప్రకటించిన హిందూ ప్రాచార్యచరిత్రలో శంకరులు ౨౫౦౦ సం॥రముల క్రిందట నుండిరనియు, నితరులు ౨౨౦౦సం॥రములని గనియు, నున్నది. శృంగగిరి మఠములోనున్న గురుపరంపరవలన విక్రమ శ౨౨ (B.C. 34)లో శంకరులాశ్రమము స్వీకరించి, విక్రమ శ ౫౦ (B.C 6) సంవత్సరమున సిద్ధిఁ బొందినట్లగపడును. కూడ్లిగి, కుంభకోణ, గురుపరంపరల పట్టికలు కూడవానినిఁ బోలియున్నవి. క్రీ. శ. ౧౯ వ శతాబ్దాదిని 'విల్ సన్' అను సంస్కృతపండితుడు పూర్వుల యభిప్రాయములన్నియు నుపహరించి తుదకు కోల్ బ్రూకు రామమోహనరాయలతో నేకీభవించి, శంకరులు క్రీ. శ. ౮-వ శతాబ్దాంతమందును, ౯-వ శతాబ్దాదియందును, ఉన్నటుల వ్రాసిరి. దీనినే మ-గా-శ్రీ, కం. వీరేశలింగముగా రంగీకరించిరి. ఈయభిప్రాయము దోషయుక్తమని బ్రహ్మజ్ఞానులగు తల్లాప్రగడ సుబ్బారావుగారు హేతుపుంజములతో 'థియాసఫిస్టు' అను దివ్యజ్ఞాన పత్రికలో నింగ్లీషున స్థిరపరచిరి.

బళ్లారిజిల్లాలో హోస్ (క్రొత్త) పేటవాస్తవ్యులును, జగద్విఖ్యాత పండితులునగు, భట్ట నీలకంఠశాస్త్రులను దాదాశాస్త్రులవారు తమ 'శంకరమందార సౌరభ' మను చంపూగ్రంథములో శంకరకాలమిట్లు వర్ణించిరి:— "ప్రాసూతతిష్య శరదామతియాతవత్యా ఏకాదశాధిక శతోనచతుః సహస్ర్యాంతిష్యశరదాం" అనగా కలియుగ

వర్షమున నీకాలము క్రీ.శ. ౭౮౮ సం॥మునకు సరిపోవును. ఇది సంప్రదాయవేత్తలు చెప్పు-వక్ష్యమాణశ్లోకము ననుసరించి యున్నదని విద్యాసుధాకరులును సూరతువాస్తవ్యులు నగు యజ్ఞేశ్వరశాస్త్రిలవారు తమ ఆర్యవిద్యాసుధాకరములోని ౩౩౬ పుటలో వ్రాసిరి. "నిధి నాగే భవహ్న్యబ్దే విభవే మాసిమాధవే, శుక్లేతిథౌ దశమ్యాంతు శంకరార్యోదయః స్మృతః" దీనింబట్టి కలియుగము ౩౮౮౯ వ సం॥రము అనఁగ, క్రీ. శ. ౭౮౮ వ సం॥మునకు సరియగు విభవ సం॥ వైశాఖ శుద్ధ దశమినాఁడు శంకర జయంతి అని జరుగుచున్నది. ఈయుద్దేశము గ్రంథకర్తలు ౫౦ ఏండ్లకు లోపలివారు. వారియూహలకుఁ బ్రమాణంబులేమియు వ్రాయకున్నను, వారిని మోక్షమూలరు "హిందూదేశము: అది మనకేమి బోధింపగలదు?" అను గ్రంథములో సంగ్రహించి, శంకరాచార్య కాలనిర్ణయమయిన దని యనిరి. కాని యిది నిర్దుష్టము కాదని పుంఖానుపుంఖముగ బొంబాయి హైకోర్టు జడ్జియగు కాశీనాథత్ర్యంబక తెలంగుగారు ముద్రారాక్షసనాటకాదియందు నింగ్లీషున సోపస్కారముగ వ్రాసిరి.

శారీరక భాష్యములోని(2-1-18-యు క్తేః శబ్దాంతరాచ్చ):— "నహి దేవదత్తః స్రుఘ్నే సన్నిధీయమానః తదహరేవపాటలీపుత్రేఽపి సన్నిధీయతే, యుగపదనేకత్ర వృత్తావనేకత్రప్రసంగాద్దేవదత్త యజ్ఞదత్తయోరివ స్రుఘ్నపాటలీపుత్ర నివాసినోః".— ఆంధ్రతాత్పర్యము, "ఎందుకనిన దేవదత్తుఁడు స్రుఘ్నమను గ్రామమందు ఉన్నవాఁడే పాటలీ పుత్రమందుఁగూడ నుండలేఁడు. ఏలయన, ఏకకాలమందే ఒకచోటుకంటె నెక్కువస్థలములలో నుండవలెనని యన్నచో, నొకనికంటె నెక్కువమందియుండవలెను. దేవదత్తుఁడు స్రుఘ్నమందు, యజ్ఞదత్తుఁడు పాటలీపుత్రమం దేకకాలమునందున్నట్లు" ఈవాక్యమువలన శంకరకాలములో స్రుఘ్నపాటలీపుత్రములుండెనని యూహింపనగు. పాటలీపుత్రము క్రీ. శ. ౮-వశతాబ్దములో నదీప్రవాహముచే మునిఁగి నశించెనని బహు చరిత్రకారుల యభిప్రాయము. అది ప్రమాణమైనచో క్రీ. శ. ౭౫౬ సం॥లకుముందె పూర్వోక్తవాక్యకర్తలగు శంకరులు జన్మించి యుండవలెను. కానియుదాహృతశ్లోకములలోఁ జెప్పబడిన క్రీ. శ. ౭౮౮-వ సం॥లోఁ బుట్టి యుండ వీలులేదు. మఱియు, నుదాహృతసూత్రభాష్యములోనే తర్కఖండనప్రసంగములో నిట్లున్నది. "సంబంధము సత్తులగురెండుపదార్థములకే ఉండును గాని,అసత్తులగువానికిఁ గాని, ఒకటిసత్తు మఱియొకటి అసత్తు అయిన పదార్థములకుఁ గాని ఉండ నేరదు. తార్కికుల యభిమతమగు నభావముసత్పదార్థము గాన వస్తూత్పత్తికిఁ బూర్వమందుండునదియని హద్దు చెప్పుటకు వీలులేదు. ఏలయన, లోకములో నిండ్లకుఁ జేలకు హద్దులగుపడుచున్నవిగాని,అభావములకు హద్దులగుపడుటలేదు. అట్లే యసత్పదార్థమగు వంధ్యాపుత్రుఁడు రాజుగానుండెనని కాని, యున్నాఁడని కాని, యుండఁబోవునని కాని- మఱియు పూర్ణవర్మయను రాజుయొక్క యభిషేకమునకుఁ బూర్వము వంధ్యాపుత్రుఁడు రాజుగా నుండెనని చెప్పుటకు వీలులేదు" ఇక్కడ దృష్టాంతము పూర్ణవర్మాభిషేకమునకుఁ బూర్వము వంధ్యాపుత్రుఁడు రాజుగానుండెను. దార్ష్టాంతికములో ప్రపంచసృష్టికిఁ బూర్వము అభావముండెను. ఇందుదాహృత పూర్ణవర్మ దేవదత్తాదులవలెఁ గాక నిజమయిన రాజనియు, నతఁడు మగధదేశమునకు క్రీ.శ-౭వ శతాబ్దాదిలో బౌద్ధప్రభువనియు, ననేకప్రమాణంబులచే 'తెలంగు' గారు నుడివిరి. అందులకుపష్టంభకముగ బాణ, మయూర, దండికవులు శంకరాచార్యసమకాలికులని మాధవులు నుడివిరనియు—వారు క్రీ.శ.౬ -వ శతాబ్దాపరార్థమందలివారని నిర్ధారితమనియు, ఇతరహేతువులనేకములు వ్రాసి, తుదకు శంకరాచార్యులు క్రీ.శ. ౫౯౦ సంవత్సరమ్రాంతముల నుండి యుండవచ్చునని యభిప్రాయపడిరి; ఈకాలనిర్ణయము కారణాంతరములచేత ప్రొఫెసర్ రామకృష్ణగోవింద భండార్కర్ గారికిఁ గూడ సమ్మతమనియు, నుడివిరి.

'తెలంగు' గారు వ్రాసినదానిని సుబ్బారావుగారు చూచినట్లగపడదు. ఇతర పురాణసంస్కృతాదిగ్రంథంబులను శోధించి, మాధవేతరుల యభిప్రాయములు సహేతుకముగ నిరాకరించి, పూర్వోక్త మతత్రయములోని గురుపరంపరల నామోదించి మాధవకృత శంకరవిజయములోని (4 అ, 94, 95, 96, 97, శ్లో) శంకర గురుస్తోత్రమువలన నొక విశేషము నూహించిరి. ఆస్తోత్రములో యోగసూత్ర వ్యాకరణ మహాభాష్య చరక పరమార్థసార

కర్తలకు పతంజలికి నడుమ గురువులకు గోవింద యతీంద్రు లను నర్మదయందు వర్ణింపబడెను. ఇదియు. వారి గురువు లగు శ్రీగౌడపాదాచార్యులు (B.C 500) సంవత్సర ములకు బూర్వముండిరని యుక్తులతో స్థాపించి, బర్త్, గోల్డ్‌స్టక్కర్, వీబరు, మోనియరు విలియంస్ లోనగు గాంగల పాశ్చాత్యపండితుల యూహలను సయుక్తిక ముగ నిరస్కరించిరి. తుదకు హిందూదేశములోను, టిబెట్టులోను నేటివరకు బాహుళ్యముగనున్న మహాత్ముల కదమున్న ప్రమాణముల బట్టి బుద్ధనిర్యాణమయిన ౫౦ సంవత్సరముల ౨ మాసములకు అనగా, క్రీస్తుపట్టిక పూ ర్వము ౫౧౦ అనగా, నేటికి ౨౪౧౮ ఏండ్లక్రిందట శంక రాచార్యు లవతరించినట్లువ్రాసి- యాసంగతి కాంచీ, శృంగగిరి, జగన్నాథము, కాశీ, కాశ్మీరము, లోనగుగాంగల ప్రదేశములలోని శాసనములలో నుండునని నిగమించిరి. కాని యట్టిశాసనము లివరకు నెవరును బ్రకటింపరైరి. ఇతియు వీబరు, మహాదేవకుంతె గార్లు. యోగసూత్రకర్త మహాభాష్యకర్తయగు పతంజలికాదనియు, బ్రతిపాద్యాం శములలో బరస్పరముగ విశేష భేదములున్న వనియు, వ్రా సిరి. కాని యా భాష్యములోని ప్రథమాహ్నికములో నుడి విన యోగసూత్రములోని హరణయోగాపాస్యములు స్ఫోట సిద్ధాంతపాస్యములు స్థూలదృష్టులకు దెలియవు. కాన నా గ్రంథములు భిన్నకర్తృకములని భ్రమపడనని సుబ్బా రావుగారి నిశ్చితాభిప్రాయము. కాని స్మృతిపాదము లో "ఏతేనయోగః ప్రత్యుక్తః" (2 అ. పా 1.) అని బాదరాయణులే కేవలయోగము మోక్షసాధనముగాదని తెలపిచ్చిరి. దానికనుగుణ్యముగ శంకరులు భాష్యము జేసిరి. యోగశాస్త్రములో జీవేశ్వరుల కుపాసకోపాస్య సంబంధమున్నట్లుగపడును. అది అవిద్యాభూమియని శం కరాభిప్రాయము. అట్లయిన, పతంజలి శంకరుల కెట్లు గురువగు? యోగమందలి యేకదేశము యమాదిసమా ధ్యంతమగు సాధనాష్టకము శ్రుతి సమ్మతమే. కాన దత్తావన్మాత్రమునకు వ్యాసులే భాష్యము రచియించిరి. కాని యోగశాస్త్రములో, పతంజలి యీశ్వరస్వరూపము నుపదేశించె; కాని యావేశస్వరూపమును వ్యాసులకే వదలిపెట్టినట్లు కానవలెను. "ఇదంపుకంపం కాన్వంతిచ్ఛన్తో బాదరాయణం" అను గౌడపాదోక్తి సంకరించుగదు. మతి యు, వ్యాకరణమందు శబ్దముకంటె భిన్నము నిత్యమగు స్ఫోటమున్నదనియు, అదే శబ్దబ్రహ్మమనియు, వ్యా కరణ మహాభాష్యములలో నున్నది. దానిని దేవతాధి కరణభాష్యమందు గురువగు శంకరులు విశేషముగ ఖండించి శబ్దమే నిత్యమని శంకరులు స్థాపించిరి. ఇక్కడను గురు శిష్యులు భిన్నాభిప్రాయులైరి. ప్రాచీన యోగవ్యాకరణ మతానుగుణముగ బతంజలులు రచియించిరనియు, మీ మాంసాన్యాయమతానుగుణముగ నాయాశయమును శం కరులు ఖండించిరనియు ననుకొనినచో, గురుశిష్యుల కేకశాస్త్రమందు వైషమ్యము జెప్పుటకు వీలుండదు. కాననే వాచస్పతి మిశ్రులు సాంఖ్యకారికలకు, సూత్ర భాష్యమునకు, వ్యాఖ్యలు గావించిరి. కనుక నేతద్విషయము బహుకంటకాన్వితమైనను శృంగగిర్యాది గురుపరంపర మును, ఆప్తవాక్యమగు శబ్దమును, ప్రమాణముగ స్వీకరిం చువారికి సుబ్బరావుగారి పలుకు రుచియించును. కేవ లము సూత్రభాష్యములోని పూర్ణవర్మాది పదోదాహ రణమును బట్టి ప్రాచీనరాజులలో నాపేరుగలవారుండె నని యనుట క్లిష్టకల్పనగ గన్పించినను, శంకరులు క్రీ.శ. ౮-వ శతాబ్దములోనివారని పాశ్చాత్యపండిత నిశ్చయ మును, నగనాడనులగు యజ్ఞేశ్వర, నీలకంఠశాస్త్రుల వారగల యూహలను నిరాకరింపగలదు. ఇక శంకరసుం దరసారగమందున్న నీక్రింది శ్లోకముతో నీవిషయము లను విరమించెద:—ధూతార్యాయః శేరశేషు ద్విజగు రుశివ గుర్వాఖ్య ధీరదక్షితా శేషామ్నాయ శ్రుతౌఘా ష్టమ శరదియతీ భావతత్త్వావబోధా లబ్ధ్వా గోవిందనా థాత్ వృషపతిశకసా వ్యాససూత్రాది భాష్యాణ్యతన్వ న్నద్ధధారత్రిగదముపహాం శంకరాచార్యమీడే."

ఇద్దఱు శంకరాచార్యులు గలరనియు, ఒకరు ౨౫౦౦ సంవత్సరములక్రిందవతరించిబుద్ధదేవునివలె మత బోధజేసిరనియు, రెండవవారు క్రీ.శ. ౬౦౦ సం॥ లకు జన్మించి భాష్యములను వ్రాసిరనియు, సుబ్బారావు, బిసెంటు, లెడ్బీటరుగార్ల, యభిప్రాయము. పండితభా ష్యాచార్యుల వారి గ్రీకుచరిత్రకారులయొక్కయు, సం ప్రదాయవేత్తలయొక్కయు, నభిప్రాయములను వ్యక్తీక రించి 'తెలంగు'గారు చెప్పినట్లు శంకరులు క్రీ.శ. ౬౦౦

సం॥ముల ప్రాంతమున నవతరించి యుండవచ్చునని తెల విచ్చిరి.

ప్రకృతము వైశాఖశుద్ధపంచమినాఁడు శ్రీశంక రజయంత్యుత్సవము వారిశిష్యులు జరుపుచున్నారు.

—ఇతి శమ్.

—వాడ్రేవు లాల వేంకటశివావధానులు

# భక్తభూమి.

(మీరాబాయి)

నీతిమాలిన దని ♦ నిందించెదరు
జాతిజాఱిన దని ♦ శాసించెదరు,
సిగ్గువీడిన దని ♦ చిన్నమాటాడి
పరవశురాలని ♦ పాపముల్ పలికి,

వీధులం బోవఁగ ♦ వేలెత్తి చూపి
నొవ్వఁ జేసిరి నా ♦ మవ్వపు మనసు
విసపు గిన్నయ నా ♦ పెదవిని జేర్చి
కసిదీర్పుము "నా ♦ గర"గురుమాళీ.

# గ్రంథాలయ పాలనము

సకలకళలనుబోధించునట్టియుసర్వశాస్త్రసంపన్నములై పండితపామరరంజకములై సూరిజనస్తోత్రపాత్రంబులైన గ్రంథరాజంబులచే నలరారుచు, ప్రాచీన నవీనగ్రంథములనెల్ల గలిగి, చదువరులకు సులభముగ చిక్కుటకు తగినవీలుగలిగి, అందలివిషయములను కోరిన చదువరులకు బోధింపగల సమర్థుడగు గ్రంథభాండాగారిచే పాలింపబడుచుండునవి గ్రంథాలయములని పలువబడుటకర్హతను గలిగి యుండును. కాని, పరుల యాచించియు పీడించియు కొన్నిపొత్తములు ప్రోగుచేసి, ఒకగదియందుంచి తాళమువైచి, చదువువారును చూచువారునులేక అమ్మవారిగుడివలె ఏటేట జాతరలు జరుపుటకుమాత్రము తెరచి వార్షికోత్సవములు జరిపిన, అవి గ్రంథాలయములనిపించుకొనజాలవు. అట్లుచేయుటవలన లాభ మేమాత్రమునుగూడ నుండబోదు. కాన అందునుగూర్చిన కొన్ని విషయములను వ్రాయుచుంటిని.

## గ్రంథాలయము.

పూర్వకాలమున లక్ష్మితో విష్ణువునకును, పార్వతితో శివునకును, దేవాలయములను కట్టిరి. కాని సరస్వతితోగూడిన బ్రహ్మాలయములు లేవు. ఆకొరతను యిప్పటివారు తీర్పవలసియున్నది. పూర్వము దాతలు దేవాలయములకును, సత్రములకును ఎంతవిరివిగ ధనసహాయమొసర్చిరో అటులనే ఇప్పటిదాతలు గ్రంథాలయములకును, పాఠశాలలకును సహాయమొసగవలసియున్నది. జనులు ఈరెండు విషయములనుగూర్చి ఎప్పుడు శ్రద్ధవహించి పనిచేయుదురో అప్పుడే దేశము విద్యాశోభితమై, సంపూర్ణమగు దేశాభివృద్ధిగలుగును. పూర్వపు ఆలయములవలె ఇవి అంతర్భాగములు కలిగియుండక ఒకటే విశాలమగు చావడిగలిగి వెలుతురును గాలియు ధారాళముగా వచ్చుటకు తగినన్ని కిటికీలు గుమ్మములు గలిగి, దృఢములుగను చెదలకును అగ్నికిని అలవికానివిగను ఉండవలయును. చావడి ఆయాగ్రామములకు తగినంత విశాలమయినదిగాను, ఏదయిన మహాజనసభ జరిగిన తగినంతమందిని పట్టునదిగాను ఉండవలయును. లేదా గ్రంథాలయమునకు సరిపడునదిగానైనను ఉండవలయును..

## గ్రంథములు.

ఇవి యివి యననేల సర్వగ్రంథములును గ్రంథాలయమునందుండవలయును. ముఖ్యముగా స్వభాషయందలి సకలగ్రంథములును, ఎక్కముల పొత్తముమొదలు మిగుల గొప్పవగు వేదసంపుటములవరకును అన్నియును ఉండవలయును. బూతులతోగూడిన పొత్తములుండ నవసరములేదు. ఏవో కొన్ని మాసపత్రికలు; వార్షికరిపోర్టులు, శతకములు, మొదలగువాటిని వందలకొలది వేలకొలది చూపుటకన్న ఉత్తమములగు గ్రంథములను స్వల్పముగా కలిగియున్నను మన్నెకెక్కును.

## గ్రంథసంరక్షణము.

గ్రంథములలోనిపుటలునలిగిపోకుండుటకును, రక్షణగలిగియుండుటకును, అట్టలు కట్టవలయును. పూర్వకాలమున తాటియాకు గ్రంథములకును ఇరుపార్శ్వముల రెండుచెక్కల నునిచి సూత్రముచే బంధించుట వాడుకగా ఉన్నది. అటులనే అధునికులు కాకితపుపుస్తకములకు అట్టలుకట్టుట వాడుకగా ఉన్నది. అయినను స్వల్పవెలకు విక్రయించుటకై పలుచటి కాగితమునే ముఖపత్రముగా గలిగి ఎన్నియో గ్రంథములు వెలువడుచున్నవి. వానికన్నిటికిని అట్టలు కట్టించకపోయిన తగినంతబలమును రక్షణయులేక, త్వరలో చినిగిపోవుటయు నలిగిపోవుటయు, సంభవించును. సాధారణముగా పుస్తకములకు వెనుకవైపున గుడ్డవైచి అట్టల కంత్యపత్రము లంటించుట వాడుక. కాని ఇప్పుడిప్పుడు పుస్తకములు దృఢముగా ఉండుటకు పుస్తకముల కంటించుట కేర్పరుపబడిన ఒకవిధమగు 'క్యాలికో'అనుగుడ్డతో అర్ధభాగమును, పూర్తిగను మూయుచున్నారు. ఇంతకన్నను దృఢముగా ఉండుటకు చర్మముతోగూడ మూయుచున్నారు. అనేకుల చేతులలోతిరిగి మాసిపోవుచుండుటచేతను, ఒక్కవిధముగా అన్నియు కాన్పించుటకును రక్షణపత్రముల (Cover papers) చే గ్రంథముల నన్నిటిని మూయుట మంచిది ;లేనియెడల అవియన్నియు, మాసిపోయి, మరకలయి చూచుటకు యింపుగానుండవు. పిమ్మట పుస్తకములను సులభముగా గుర్తించుటకు పైభాగమున వరుస నంబరును, క్రిందిభాగమున తరగతి వరుసనంబరును, మధ్యను పుస్తకముపేరును అతికించవలయును. గ్రంథములకు శత్రువులగు రాసుబాణములు, చిమ్మెటలు, చెదపురుగులు మొదలగువానిచే శిథిలము కాకుండుటకును, సరియైన స్థితియందుంచుటకును ; అధమము వత్సరమునకు రెండుసారులైనను, వాటిని తీసిచూచి యథాస్థానమున ఉంచుచుండవలయును.

## గ్రంథవిభజనము.

అన్ని విధములగు గ్రంథములును కలిసి ఒకతరగతివి అనేకచోటుల ఉండుటకన్న, ఒక్కొకరకము గ్రంథములు ఒక్కొక తరగతిగాను ఒకవరుసగాను ఏర్పరచుట చాలసౌకర్యముగా నుండును. సాధారణముగా ఇప్పటిమనగ్రంథాలయములలో ఆంధ్రగ్రంథములు విరివిగను, సంస్కృతాంగ్లేయ గ్రంథములు స్వల్పముగను, ఉండును. ఏభాష కాభాషకు ప్రత్యేక బీరువాలుండుట మంచిది. విరివిగానుండునవి నాంధ్రగ్రంథములుగాన వానినీక్రిందిప్రకారము విభాగముచేసిన బాగుండును.

పురాణములు:— ఇందు అష్టాదశపురాణముల భాషాంతరీకరణములగు స్థలపురాణములును, మహాత్మ్యములును ఉండవలయును.

ప్రబంధములు:— ఇందు పద్యకావ్యములన్నియు నుండవలయును.

నాటకములు:— ఇందు పద్య గద్యములతో గూడిన నాటకములు, వచననాటకములు, ప్రహసనములు భాణములు ఉండవలయును.

నవలలు:— ఇందుచారిత్రిక, సాంఘిక, నీతిసంబంధములగు చిత్రకథలన్నియు ఉండవలయును.

వచనములు:— ఇందు ఏతరగతిలోను చేర్చుటకు వీలులేక కేవలము వచనములేయగునవి ఉండవలయును.

చరిత్రములు:— ఇందు దేశచరిత్రములు, జీవితచరిత్రములు, వంశచరిత్రములు ఉండవలయును.

ప్రకృతిశాస్త్రములు:—ఇందు, రసాయన, పదార్థవిజ్ఞాన, పరిశ్రామికాది శాస్త్రీయగ్రంథము లుండవలయును.

లక్షణగ్రంథములు:— ఇందు, అలంకార, వ్యాకరణ, ఛందోవిషయిక గ్రంథము లుండవలయును.

వైద్యగ్రంథములు:— ఇందు శారీరము, ఆరోగ్యము, రోగనిదానము, చికిత్సాపద్ధతులుగల గ్రంథము లుండవలయును.

నిఘంటువులు:— ఇందు అకారాదిగా వ్రాయబడినవియు, పద్యరూపమున వ్రాయబడినవియు ఉండవలయును.

శతకములు:— ఇందు నీతి, మత, సాంఘికము లగున వన్నియు ఉండవలయును.

నానావిధములు:— ఇందు సాధారణముగా ఎందును జేరనివియు, బొత్తిగా చిన్నపుస్తకములును ఉండవలయును.

సంస్కృతమునను, ఆంగ్లమునను గ్రంథవిభజన విషయమై విశేష పరిశ్రమ జేయబడియున్నది; ఆంగ్లేయ భాషయందు దీనినిగూర్చి ప్రత్యేకముగ వ్రాయబడిన అనేకగ్రంథములు కలవు. ఆంధ్రదేశ గ్రంథభాండాగార సంఘమువారు చేయుచున్న గ్రంథవిభజన సంపూర్ణమగువరకును పైనచెప్పిన పద్ధతిని ఆచరణలోపెట్టవచ్చును.

## గ్రంథమును ఎరువిచ్చుట.

గ్రంథభాండారికానిఅందు కేర్పరుపబడిన మరియొకరుగాని,గ్రంథాలయమున చదువుకొను చదువరులకుగాని, ఇండ్లకు గ్రంథములు తీసికొని చదువువారికిగాని,ఏదోయొక నియమితకాలమున గ్రంథములిచ్చుచుండవలెను. ఆగ్రంథములు తీసిన కాలిస్థలమున ఒకచీటిపై గ్రంథముపేరు-తీసుకొనినవారిపేరు- తేదీ-వేసియుంచి, అందుకొరకు ప్రత్యేకప్రత్యేకముగా ఉంచబడినపట్టికలలోవ్రాసి వారివలన సంతకములు చేయించుకొనవలయును. తిరిగి ఒసంగినపుడు పుచ్చుకొనిన తేదీవేసి, పుచ్చుకొనినవారు సంతకము చేయుచుండవలెను. ఈపనిని బహుశ్రద్ధతో చేయవలయును. లేనియెడల పుస్తకములు వరుస తప్పుటయు, ఉన్నవేవియో పోయినవేవియో తెలియకపోవుటయు, ఎవరైనను ఒకపుస్తకమడిగిన అదికలదో లేక ఎవరైనను తీసుకొనిరో సులభముగా తెలియకపోవుటయు సంభవించును.

## పత్రికలు.

గ్రంథాలయము జనులనాకర్షించుటకును,ప్రపంచమందలి వార్తల తెలిసికొనుటకును, పత్రికలు సహకారములు గాన తప్పక వీటిని తెప్పింపవలెను. మాసపత్రికలలో కొన్ని గ్రంథములు వెలువడుచుండును గాన అవియునుఉండవలెను. ఈపత్రికలన్నియుప్రతివారు చదువుకొనుటకు వీలగునట్లు చదువరుల బల్లపై వరుసలుగా నమర్చి, ఎగిరిపోకుండుటకు వానిపై కర్రదిమ్మలుగాని మరియొకటిగాని, ఉంచవలయును. చదువరులు వీనినటునిటు తీసికొనిపోవుటయు, గుట్టగా అన్నిటిని పోగువైచుటయు, తరచుగా జరుగుచుండును. కాన అట్లు జరుగకుండునట్లును, యథాప్రకారము వరుసలుగా ఉంచునట్లును అలవాటు చేయవలెను. పత్రికలు ఒక్కొక ప్రతియే ఉండును; కావున వాటిని ఇండ్లకీయరాదు. అట్లిచ్చిన భాండాగారమునకు వచ్చిన చదువరులు చదువుకొనుటకు పత్రికలుండకపోవుట సంభవించును. ప్రతి సంవత్సరాంతమునను పత్రికలన్నియు సంపుటములుగా గట్టి భద్రముచేయుట మంచిది. మాసపత్రికలలోని భాగములన్నిటిని కలిపి గ్రంథములుగా కట్టవలయును.

## చిత్రపటములు.

గ్రంథాలయమున మహాపురుషుల చిత్రపటములును, భాషాపోషకులయొక్కయు, కవివరులయొక్కయు, చిత్రపటములును ఉండవలయును. మరియు జనులకు శాస్త్రీయ విషయములను, భూగోళ, ఖగోళ విషయములను,శారీరము ఆదిగాగల ఇతర శాస్త్రీయ విషయములను,బోధించు చిత్రపటములును ఉండవలయును.

## పట్టికలు.

గ్రంథాలయము ఈక్రింది పట్టికలను కలిగియుండవలెను.

౧ చందాదారుల పట్టిక:—ఇందు ఈక్రింది విభాగములు ముఖ్యముగా నుండవలెను. ౧ చేరిన తేదీ, ౨ చందాదారుని పేరు, 3 గ్రామము, ౪ తరగతి, ౫ చందాదారుని సంతకము, ౬ మానివేసిన తేదీ, ౭ మానివేయువరకు చందాబాకీ, ౮ రిమార్కు.

౨ జమాఖర్చు పుస్తకము:—ఇందు చందాదారుల చందాలవలనను, విరాళముల మూలమునను, ఇతర

విధములను వచ్చు జనులును, ఖర్చులును తేదీలవారీగా ఏ నెలకా నెల ఉండవలెను.

౩ ధర్మ గ్రంథములపట్టిక:— ఇందు ధర్మముగావచ్చు పుస్తకములు సామానులు, వానివిలువ, ఇచ్చినవారి పేరు, ఇచ్చిన తేదీ ఉండవలయును. ఇందు కొన్న గ్రంథములుకూడ వ్రాసుకొనిన ఇచ్చినవారి పేరు భాండాగారమని వ్రాసుకొనవలెను.

౪ ఆస్తిని తెలియజేయు పట్టిక:— ఇందు గ్రంథాలయమునకు చేరిన యావదాస్తియు, (కొన్నదియు, ధర్మముగా వచ్చినదియు,) వానివాని ఖరీదులతో వ్రాయవలయును.

౫ ఉత్తరముల నకళ్లు:— ఇందు ఇతరులకు వ్రాయు ఉత్తరములకు నకళ్లు వ్రాయుచుండవలయును.

౬ తీర్మానముల పుస్తకము:— ఇందు ఆయా తేదులను కార్యనిర్వాహక సంఘముగాని, సాధారణ సంఘముగాని చేయు తీర్మానములు వ్రాయుచుండవలయును.

౭ అభిప్రాయములు వ్రాయు పుస్తకము:— ఇందు తగువారిచే భాండాగారమును గూర్చిన అభిప్రాయములు వ్రాయించుచుండవలయును.

౮ అభిప్రాయములు వ్రాయు పుస్తకము 2:— ఇందు భాండాగారముయొక్క లోపాలోపములను, భాండాగార సభ్యులు, కార్యదర్శి, అధ్యక్షుడు, తాలూకా గ్రంథభాండాగార కార్యదర్శి, ఆంధ్రదేశ గ్రంథభాండాగార కార్యదర్శి, మొదలగు భాండాగారములకు సంబంధించినవారిచే వ్రాయించవలయును.

౯ పుస్తకముల పట్టిక:— అన్ని పుస్తకములు అకారాదిగా ఏభాషకాభాషకు ప్రత్యేకముగా వ్రాయునదొకటియు, ఏభాషకాభాషకు ప్రత్యేకముగ తరగతివారీగ (నవలలు, నాటకములు, పురాణములు మొదలగునవి) వ్రాయునదొకటియు ఉండవలయును. కవుల నామములను బట్టికూడ, అకారాదిగా ఒక పట్టికను తయారుచేసిన, చదువరులకు ఎక్కువ సౌకర్యముగ నుండును. దీనియందు గ్రంథాలయమున గల గ్రంథములన్నియు వ్రాయవలయును. వార్షిక వృత్తాంతములు, మాసపత్రికలు మొదలగునవి గ్రంథములు గావు; కాన వానిని చేర్చకూడదు. అవసరమైనచో వానికి వేరువేరు ఖాతా లుంచి వ్రాయవలయును. పుస్తకములసంఖ్యలో చేర్చకూడదు.

౧౦ చదువరులపట్టిక:— ఇందు తేదీ, పుస్తకమునంబరు, పుస్తకముయొక్కగాని పత్రికయొక్కగాని పేరు, తెనుగు సంస్కృతము ఆంగ్లేయము వీనివివరము, చదివి యిచ్చివేసినపుడు గ్రంథాధికారి సంతకము, తరగతి (నవలా, నాటకమా అనునదియు) చదువరుల వరుసనంబరును ఉండవలయును. దీనిని ఏనెలకానెల కూడి, ఎంతమంది చదువరులు వచ్చినది, పుస్తకము లెంతమంది చదివినది, ఎన్ని పుస్తకములు చదివినది— సంస్కృతమెన్ని తెనుగుఎన్ని ఆంగ్లమెన్ని — తెనుగున చదివిన వానిలో పురాణములు, నవలలు, నాటకములు మొదలగునవి ఏవియెన్ని-ఈవిషయములన్నియు వ్రాయవలెను. ఈపట్టిక ఏసంవత్సరమున కాసంవత్సరము జనవరి ౧వ తేదీనుండి ప్రారంభించి డిసెంబరుతో ముగించుచుండవలెను. ఆయాగ్రంథాలయముల వార్షికోత్సవములకు నివేదికలను వ్రాసుకొనుటకు వారువారు ఏర్పరచుకొనిన నెలమొదలు మరుసటిసంవత్సర మానెలవరకు కూడ వేసుకొనవచ్చును.

౧౧ ఇండ్లకు గ్రంథములు తీసుకొనువారిపట్టిక:— ఇందు తేదీ, పుస్తకముసంఖ్య, పుస్తకముపేరు, విలువ (పోస్టేజీసహా), తెనుగు సంస్కృతము ఆంగ్లము ఈవివరము, తీసుకొనినవారి సంతకము, తిరిగి భాండాగారమునకు ఇచ్చినపుడు ఆతేది, భాండాగారికుని సంతకము, తరగతి, రిమార్కు, అనుకలములుండవలయును. ఒకొక్కరికి కొకొక్క పుటవంతున అక్షరాదిగా ఏర్పరచి, వారు ఆసంవత్సరములో ఎప్పుడెపుడు తీసుకొనినను అందే వ్రాయుచు ఆపేజీ చాలనియెడల మరొక పుటకు మార్చుకొనవలెను. కాని అందరినికలిపి వరుసగా వ్రాసిన ఎంతమంది చదివినదియు, ఎవరెవ రెన్నెన్ని చదివినదియు, తెలియదు. దీనికికూడ ఏనెలకానెల ఎంతమంది చదివిరో, ఎన్ని పుస్తకముల చదివిరో, అందు తరగతివారీగా ఏయేగ్రంథములెన్నియో, దానికొకపుట పెట్టి అందు వ్రాయుచుండవలయును. సంవత్సరాంతమున మొత్తమందరు ఎందరు చదివిరో, ఎన్ని పుస్తకములు చదువబడెనో, అందుతరగతులేవియో, ఎన్నెన్నియో, వ్రాయ

వలయును. మాసవారీగా ౧౨ మాసములవికూడి, ఇండ్లకు గ్రంథములు తీసుకొనినవారిసంఖ్యగా వేసిన, ఒకరే ౧౨ సారులు వచ్చెదరు. కాన, ఆసంవత్సరమంతలోను ఎన్ని పర్యాయములు తీసికొనినను ఒకరిని ౧ టిగా భావించుకొని అట్టివారందరుకలగో ఆమొత్తము వేయవలెను. వార్షికవృత్తాంతములలో ఇండ్లకు తీసుకొనిన గ్రంథముల మొత్తమును, భాండాగారమున చదివిన గ్రంథముల మొత్తమును; కూడి ఆమొత్తమును చదివిన గ్రంథసంఖ్యగా వేయవలెను. ఇదియు ప్రతిజనవరి ౧వ తేదీనుండియు క్రొత్తది ఏర్పాటుచవలెను.

## నిబంధనలు.

సాధారణముగా గ్రంథాలయములన్నిటికిని ముఖ్యాంశ ఉద్దేశ్యములును నిబంధనలును ఒకటే. కాన ఈక్రిందివి అందరును కలిగియుండిన మంచిది.

### ఉద్దేశ్యములు.

౧ ఆంధ్ర భాషయందుగల గ్రంథములన్నిటిని, వీలయినంతవరకు సంస్కృతాంగ్లేయ గ్రంథములను సంపాదించుట. తాళపత్ర గ్రంథములను భద్రపరచుట.

౨ వార్తాపత్రికలను మాసపత్రికలను తెప్పించుట.

3 ఈగ్రంథములను, పత్రికలను, భాండాగారమునకు వచ్చు చదువరులనెల్ల నుచితముగా చదువుకొననిచ్చుట, చదివి వినిపించుట.

౪ ఇంచలి గ్రంథముల నిండ్లకు తీసుకొనగోరువారియొద్ద చందాధనమును గైకొని, తన్మూలమున భాండాగారమభివృద్ధికి తెచ్చుట. (ఇండ్లకు గ్రంథములను ఉచితముగా నిచ్చుటకుగూడ ఏర్పాటుచేసిన మంచిది.)

౫ జ్ఞానదాయకములును దేశాభివృద్ధికరములునగు ఉపన్యాసము లిప్పించుట, మహాపురుషులయొక్కయు ప్రవక్తలయొక్కయు వర్ధంతులను జేయుట, జాతీయ పండుగలను సలుపుట, వ్యాయామములను కళలను ప్రోత్సాహపరచుట.

౬ మహనీయుల చిత్రపటముల సంపాదించి భాండాగారము నలంకరించుట.

పుస్తకములను ప్రకటించుట, రాత్రి పాఠశాలలు ఏర్పరచుట, మొదలగునవి వారివారి స్థితిగతులను బట్టి చేయుచుకొనవచ్చును.

ప్రతి గ్రంథాలయమును సాధారణ సంఘము, కార్యనిర్వాహక సంఘము అను రెండు సంఘములచే పరిపాలింపబడవలయును. సాధారణ సంఘము:- గ్రంథాలయమున చేరు ప్రతి చందాదారుడును సాధారణసంఘ సభ్యుడుగా ఉండును. గ్రంథాలయ నిబంధనలలో గ్రంథాలయము నెత్తివేయుటకుతప్ప—ఇతరములెవ్వియైనను మార్చుటకును, చేర్చుటకును, రద్దుపరచుటకును సాధారణసంఘ సభ్యులధికారము కలిగియుందురు. అందు నిమిత్తముగ్దేశింపబడిన సభకు మూడవవంతునకు తక్కువగాని సభ్యులు హాజరయి యుండవలయును. ఒకపర్యాయమేర్పరుపబడిన నిబంధనలు తిరిగి 3 మాసముల పర్యంతము పరిష్కరింపకూడదు. గ్రంథాలయ మెత్తివేయుటకు ఏసంఘమునకును—ఎప్పుడు ఎట్టి అధికారము ఉండకూడదు.

కార్యనిర్వాహక సంఘము:—సాధారణ సంఘమునుండి సంవత్సరమునకొకమారు ఎన్నుకొనబడిన నియమిత సంఖ్యగల అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధిపతి, మరికొందరు సభ్యులు గలిగిన కార్యనిర్వాహక సంఘము పరిపాలనకొరకు ఉండవలయును. గ్రంథాలయముయొక్క యాస్తినంతను ఈసంఘము తన వశమునందుంచుకొని ఆదాయవ్యయముల పరిపాలించుటయు, భాండాగారికుని గాని సేవకులనుగాని నియమించుటయు తొలగించుటయు, అవసరమయిన సామానులు వార్తాపత్రికలు పుస్తకములు మున్నగువానిని తెప్పించుటయు, అనవసరము యినవానిని విక్రయించుటయు, గ్రంథాలయ మందిరము సామానులు మున్నగువానిని తగినరీతిని మరమ్మతులు చేయించుటయు, మొదలగు కార్యముల నిర్వహించవలెను.

అధ్యక్షుడు:—ఈతడు భాండాగారమును సదా పరిపాలించుచు కార్యనిర్వాహక సంఘమువారు చేయు కార్యములను, లెఖలను అప్పుడపుడు పరీక్షించుచు లోపములున్నయెడల కార్యనిర్వాహక సంఘముతో నాలోచించి ఉచితరీతిని జరిగించుచుండవలయును.

కార్యదర్శి:—గ్రంథాలయముయొక్క అభివృద్ధి యంతయు కార్యదర్శిపై నాధారపడియున్నది. గ్రంథాలయముయొక్క యావత్తు వ్యవహారములును, భాండా

గారికుని పనియుకూడ కార్యదర్శిమీదనే అనేక స్థలముల ఉండుచున్నది. అధ్యక్షుడుగను, కోశాధిపతిగను, సభ్యుడుగను ఉండుట కందరుసమ్మతించెదరుగాని కార్యదర్శిగను, గ్రంథాధికారిగను ఉండుటకెవరును సమ్మతింపరు. కార్యదర్శియే భాండాగారికుడుగాకూడ పనిచేయవలసివచ్చిన వానిశ్రమ చెప్పనలవికాదు. అట్టిచో సహాయము చేయువారు ఎవరును ఉండరు. కాని, ఏదేని వంకబెట్టి వెక్కిరించువారనేకులుందురు; కాన శాంతుడును న్యాయవాదియు ఓర్పుగలవాడును లోకవ్యవహారముల తెలిసినవాడును గ్రంథ పఠనాభిలాష గలవాడును జనాదరము గలవాడుగను ఉండవలెను. కాని విసుగుకొనియు కసరియు పాక్షికబుద్ధి కలిగియు ఉండినచో గ్రంథాలయము హీనస్థితికి వచ్చును; కనుక గ్రంథాలయాభివృద్ధికి ఇదియొక ముఖ్యవిషయము. ఈతడు కార్యనిర్వాహక సంఘమువారి తీర్మానముల ప్రకారము ఎల్లవ్యవహారములను నిర్వర్తింపుచుండవలయును.

భాండాగారికుడు:—భాండాగారము నెల్లపుడు కనిపెట్టుకొనియుండువాడును, చదువరుల కెల్లప్పుడు కాన్పించుచుండువాడును, గ్రంథాధికారియై యున్నాడు. గ్రంథములు ఇండ్లకిచ్చుట, తిరిగిపుచ్చుకొనుట, చదువరులకిచ్చుట, పుచ్చుకొనుట భాండాగారికుని విధులు. ఈతడుకూడ భాండాగార ప్రచారమునకు ముఖ్యుడు; కాన శాంతముగలవాడును, చురుకుగలవాడుగను ఉండవలయును. గ్రంథాలయమును కనిపెట్టుకొని యుండువారు జీతభత్యములు లేక ఉచితముగా దొరుకుట బహు అరుదుగానున్నది. అందువలన ఆపనికూడ కార్యదర్శిపైనే పడుచున్నది. అనేక గ్రంథాలయములలో కార్యదర్శి ఏపనిమీదనైనను ఒకరోజుగాని కొన్నిరోజులుగాని రాకపోయిన తలుపు తీయువారైనను ఉండరు. ద్రవ్యమిచ్చి భాండాగారికుని ఏర్పరచుకొనుటకు ధనము చాలదు; అనేకభాండాగారములకు నెలకు ౧, ౨, రూపాయ లాదాయమయినప్పుడు జీతమిచ్చి భాండాగారికుని ఎట్లుఏర్పరచుకొనగలరు? గ్రంథాలయము లభివృద్ధి నొందవలయుననిన ఉచితముగాగాని, జీతముపైగాని పనిచేయునట్టి భాండాగారికుడున్ననే వృద్ధినొందును. లేనియెడల కొంతకాలమునకు అనేకభాండాగారములు మూసివేయబడవలసివచ్చును. కావున జీతమునిచ్చి భాండాగారికుని ఏర్పరచుకొనుటకు ప్రతిగ్రంథాలయమువారును ప్రయత్నింపుచుండవలయును.

చందాదారులు:—ఏయుద్యమమైనను ద్రవ్యము లేనిది నెరవేరజాలదు కదా! గ్రంథాలయములకు ద్రవ్యము ముఖ్యముగా చందాదారులవలననే వచ్చును. చందాదారు లెంత ఎక్కువగానున్న ఆభాండాగారమంత విశేషముగా పనిచేయగలదు. చందాదారులు విరివిగ ఉన్నయెడల భాండాగారికునిజీతమిచ్చి ఏర్పరచుకొనుటకు సహాయమగును. కాన ప్రతిభాండాగారమును తగినంతమంది చందాదారులను చేర్చుటకు పాటుపడవలెను. చందాలు ఆయాగ్రామములకుతగినట్లు కొన్ని తరగతులుగా ఏర్పరచుకొనవచ్చును. విరాళముల మూలమునకూడ కొంత ద్రవ్యము రాగలదు. కాన విరాళములనుకూడ ప్రోగుచేయుచుండుట ఆవశ్యకము.

చదువరులు:— సరియగు గ్రంథాలయాభివృద్ధి చదువరుల సంఖ్యనుబట్టి ఉండును. మనలో అనేకులు పనిపాటలులేక తినుటకు వసతిగలిగినవారు, చతురంగము పేకలేక, ఇతరఆటలయందు తమకాలమునంతను వినియోగించుచున్నారు; ఈ ఉత్సాహము, ఓపిక, కాలములను కొంతవరకైన గ్రంథపఠనమునం దుపయోగించిన—వారు తమకును తమ దేశమునకునుగూడ మేలు చేసినవారగుదురు. కాన ఆట్లయం దాసక్తి విడచి గ్రంథపఠనాభిలాషులైనచో గ్రంథాలయములకు చదువరుల సంఖ్య హెచ్చుటయు, రాబోవు తరమువారికి మార్గదర్శకులగుటయు జరగును. చదువరులకొర కేర్పరుపబడిన పుస్తకమునందు ప్రతిచదువరియు తాను చదివిన పత్రికగాని పుస్తకముగాని వ్రాసి, సంతకము చేయవలెను. ఇందువలన ఎంతమంది చదువరులు చదువుకొనుచున్నదియు ఎన్ని పుస్తకములు చదివినదియు తెలియుటయేకాక గ్రంథాలయాభివృద్ధి ఎటులున్నదియు తెలియగలదు.

## ప్రకటనలు

చందాదారుల జాబితాలు, వార్తాపత్రికల మాసపత్రికలజాబితాలు, పుస్తకములపట్టిక, ఆదాయ వ్యయములపట్టిక, చందాలు ఈయక మానివేసిన వారి జాబితా (బాకీలతో), చదువరుల ప్రకటనలు, కార్యనిర్వాహక

సంఘపత్రిక, ఇంకను ముఖ్యమగు ఇతర ప్రకటనలును, అందరికి తెలియుటకుగాను గ్రంథాగారమున వ్రేలగట్ట వలయును.

## వార్షికసభ

ప్రజలకు గ్రంథాలయములం దభిమానము గలుగుటకును, పరిపాలనయందలి లోపాలోపములందరికి తెలియుటకును, ఆదాయవ్యయములును చదువరులయొక్కయు చందాదారులయొక్కయు అభివృద్ధులు తెలియుటకును, గ్రంథముల అభివృద్ధిక్షయములు తెలియుటకును, వార్షికసభ చేయవలయును.

## అదనపు గ్రంథములు

గ్రంథాలయములలో ఒకేపుస్తకము రెండు మూడు ప్రతులుండుచున్నవి. అట్లుండుటవలన ఒకపుస్తకము పోయిన రెండవప్రతిని ఉపయోగించుకొనవచ్చును. ఎన్ని ప్రతులున్నను ఉంచుకొనవచ్చును. కాని పుస్తకములపట్టికలో అట్టిగ్రంథములు ఎన్నిగలవో అన్నియు అదనపు గ్రంథములను శీర్షికక్రింద వ్రాయవలయును.

## ఆంధ్రదేశ గ్రంథభాండాగార సంఘము

ఈసంఘమువారు గ్రంథాలయముల అభివృద్ధికి కావలసిన సలహాలనెల్ల ఒసంగెదరు. గ్రంథాలయ నిర్వాహకులెవ్వరైన తమకు ఏవిషయమునుగూర్చిగాని సందేహము కలిగినప్పుడు, ఈసంఘమువారికి వ్రాసి తమసందేహనివృత్తిని జేసికొనవచ్చును. నూతన గ్రంథాలయములు స్థాపించుటకు కూడ వారు సహాయపడెదరు.

గ్రంథాలయముల ఉపయోగార్థమై కొన్ని పట్టికల నమోనాలను ఇచ్చుచున్నాను:—

### చందాదారుల పట్టిక.

| చేరిన తేది. | చందాదారుని పేరు. | గ్రామము | వృత్తి | చందాదారుని సంతకము. | మానివేసిన తేది. | మానుసరికి చందాబాకీ | | | వ.రా. |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | రు. | అ. | పై. | |

### జమా ఖర్చు పుస్తకము లేక చిఠా ఆవర్జా.

| సంవత్సరము నెల | తేది | బాపతులు | జమలు | | | ఖర్చులు | | | వ.రా. |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | రు. | అ. | పై. | రు. | అ. | పై. | |

### ధర్మముల పట్టిక

| తేది | ధర్మపుస్తకములు లేక సామానులు | విలువ | | | ఇచ్చినవారి పేరు. | వ.రా. |
|---|---|---|---|---|---|---|
| | | రు. | అ. | పై. | | |

### ఆస్తిని తెలియజేయు పట్టిక

| తేది | ఆస్తి వివరము | విలువ | | | ఇచ్చినవారిపేరు లేక కొనినది. | వ.రా. |
|---|---|---|---|---|---|---|
| | | రు. | అ. | పై. | | |

## చదువరుల పట్టిక.

| తేది | పుస్తకము సంఖ్య | పుస్తకముయొక్క గానిపత్రిక యొక్క గాని పేరు. | చదివినవారి సంతకము | విలువ | | | పుస్తకమైన భాండాగారి సంతకం. | తెనుగు, సంస్కృతం, ఆంగ్లం వివరము. | పుస్తకము యొక్క తరగతి | వరుసనంబరు | వ.రా. |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | రు. | అ. | పై. | | | | | |

## ఇండ్లకు గ్రంథములను ఇచ్చుపట్టిక.

| తేది | పుస్తకము సంఖ్య | పుస్తకము పేరు | విలువ పోస్టేజి సహా | | | [illegible] | తీసుకొనినవారి సంతకము | తిరిగియిచ్చిన తేది | భాండాగారిని సంతకం | పుస్తకము తరగతి | వ.రా. |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | రు. | అ. | పై. | | | | | | |

## గ్రంథాలయము యొక్క నెలసరిలెక్క

| గ్రంథములుకొన్నవి | | | | గ్రంథములు ధర్మపువి | | | గ్రంథముల మొత్తం | చందాదారులు | | | వసూలయిన చందామొత్తం | | | చందాల బాకీల మొత్తం | | | విరాళముల మొత్తం | | | ఖర్చు మొత్తం | | | నిలువ మొత్తం | | | సభలు | | భాండాగారమునకు వచ్చిన చదువరుల సంఖ్య | భాండాగారమున చదివిన గ్రంథముల సంఖ్య | ఇండ్లకు గ్రంథములు తీసుకొనిపోయినవారి సంఖ్య | ఇండ్లకు ఇయ్యబడిన గ్రంథముల సంఖ్య | వ.రా. |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| తెనుగు | సంస్కృతం | ఆంగ్లము | ఇతరభాషలు | తెనుగు | సంస్కృతం | ఆంగ్లము | | స్త్రీలు | పురుషులు | మొత్తం | రు | అ | పై | రు | అ | పై | రు | అ | పై | రు | అ | పై | రు. | అ | పై | మహాజన | కార్యనిర్వాహక | | | | | |

## గ్రంథాలయముయొక్క......సాలుసరిలెక్క

| ప్రారంభ నెల తేదీ | గ్రంథములు | | | | | పత్రికలు | | చందాదారులు | | | వసూలైన చందా మొత్తం | | | ఖర్చు మొత్తం | | | చందాల బాకీల మొత్తం | | | నిలవ మొత్తము | | | విరాళముల మొత్తం | | | సభలు | | భాండాగారమునకు వచ్చిన చదువరుల సంఖ్య | భాండాగారమున చదివిన గ్రంథముల సంఖ్య | ఇండ్లకు తీసుకొనిపోయినవారి సంఖ్య | ఇండ్లకు ఇయ్యబడిన గ్రంథముల సంఖ్య | వ.రా. |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | తెనుగు | సంస్కృతం | ఆంగ్లము | ఇతరభాషా గ్రంథములు | మొత్తం | వారపత్రికలు | మాసపత్రికలు | పురుషులు | స్త్రీలు | మొత్తం | రు. | అ. | ప. | రు | అ. | ప. | రు | అ | ప | రు | అ | ప | రు | అ | ప | కార్యనిర్వాహక | మహాజన | | | | | |

## గ్రంథముల పట్టిక (విభాషకాభావకు) అనగా ఆవర్జా

| వరుససంఖ్య | తరగతి వరుససంఖ్య | గ్రంథనామము | గ్రంథకర్త పేరు | వ.రా. |
|---|---|---|---|---|
| | | | | |

—దంటు కృష్ణమూర్తి.

## స్వాగతము *

చ. 'కే' 'కే' యంచుఁ బ్రియావలిప్పు తరళ ♦ ప్రేమా మయూరీకుమా
రీ కంఠస్వరముల్ మహాంధ్రజనయి ♦ త్రీ (శ్రీ) పదోపాసనం
దాకర్ణించి, ప్రసన్నదృష్టిఁగొనుమీ ♦ యాతిథ్య కర్పూరమా
లా కళ్యాణసుమాంజలిన్ తెలుగుబా ♦ లా భక్తిచిహ్నంబుగన్.

సీ. ఏతటినీతటిన్ ♦ బూతంబుగనొనర్చె - గాండీవి తన తపః ♦ కళలనిచ్చి
ఏయేటిచెంతఁ బూ ♦ యించె భాషాకన్య - రసవంతమగు కావ్య ♦ కుసుమములను
ఏపుణ్యనదిపొంత ♦ స్థాపించినారు బౌ - ద్ధాచార్యమణులు వి ♦ ద్యాలయముల
ఏమహావాహిని ♦ నెనసికట్టిరి రెడ్డి - దొర లసాధ్యములైన ♦ దుర్గములను
గీ. ఆ పవిత్ర కృష్ణాతీర ♦ మందు వెలసి - నట్టి యీ మహాగ్రంథాల ♦ యంబు మొదలె
అందుకొనియె తావకభాగ్య ♦ హస్తరేఖ - నేమినోము ఫలమొ శివ ♦ స్వామిచంద్ర!

---

## ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల తృతీయమహాసభ - నెల్లూరు.

౧౯౧౬ సం. మే నెల ౧౩ వ తేది ఉదయము ౮½ గంటలకు తృతీయ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ లక్ష్మీనర్సారెడ్డి పురమందిరమున సమావేశమైనది. కృష్ణా, గోదావరి, గుంటూరు, విశాఖపట్నము, గంజాము నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, మద్రాసు జిల్లాలనుండి నూటయిరువదిమంది ప్రతినిధులును నూరుమంది ప్రేక్షకులును సభ నలంకరించిరి. జ్ఞానోదయ సమాజ సభ్యులగు శేషాచార్యులుగారు చేసిన దైవప్రార్థనతో సభ ప్రారంభమైనది. అనంతరము ఆహ్వానసంఘాధ్యక్షులగు మైదవోలు చెంగయ్యపంతులు బి. ఏ., బి. ఎల్. గారు ప్రతినిధులకు స్వాగతమొసంగుచు తమ యుపన్యాసమును చదివిరి. ఆనరబిల్ ఆంవగ్ల కృష్ణారావు, నె[illegible]వి సుబ్బారావు, ఒంగోలు వెంకటరంగయ్యగార్లు శ్రీ కాశినాథుని నాగేశ్వరరావు పంతులుగారిని అగ్రాసనాధిపత్యమును వహింపుడని కోరుచు ముచ్చటించిన తరువాత శ్రీ నాగేశ్వరరావుగారు సభాధిపత్యమును వహించి తమ యుపన్యాసమును చదివిరి. అంతటితో ప్రాతఃకాలసభ ముగిసెను.

ఆనాడు మధ్యాహ్నము సభ తిరిగి 3 గంటలకు కూడెను. అప్పుడు పలువురిచే ఉపన్యాసము లొసంగబడెను.

తిరిగి ౧౪ వ తేది ప్రాతఃకాలమున ఎనిమిది గంటలకు మహాసభ సమావేశమైనది. ఆంధ్రమాతృ స్తవముతో సభ ప్రారంభమాయెను. అప్పుడు వివిధములగు ఉపన్యాసములు జరిగినపిమ్మట ఈదిగువ తీర్మానములు చేయబడెను.

---

* బెజవాడ రామమోహన ధర్మపుస్తక భాండాగారమునకు ౧౭-౪-౧౯౧౬ వ తేదీన ఆనరబిల్ సర్ పి. యస్. శివస్వామి అయ్యరుగారు విచ్చేసినప్పుడు బ్రహ్మశ్రీ. రాయప్రోలు సుబ్బారాయకవీంద్రునిచే జెప్పబడినవి.

౧ దేశసేవాధురంధరులు దివాను బహదరు ముట్నూరు ఆదినారాయణయ్య, గురుజాడ అప్పారావు, కొండూరి భద్రాద్రిరామశాస్త్రి, ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రిగార్లు, అకాలమరణములకు చింతిల్లుచు, వారి కుటుంబముల కీ సభవారు సానుభూతిని తెలుపుచున్నారు.

౨ జనసామాన్యమందు విద్యాభివృద్ధి చేయుటకు గ్రంథాలయములు ముఖ్యసాధనములు గనుక,

(క) ప్రస్తుతము ఆంధ్రదేశమున స్థాపింపబడిన గ్రంథాలయములకును, పఠనమందిరములకును, మునిసిపాలిటీ డిస్ట్రిక్టు తాలూకా బోర్డులయొక్క ద్రవ్యములనుండియు ప్రావిన్షియల్ రివిన్యూలనుండియు ద్రవ్యసహాయము చేయుటకు సదుపాయములను గలుగజేయవలసినదని ప్రభుత్వమువారిని ఈసభవారు ప్రార్థించుచున్నారు.

(చ) పుస్తకభాండాగారములను, పఠనమందిరములను, ౧౮౬౦ సం. ౨౧ నెం. ఆక్టును అనుసరించి రిజష్టరు చేయుటకు చెల్లింపవలసిన రుసుమును లేకుండగనే రిజష్టరు చేయించుటకు ప్రభుత్వము వారి నీ సభవారు ప్రార్థించుచున్నారు.

(ట) ఎలిమెంటరి బోర్డుపాఠశాలలయందు ఉండునట్టి పుస్తకభాండాగారములను అట్టి పాఠశాలలుండునట్టి గ్రామములందుండు జనులెల్ల ఉచితముగా చదువుకొనుటకుల ఏర్పాటుచేయుటకు ప్రభుత్వమువారి నీ సభవారు ప్రార్థించుచున్నారు.

(త) దొరతనమువారిచే ప్రచురింపబడు పరిశ్రామిక ఆరోగ్యవిషయిక ప్రచురముల నన్నిటిని, జిల్లా గెజటీరు ఆంధ్రభాషయందు ముద్రింపబడు గ్రంథముల పట్టికలను ఆంధ్రదేశమునందలి గ్రంథాలయము లన్నిటికిని ఉచితముగా దయచేయవలెనని ఈసభవారు ప్రభుత్వమువారిని ప్రార్థించుచున్నారు.

(ప) ఆంధ్రదేశమధ్యమున అనుకూలమైన స్థలమందు, ఆంధ్రభాషయందు ప్రచురింపబడు గ్రంథములన్నిటిని పత్రికలన్నిటిని చెన్నపట్టణ ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమందలి ఇతర అముద్రితగ్రంథప్రతులన్నిటి జేర్చి, ఆంధ్రదేశమందలి ఇతర గ్రంథాలయములకు సహాయభూతముగ నుండునటుల గ్రంథాలయము నొకదానిని ప్రభుత్వమువారు నెలకొల్పుట అత్యావశ్యకము. కనుక అట్టి గ్రంథాలయమును త్వరలో స్థాపించుటకు ప్రభుత్వమువారిని ఈసభవారు ప్రార్థించుచున్నారు.

(గ) విద్యాశాఖకు సంబంధించిన ఉద్యోగస్థుల దగ్గర ఉండునట్టి మాజిక్కులాంతరు మొదలగు పరికరములను, జనసామాన్యమునందు విద్యాభివృద్ధిని చేయుటకై గ్రంథాలయములకు ఎరవిచ్చు ఏర్పాటులను చేయుటకై ప్రభుత్వమువారిని ఈసభవారు ప్రార్థించుచున్నారు.

౩ (క) ఆంధ్రదేశమందంతటను గ్రంథాలయోద్యమమును వ్యాపింపజేయుటకై సంచారకార్యదర్శి నేర్పాటుచేయుటకు కావలసిన ద్రవ్యమును సమకూర్చుటకు సహాయపడెదరని ఈసభవారు జనులనందఱిని ప్రార్థించుచున్నారు.

(చ) ఆంధ్రదేశము నందున్న అన్నిపట్టణముల యందును పల్లెలయందునుగూడ గ్రంథాలయములనుగాని పఠనమందిరములనుగాని స్థాపింపవలెనని జనుల నీ సభవారు ప్రార్థించుచున్నారు.

(ట) ప్రతిగ్రంథాలయమును తాము గతవత్సరమునందు చేసిన పనిని నివేదించుటకును, ముందు చేయబూనుకొన్న పనిని గూర్చి ప్రస్తావనచేయుటకును, జనసామాన్యమునకు సంఘోద్దేశములను తెలియజేయుటకును గాను సంవత్సరోత్సవములను జరుపుటకును, ఆసమయమున జదువబడిన కార్యనివేదనమును ఈసంఘముయొక్క కార్యదర్శులకు పంపుటకును గ్రంథాలయసంఘములను ఈసభవారు కోరుచున్నారు.

(త) ఆంధ్రదేశమునందున్న గ్రంథాలయములన్నియు "గ్రంథాలయసర్వస్వము"ను తెప్పించుకొనవలెనని ఈసభవారు తీర్మానించుచున్నారు.

(ప) ప్రతినిధుల కట్నములవలన వసూలు అయిన సొమ్మును సంచారకార్యదర్శియొక్క ఖర్చులకొఱకును ఇతర ఖర్చులకొఱకును ఈసభవారిచే నేర్పఱుపఁబడిన గ్రంథాలయ సంఘమునకు ఇచ్చుటకు ఈసభవారు తీర్మానించుచున్నారు.

౪ గ్రంథాలయములకై విశేషముగ సహాయము

తృతీయ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ, నెల్లూరు.

3౬-A



ఆహ్వానసంఘాధ్యక్షులగు

మైదవోలు చెంగయ్యగారు, బి.ఏ., బి.యల్.



అగ్రాసనాధిపతులగు

కాశినాథుని నాగేశ్వరరావుగారు.

తృతీయ ఆంధ్రదేశ గ్రంథాలయసభ, నెల్లూరు.



వివిధ గ్రామములనుండి విచ్చేసిన ప్రతినిధులు.

చేయుచున్న కాతా సూర్యనారాయణరావు, గొడ్డపాటి వేంకటప్పయ్య, ఎల్లేపెద్ది జానికిరామయ్య, కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి, కుప్పా శ్రీరామశర్మ, కొత్తా వెంకయ్యగారికుమారుడు సంగయ్య, అనుగూరి సుబ్బారాయుడు, పొణకా సుబ్బరామిరెడ్డి, శ్రీజగన్నాథపాడిఖడం, సోంభొట్ల వెంకయ్య, పొన్నలూరి రాఘవయ్య గార్లకు ఈసభవారు వందనము లాచరించుచున్నారు. ఈ రీతిగనే ద్రవ్యాధికులందరును గ్రంథాలయములకు విరివిగా సహాయము చేయుదురని ప్రార్థించుచున్నారు.

౫ ఆంధ్రదేశ గ్రంథభాండాగార సంఘమునకు ఈసంవత్సరము ఈదిగువను ఉదహరింపబడిన వారును ఇంకను నలుబదిమూడుగురును కార్యనిర్వాహక సభ్యులుగ నెన్నుకొనబడిరి.

అగ్రాసనాధిపతి:— మోచర్ల రామచంద్రరావుగారు

ఉపాగ్రాసనాధిపతులు:— ౧ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు. ౨ సూరి వేంకటనరసింహంగారు. 3 నెమలి సుబ్బారావుగారు.

కార్యదర్శి:— అయ్యంకి వేంకటరమణయ్యగారు.

సహాయకార్యదర్శులు:— ౧ పురాణం సూరిశాస్త్రులుగారు. బి. ఏ. ౨ అవసరాల వేంకటరెడ్డిపంతులు గారు.

తీర్మానము లన్నియు ముగిసిన తరువాత చిత్తూరు నివాసులు బి. నరసింహారావుగారు, రాయూరునివాసులు చిగురుపాటి సుబ్బారావుగారు, గ్రంథాలయ నిర్వహణావశ్యకతను గురించి మాటలాడిరి. ఆంధ్రదేశగ్రంథాలయసంఘ కార్యదర్శులు అయ్యంకి వేంకటరమణయ్యగారు గత సాంవత్సరిక కార్యనివేదనమును చదివిరి. అందు గత వర్షమున దేశములో ఎటుల గ్రంథాలయోద్యమము వ్యాపించినదియు, దానికొరకు వ్యయముచేసిన ద్రవ్యము మున్నగు విషయములను చెప్పిరి. గతసంవత్సరమునందు చిలకమర్తి లక్ష్మీనరసింహము పంతులుగారు, ఒంగోలు తాలూకాలో ఎం. వి. ఎస్. శర్మగారు, భాండాగారోద్యమమునకు పాటుపడుచు నూతనగ్రంథాలయముల నెలకొల్పుచున్నందులకు వందనముల నర్పించిరి.

రాబోవు సంవత్సరము ఈమహాజనసభ, ఒంగోలు, తెనాలి, బారువలలో జరుపబడుటకు ఆయాతాలూకాలనుండి వచ్చిన ప్రతినిధులు పొన్నలూరి రాఘవయ్య ఎం. వి. ఎస్. శర్మగార్లు, కుప్పా శ్రీరామశర్మ- సత్తెనపల్లి హనుమంతరావుగార్లు, శ్రీజగన్నాథపాడిసుదం- తిత్తి బలరామయ్యగార్లు ఆహ్వానముచేసిరి. కాని గంజాం మండలమందున్న 'బారువ' నుండి చేయబడిన ఆహ్వానమునే సభ్యులెల్లరు అంగీకరించిరి.

అంతట అధ్యక్షులు గ్రంథాలయోద్యమప్రచారమును గూర్చి కొంతవరకు జెప్పి సభను ముగించిరి.

తదనంతరము శ్రీమైనవోలు చెంగయ్యగారు ఆహ్వానసంఘపక్షమున అధ్యక్షులకు ప్రతినిధులకు వందనములర్పించి, నెల్లూరులోని గోక్లేయువజనసంఘసభ్యులు స్వచ్ఛందసేవకులుగానుండి, సభను జయప్రదముగా జరుపుటకు సహాయ పడినందులకు శ్లాఘించిరి.

## గ్రంథాలయోద్యమము

సీ. అక్షరజ్ఞులకెల్ల ♦ యమితజ్ఞానంబిచ్చి - సతతంబుకాపాడు ♦ సంస్థయగుచు
అఖిలమత్యవిహీను ♦ లాంధ్రులంచనుదూరు - బాపగాజేయు స్వ ♦ రూపమగుచు
విలువయౌకాలము ♦ వ్యర్థమైపోకుండ - సత్కథాలాపనల్ ♦ జలుపదగుచు
స్వీయమై దేశిక ♦ చిత్రవార్తలదెల్పు పత్రికాళిని జేర్చ ♦ పాత్రమగుచు
తే. గీ. దేశమర్థింపదగిన దె ♦ ద్దేనియున్న - వానినన్నిటి సమకూర్చ ♦ వలయుననుచు
స్వీయజనులకు బోధనల్ ♦ జేయుచుండు ఆంధ్రగ్రంథాలయోద్యమం ♦ బధికమగుత.

—సత్తెనపల్లి హనుమంతరావు.

# నాచన సోమనాథుఁడు.

ఈ కవినిగూర్చి పలువురు చరిత్రకారులు ప్రకటించిన విషయములను ఖండించుచు ౧౯౧౩, ౧౯౧౪ సంవత్సరములయందు "సువర్ణలేఖ" పత్రికయందును, ౧౯౧౫ సంవత్సరమున గ్రంథాలయసర్వస్వము నందును వ్యాసములను వ్రాసితిని. శ్రీచిలుకూరి వీరభద్రరావు పంతులుగారు ఆంధ్రుల చరిత్ర మూఁడవ భాగమునం దీ కవిని గురించి వ్రాయుచు నేను ఖండించిన 3, 4 విషయములలో మూఁడు విషయములఁ (అనఁగా ౧ కాలము ౨ కులము 3 తండ్రిపేరులను గూర్చి నేను వ్రాసిన విషయముల) జల్లగ నంగీకరించి, కాలము విషయములో సగము నా వాదమున కనుకూలముగ మలుచుచు వారి లేఖినికి స్వభావమగు నించుక యావేశముతో నా వ్యాసమును ముగించిరి. ఒక మహాకవిని గురించిన మూఁడు ముఖ్యవిషయములం దొక్కప్రసిద్ధి వడసిన చరిత్రకారుని కనుకూలములగు విషయములను గనిపెట్టి చూపితిననియు, నా కష్టము వృథకాలేదనియు సంతసించుచున్నాను.

నాచన సోముఁడు శంభుదాసునకుఁ బిమ్మటివాఁడను వాదము పూర్తిగాఁ బోయినను, సమకాలీనుని స్థానమునకు దిగుట కంగీకరించినను, సోముఁ డెఱ్ఱాప్రెగ్గడ హరివంశము జూచిన పిమ్మట నది ప్రౌఢముగ లేదని తా నొక నూతన హరివంశమును బ్రకటించెనను నపవాద మా మహాకవిపై వేయుచున్నారు. నాచన సోముడు మహాకవియని యంగీకరించి శ్రీ వీరభద్రరావుగారే, యేమి వ్రాయుచు[illegible] చూడుఁడు.

"'శ్రీమత్సకల భాషాభూషణ రసపోషణ సంవిధానచక్రవర్తి' యగు సోముఁడు బుక్కరాయనిచే సన్మానింపఁబడెను." (మరి రెండు పంక్తులయిన ముగియకుండ స్వవచన వ్యాఘాతముగ శ్రీ వీ॥ రావుగారు వ్రాయునది చూడుఁడు.) "ఎఱ్ఱాప్రెగడయును నాచన సోముఁడును సమకాలికులు గావున నుభయులలో నెవరి గ్రంథము ముందు రచింపఁబడినదో చెప్పుట సాధ్యముకాదు. కాని యెఱ్ఱాప్రెగడ విరచితమైన హరివంశమును విన్న మీఁదట నది ప్రౌఢముగ లేదను తలంపుతో నుత్తరహరివంశమును వ్రాసెనని యూహించుటకు గద్యములో "శ్రీమత్సకల భాషాభూషణ రసపోషణ సంవిధానచక్రవర్తి" అని పెట్టుకొన్న పెద్దబిరుదములే యవకాశ మిచ్చుచున్నవి."

(ఆంధ్రుల చరిత్ర. 3 భా. 340 పుట.)

సంవిధాన చక్రవర్తియగుటచేతనే బుక్కరాయఁడు సన్మానించెననిరి. మరల నాతఁడవి పెట్టుకొనిన (డంబముకొఱకు?) పెద్దపేరు లనిరి. ఆమాటలక్రింద నే మరల "నాచన సోమనాథుని కవిత్వము మిక్కిలి ప్రౌఢమైనది. ఈ మహాకవి కవిత్వ పటుత్వ సంపదనుబట్టి యీతనికి సర్వజ్ఞుఁడని బిరుదుపేరు వచ్చినది" అని వ్రాసి సోముని మహాకవిత్వ స్థానము నంగీకరించిరి. సర్వజ్ఞనకవి పెద్దపేరులా? ఇట్లు వ్రాయుటకుఁగల కారణ మేమియో నాకు దురూహ్యముగనున్నది.

"గ్రంథాలయ సర్వస్వముయొక్క ప్రథమ సంచికలో నెఱ్ఱాప్రెగ్గడకంటె నాచన సోముఁడు పూర్వికుఁడని నామిత్రులగు వంగూరి సుబ్బారావుగారు ప్రయత్నించిరి. కాని వారి ప్రయాసమంతయును వ్యర్థము." అనియు "నాచనసోముఁడు శంభుదాసునికంటెఁ బూర్వుఁడని వాదింపఁ దివురుట నేలవిడిచి సాముచేయుటవంటిది." అనియు శ్రీ వీరభద్రరావుగారనుచున్నారు.

నేలవిడిచిన సాము నాదియో వారిదియో తెలియుటకై రెండు విషయముల మాత్రము చూపుచున్నాను. ఒకసారి శ్రీమానవల్లి రామకృష్ణకవిగారును వీరభద్రరావుగారును కూడ సోముఁడు పూర్వుఁడును, శంభుదాసుఁడు ఆతనితరువాతివాఁడునై యుండవలెనని యంగీకరించియున్నారు. అవి మాటలు; ఆధారములు కాఁజాలక పోవచ్చును. ఇవి వ్రాతలు; కావున నంచి యాధారములతోనే సోమునికి జరుగవలసిన న్యాయ మొనరింతము.

క్రీ॥ శ॥ ౧3౨3లో ప్రతాపరుద్రుని రాజ్య మంతరించినది. ఆపిమ్మట నాతని సేనాధిపతి ప్రోలయ విను

కొండలోను, కోశాధ్యక్షుఁడగు బుక్కరాయలు విజయనగరములోను స్వతంత్రులై రాజ్యముల స్థాపించిరి. ఇందు నాచన సోముఁడు బుక్కరాయలవలన నగ్రహారం బొందెను. శంభుదాసు ప్రోలయకుఁ బిమ్మట వచ్చిన యనవేముని కడ గవి. వన మొక్క నివిషము కలహములతో నిండియున్న సంశయాస్పదములగు సంవత్సరములను విడిచి సరిగఁ బరిశీలింతము. ఈయనవేముఁడు ప్రోలయకుఁ బిమ్మట రాజ్య మొసరించినట్లు నమ్మఁటకు వీలు లేకున్నది. ఈసంగతి చూడుఁడు.

"ప్రతాపరుద్రునితో కాకతీయరాజ్యము సాంతమైనది. తురుష్కులు ప్రతాపరుద్రుని జయించి యాలనిదేశములోఁ గొంతిభాగము నాక్రమించుకొనిరి. దూరదేశముల నాయా నాయకు లాక్రమించి స్వతంత్రముగా బాలింప సాగిరి. వారిలో ప్రోలయనాయకుఁ డొక్కఁడు. † అతఁడు గతించిన పిదప నాదేశమును కాపయ యను నాయకుఁడు పరిపాలించెనట. అతనిక్రింద డెబ్బదియైదుగురు నాయకు లుండినట్లును, కాపయనాయకుని యనంతరము వారాతని దేశమును విభజించుకొని స్వాధీన పఱచుకొనినట్లును, వారిలో కొండవీటి రెడ్డిరాజులకు వంశకర్తయగు వేమారెడ్డి ‡ యొక్కఁడనియు నీ శాసనమువలనఁ దెలియుచున్నది." * (అని తల్లి కలువచేఱు శాసనము.) కాబట్టి సోముఁడు, హరివంశకృతిపతి యగు వేమారెడ్డి కొకటి రెండు తరములపైనున్న ప్రోలయతో సమకాలీనుఁడు కాని శంభుదాసునితోఁ గాఁడు.

ఇదియిట్లుండ సోముఁడేరచియించిన 'వసంతవిలాసము' మేచకనాయకునకుఁ గృతియీయఁబడినట్లును, ఆగ్రంథము తనకు దొరకినట్లను, శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు వీరభద్రరావుగారుండఁగాఁ జెప్పియున్నారు. ఆమేచకనాయకుఁడు ప్రతాపరుద్రునికాలీనుఁడగు మార్కండేయపురాణ కృతిపతికి మాతామహుఁడు. గణపతిదేవుని తలవరి. వసంతవిలాస కృతిపతి యీమేచకనాయకుఁడైనను, అతని కొడుకైనను, మేచన సోమనలు తిక్కన శిష్యుఁడగు మారనతో సమకాలికులై యుండవచ్చును. అనఁగా నించుమించుగా ౧౨౯౦ వఱకును జీవించియున్న తిక్కనసోమయాజికి దగ్గఱివారు. ౧౩౪౪ క్రీ॥ శ॥ లో సోముఁడగ్రహారమునే పొందెనని వీరభద్రరావుగారె చెప్పుచున్నారు. కావున సోముఁడు రమారమి ౧౨౮౦–౧౩౪౪ క్రీ॥ శ॥ లలోనుండి బహుశః నే నిదివఱకూహించినట్లు తిక్కన సోమయాజి శిష్యుఁడుగాఁగూడనుండియుండవచ్చును. మారనసహాధ్యాయి! కాని శంభుదాసు హరివంశమును జూచి వ్రాయవలసినంత తరువాతవాఁడు కాఁడని కనపడుచున్నది. గణపతిదేవుని కాలములోనున్న (తిక్కనతో సమకాలికుఁడగు) తలవరికిఁగాని యాతలవరి కొడుకగు మేచకనాయకునికిఁగాని వసంతవిలాసమును గృతినిచ్చిన నాచనసోముఁడు, శంభుదాసుని హరివంశము నెట్లుచూడఁ గలఁడో తెలియకున్నది. హరివంశము కృతిభర్తయగు వేమారెడ్డి కాలముకూడ నాకు సందేహముగనే యున్నది. అది నే నింకను బరిశీలింపవలసి యున్నది. ఏవేమారెడ్డి హరివంశకృతిభర్తయో నా కింకను సరిగ తెలియలేదు. అనవేమారెడ్లు చాలమంది కలరు. హరివంశకృతిభర్త ప్రోలయ వేముడా? పోలయ వేముఁడా? చూడవలసియున్నది. భావి పరిశోధనమునఁ జరిత్రకారు లింకను సంగతుల వెలిపుచ్చెదరని నమ్ముచున్నాను.

పర్యవసానమున నేఁ జెప్పిన దేమనఁగా బుక్కరాయలు విద్యారణ్యుని వంటి మహాత్ముని యూహననుసరించి విద్యానగర సింహాసనస్థుఁడై యిచ్చిన యగ్రహారము సోముని ప్రౌఢకవిత్వమును జెప్పఁగల వృద్ధాప్యమునఁగాని కాఁజాలదు. అనవేమారెడ్డి ప్రోలయవేముఁడైనను, తనయనుజనుజులకు రాజ్యమును బంచియిచ్చినపిమ్మట శంభుదాసు (బహుశః) వేమారెడ్డి వృద్ధాప్యమున నుండినందునను, అప్పటికి శంభుదాసొక్క రామాయణమును మాత్రమే రచించినట్లుండుట వలనను శంభుదాసు పడుచువాఁడైయుండి పిమ్మటనే నృసింహపురాణాదుల వ్రాసియుండును. కాన సూక్ష్మదృష్టితోఁ జూచినవారు సోమన శంభుదాసుల కొక్క

† వీరిలో బుక్కరాయలుకూడ నొకఁడు. ఈబుక్కరాయలవలననే సోముఁడగ్రహారము నొందెను. అనఁగా సోముఁడు ప్రోలయకు సమకాలికుఁడు. ఈ ప్రోలయపిమ్మట కొన్నిసంవత్సరములకుఁ బిమ్మటనున్న వేమారెడ్డి యంత్యదినములలో నన్నవాఁడు శంభుదాసు. అట్టి శంభుదాసు సోమునికిఁ బూర్వుఁడా? ఆ హరివంశమును సోముఁడు చూచెనా?

‡ ఈవేమారెడ్డియే హరివంశకృతిపతియని వీరభద్రరావుగారు చూపియున్నారు. అది సరియైనను వేమారెడ్డి పై ప్రోలయ సమకాలికుఁడైన బుక్కరాయనితో సమకాలికుఁడెట్లగును? ఇదియింకను విచారణీయము. ఈయాధారమును బట్టి శంభుదాసులు సమకాలికులైయున్నను సోముఁడే వృద్ధుఁడై పూర్వుఁడై యుండవలసినట్లు కనుపట్టుచున్నది.

* ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక 2 వ వాల్యూం. 99 వ పేజీ.

లరమైన భేద ముండితీరవలెనని యంగీకరింపక లిప్పుడు. సోమన శంభుదాసులలో సోమన వృద్ధుఁడనియు నాఁ జెఱువరు లిప్పటి కంగీకరింపక పోరు. అంతేకాని సోముఁడు శంభుదాసునకుఁ బిమ్మట ౨౦, 3౦ సంవత్సరముల లో నున్నవాఁడు కాఁడని స్థిరపడు చున్నది. శంభుదాసుని హరివంశమును చూచి సోముఁడు తన గ్రంథమును వ్రాయలేదనుటకీ వాదము చాలును.

—వంగూరి సుబ్బారావు

---

# మేఘము

శా. ఆకాశంబున జీబుకాఁడె సొగసై ◆ యాషాఢయోషానితం
బాకీర్ణాలకజాలకంబులన ◆ పాయల్ పాయలై మేఘముల్,
రాకాచంద్రవిలాసముల్ ముసుఁగువా ◆ ఱన్ నైల్యమాల్యంబులై
ప్రాకెన్ జీకటి చెట్ల పోయగపు పూ ◆ రంగుల్ దిశాంతమ్ములన్.

సీ. చినుకుచిన్కునకుఁ జీలిన చిన్ని రేకుల-తోడ, పద్మంబు లల్లాడఁ దొడఁగె
ధారధారకు మాపుతగిలిన చిగురుల-తోడ, కొమ్మలు సొంపులొడఁగడఁగె
జల్లుజల్లునకుఁ దృష్ణలు నల్లు తీయమ్మ-తోడ, చాతకము లుత్సాడసాగె
ఉరుమురుమునకు నంకురమైన మొలకల-తోడ, వేణువులు తూగాడనయ్యె

గీ. ఖేదమును మోద మవనికి ◆ గిలుకొలిపి - ప్రౌఢవయి నటియింతు వాషాఢలక్ష్మి!
పల్కలేక ప్రాల్మాలు నా ◆ నాల్కగూడ - క్రొత్త చక్కిలిగింతల ◆ గుస్తరింప.

ఉ. ఎండిన బీళ్ళయందు నుదయించిన పచ్చిక కండ్లపండువై
యుండగ చూడియాలు తలలూపుచుఁ బోయెడి, క్రొత్తనీటిచే
నిండెఁ దటాకగర్భములు ◆ నిష్కుటముల్ కడు శ్యామలంబులై
మెండుకొనెన్ వనిన్, మొగిలు ◆ మేసెఁ బ్రభాతములందుఁ గొండలన్.

శా. నీడల్ గట్టఁగ భూమియందు, చదలన్ ◆ ప్రేలాడు కాదంబినీ
చూడా కృష్ణకలాపగుచ్ఛములపైఁ ◆ జూడ్కుల్ కటాక్షించి, లీ
లాన్దోలాసుఖలాలసీయరతి పోలన్ సాగె నృత్యోత్సవ
క్రీడోన్మాదములై మయూరములు సారెన్ పింఛముల్ విప్పుచున్.

గీ. కడలిమూలలనుండి పిక్కటిల లేచి - బొబ్బరిల్లుచు మబ్బులు ◆ పోవసాగె,
గుబ్బెతలు చిత్తచపలత ◆ గుబ్బటిల్ల - చల్లని మిథఃకలాపముల్ ◆ చదువుకొనుచు.

చ. నఱకులుగొట్టు చీలు రతనాల మహోజ్జ్వలగర్భదీప్తి వి
స్ఫురణలు నాదెసల్ పగిలిపోవ నభఃఖని గ్రక్కె, తివె క్రొ
మ్మెఱుపులు, మూడువన్నియల ◆ మేఖలమాదిరి దిక్తటీమనో
హరమయి యింద్రచాప మరయన్ సొగసయ్యెను సందెవేళలన్.

—రాయప్రోలు సుబ్బారావు

# గ్రంథాలయములు-బరోడా రాజ్యము

అభివృద్ధిని రూపుమాపునది అజ్ఞానము. అట్టి అజ్ఞానమును జనులనుండి పారదోలుటకై బరోడాసంస్థానాధీశుడు అనేకములగు నూతనమార్పులను తనరాజ్యమునందు ప్రవేశపెట్టియున్నాడు. అట్టి మహత్కార్యములయందు సార్వజనిక గ్రంథాలయ స్థాపనమొకటి; ఈగ్రంథాలయోద్యమ విషయమై వారు చేసిన ప్రయత్నములన్నియు విజయముగాంచి ఫలప్రదములై విలసిల్లినవి. గ్రంథాలయోద్యమము ఆరాజ్యమునందెంత విరివిగ వ్యాపించియున్నదో ఈక్రింది సంగతులవలన విశదముకాగలదు

౧౯౧౦ వ సంవత్సరమున ఆసంస్థానమున చందాలచే పోషింపబడు గ్రంథాలయములు ౧౭౭ మాత్రమే యుండెను. కాని ౧౯౧౯ వ సంవత్సరము జూలై నెలాఖరునకు 3౭౯ గ్రామగ్రంథాలయములును, 3౯ పట్టణ గ్రంథాలయములును, 3 జిల్లా గ్రంథాలయములును, బరోడాలో నొక కేంద్ర గ్రంథాగారమును నుండెను. వీటిలో ౨,౧౦,౦౦౦ల పుస్తకములు కలవు. ౧౯౧౮ వ సంవత్సరమున పాఠకులచే చదువబడినపుస్తకములు ౨,౨౦,౦౦౦ లకు పైగా నుండెను. బరోడా సంస్థానముయొక్క జనసంఖ్య ౨౦ లక్షలు మాత్రమే యనియు, ౪,౦౦౦ కన్న నెక్కువ జనసంఖ్య గలిగినపట్టణములు 3౯ యనియు, ౧,౦౦౦ కంటెకన్న నెక్కువజనసంఖ్య కలిగిన గ్రామములు ౪౭౬ యనియు స్మరణకు దెచ్చుకొనినప్పుడే గ్రంథభాండాగారములవిషయమునవైనోసంగబడిన యంకెల విలువ పూర్తిగ దెలియగలదు.

ఆ సంస్థానమునందలి గ్రంథాలయము లీక్రింది సూత్రముల ననుసరించి నడుపబడుచున్నవి:— "గ్రంథాలయమున గ్రంథములయొక్క గిడ్డంగికాదు; కావలసినవారికెల్ల గ్రంథములందుబాటునందుండునటుల సకల ప్రయత్నములను చేయునదియు, కావలసినవారికెల్ల గ్రంథముల ఆవశ్యకతను గ్రహించి వాటినిచదువునటుల చేయునదియు మాత్రము గ్రంథాలయమని పిలువదగియుండును. గ్రంథాలయమునకు తమంతటతాము వచ్చువారికి మాత్రమే ఉపయోగకరమై యుండుటతో తృప్తినిజెందక, ఆగ్రామమునగల జనులందరకును సేవజేయుటయే సార్వజనిక గ్రంథాలయముయొక్క విస్పష్టధర్మమైయున్నది. గ్రంథాలయమునందున్న ప్రతిగ్రంథమునకు ఒక్క చదువరినైన సంపాదింపవలెను; గ్రామమందున్న ప్రతిమనుజునకును కావలసిన ఒక్కగ్రంథమునైన సేకరించి పెట్టవలెను; ఇంతేగాక చదువరికి తగిన గ్రంథమును, గ్రంథమునకు తగిన చదువరిని సమకూర్చుచుండవలెను. ఈ యుద్దేశములు నెరవేరుటకుగాను అనేకమార్గముల నవలంభింపవలెను; గ్రంథములను గృహములకు ఎరువియ్యవలెను; అలమారులదగ్గరకు జనులు ధారాళముగాపోయి గ్రంథములను తామకొనుటకు వీలుండవలెను; గ్రంథాలయభవనము ఆకర్షకముగ నుండవలెను; పిల్లలును, స్త్రీలును చదువుకొనుటకు ప్రత్యేకముగ గదులుండవలెను; పాఠశాలలతో సంబంధమును కలుగజేసికొని విద్యార్థులనాకర్షింపవలెను. వివిధప్రదేశములయందున్న గ్రంథాలయములు తమదగ్గరఉండనట్టిఉద్గ్రంథములనెల్ల సోదరగ్రంథాలయములకు ఎరువిచ్చుచుండవలెను; అన్నితరగతుల జనులకును సౌకర్యముగ నుండునటుల గ్రంథాలయమును ఎక్కువకాలము తెరచియుంచవలెను; గ్రంథములపట్టికలను మిక్కిలి ఉపయోగకరముగ నుండునటుల తయారు చేయవలయును; శాఖాసంఘములను, సంచారగ్రంథాలయములను, కుటుంబపుస్తకాలయములను అభివృద్ధిపరుపవలెను; ఉపన్యాసముల మూలమునను, ప్రదర్శనముల మూలమునను, ఇతరభాషలయందున్న గ్రంథములను దేశభాషలలో బోధించుటవలనను, జనుల మనస్సులను రంజింపజేయవలెను"

ఈక్రిందవ్రాయబడిన సంగతులవలన సంపూర్ణ సార్వజనిక గ్రంథాలయముయొక్క లక్షణములు చదువరులకు బోధపడగలవు. బరోడాపట్టణమునందలి పౌరులందరును కేంద్రగ్రంథాలయమునకు పోయి తమయిచ్చవచ్చిన పుస్తకము నేరుకొని, చదువుకొనిన నచ్చట చదు

పుకొనవచ్చును; లేదా తీయబడిన నింట చదువుకొనుటకు తీసికొనిపోవచ్చును ఒకవేళ, గ్రంథభాండాగారికుడు గాని ఆగ్రంథాలయము యొక్క ఉద్యోగులలో నెవరైనగాని, పుస్తకము తీసికొనిపోగోరువాని నెరుంగక పోవచ్చును అప్పుడాతడు తానెఱిగినవారిలో గౌరవనీయులగువారిపేరు జెప్పి, తన సరియైన చిరునామాయిచ్చి, వృత్తి నివేదించి, గ్రంథమును తీసికొని పోవచ్చును. బరోడా సంస్థానమున రు ౪౦లకు తక్కువగాని జీతమును సంపాదించుకొనుచున్న యుద్యోగిగాని, ఆసంస్థానమున భూమికలవాడుగాని, ఆదాయపుపన్ను చెల్లించువాడుగాని, లేక గ్రంథభాండాగారికి నమ్మకముగల ఆసంస్థానమందున్న సరియెవ్వరుగాని, గ్రంథము వేసుకొనిపోవువాడా గ్రంథమునకు నష్టము కలుగజేయడని పూచీగనుండిన చాలును; ఎవ్వరైన ఏగ్రంథమునైన తీసుకొని పోవచ్చును. నిఘంటువులు ఆదిగాగలవియును, అమూల్యములును అపూర్వములునునగు గ్రంథములు మాత్రము గృహములకు ఇయ్యబడవు. చదువరులు చదువుకొనుటయందు కొద్దిగ పుస్తకములు నలిగిపోయినను అధికారులు జూచియు చూడనట్లు ఊరకుండెదరు. ఈవిధముగ పని జేయుచున్నను ఇంతవఱకుపోయిన గ్రంథములుబహుస్వల్పము;జనులయందు చెడుహృదయము కలవారు ఎల్లెడలను నిండియున్నప్పటికిని, గ్రంథాలయము నలంకరించు వారియందు మాత్రము అట్టివారి సంఖ్య మిక్కిలి స్వల్పమని దీనివలన తేలుచున్నది.

నూతన విధానము ననుసరించి ఏర్పడిన గ్రంథాలయములన్నియు సర్వజనులకు ఉచితములై యున్నవి. ఆ రాష్ట్రమునందలి గ్రంథాలయములన్నియు గ్రామగ్రంథాలయములు, పట్టణగ్రంథాలయములు, మండల గ్రంథాలయములు, కేంద్రగ్రంథాలయములు— అని నాలుగు విధములుగ భాగింపబడియున్నవి.

కేంద్ర గ్రంథాలయము మిగిలిన గ్రంథాలయముల కన్నిటికి మార్గదర్శియై హితము నాపునదియై స్నేహితునివలె పనిచేయును. మండలమునందుగల యన్నిగ్రంథాలయములను మండల గ్రంథాలయము తనిఖీ చేయుచుండును. కొన్ని కొన్ని పట్టణ గ్రంథాలయములుగూడ తమ చుట్టుప్రక్కల గ్రామములందున్న గ్రంథాలయములను తనిఖీ చేయుచుండును. ప్రతి పుస్తక భాండాగారుడు మూడు నెలల కొక పర్యాయము తన పనిని తెలియజేయు నివేదికను కేంద్రగ్రంథాలయాధికారి కంపుచుండును. గ్రంథాలయములు లేని గ్రామములలో ప్రజలు పుస్తకములు కావలెనను వాంఛను దెలియజేసినయెడల, సంచరత్పుస్తకభాండాగారపద్ధతి ననుసరించి గ్రంథములను కేంద్రగ్రంథాలయాధికారి ఆయా గ్రామముల కంపుచుండును. సంచరత్పుస్తకభాండాగారమున నొక్కొక్క తరి, సాధారణముగ గ్రామస్థుల రుచుల కనుగుణ్యముగ నుండునటుల జాగ్రతగా నాలోచించి దిట్టమైన పెట్టెలలో 30 పుస్తకములనుంచి కట్టుదిట్టముగ గట్టి పంపుచుండును. ఆపుస్తకములు ౯౦ దినముల వఱకు పాఠకులతో నుండవచ్చును. అటు పిమ్మట తమ గ్రామమునందున్న కాలమున ఎన్నిగ్రంథములు గ్రామస్థుల కొసంగబడినవో, ఏవిధములగు గ్రంథములను జదివిరో, ఎంతమంది జనులు చదివిరో—ఈ విషయములను తెలియజేయు నివేదికతో, కేంద్రగ్రంథాలయాధికారికి ఆగ్రంథముల పెట్టెనంపివేయవలెను; ఉపయోగింపబడిన గ్రంథముల ననుసరించి, తిరిగి గ్రామస్థులకు వారి రుచుల కనుగుణ్యములైన గ్రంథముల పెట్టెలను పంపుచుండెదరు.

గ్రంథాలయము లన్నియు సంస్థానప్రభుత్వము వారి సహాయమువలనను, చందాలమూలమునను స్థానిక సంఘముల విరాళముల మూలమునను పోషింపబడుచున్నవి. ఈగ్రంథాలయములు స్థాపించుటయందలి సూత్రమేమనగా గ్రామస్థులెంతయో కొంతసొమ్మును స్వయముగ తాము పోగుచేసికొనినచో అంతసొమ్మునే ప్రభుత్వమువారును, స్థానిక పంచాయితివారును విడివిడిగ సాహాయ్యార్థ మిచ్చెదరు. ఒక గ్రామమున గ్రంథాలయము నొకదానిని స్థాపించవలెనన్న, ఆగ్రామస్థులు సంవత్సరమున కొకయేబది రూపాయలు వసూలు చేసిన చాలును. అప్పుడు స్థానిక పంచాయతివారును, ప్రభుత్వము వారును యిచ్చిన సొమ్ముతో అది రు ౧౫౦ లగును. ఈ మొత్తములో నూటికిరువదియైదు రూపాయలకు మించని సొమ్మును పుస్తకములకొఱకును, నూటికి ముప్పదిరూపాయలకు మించని సొమ్మును పత్రికల కొఱకును, నూటికిరువదియైదు రూపాయలకు మించని సొమ్మును గ్రంథాల

నుభవనమున కియ్యవలసిన యద్దెకును సాంగ్రికిని వ్యయపఱచుటకు గ్రామస్థుల కధికారము గలదు. పుస్తకములను గొనుటలో కేంద్రగ్రంథాలయము అమూల్యసాగు సహాయము చేయగలదు. ఏ గ్రంథాలయమైనను రు ౨౫ లను పంపిన, రు ౧౦౦ ల విలువగల గ్రంథములను కేంద్రగ్రంథాలయము వారా గ్రంథాలయమునకు సప్లయి చేయుదురు. ప్రతిగ్రామ గ్రంథాలయమును చందాదారులచే నెన్నుకొనబడిన యొకసంఘముచే పరిపాలింప బడుచుండును. పాఠశాలోపాధ్యాయుడు దానికి భాండాగారికుడుగ నుండును.

ఈ విధముననే పట్టణమున గ్రంథాలయమును స్థాపించవలెనన్న పట్టణవాసులు సంవత్సరమునకు రు 300 లను ప్రోగుచేయవలసి యుందురు. ఈమొత్తము ప్రభుత్వమువారి సహాయము మూలమునను, మ్యూనిసిపాలిటీవారి సహాయము మూలమునను మూడింతలగును. పట్టణపుస్తకభాండారమును సండలగ్రంథాలయముతో సమానముగ జేయవలయునన్న రు 200 లను పట్టణవాసులు ప్రోగుచేయవలసి యుందురు. ఏగ్రంథాలయమైన భవనమును నిర్మింప దలచుకొన్నయెడల, ఇదేవిధమున మూడవ వంతు సొమ్మును ప్రోగుజేసిన, మిగిలిన రెండు వంతుల సొమ్మును ప్రభుత్వమువారు ఇచ్చెదరు. భవనముయొక్క ఆకారమును సదింపు లెక్కను మాత్రము కేంద్రగ్రంథాలయమువారు అంగీకరించవలసియుందురు. గ్రామ గ్రంథాలయ భవనముయొక్క ఖరీదు రమారమి రు ౧,౫౦౦ లుండును. పట్టణగ్రంథాలయ భవనముయొక్క ఖరీదు రు 3,000 ల నుండి రు ౨,౫౦౦ ల వరకును ఉండును. ఇంతవరకును ఆరాష్ట్రమున పదునైదు పట్టణ గ్రంథాలయములకును, తొమ్మిది గ్రామగ్రంథాలయములకును భవనములు నిర్మింపబడినవి. ఇపుడు ఆరు పట్టణగ్రంథాలయములకును, ఆరు గ్రామ గ్రంథాలయములకును భవనములు నిర్మింపబడుచున్నవి.

నిర్బంధ ప్రారంభ విద్యాదానముచే వాసికెక్కిన ఈ సంస్థానాధీశుడు గ్రంథాలయోద్యమమును గూడ లిన రాజ్యమునం దెల్లెడలను పాదుకొల్పి భారతవర్షమునంతకును గూడ మార్గదర్శకుడై రాణించుచున్నాడు.

# విద్య.

## పాశ్చాత్యదేశములవిద్యాస్థితి.

పాశ్చాత్యదేశములలో నెల్ల జర్మనీ దేశమున విద్యావ్యాపన ముత్కృష్టదశయందున్నది. అచ్చట నిర్బంధ విద్యాశాసన బలమున పాఠశాలకు పోదగినవారలలో లెక్క కొక్కడైన విద్యావిహీనుడు కానరాడు. అదేశము సాదర్శముగ నుంచుకొని తక్కిన పాశ్చాత్యదేశములవారు విద్యాభివృద్ధికై నిరంతర కృషి చేయుచున్నారు. మనలను పాలించు నాంగ్లేయులు తమ దేశమున నిర్బంధ విద్యా శాసనమును ౧౮౭౦ సం॥ము మొదలుకొని యచ్చటచ్చటను, ౧౮౮౦ సం॥లో దేశసంతంతటను అమలులోనికి తెచ్చి యున్నారు. అచ్చట ౧౮౭౧ సం॥న పాఠశాలకు పోదగిన వారలు నూటికి ౪3 రు మాత్రము విద్యాగంధముగలవారుండిరి. ౧౮౭౬ లో నాసంఖ్య ౬౬కి హెచ్చినది. ౧౮౯౨ లో లెక్క కొక్కడైన విద్యావిహీనుడు లేడు. కావున ౧౨సం॥లలో నాంగ్లేయ దొరతనమువారు తమ దేశమున విద్యార్థుల యజ్ఞానావరణమును తొలగింపగలిగిరి. అమెరికా సంయుక్త రాష్ట్రములలో ౧౯౧3 సం॥ రాంతమున పాఠశాలకు పోదగిన విద్యార్థుల సంఖ్య ౨౫౪ కోట్లని లెక్కింపబడినది. అందు ౧౮౪ కోట్లు పాఠశాలలందున్నారు. తక్కిన 2 కోట్లు విద్యావాసనలేక యున్నారు. అందువలన నాదేశము విద్యావిషయమున తక్కిన వాటికి వెనుకబడినదని యూహింప గూడదు. ఆ దేశమునకు ప్రతి సంవత్సరము వచ్చు విదేశీయుల సంఖ్య యపారము. ఐరోపాఖండమునందలి రాజ్యముల కట్టియిబ్బంది యెంతమాత్రమును లేదు. అందుచేతనే ఆదేశమున నిరక్షరకుక్షులు కొంతమందరైన ఉండుటకవకాశము కలిగించినది. అచ్చ

ట విద్యావ్యాపనమెట్టి అభివృద్ధి దశయందున్నదియు న్యూయార్కు రాష్ట్రమునకు సంబంధించిన యీక్రింది సంఖ్యలవలన తెలుసుకొనదగును. న్యూయార్కు రాష్ట్రమున ప్రస్తుతము ప్రారంభ విద్యాశాలలు ౧౧౬౪౨.

| | |
|---|---|
| ఉన్నత కళాశాలలు | ౯౪౮ |
| అత్యున్నత కళాశాలలు } సర్వకళాశాలలు | ౩౪ |
| దాదుల పాఠశాలలు | ౩౬ |
| వ్యావసాయిక పాఠశాలలు | ౬౫ |
| హిందూపాఠశాలలు | ౭ |
| వికలాంగుల ,, | ౧౦ |
| ఇతరతరగతి ,, | ౨౧౮ |
| గ్రంథాలయములు | ౫౧౩ |
| మొత్తము | ౧౩౪౭౩ |

కళాశాల లున్నవి. న్యూయార్కు రాష్ట్రము విస్తీర్ణమున మన మూడు జిల్లాలకంటె పెద్దదికాదు. జనసంఖ్య ౯౦ లక్షలు మాత్రము కలరు. అట్టి చిన్నదేశమున గల విద్యాశాలలు విస్తీర్ణమున నంతకంటె నెన్నోవేలరెట్లు పెద్దదియు ౨౩౭ కోట్ల జనసంఖ్య కలిగినట్టియు మన దేశమున లేవు. కావున నచ్చటి విద్యావ్యాపనమును గురించి వేఱుగ జెప్పనే యక్కరలేదు. ఇట్లే ఆస్ట్రియా, డెన్మార్కు, ఫ్రాన్సు, మున్నగు పాశ్చాత్యదేశములను జపానునను విద్యాభివృద్ధికెన్నో యేర్పాట్లు దొరతనమువారిచే చేయబడుచున్నవి. వేయేల! పశ్చిమ ఖండమున నొక్క రషియా తప్ప తక్కిన రాజ్యములయందు విద్యావ్యాపనమున కావంతయైన కొరంత లేదు.

## హిందూదేశవిద్యాస్థితి.

మన మాతృదేశమున ౧౮౫౪ సం॥నకు పూర్వము విద్యాప్రవృత్తికి దొరతనమువారిసహాయమే లేదు. ఆసంవత్సరమున ౯ లక్షల విద్యార్థులు ప్రజలుస్వయంసహాయముచే నిర్మించుకొనిన పాఠశాలలలో చదువుచున్నారు. షుమారు ౨౮ సం॥లైన పిమ్మట ననగా ౧౮౮౨సంవత్సరమున జనసంఖ్య కోట్లకొలది వృద్ధికాగా విద్యార్థుల సంఖ్య ౧౬ లక్షలుమాత్రము పెరిగినది. తరివొక ౨౮ సం॥లైన పిమ్మట ననగా ౧౯౧౦ సం॥న జనసంఖ్య రమారమి ౩౦ కోట్లు వృద్ధికాగా విద్యార్థుల సంఖ్య ౨౦ లక్షలు మాత్రము పెరిగినది. ౧౯౧౦ సం॥ రాంతమునకు విద్యార్థుల సంఖ్య ౮౫ లక్షలైనది. ఈ సంఖ్య వినుటకు గొప్పదైనట్లున్నను జనసంఖ్యనుబట్టి చూచిన యెడల నూటికి ౫ గురు మాత్రము అక్షరకుక్షులైనట్లు తెలుచున్నది. మన దేశమును, పశ్చిమఖండమున విద్యావిషయమున వెనుకడుగులోనున్న రషియా దేశముతోనైనను పోల్చుటకు అవకాశములేదు. నూటికి రమారమి ౫ గురు విద్యనేర్చినవారు మన దేశముననుండ రషియాలో నూటికి ౨౫ గురు గలరు. మన దేశమున విద్యార్థి కొక్కనికి ఒకయణా ఖర్చు పెట్టబడుచుండ నచ్చట ౮ అణాలు వెచ్చపెట్టబడుచున్నవి. పశ్చిమదేశములలోన నాగరికతయందున్న రషియాతోతులతూగలేని మన దేశమునకును నాగరకతయందున్న తక్కిన దేశములకును హస్తిమశకాంతరము కలదని వేరుగ జెప్పనక్కరలేదు. అమెరికా మొదలగు దేశముల యాదాయ వ్యయ వివరణముల బరికించిన యెడ సైన్యమునకును ఇనుపదారులు మొదలైన వాటికిని తక్కువయు విద్యకొరకు ఎక్కువయు వెచ్చపెట్టబడుచున్నట్లు కనుపడగలదు. మన దేశమున ౧౮౮౨ సం॥న కంటె ౧౯౧౦ సం॥న సర్కారువారి యాదాయము రమారమి యారుకోట్లు పెరిగినది. ఆకాలమున నినుపదారులకొరకు కోటియును సైన్యమునకు రమారమి ౯౦ లక్షలును వ్యయమభివృద్ధిచేసి విద్యకొరకు ౪ లక్షలు మాత్రము పెంపుచేసినారు.

మన దేశమున నూటి కైదుగురు విద్యాగంధము కలవారున్నారని చెప్పియున్నాను. ఇక స్వదేశసంస్థానముల స్థితి జూచెదము.—నూటికి రమారమి ౯ మంది బరోడాలోను, ౮ మంది కొచ్చిను సంస్థానమునను, ౭ గురు తిరువాన్కూరునను, ౬ గురు మైసూరునను అక్షరజ్ఞులు కలరు.

—కొండముది శ్రీరాములు

# పుస్తకములు.

చ. పవనరథమార్గముల్ దనువు
నసె నలసంబుగ వీచి దేహముల్
దవిలినతాపమాపు; నెద
దాకియలంచు మనోవికారకై
తెవథమున్ మఱల్చి సత
తమ్ము ముదావహహేతువుల్ కదా!
కవిసముదాయమానస వి
కాసలసత్పరిణామ తేజముల్.

చ. కవిసముదాయమానస వి
కాస లసత్పరిణామ తేజ వి
స్రవణము లుప్పతిల్లి, తిమి
రమ్ములలో బొరలాడుచున్న మా
నవులకు జ్ఞానదీపకల
నన్ బథమేర్పడ జూపుటల్ గసా
నవపరిపూర్ణ పుస్తక ప్ర
చారవిశిష్టవిధమ్మునన్ గదా?

మ. శ్రమచే దన్నినకాలమందు మన ప
జ్జంజేరి భాషా ప్రసం
గమునన్ వీనుల విందుగొల్పి యతియో
గ్యంబైన భావ ప్రపం
చమునన్ ద్రిప్పి విశేషముల్ గఱపి మా
నృత్వంబు నిజాలు ను
త్తమసంచారములౌ విమానములు గ్రం
థ వ్రాతముల్ గావొకో.

శా. లీలారామవిహార యోగ్యలగు నా
లీకాస్యలాత్మీయ బా
హాలంబోగ్ర నిశాత ఖడ్గముల శౌ
ర్యస్ఫూర్తి, గ్రూరాళి ని
ర్మూలంబున్ బొనరించి వీరయువతీ
రూపంబులన్ దాల్చ మే
ల్మేలంచుం గనుగొమె చిత్రితములౌ
లెన్ దోప గ్రంథంబులన్.

గ. అమలమనీషులై జగము
నంతయు వీడి హిమాచల ప్రదే
శముల మహీరుహంబుల ప్ర
శస్తపు నీడల గూరుచుండి యు
త్తమమగు దత్త్వమున్ గను ము
దంబున నిశ్చలులౌ మహర్షి తే
జములను భక్తిపూర్ణమగు
స్వాంతములన్ గనుగొందుమచ్చటన్

—కలచవీడు వేంకటరమణాచార్యులు.

---

# గోదావరీమండల గ్రంథాలయోద్యమము

౧౯౧౪ సం॥ డిసెంబరు వఱకు ఈ గోదావరి మండలమున స్థాపితములైనవి ౩౪ గ్రంథాలయములు. ౧౯౧౫ సం॥ డిసెంబరు వఱకు స్థాపితములైన గ్రంథ భాండారములు ౪౨. గోదావరీ మండల గ్రంథాలయము లందు ౧౭౬౭౦ ఆంధ్ర గ్రంథములును, ౨౧౯౭ సంస్కృత గ్రంథములును, ౫౯౦౯ ఆంగ్లేయ గ్రంథములును, ౬౮ ఇతర భాషా గ్రంథములును మొత్తము ౨౫౮౪౪ గ్రంథములు కలవు. ౧౭౫ వార్తాపత్రికలును, ౧౫౭ మాసపత్రికలును వచ్చుచున్నవి. ౧౨౨౪ గురు చందాదారులు గలరు. చందాలమూలమున ఆదాయము రు ౩౭౬౪—౮—౦. వ్రయము రు ౩౧౧౩—౦—౯ నిలువ రు ౧౬౯౦—౯—౩. చందాదారులును ఇతరులును

౦౨౧౧ గ్రంథములను చదివిరి. ౧౩౮ బహిరంగ సభలు గావింపఁ బడినవి.

ఈ మండలములో, ౧ రామచంద్రపురము. ౨ పెద్దాపురము. 3 రాజవోలు. ౪ అమలాపురము. ౫ రాజమహేంద్రవరము. ౬ కాకినాడ. ౭ భద్రాచలము. తాలూకాలలో మాత్రమే గ్రంథభాండాగారములు గలవు.

రామచంద్రపురము తాలూకా:—ఈ తాలూకాలో ౧౯౧౪ సంవత్సరము డిసెంబరు వఱకు లెక్కకు వచ్చినవి ౧౧ గ్రంథాలయములు. ౧౯౧౫ సంవత్సరము డిసెంబరు వఱకు స్థాపింపఁబడినవి ౧౪ గ్రంథాలయములు. కపిలేశ్వరపురమునందున్న "హితార్థదాయినీ గ్రంథాలయము" సరిగ పని చేయుట లేదనియు వ్రాయబడియున్నదనియు వినియున్నాఁడను. ఈవత్సరము స్థాపింపబడిన రెండు గ్రంథాలయములలోను వాకతిప్పయందలి "శ్రీ వెంకటేశ్వర పుస్తకభాండాగారము" తన చారిత్రమును గ్రంథాలయ సంఘమునకు పంపలేదు. చొప్పెల్లయందు స్థాపించిన "కామరాజ" పుస్తకభాండాగారముయొక్క చారిత్రము కూడ వచ్చి యుండలేదు. ఆలమూరునందు స్థాపింపఁబడిన "సరస్వతీ సమాజము" యొక్క స్థాపకులు గ్రంథసామగ్రిని సమకూర్చిరి; దానిని సర్వజనులకు సర్వవిధముల నుపయుక్తముగ నుండు తావున నుంపక స్వగృహమున గట్టి కఱ్ఱపెట్టెలందు భద్రముగ జాగ్రతపఱచి యున్నారు. మొత్తముమీఁద ఈ గోదావరి మండలములోని తాలూకాలన్నిటిలోను ఈ తాలూకాయందే గ్రంథాలయములు చక్కగ పని చేయుచున్నవి. గ్రంథభాండార సంఘమువారు తాలూకా సంఘము నేర్పరుచుటచే గ్రంథాలయములు క్రమపద్ధతిచే నడచుచున్నవి.

పెద్దాపురము తాలూకా (తునిశాఖజమీనుసహా):—ఈ తాలూకాలో ౧౯౧౫ సం॥ డిసెంబరు వఱకు ౬ నూతన గ్రంథాలయములు స్థాపింపఁబడినవి. గతసంవత్సరము ప్రకటించిన గ్రంథాలయ చరిత్రలో చేరిన రౌతులపూడి "కరణముల క్లబ్బు" గండ్రేడు "విద్యాభివర్ధనీ పుస్తకభాండాగారము" సరిగ పని చేయుట లేదు. మఱియు "రౌతులపూడి కరణముల క్లబ్బు"ను చూడవలెనని నేను వెళ్ళి వాకబుచేయఁగా అయ్యది అంతరించిన దనియు, ఉండిన కరణముగారి యింటిలో ఉన్నదేమో యనియు గ్రామ ప్రముఖులు నుడివిరి. మొత్తముమీఁద ఈ యూరిలోని గ్రంథాలయ మంతరించినదని సందేహము లేకుండ చెప్పఁగలను. పెద్దాపురము లక్ష్మీవిలాస సంఘము ఈ వత్సర మభివృద్ధిలో లేదు. శ్రద్ధతో పని చేయువారు లేరు. దీనిని ముందుగూడ నభివృద్ధి పఱచువారు లేని యెడల త్వరలో నంతరించుట కావంతయు సందియము లేదు. నేను దీనిని స్వయముగా వెళ్ళి చూచినాను. గండ్రేడలోని విద్యాభివర్ధనీ పుస్తకభాండాగారముకూడ అభివృద్ధిలో లేదు. ఆంధ్రదేశ గ్రంథభాండాగార సంఘ కార్యదర్శిగారు దీనిని చూచుటకు వెళ్లియుండిరి; కాని దీనిని చూచు భాగ్యము వారికబ్బలేదు. రెండు సంవత్సరముల క్రితము స్థాపింపఁబడి యభివృద్ధిలోనున్న తునిలోని "రామానుజ పుస్తకభాండాగారము, అన్నవరమునందలి "సత్యదేవ మనోల్లాసినీ సమాజపుస్తకభాండాగారము" తృప్తికరముగ బని చేయుచున్నవనియు, అభివృద్ధిలో నున్నవనియు కార్యనిర్వాహకులు పట్టుదలతోను అభిమానముతోను పని చేయుచున్నారనియు చెప్పఁగలను. అన్నవరమునందలి గ్రంథాలయమును నేను చూచి గ్రంథాలయ పరిపాలనాది విషయములను, వలయు నిబంధనలను తెలిపితిని. మఱియు ఈ తాలూకాలో ఈ వత్సరము స్థాపింపఁబడినదియును చరిత్రయందు జేరనదియు నగు "రాజగోపాల సమాజ" మొకటి ధర్మవరములో కలదు. ౧౯౧౫ సం॥ డిశెంబరు వఱకు రెండు గ్రంథాలయము లంతరించినవి. నూతనముగా ఆరు గ్రంథాలయములు స్థాపింపఁ బడినవి. పాతవి 3 గ్రంథాలయములు. మొత్తము ఇప్పటికి ఈ తాలూకాలో ౯ గ్రంథాలయములు గలవు.

రాజవోలు తాలూకా:— ఈ తాలూకాలో ౧౯౧౪ సంవత్సరము డిసెంబరు వఱకు స్థాపితములైనవి ౫ గ్రంథాలయములు. ౧౯౧౫ సం॥ డిసెంబరు వఱకు బేతపర్లపూడిసావరములో "శ్రీయుమామహేశ్వర పుస్తకభాండాగారము" నూతన స్థాపితము. గంటిపెదపూడి, లో "శ్రీసరస్వతీ పుస్తకభాండాగారము" తప్ప మిగత ౫ గ్రంథాలయములు క్రమాభివృద్ధిలో నున్నవి. స్థాపకు లభివృద్ధికరములగు కార్యము లొనర్చుచున్నారు.

అమలాపురము తాలూకా:—ఈ తాలూకాలో ౧౯౧౫ సంవత్సరం డిసెంబరువఱకు స్థాపితములయినవి 3 గ్రంథాలయములు. అందులో అమలాపురము "కృష్ణదేవగాయ గ్రంథాలయము" ప్రస్తుతమభివృద్ధిలో లేక మూయఁబడి యున్నదనియు, తిరిగి వేరొక గ్రంథాలయము స్థాపింపఁబడుననియు, వినియున్నాడను; అభివృద్ధిలో లేదన్నమాట సత్యము. మిగత ౨ గ్రంథాలయము లొకవిధముగ కార్యము లొనర్చుచున్నవి.

రాజమహేంద్రవరము తాలూకా:—ఈ తాలూకాలో ౧౯౧౪ సం॥ డిసెంబరులో ప్రకటించిన చరిత్రకు జేరినవి మూడు గ్రంథాలయములు. "ములకలంక" యందు శ్రీ సూర్యరాయ గ్రంథభాండాగారము స్థాపించి ఆరు మాసములయినది. ఈ గ్రామములో ధనవంతులును భాషాభిమానులును చాలమంది గలరు. గ్రామవాసు లందఱకు గ్రంథభాండాగార మభివృద్ధి పఱచుకొనవలెననెడి యుత్సాహము మెండుగ గలదు. ఈ గ్రంథభాండాగారమునకు నిబంధనలు మొదలగునవి యన్నియు వ్రాసియిచ్చి స్థాపకులకువలయు సలహాలనందించి ప్రోత్సాహము కలుగఁ జేసితిని. "కాతేరు"నందున్న శ్రీ రాజలక్ష్మి పుస్తకభాండాగారమునకు స్వంతముగా భవనమున్నది. స్థాపకుల అభిమానముచే ఇది మంచి స్థితియందున్నది. మొత్తము మీఁద ఈతాలూకాలో ౫ గ్రంథాలయములు గలవు. రాజమహేంద్రవరములోగల రత్నకవి గ్రంథాలయము అభివృద్ధి పఱచువారు లేకుండుటచే క్రమాభివృద్ధియందు లేదు. సర్వజన పుస్తకభాండాగారము కూడ ఈమధ్య కొన్ని వ్యవహారపు చిక్కులలో దగిలి యుండుటచే అభివృద్ధి గావించుటకు వీలులేక, తెఱచుటను మాత్రము క్రమముగ చేయుచున్నారు.

వసురాయ పుస్తకభాండాగారమువారు కరపత్రిముద్రించుచు ఉపయోగము కలుగజేయుచున్నారు

కాకినాడ తాలూకా:—ఈతాలూకాలో ౧౯... సంవత్సరం డిశంబరు వఱకు ౭ గ్రంథాలయములు... వు. కాకినాడలోనున్న "శ్రీసర్వజన గ్రంథాలయ... మూయబడి యున్నది. ఈ తాలూకాలో జేరిన పి... రములో ప్రతివత్సరమును గ్రంథాలయమును స్థా... చుటయు, వత్సరము పూర్తికాకుండగనే మరల ... నశించుటయు జరుగుచున్నది. పిఠాపురమునందీ ... త్సరము తిరిగి మహాజనసభ లొనర్చి నూతన గ్రంథ... డాగారములు పఠనమందిరములు స్థాపించినారు. ... నైన క్రమాభివృద్ధిని పొందునట్లుచేయుదురుగాక.

భద్రాచలము తాలూకా:—ఈ తాలూకా... ౧౯౧౫ సంవత్సరము డిసెంబరు వఱకు ౮ గ్రం... యములు గలవు. వీటిలో దుమ్ముగూడెము నందు... "శ్రీవాణీనికేతనము" అను గ్రంథాలయము అంతరి... నట్లు తెలిసెడిని. మిగత మూడు గ్రంథాలయముల... గ్రంథముల సంఖ్యయందేమి చదువరుల సంఖ్యయందే... చందాదారుల మొత్తమందేమి సర్వవిధముల నభి... లోనున్నవని చెప్పుటకు సంతసముగ నున్నయది. ... వరములోని "శ్రీవాణీ పుస్తకభాండాగారము" ఒక... రమునుండి మూయఁబడి యున్నదనియు, గ్రంథసామ... మాత్రము జాగ్రత్తగ ఉన్నదనియు ప్రతి దినము ... చుటకు ఎవరును లేరనియు, అందఱు వచ్చి చదువుకొ... టకు వీలుగానుండు స్థలములో లేదనియు కార్యదర్శి... గు నాతో చెప్పినారు. గ్రంథసామగ్రి అన్యాక్రాంత... గాక కార్యదర్శిగారి యాధీనములో నున్నది.

—అద్దంకి సత్యనారాయణశ...

## గ్రంథమాలికలు.

'ఎఱుక పడినఁడు ధనము' అను మాట ఎవరెఱుంగనిది? ఇక్కడ, ఎఱుక అనఁగా ఎవరినో ఒకరిని ఎఱిగి ఉండుటయే. అయిననూ అంతయును ఎఱుఁగు ఎఱుకకు—జ్ఞానమునకు—విలువ ఇంత అని చెప్పు... ఎవరితరము? అందుచేతనే పూర్వులు, 'జ్ఞానమే ధన...' అన్నారు. 'ధనమూలమిదం జగత్'— అనునపుడు...

రణముగా ధనమునఁగా బంగారము- వెండి మొదలవే అను తలంపుతో వాడినను, ముఖ్యముగా ఆలోచించిన యెడల జ్ఞానధనము గానిలో ఇమిడియే ఉదనియు- అదే ముఖ్యమనియు కూడ ఒప్పక తప్పదు. ట్టి జ్ఞానధనము, జ్ఞానేంద్రియముల మూలమున సృష్టిద్రములను కనిపెట్టుటవల్లను- గురువులు తెలుపఁగా తెలిసికొనుటవల్లను- మనకు కొంతవఱకు లభించును; కొంతవఱకే అగుటకు కారణము అందఱమును ప్రపంచమంతయును తిరిగి చూడఁజాలక పోవుట; కావలసినప్పుడెల్ల గురువులు మనదగ్గఱ ఉండుటకు వీలులేక పోవుట. అయితే, హెచ్చుగా జ్ఞానము లభింపఁజేయు సాధనములు మఱేవో ఉండవలెనే. అవి ఏవి? గ్రంథములు. మొగము ముందట చేయు బోధకంటె హెచ్చుగా బోధచేసి హెచ్చు తెలివి కలిగించునవి గ్రంథములు గాక మఱి ఏవి? కాఁబట్టి, మనకు జ్ఞానము సమకూర్చుటలో ముఖ్యసాధనములు గ్రంథములే అని నొక్కి చెప్పవచ్చును. ఆవశ్యకములని వేఱే చెప్పవలయునా? ఇట్టి గ్రంథములను వరుసగా ప్రచురించుటకు కొందఱు ప్రయత్నించుచున్నారు. పూలమాలికవలె ఒకదాని వెంట నొకటి వరుసగా ప్రచురింప నెంచిన సంపూర్ణ గ్రంథముల సమూహములకే "గ్రంథమాలికలు" అని పేరు.

## ఎట్లు బయలు దేఱినవి?

అచ్చుయంత్రములు రాకమునుపు మనదేశమున మొదట తాటాకులమీఁద గ్రంథములు వ్రాసికొనుచుండెడివారు; కాగితములు వచ్చినతరువాత వానిమీఁదకూడ వ్రాసికొన మొదలు పెట్టిరి. కావలసినవారు ఎంతో శ్రమపడి ప్రతులు వ్రాసికొనుచుండెడివారు. అచ్చాఫీసులు ఏర్పడిన వెనుక గ్రంథములు అచ్చువేయుటకు ఆరంభించిరి. వ్రాసికొను బాధ తప్పిపోయె. అచ్చుప్రతులే తక్కువ ఖరీదులకు దొరకుటకు వీలయ్యె. కాని, అచ్చాఫీసులవారు హెచ్చుగా చెల్లునను గ్రంథములే ప్రచురపఱచుచుండుటచేత తక్కినవి అచ్చుపడక పోయెను. అట్టి వానిలో కొన్నిటిని గ్రంథకర్తల బంధువులు అభిమాన పూర్వకముగా అచ్చువేయించిరి. కొన్నిటిని వానియందభిమానముగల మఱి కొందఱు ప్రచురపఱిచిరి. అప్పటికిని కొన్ని గ్రంథములు వ్రాఁతలోనే ఉండిపోవును. ఆస్థితి కనిపెట్టి భాషాభిమానులు కొందఱు మాసపత్రిక లేర్పఱిచి కొన్నిటిని అచ్చులోనికి తెచ్చిరి. వానితోపాటు కొన్ని క్రొత్త గ్రంథములును బయటకి వచ్చె. ఇటుల గ్రంథప్రచారము హెచ్చె. జ్ఞానవృష్టి కురిసె. దేశస్థితియును మాఱె. క్రొత్తక్రొత్త గ్రంథములు అవసరమని స్ఫురించె. లోలోన అణఁగిఉన్న కవితాబీజములు అంకురించె; నవనవలాడుచు పెరఁగి గ్రంథరూపమున ఫలించె. ఈగ్రంథములన్నియు పైకి వచ్చుట ఎట్లు! విడిగా ప్రచురించుటకు కవులందఱును ధనికులు కారు; మాసపత్రికలు చాలకపోయె; ఉన్నవియును వానికుండు బాధలను బట్టియు- లోపములను బట్టియు ఒక్కటొక్కటి మాయమయ్యె. ఈస్థితిగతులు చూచి చందాల పద్ధతిని మాత్రమనుసరించి గ్రంథములు సంపూర్ణముగా ప్రచురించిన బాగుగా ఉండునను ఆలోచనలు పుట్టె; తలఁపులే గట్టివయిన యెడల క్రియలకు కారణము లగును గాన గ్రంథమాలికలు బయలు దేఱె.

## అభివృద్ధి ఎట్లున్నది.

గ్రంథమాలికలు బయలుదేఱి మొదలుపెట్టి సుమారు పండ్రెండు సంవత్సరము లయినది. ఇప్పటికి లెక్కకు సుమారు ముప్పది కానవచ్చుచున్నవి. కాని, వెనుక సాయమున్న ఏవో కొన్నిటి స్థితి తప్ప తక్కినవాని స్థితి అభివృద్ధిలో ఉన్నదని సంతోషించుటకు అవకాశము కానరాకున్నది. మంచితరుణమున బయలుదేఱి విరివిగా వ్యాపించి, ఇంకను వ్యాపించి అభివృద్ధి చెందవచ్చుననిపించిన విజ్ఞానచంద్రికా గ్రంథమాలయు వెనుకడుగు వేయుచున్నదేమో అను స్థితిలో ఉండఁగా తక్కిన వాని మాట చెప్పుట ఎందుకు? కొన్ని ముందడుగు వేయుచున్నట్లు కాన్పించినను ఈ అభివృద్ధి ఒక అభివృద్ధిగా ఎన్నఁదగినది కాదు.

## అభివృద్ధి కాకుండుటకు కారణములు ఏమి?

కొనేవారు ఉన్నఁగదా వర్తకము పెంపొందుట! గ్రంథమాలికల పనియును వర్తకమే. గతిలేక కవులు వర్తకులయినారు. అయితే వీరి సరకులు కొనేవారు ఎవరు? తక్కిన వర్తకుల సరకులు కొనుటకు ఒక్క ధనమున్న చాలును; ఈవర్తకుల సరకులు కొనుటకో

ధనముతోపాటు విద్యకూడ ఉండవలెను. అవి రెండును మనదేశమున అరుదుగనే ఉన్నవి. డబ్బునకును చదువునకును పొత్తుకలియుట అబ్బురమే. అందుచేత తమంతట తాము కోరి చందాదారులగు వారు చాల తక్కువ. అప్పటికప్పుడు పుట్టిన అనుగంటు ఉత్సాహముచేతనో- మొగమోటముచేతనో- మోసపుబుద్ధిచేతనో చందాదారులైన వారిలో వీ. పే. లు త్రిప్పివేసి దండుగలు తగిలించి- గ్రంథములు పోయి తిరిగి రాకుండ సొమ్ము చెల్లించి పుచ్చుకొనువారు అంతకంటె తక్కువ. ఈ సౌభాగ్యమునకు తోడు తెలుగు పదములతో నిండియున్నను తెలుగువారికైనను తెలియని తెలుగు భాషలో గ్రంథములు వ్రాయుటకూడ వర్ధిల్లుచున్నది. కొన్ని గ్రంథమాలికలను గూర్చి మన దేశములో చాల భాగముల తెలియనే తెలియదు. పైసంగతులను బట్టి, గ్రంథమాలికలు అభివృద్ధి కాకపోవుటకు (౧) సంపాదకులు ధనవంతులు కాకపోవుట, (౨) తగినంత ప్రకటనము జరుగకుండుట, (3) చదువుకొనిన వారి ఆదరణమును ధనవంతుల ఆదరణమును లేకపోవుట, (౪) కొన్నిగ్రంథములలోని భాష సరి అయినది కాకుండుట, ముఖ్యకారణములని తేలును.

## అభివృద్ధిలోనికి వచ్చుట ఎట్లు?

ఏదిగాని అభివృద్ధిలోనికి రావలెనన్న ముందు దాని లోపములు తీర్పవలెను. గ్రంథమాలికల లోపములలో ముఖ్యమైనది ప్రకటన లోపము. ఇది, గ్రంథమాలికా సంపాదకులు పరస్పర మైత్రి కలిగి ఒకరి ప్రకటనలు ఒకరు ప్రచురించుటవల్లను- వార్తాపత్రికా మాసపత్రికా సంపాదకులును, గ్రంథాలయ సర్వస్వకార్యనిర్వాహకులును, లాభమునకు చూడక అయిన ఖర్చులు మాత్రము పుచ్చుకొని గ్రంథమాలికా గ్రంథముల ప్రకటనలు ప్రచురించుటవల్లను- గ్రంథాలయ కార్యనిర్వాహకులు ఆయా గ్రంథమాలికలలోని గ్రంథముల జాబితాలు తమ గ్రంథాలయములలో అట్టలపైని అంటించి ప్రచురించుటవల్లను—వర్తకులు ఆయాగ్రంథముల జాబితాలు ప్రచురించుటవల్లను—చాలవఱకు తీరును. ఎన్ని ప్రకటనలు ప్రచురించినను, కొనేవారు లేకున్న లాభము గలంతియును కలుగనేరదు. కావున చదువుకొనినవారును - ధనవంతులును గ్రంథములను కొని తగు ఆదరణము చూపవలయును. మన తెలుగువారు రెండుకోట్లకుపైఁగా ఉన్నారు. మొత్తము మీఁద నూటికి ఒక్కరే గ్రంథములు చదువఁగలవారనుకొనినను వారి సంఖ్య సుమారు రెండు లక్షలకు పైఁగా ఉండును. వీరు సంవత్సరమునకు అధమము తల ఒకరు పాయ గ్రంథమాలికలను ఆదరించుటకు ఖర్చుపెట్టుదుమని నియమము చేసికొన్నను ఎంతో ప్రోత్సాహము కలిగించినవారగుదురే! భాషాభిమానముగలవారికని - దేశాభిమానముగలవారికని సంవత్సరమునకు ఒక్కరు పాయ లెక్కా? కావున, చదువుకొనినవారిలో ఇంతవఱకు ప్రోత్సాహము చేయనివారు మొదట తమ జిల్లాలోను- పిదప పైజిల్లాలలోను బయలుదేఱిన గ్రంథమాలికలను చేతనగునంతవఱకు సాయముచేసి ఆదరించి వానిని అభివృద్ధిలోనికి తేవలయును. ఇఁక ధనవంతులమాట చెప్పవలసినదేమున్నది? వారిలోకూడ ఈవిషయమునుగూర్చి ఇప్పటికి ఐక్యము కలిగించుకొననివారు తమకు వీలున్నంతవఱకు గ్రంథమాలికలను ఆదరింపవలయును. మహాజనులారా! వేయిమాటలేల! గ్రంథమాలికలను అభివృద్ధిలోనికి దెచ్చుభారము ముఖ్యముగా మీదే. మీరు సరిగా ఆదరించినయెడల కవులకు ప్రోత్సాహము కలుగును; సంపాదకులు ధనవంతులగుదురు. భాషావిషయమై తగిన కృషిచేయుదురు; చక్కనిభాషలో మంచిమంచి గ్రంథములు వ్రాయుదురు. దేశమందంతటను వ్యాపింపఁజేయుదురు; జ్ఞానధనము వెదజల్లుదురు; మనవారినందఱను సుఖములలో ఓలలాడింతురు. అంతకంటె కావలసినదేమి? లెండు; కనువిచ్చిచూడుఁడు; మీవిధి చేయుఁడు; కృతార్థులగుఁడు. ఇప్పటికే ఈవిషయమున శక్తివంచనములేక తోడ్పడు భాషాభిమానులకును- దేశాభిమానులకును అనేక కృతజ్ఞతాపూర్వకవందనములు.

గీ. మొగమునెదుటచెప్పెడునట్టి ♦ బోధకంటె
ఎక్కువగ బోధకావించి ♦ హెచ్చు తెలివి
కలుగఁజేసెడి ఉత్తమ ♦ గ్రంథములను
వ్రాసితోడ్పడు కవులార! ♦ వందనంబు.

—మారేపల్లి రామచంద్రశాస్త్రి.

# కోకిల.

వెన్నకన్నను మృదువగు క్రొన్ననలను
మెక్కి కొమ్మావిగున్నపై నెక్కి పంచ
మస్వరంబున నవ్యక్తమధురగాన
మును పొనర్చెదు, కోకిలా, వెనుకదిరిగి
చేరువనెయున్న హాని వీక్షించవేమి.
వింటిబద్దను చేఁగొని, కంటిరెప్ప
వాల్చకుండఁగ, దృష్టి నీప్రక్క నిలిపి
పొంచియున్న కిరాతు వీక్షించవేమి.
తొంగిచూచెడి యా కంట దుమ్ముగల్లి
యెగిరిపోవేమి? యెత్తినదెత్తినట్టు
వింటిబద్దను క్రింద దింపింపవేమి?
బోయని దురాశ నట్టేట ముంపవేమి?
గానలోలత్వమునఁ బ్రాణమైన విడువ
దలఁతువాయేమి? గానప్రియులకు నెందు
మంచిచెడ్డలు తెలియనిమాట నిజము.
చెవిని నోరుంచి నే నెంతచెప్పుచున్న
నింతనిశ్చింతతో నుందువేమిచెపుమ?
ప్రాణములు దాల్చి సంసారబాధకంబు
లనుభవింపఁగలేక ప్రాణాశవిడుతొ?
నీకుదిగులేమి పిల్లల సాకవలెనొ?
గూటికై చిదుకులు నేరుకొనఁగవలెనొ?
అట్టి సంసార తాపత్రయములు లేక
మురియుచుంటివి, కడిగిన ముత్యమట్టు
లొరుల సంబంధమేమిలేకుండ నీవు.
అవసరంబేమి బ్రతుకుపై నాశవిడువ
బ్రతికియుండిన సుఖములు వదుదుగాని
కష్టములు లేవు నీకు నెక్కాలమునకు.
నిరపరాధిని నన్నేల యెటుక గొట్టు
ననెడ నిర్భీతిమై నుంటివా వచింపు
అనపరాధులు నపరాధులనెడి భేద
లవము దుర్మార్గులయెడ హుళక్కి సుమ్ము.
నిండుచూలాలగుటచేత, నిలిచి, నిలిచి
యలసగమనంబుతో నడయాడు, కన్నె
లేడి, మృగయాప్రియునిచేతి వాడికత్తి
కెఱయగుట కపరాధమదేమి చేసె.
ఒందుచింతలు దక్కుము, మొండిధైర్య
మును వహింపకు, నావాక్యములను నమ్మి
వేరుచోటికిఁ బొమ్ము జీవించియున్న
రేపు నీగానమహిమంబు చూపవచ్చు.
చూడఁగాఁజాల నీవిటఁ బాడు వింటి
దెబ్బతిని క్రిందఁబడఁగ నీయబ్బ చెట్టు
కడకుఁ బరుగునవచ్చి నిన్నొడిసిపట్టి
మెడవిరిచి సంచిలోఁ గ్రుక్కి నడుచుచుండ.
నిర్దయాస్వాంత కోకిల నిరపరాధి
సర్వసముఁడగు దేవుఁడు సకలభూత,
ములకు సమమైన యధికారమునె యొసంగ
బ్రకృతియందున వేర్వేఱ బ్రతుకుకొఱకు
దానికంటెను నీయందుఁ దవిలియున్న
ఘనతయేమొ వచింపు నీకండకావ
రంబొకఁడుదక్క, యంతమాత్రంబుచేత
నొరులసంబంధమేలేక యుండ నొక్క,
గూడయినలేక, యేచెట్టుకొమ్మయందొ
బ్రతుకుచుండిన దీనిఁ జంపంగవలెనె!
యేమియెఱుఁగనిపక్షుల హింసచేయ
నెట్లుపాలించు నిన్ను సర్వేశ్వరుండు.
హాయిగొల్పుచుఁ గర్ణరసాయనముగఁ
బాడుచున్నది వినుము నీపాడుచెవికి
శూలములవలె నాటెనచో మఱొక్క.
యెడకుఁ బోరాదె! నీకంట నెట్లుపడెను
రా! దురాత్మక! యీపక్షి రాజమిపుడు.
దిక్కులేనట్టివారికి దిక్కుదేవు
డనెడువాక్యము సత్యమేయైనయెడలఁ
బరభృతంబది నీచేతఁబడకమున్నె
భూతనిర్మాణకర్తయే ప్రోచుదాని.

రాక్షసాగ్రహంబు నే ననరాదు గాని
నీదు కడుపునఁ బుట్టిన నిసువు నీకు
కష్టపెట్టుట నొక్కక్రూరుఁడు కఱకువాల
మున విదల్చుచునుండు నిముసమునందు
శిశువు నీవంక దీనదృష్టి నిఁగురల్చి
కాపుగని యేడ్చి యసువు గోల్పోవునపుడు
కఠినచిత్తుఁడవైన నీకడుపు అంప,
కోతపడుగాని నీవూరకుండువోటు.
బాహుబలమును బుద్ధివైభవమునున్నఁ
కత్తిచేఁబూని యుద్ధరంగమున దుమికి,
స్వామిభక్తిపరాయణత్వమున కంఠ
రక్తధారల పశ్చిమరాష్ట్రములను
దడుపుచున్నట్టి భరతపుత్రకులఁ జేరి,
నీదుశక్తిని బ్రకటింపగాదె? యిపుడు
దేశసంరక్షణార్థమై దిగితివంచు,
సల్పఁగను పద్యకుసుమ పూజలను నీకు.

—పింగళి లక్ష్మీకాంతము.

# ఆంధ్ర భాషా సర్వస్వము *

ఎట్టకేలకు మేల్కాంచి ప్రతిజ్ఞా నిర్వాహణ సంసిద్ధులై ఆంధ్రసాహిత్యపరిషదధికారులు భాషాసర్వస్వ స్వరూప దర్శన పత్రములను ముద్రించి వానింగూర్చి విద్వదభిప్రాయముల స్వీకరించి గ్రంథరచనము నారంభించిరని వినుట కెంతయు సంతసించుచున్నారము. వీరి యత్నములు శీఘ్రకాలమున నెరవేరి యాంధ్రభాషకు మహోపకారము గావించునని నమ్ముచున్నాము.

భాషాసర్వస్వమును రచియింపవలెనను ప్రయత్నములు ౧౯౧౨ సం॥ నుండి జరుగుచున్నవి. పీఠికాపురాధీశుడీ యుద్యమమునకు కేలూతయొసగి యాదరించిన వెనుక జయంతి రామయ్యపంతులుగారు కొన్ని రచనామార్గముల సూచించుచు వ్యాసము నొకదానిని ముద్రించి పండితులకంపె అందలి యంశములకు పూర్వపక్షసిద్ధాంతములను, ఇతరబుధోత్తములకు దోచు అభిప్రాయములను రావించిరి. వీని సారాధారమున పరిషదధికారులు భాషాసర్వస్వమునుగూర్చి త్రోవల నేర్పరచిరి. ఈపని జరిగి చాలా కాలమైనను సర్వజ్ఞులగు సంపాదకులు లభింపమిచే భాషాసర్వస్వము రెండు మూడువత్సరములు బీజస్థితిలో సంచరింపక నల్లాడుచుండెను. తుట్టతుదకు ఆంధ్రగీర్వాణ సాహితీపారంగతులును ఆంగ్లసారస్వత రసజ్ఞులును విమర్శనాచక్రవర్తులును నగు వేదము వేంకటరాయశాస్త్రిగారి నీ కార్యము నిర్వహింప నియమించిరి. వీరిచే గల్పింపబడిన ప్రదర్శనపత్రములను కడుజాగరూకతతో జదివి యందలి వివాదాంశములగూర్చి మాకుదోచెడియభిప్రాయముల ముందుగ నుదహరించి యావల కొన్ని సంస్కారముల విన్నవింప బూనియున్నాము.

భాషాసర్వస్వములోని ప్రతిపదమును ఆంగ్లలిపిలో ముద్రించుట అనగత్యమనియు వ్యయకారకమనియు నిష్ప్రయోజనమనియు మాకు దోచుచున్నది. మనుష్యుని వాగ్జాలమున సుమారు అరువదిరెండు స్వరము లున్నవని భాషా తత్త్వజ్ఞులు చెప్పుచున్నారు. ఇందులో ఆంధ్రభాష యేబదియారు స్వరముల స్వీకరించినది. ఆంగ్లలిపిలో ఇరువదియారు అచ్చరములే చేరియున్నవి. ఇట్టి యసంపూర్ణలిపిలో నించుమించుగ స్వర సంపూర్తిగాంచిన యాంధ్రభాషాపదములను వ్రాయబూనుట కడుహీనముగ తోచుచున్నది. హిందీ లేక నాగరలిపిలో నీపదములను వ్రాసి హిందూదేశమందలి నానాభాగములజనుల కాంధ్రభాషారూపముల దెలుప యత్నించుటయు నిట్టి యసందర్భములకు లోనై యున్నది. కాని, మరియొక లిపిలో నాంధ్రపదములను వేయదలచినయెడల నాగరలిపి సర్వోత్కృష్టముగ నుపయోగింపదగును.

భాషాసర్వస్వమున ఉదహరింపబడిన గ్రంథము

* కొందరు విద్యాధికులుకూడి తెల్పిన యభిప్రాయములు.

లన్నియు ప్రాచీనకవులచే రచియింపబడిన తెలుగుపొత్తములే; వీనియందచ్చటచ్చట నాంగ్లేయోత్పత్తిగలవిదేశ పదములు జేర్పబడియున్నను, సామాన్యముగ నీగ్రంథము లంగ్లేయరీతి నాగరకతయు నాంగ్లేయజాతి యభిప్రాయములును గనుపడుచున్నవి. ఈపదములలో చాలభాగము ఈకాలమున వాడుకలో నుండి జరిగిపోయినవి. ఆధునికాంధ్ర సారస్వత విజృంభణమునందు వన్నెకెక్కిన తెలుగుపదములను పరిషదధికారులు అంగీకరింపవలయును. భాషాసర్వస్వమును కూర్చునెడ, గ్రంథరచనము జరుగునప్పటికి భాషలో చేరియుండిన పదములన్నిటిని జేర్పక తప్పదు. ఆంగ్లనిఘంటు నిర్మాతయగు శామ్యూల్ జాన్సన్ తనసమకాలికులగు గోల్డుస్మిత్ మున్నగు వారి రచనలలోని యాభాషాప్రయోగముల నయితము తన నిఘంటువులోచేర్చి యున్నాడు. నూతనముగ ననేక విదేశభావములు తెలుగులోనికి గ్రంథకర్తలచే నేమి, పత్రికలచే నేమి, తేబడుచున్నవి. వీనికి సంస్కృతాంధ్రమయమగు పరిభాష లేర్పడుచున్నవి. ఈపదములు సర్వసామాన్యముగ వాడబడుచున్నవి. ఎవరు అంగీకరించినను అంగీకరింపకున్నను వీనిపరిపాటు తప్పదు. ప్రబంధములలో నలరారు పదములను వాంఛించు చదువరులు పెక్కుమంది లేకున్నను పత్రికలలో అనుదినము ప్రచురింపబడు నూతన పదములగూఢార్థముల నరయు నగత్యము ప్రతివారికిని గలుగుచున్నది. ఇట్టి సందర్భములలో, ఇప్పటివరకు భాషలోచేరిన పదముల నన్నిటిని భాషాసర్వస్వమున చేర్చుటయుక్తమని మాయభిప్రాయము.

పాశ్చాత్యదేశములలోనేమి, ప్రాచీన సంస్కృత విద్యాసచారిత్రమున నేమి ప్రజలవిద్యాసంపత్తులు ప్రబలుకొలది వానికి దగు పరిభాష లేర్పడుచు వచ్చినవి. అనగా, కాలక్రమమున సందర్భానుసారముగ నాభాషలు పెంపొంది యున్నవి. ఇదివరకు ఆంధ్రమునగూడ నిట్టి వ్యాపారమే జరుగుచుండెను. చాలకాలములో, కడు నెమ్మదిగ ప్రజాభిప్రాయములు ప్రబలి వానిననుసరించు నట్టి పరిభాష లేర్పడినవి. ఇప్పుడు ఆంగ్ల విద్యాలయముల విపరీత ప్రభావమునజేసి, పాశ్చాత్యదేశములందనేక శతాబ్దములలో నేర్పడిన భావములన్నియు కొలది [illegible] కురియుచున్నవి. భాష వెనుకపడినది. భావములు ముందుకు నడుచుచున్నవి. వాగర్థములకుగల నిరంతర సాహచర్యము ఈనాటి తెలుగుసీమలలో విముక్తమైనది. నూతనాభిప్రాయసంపత్తిచే నుల్లసిల్లుచు ఆధునిక గ్రంథరచనావేత్తలు తమకు తోచినపదములనెల్ల సంస్కృతము నుండియో ఇతరభాషల నుండియో స్వీకరించి ప్రత్యయభేదమున తెలుగులో వాడుచున్నారు. ఇట్లుచేయువారు పలుతావుల విదేశపదవ్యాప్తిని సంపూర్ణముగ గుర్తెరుగక అందలిభావములకే ఉపద్రవము వాటిల్లు పదముల నిచ్చవచ్చిన రీతిని వాడుచున్నారు. ఇందుచే ఆంధ్రభాషయందు భావోచితముగు పదజాల మేర్పడక వెఱ్ఱితలలూడుచున్నవి. భాషాసర్వస్వమునందు ప్రాచీన పుస్తకప్రయోగములను గ్రహించుటయే గాక, నూత్న సారస్వత నిరూపణమునకుగూడ తోడగుచు నానావిధములగు ఆధునిక భావములకు తగు పరిభాషను కల్పింపవలసియున్నది. లేనిచో అల్పాధికారులచే నల్లబడు పదములు భాషలోచేరి కళంకముగ పరిణమింపక మానవు. ఇదియుంగాక నూతనముగ సృష్టింపబడుచున్న పదముల నేకములు ఇదివరకే సంస్కృతాంధ్రములలో ప్రత్యేక వ్యుత్పత్తిగలిగి విద్వాంసులచే నన్యథా తెలిసికొనబడుచున్నవి. ఇందుచేతనే ఎట్టిసంస్కృతపండితుడైనను ఇప్పటి తెలుగు పత్రికలలోని పదజాలమును గుర్తింపజాలకున్నాడు. భాషాసర్వస్వములో ఇదివరకు సంస్కృత నిఘంటువులలో చేర్పబడిన పదములన్నిటిని తద్భవరూపమున ముద్రించుటయేగాక, పాశ్చాత్యశాస్త్రరాజములగు జ్యోతిష-రసాయన-శిల్ప-యంత్ర-జీవ-వృక్షశాస్త్రములలోని పదములకు తగు తెలుగుమాటలనుకూర్చి ముద్రింపవలసియున్నది. కొన్ని సమయములలో నిట్టిపదరచన యనుకూలింపదు. మఱియు చిన్నతరగతులలో తెలుగుమూలమున పాశ్చాత్యశాస్త్రముల సారాంశముల నరవగలిగినను, ఆశాస్త్రముల యున్నత భావములు తెలుసుకొనుటకు పెద్దపొత్తముల నాంగ్లభాషలోనే చదువవలసివచ్చుచున్నది. అట్టియెడ చిన్ననాట ఒకపరిభాషయు, పెద్దనాట మరియొకటియు నేర్చుకొనుట కడు కష్టతరము. మరియు నాంగ్లశాస్త్రీకపదములకు తెలుగుపరిభాష నేర్పరచినను అట్టివానిలో చాలాభాగము జనసామాన్యమునందు ఉపయోగింపకుండును. ఈకాగ

ణములచే శాస్త్రీకపదసందర్భములలో పాశ్చాత్యపదముల నే తద్భవరూపమున తెలుగులో నచ్చి నిఘంటువునందు చేర్చుట యుక్తమై యున్నది. ఈవిధముగ చేసిన, సంస్కృతాంగ్లేయ భాషలయందలి నిరుపమభావసంపత్తి పదరూపమున నాంధ్రభాషలో చేరుటయేగాక దుష్ప్రయోగములకు సందుండజాలదు. ఆంధ్రభాషలో మహత్తరగు మార్పులు గలుగుచున్నవి. ముందుగలుగకమానవు. ఈమార్పుల ననుసరించుచు వీనికి మార్గదర్శకమై వన్నెదెచ్చు పదజాల మచిరముగ నేర్పడనిచో, భాషయనేక రీతుల విచ్చలవిడియై చెడిపోవునమాట సందియములేదు. భాష చెడిపోకమునుపే భాషాభిజ్ఞులు దానికి వలయు పోషకద్రవ్యముల సమకూర్చి సుకవిప్రయోగముల నిగ్రహించి చక్కని తెలుగుపాత్రము లేర్పడు తెరవులజూపుట ఉచితము. ఈకార్యము నిర్వహించుటకు ఆంధ్రసాహిత్యపరిషత్తువారు పూనుకొనవలయును.

అచ్చతెనుగు ద్రావిడభాషలకు సంబంధించియున్నదగుటచే, కొన్ని సందర్భములలో అరవ-కన్నడ-పదములకు ప్రకటింపవలసివచ్చుచున్నది. కొన్ని కొండజాతులవారి పదములలో నుభయభాషాసాంకర్యమును నూపు రూపములగుపడుచున్నవి. వీనిని వీలైనంతవరకు సంగ్రహించియు, కోయలు- చెంచులు- యెఱుకలు- ఏనాదులు మున్నగు కొండజాతులవారి భాషలలోని తెలుగుపదముల నర్థయుక్తముగ నరసి ప్రకటించియు, ఆంధ్రసారస్వతమునకు ద్రావిడసంపత్తి కలిగింపవలసియున్నది. ఈపదములనుగూడ అకారాది క్రమమున నిఘంటువులో చేర్చిన బాగుండును.

తెలుగుదేశములోని పట్టణములలోగాక నానా ప్రాంత్యముల పల్లెటూళ్లయందు సుద్దులు-జంగముకథలు-యాలపాటలు- లాల్లాయిపదములు మున్నగు దేశీయ సారస్వతము ప్రబలియున్నది. వీనిలో తెలుగుపదముల ఆభాసరూపములు సామాన్యముగ వాడబడుచున్నవి. ఈఆభాసరూపములను నిఘంటువులో జేర్పనవసరములేదు; కాని అచ్చటచ్చట చక్కని మారుమూలమాటలుదొరకినపుడు వానిభావములను తెలియజెప్పుచు భాషాసర్వస్వములో చేర్పవలసియుండును. పైనజెప్పినకొండభాషల పదముల స్వీకరించుటకును దేశీయగానములలోని ముచ్చటమాటల పోగుచేయుటకును పరిషదధికారులు తగు యత్నములు జేయవలసి యున్నది.

వృత్తులకును పనిముట్లులకును సంబంధించిన దేశీ పదములను భాషాసర్వస్వములో నొకప్రత్యేకశీర్షికక్రిం ప్రకటింపబోవుచున్నారట. ఇట్టి పదములలో ఏకా సూచకములయినవే జిల్లాభేదమున భిన్నభిన్నముగ నున్న అట్టిచో నాయాజిల్లాలలోని పదములను ప్రత్యేకముగ వే వానికన్నిటికిని ఒకే అర్థమును పునః పునహా వ్రాయు కన్న, వీనికి సరియగు సంస్కృతిపదమునుగాని ప్రసిద్ధా ధ్రపదమునుగాని గ్రహించి దానిపర్యాయముల జాబిత లో ప్రాంత్యభేదమును సూచించుట యుక్తముగ దో చున్నది. పనిముట్లతో వీలయినయెడల చిత్రములనుగూ ముద్రించిన ఉపయోగకరము.

సంస్కృతసాంప్రదాయముల ననుసరించి తెలు లోని గణితాది శాస్త్రములుకూడ పద్యసరళిని వ్రాయ డియున్నవి. అచ్చులేక పాత్రములే కరవైనదినముల జ్ఞాపక సౌష్టవముచేకూర్చుటకు నానావిషయము పద్యరూపమున ప్రకటింపబడుచుండెను. పద్యములు గణ యతిప్రాస, నిబంధనలననుసరించునవిగాన అందు పర యపదములు విశేషముగవాడవలసివచ్చెను. ఒకపదమ కొక్కటేయర్థమనియుపర్యాయపదములుండ నేరవని వీనికి సూక్ష్మార్థములు కలవనియు భాషాతత్వమును గు రిగినవారందరు జెప్పుచున్నారు. ఇదియేగాక, ఒ అర్థమున వేరువేరు పదముల నుపయోగించుట శాస్త్ర సమ్మతమగు వ్యుత్పత్తికాదు. మనము పద్యయుగమును గద్యయుగమున జొచ్చియున్నాము. అందుచేత పర యపదముల ఉపయోగముకూడ నశించినది. అవికావ సినవారు నిఘంటువులలో చూచుకొనవచ్చును. ఆంధ్ర భాషాసర్వస్వమున నీపర్యాయపదములజంపివైచి, శ ము-దానియర్థము, వివిధప్రయోగములతో ప్రకటించి యెడల ఆంధ్రభాషకు అర్థసంపత్తి గలుగునని నమ చున్నాము. అనగములోని శ్లోకము లిందుదహరించు యనవసరము. శబ్దోత్పత్తి సూచించుటకై విగ్రహము జె నజెప్పవచ్చును. ద్రావిడభాషలలోని పదముల ము చిన ముద్రింపవచ్చును. కాని అకారాదినిఘంటువుల ని వాక్యముల ప్రకటించుట గ్రంథవిస్తరణకు కారణ

పృథావ్యయమును కలిగించునని నమ్ముచున్నాము.

ఈవిధమున ఆంధ్రభాషా సర్వస్వమును రచియించిన, ఆంధ్రదేశమున ప్రస్తుతమువ్యాపించుచున్న నూతనాభిప్రాయములకు చక్కనిరూపముతేర్పడును; ఇంతియేగాక సంస్కృతాంగ్ల సారస్వతములందు వన్నెకెక్కిన పదములను వానిభావములను తెలుగులోనికి దించి, యాధికారికముగ పరిభాష నేర్పరచి, కుకల్పకల్పనలనుండి సద్గ్రంథముల తోడునీడనై- సారస్వత విన్యాసమునకు దారి డొంకలను గల్పించి, యాంధ్రులసంఘకారాగమునుండి తొలగించి మేలును గలిగించు ననుటకు సందియమెక్కింతయు లేదు. ఇట్లుచేయక ప్రాచీనప్రబంధ నిబద్ధమైన పదజాలమునుమాత్రమె గౌరవించుచు భిన్నతత్త్వముగల పదముల పర్యాయములుగ స్వీకరించుచు రచియించినచో, సీతారామాచార్యులవారి నిఘంటువుకన్న సాహిత్యపరిషత్తువారి భాషాసర్వస్వమేమియు ఉపకారము చేయజాలదు. దేశములో మార్పులు గల్గునపుడు ఆయామార్పుల ననుసరించుచు, సారస్వతచరిత్రమున పూర్వ సధ్యసంగముల జిత్రించుచు, వీనివెలుగున నుత్తర రంగమునకు దారిజూపినగాని యాంధ్రభాషాసర్వస్వము సార్థకము కానేరదు; నిర్మాతల ప్రయత్నములు ఫలింపనేరవు.

## ఆంధ్రమాతస్తుతి.

సీ. ఆర్యమాతకుఁబుట్టి యశముచేఁ బూర్వము నాయకమణివలె నమరినావు
"దేశభాషలలోనఁ దెల్గులెస్స"ని బిరుదఖిలదేశమ్ముల నందినావు
రాయలకాలాన రాజిల్లి సత్కీర్తి దైవంబుచాలమిఁ దగ్గినావు
తగ్గితగ్గకమున్న తనయులఁబడసి యాచిన్నతనముఁ బాపఁజేసినావు
తే. గీ. నీ కుమారులు నీపేరు నిల్పురీతి । నీవు భారతమాతను నిగుడఁగాన
శ్రీల విద్యల రాజిల్లఁ జేయలేదె । అఖిలగుణపూత శుభజేత యాంధ్రమాత!

## తెనాలిపురము *

కృష్ణరాయల యాస్థాన కవిదిగ్గజములలోనొక్కఁడై యు కాకపోయినను, ఏమహానుభావుఁడు "సకలభూపాలాస్థాన కమలాకరోదయతరుణ సూర్యోదయుండ"ను ఖ్యాతిగాంచెనో-కలికానకైన నిరర్థకపదము లేకుండఁ గలొలుక్కు పలుకులతోను మురిపెములు గులుకు తీయములతోను ముద్దులు మూటలుగట్టు సమాసములను మానసమును సంతోషసాగరమున డోలాకేళిసల్పు నవిచిత్ర కల్పనములతోను రసగుంభితముగ స్థలపురాణమును ధూర్జటి శ్రీనాథాదులవలె ప్రబంధరూపమున నిర్మించి కృతినాయకునిచే

"ఉదయంబ స్తనగంబు సేతువుహిమ
వ్యూహంబునుంజుట్టిగా
విదితంబైన మహీమహేంద్రకవితా
విద్యాబలప్రౌఢి నీ
కెనురేరీ సకలార్థబోధనపటనా
హేలాపరిష్కారశా
రద నీరూపము * *"

అని తగుకీర్తి సమకాలికులైన మహాకవుల శిరో

* ప్రథమ గుంటూరుజిల్లా గ్రంథాలయ ప్రతినిధుల మహాసభకు ఆహ్వాన సంఘాధ్యక్షులగు కొండముది శ్రీరాములుగారి ఉపన్యాసమునుండి గ్రహింపబడినది.

వణిగఁ గొని యాడఁబడియెనో-యాపాండురంగ క్షేత్ర మహాత్మ్యవిధాన మాకవి సహకారవసంతుఁ డాకావ్య రససుధారసుండనకుండెలుఁ డా శ్రీరామకృష్ణుఁ డీనగరము నగ్రహారముగ నేర్పఱచినట్లు ప్రబలాధారములు కలవు. మొదటిది లోకప్రతీతి యటుండఁగ నదియే తనగ్రంథమున "ఆంధ్రభూమీరుచాగ్రహారాభమైన శ్రీతెనాల్యగ్రహారనిర్ణేత"వని కృతిపతి తనను ద్దేశించి చెప్పినట్లు వ్రాసియున్నాడు. రెండవది గమారమి ముప్పాతిక సంవత్సరములక్రింద కావలి వేంకటరామస్వామిగారు తమ దక్షిణహిందూస్థాన కవిచరిత్రమునందు ఇక్కవి కృష్ణామండలములోని తెనాలిగ్రామమున శాలివాహనశకము ౧౩౮౮ సంవత్సరమున జన్మించినట్లును ఈతని యింటిపేరీశ్వరప్రగడ వారయినట్లును వ్రాసియున్నారు. రావుబహద్దరు వీరేశలింగము పంతులుగారు తమ కవిచరిత్రయందతని వాసస్థలము కృష్ణామండలములోని తెనాలి యగ్రహారమనియు అతని పూర్వులు తెనాలికి రెండుక్రోసులదూరమున నున్న గార్లపాటి కాపురస్తులనియు నితఁడు తన నివాసము నచటినుండి తెనాలికి మార్చినట్లెవరో యొకరు వ్రాసిరనియుఁ దెల్పియున్నారు. గురుజాడ శ్రీరామమూర్తిగారు తమ కవిజీవితములలో నిక్కవిది కృష్ణామండలములోని గార్లపాడనియు దానం జేసి యీతని యింటిపేరు గార్లపాటివారనియు నీతని మాతులుం డితఁడు బాలుఁడైయుండ తనగ్రామమైన తెనాలికిఁ గొంపోయి యచ్చటి యీశ్వరుని పేర రామలింగమని నామకరణము చేసెననియు వ్రాసియున్నారు. పైన తెల్పఁబడిన విషయములవలన రామకృష్ణుఁడు తెనాలికి సంబంధించినవాఁడనియు తెనాలి కృష్ణామండలములోని తెనాలియనియుఁ దేలుచున్నది. కృష్ణామండలములో నొండొక తెనాలి లేమి యాతెనాలి యియ్యదియని నిర్ధరింపవలసియున్నది. కాని కొందఱు పెద్దలు "తెనాల్యగ్రహారనిర్ణేత"యను దానిలోని యగ్రహారము నాధారముగ నొనర్చుకొని యాతెనాలి యియ్యది కాదనియు, కవిచరిత్రకారుల యభిప్రాయము లనాధారములగుటచే నరియొక దృష్టాంతము లేనిచో నాతెనాలి యీతెనాలియని కంఠోక్తిగఁ జెప్ప వలనుపడదనియు వాదించుచున్నారు. వారి యాక్షేపణమంత హేతుపోషితమైనది కాదు. ఇచ్చటికో

కమైలుదూరమున నున్న తేలప్రోలు ఒకానొకప్పు డ హారమని చూపుటకు శిలాశాసనములు కలవు. ఇప్పుడ శేరీగ్రామము. ఇట్లె యొకప్పు డగ్రహారములుగ నుండి ప్రస్తుతము శేరీగ్రామములుగ నున్నవి. ఇది యిట్లుం నిచ్చటి శ్రీరామలింగేశ్వరస్వామి యుత్సవిగ్రహ మున లిఖింపఁబడిన యీక్రిందిశ్లోకము పూర్వోత్తరా సందర్భశుద్ధికలదిగా కాన్పించకపోయినను, పై సంశ విచ్ఛేదము జేయుటయే గాక యనాధారములని యా పింపఁబడిన కవిచరిత్రకారుల యభిప్రాయములకు మొసంగి సంశయాస్పదమని విడువబడిన రామకృష్ణ కాలనిర్ణయమునకుఁ దోడ్పడుచున్నది.

శ్రీ తెనాలి నగరేవ్య రాజ య
ద్గార్లపాటి పురరామ పండితః
శుక్ల మాఖసిత పంచమీగురౌ
రామలింగ మమయోత్సవాకృతిం.

ఇందలి గార్లపాడు వీరేశలింగకవిగారు తెలియప చినట్లు తెనాలికి రెండుక్రోసులదూరమున లేదు. సత్తె పల్లి తాలూకాలో నిచ్చటికి సుమారు పది క్రోసులద రమ నున్నది. అచ్చట రామకృష్ణుని శాఖవారయి యాజ్ఞవల్క్యులిప్పటికి పెక్కండ్రుగలరు.

ఆమహానుభావునికి పిమ్మట నిచ్చట పెక్కండ్రు క లు వెలసిరి. వారిలో మతుకుమల్లి మాదన్న, బుచ్చి సింహశాస్త్రిలు, ముదిగొండ బ్రహ్మయ్య లింగమనువా మిగులఁ బ్రశంసనీయులు. మాదన్న సర్వకళాకోవిదుఁడ టచే నాతని చౌషష్టివిద్యల మాదన్న యని పిలుచుచుండె వారు. ఆతఁ డష్టాదశపర్వప్రయుక్తమైన యభినవభార మును రచించియున్నాడు. శాస్త్రిగారు తర్కవ్యాకర ములఁ గూలంకష ప్రజ్ఞ గలవారగుటయే కాక, వైదిని చం కాపరిణయాదుల ననుసరించు నిందుమతీపరిణయమను ప్ర బంధమును వ్రాసియున్నారు. లింగముగారు నృసు ధురవైలని శివహాస్యఖండము నాంధ్రీకరించియున్నా రు. కవితాప్రాశస్త్య మట్లుండ శాస్త్రమునఁ బ్రజ్ఞ చూపి వారు లేకపోలేరు. జ్యోతిష సిద్ధాంతమున నుత్తరసగ్రా ములలో వాడుకలోనున్న పిల్లలమఱ్ఱి పూర్ణయ్య సిద్ధాంతి యీపురవాసుఁడైయున్నాడు.

తెనాలియనునది 'తెరవాలి'యొక్క వికారమని యుం దెగవాలి వాలివధానంతరమునఁ దత్పాతకవిమోచనార్థము శ్రీ రామభద్రునిచేఁ బ్రతిష్ఠింపఁబడిన శివాలయములుగల వాలి, చెవాలి, పెరవాలి, తెరవాలి, గంగాలియను పంచవాలులలో నొక్కటియనియుఁ గొందఱు చెప్ప వినియున్నాను. దీనికి ప్రమాణము కన్పడదు. కాని దీనివలన నేర్పడు పురపురాతనస్థితికి మాత్రమీనగరమందు నుత్తరమునఁగల గృహశిల్పాదులు సాక్ష్యమునిచ్చుచున్నవి. కృష్ణరాయఁడు దిగ్విజయార్థము పోవు మార్గమున నిచ్చటనిల్చి చిలిచరిత్రగల యిచ్చటి గోపాలస్వామికి తేలప్రోలు నగ్రహారముగ నిచ్చినట్లిప్పటికి శిలాశాసనము కలదు.

# ప్రణయభంగము

ల్లగాలికి మేడపైఁ ♦ జానయొకతె
యుని రాకనుగోరుచుఁ ♦ బ్రేమమీరఁ
ంచమను జంద్రకాంతిని ♦ గడపుచుండె
మ మొక్కయుగంబుగా ♦ శ్రమలఁబడుచు.

*　　*　　*　　*

నకాదా మెనట్టులు ♦ పూని చెప్పఁ
సగదావ్యక్తి చక్కని ♦ పూవుబోఁడి
ల! వికసించు మొగ్గను ♦ బోలియుండెఁ
త్తగాఁ బెండ్లియైయున్న ♦ కొమ్మయేమొ?
లువగల్గినదుస్తుల ♦ వెలుఁగుతోడ
ంతఁగొల్పెడురత్నాల ♦ కాంతితోడఁ
ంతిమీరెడు చెలువంబు ♦ కాంతకమరె;
దములేచిక్కకున్నవి ♦ పదతిఁబొగడ.

*　　*　　*　　*

దమూడుము ముంగురుల్ ♦ వీడియాడ
లవిసువుచు సరిచేయఁ ♦ జాలకుండెఁ;
యిపైకెత్తఁ గొర్నాడు ♦ చీరకదలి
ంచికంచుకసల్లదె ♦ కానుపించె.
ందములఁబోలు దంతము♦లుక్కుగులు! చెవులు!
జకాంతులమిళితమా ♦ వనిత చెక్కు
దములు! మోవి! చుబుకంబు! ♦ నహహ గళము!
సిమకాంతులనీనెడు ♦ పసిఁడిబొమ్మ!.
త్తికవునాఁగ సొగసుగఁ ♦ జెలియ చుట్లు
దలకే మొదలకే భర్తఁ ♦ గాంచుకొఱకు
రినట్టులెచూచును ♦ దూరమందుఁ

జలితమాకృక్త భర్తఁగాఁ ♦ దలఁచుచుండుఁ,
దలఁచి దుస్తుల నీటుగాఁ ♦ గొలుపుచుండుఁ,
గొలిపి ప్రియురాక వేగమే ♦ కోరుచుండుఁ,
గోరి శయ్యాగృహంబును ♦ జేరుచుండుఁ,
జేరి దర్పణమునఁజూచి ♦ చెలగి శయ్య
దులిపి కబరినబువ్వు ♦ ల్దురుముచుండుఁ;
దురిమి తిన్నలంబు నస్తరు ♦ నరయుచుండు,
నరసి భర్తను గానక ♦ యార్తిఁజెందుఁ,
జెంది భర్తపటంబును ♦ జేతఁబట్టు,
బట్టి ముద్దిడి రాఁడని ♦ భయమునొందు,
భయముతోఁ జెమ్మటల్గ్రమ్మ ♦ బయలుచూచు,
వేడినిట్టూరుపొక్కటి ♦ విడుచుచుండుఁ
జందురుని జూచి నిస్పృహఁ ♦ జెందుచుండు!

*　　*　　*　　*

"కార్యభారంబు రాకుక్క ♦ కారణంబొ?
దారినేదైన చిక్కు చే ♦ కూరెనేమొ?
పుష్పఫలములకొఱకును ♦ బోయెనేమొ?
మంచినగలను దే నాల♦సించెనేమొ?
క్రొత్తచీరల దుస్తులఁ ♦ గొనెదునేమొ?
ఉన్నపటఁ జాలవనియూహ ♦ నొందెనేమొ?
కొనుటఁ దెచ్చుటఁ జాలను ♦ కొనియెనేమొ?
త్రోవనాటంకమేదైనఁ ♦ దొరగలెనేమొ?
ముచ్చటల్ చెప్ప గడియలో ♦ వచ్చునింక!"
యనుచు సాలోచనంబుగా ♦ నతివ పెదవి
విఱచి, తలద్రిప్పి, నిట్టూర్పు ♦ విడచి, మరలఁ

గులపైఁ బ్రీతిని న్నగో ♦ నుఱిచె నేమొ ?
బల నన్నిటుచేయ న♦న్యాయ మయ్యె!
మతగదయ్యా!”యని కాంత ♦ వగలఁబొగల
శ్రుకణములు రాలె న ♦ గాచిరముగ
టుకున హారముల్ ద్రెంపఁ ♦ జిటుకు చిటుకు
నుమ ప్రాలెకుముత్యాల ♦ ననుకరించి.

* * * *

శ్రుకణములు చూపుల ♦ కడ్డమగుచుఁ
రెటచేరఁగనఁ గన్నుల ♦ భ గనొత్తి
గల నట్టులె చూచును ♦ వరుని కొఱకు.
దములు కొన్నియున్న వాకిలి ♦ వచ్చుననెన్ని
యము. ములైనను గనుపెట్టి ♦ యుండు రాత్రి;
ను నుఁ జెందరు కోర్కెలు ♦ విడువకుంద్రు.

* * * *

ంత యిట్టుల తననుక ♦ కాంతుకొఱకుఁ.
గన్నులెల్లను గాయలు ♦ కాయునట్లు
లేచి, ః సిగయు, వేసర, ♦ విధిని మాని,
‘వచ్చినప్పుడు చెప్పెద ♦ వనితలింతి
నోరు వగచుండఁగూడదు ♦ లోకమందు”
నుచుఁ గోపంబు ముకుపుటం♦బునను దాల్చి
తెఁ రాఁడని పోయెను ♦ భవనమునకు.

* * * *

నైనమ్ముముకడ ధ్వని ♦ వినెను; లేచి
నగమున మేడపైకి ♦ వెళ్లిపనుచు
తిఁ గాంచఁబోలునని యాస ♦ పదువులెత్తి
ట్ట గోడను జేరుచు ♦ నట్టెచూచి
చుక్కగాఁ వచ్చియుండుట ♦ నెఱిఁగి ప్రాణ
కాంతుఁడని పైటసరిచేసి ♦ కాంలిమురిసి,
‘యమ్మ! రానిమ్మ! చెప్పెదఁ ♦ గొమ్మలకును
కోపమిటులుండుననని వేగఁ ♦ జూపుదాన!”
ంతియిట్లని లిల యూపి ♦ నవ్వుకొనుచు
నవనిఁ జూచిన కోపంబు ♦ నాపుకొనఁగఁ
లనె? చిరునవ్వురాకుండఁ; ♦ గాంతుఁ జూచి
కౌఁగిలింపకయుండఁగఁ ♦ గలనె? నేను”
అనుచు నాలోచనంబుల ♦ నబలచేయు
నంతలో భృత్యుఁడొక్కఁడు ♦ తంతినొకటి
తెచ్చి లేమకునీయంగఁ ♦ దెల్లఁబోయి
విప్పిచూచి యక్షరముల ♦ విప్పలేక
దీపమున్జేరెఁ జరచర ♦ పాప మబల.

* * * *

హా! యనుచు నేలకొరగె ♦ నయ్యయ్యొ చదివి
భర్త రానని తంతిని ♦ బంపెనేమొ ?
కాదు కాదక్కటక్కటా ♦ కాంత భర్త
మరణముఁజెందె, హా! జన్మ ♦ మరయఁగల్ల!
సౌఖ్యమనల్ల! కోరికల్ ♦ సమయునెల్ల !

* * * *

కాంతునకుఁ గోపముఁజూపఁ ♦ గడిగినట్టి
ముగిత శిరమునఁ బిడుగుల ♦ మొత్తెనఁజుడు
ప్రణయకోపంబు రూపంబు ♦ భగ్నపఱచెఁ
గట్టి! విధిచేష్టములమీరఁ ♦ గలదెవండు ?
కాంతుఁడిఁకవచ్చునన్న బం♦గారుబొమ్మ!
మురిపములఁ జూపఁదలఁకొను ♦ ముద్దుగుమ్మ!
పతిని బెదరింపఁదలఁచిన ♦ యలుగుకొమ్మ!
నక్కటా! నేలఁ గూల్చెను ♦ పతినిఁ జంపె
కర్మసూత్రంబొ ? దైవంబొ ? ♦ కాలగతియొ !
యొకటి దలపంగ నగును వే♦రొకటి భువిని.

* * * *

* * * *

అయ్యయో! నాథయంచు నా♦యతివ లేచి
ధారధారలు వేడి క♦న్నీరు గార
“వారమైనను గాకుండ ♦ భారమనుచుఁ
గ్రొత్తగాఁ బెండ్లియాడిన ♦ కూర్మిసతిని
సతిని సంసారమున్వీడి ♦ స్వర్గమునకుఁ
బారిపోవుట ధర్మమే ♦ ప్రాణనాథ!
వ్రాయఁదలఁచిన నవలలు ♦ వ్రాయకుండఁ
జేయఁదలఁచిన ధర్మముల్ ♦ చేయకుండ
తల్లిదండ్రుల చివుకులఁ ♦ దలఁపకుండ
భార్యకొసగిన బాసలు ♦ కార్యరూప
మొందకుండఁగ బోవుట ♦ నిందకాదె ?
సత్యమున్దప్పఁదగదయ్య ♦ సజ్జనులకు
ధర్మచారిణి విడుచుట ♦ ధర్మమయ్య
రమ్మ వెనుకకు మరలుము ♦ రావొ ? నాథ !

నీదు నునుమీసములకది ♦ మోదమంద
మోదమొనరించు నేత్రము ♦ లీక్షఁదనొప్ప
నంకతలమందునొప్పు కుం♦తలములకట !
నీవుపంపిన దుస్తుల ♦ నేనుదాల్చి
పరిమళంబుల తైలముల్ ♦ బాగరాచి
నీకురుల్ దువ్వవలె వీడి ♦ పోకుమయ్య !
మోహనాకార ! నాసొమ్ము ♦ దేహమనుచు
నతివమైనట్టి యర్ధాంగి ♦ కదియెచాలు
ననుచుఁ దలఁచితివా ? చెప్పు ♦ మక్కటకట !
ప్రాణముల్ వీడిపోయితే ♦ ప్రాణనాథ !
నన్నుఁ బెండిలియాడిన ♦ నిన్నుఁ బ్రేమ
మెప్ప సంతృప్తిగా నయ్యొ ♦ ముద్దులైన
నీయలేదు ; కైకొనలేదు ; ♦ నీదుసన్ని
ధానమందున సిగ్గుచేఁ ♦ గాననాథ
సిగ్గువిడిచి మనసుదీరఁ♦జేతు బూజ
రమ్మ ! సతినేడిపింపన ♦ ఘుమ్మసుమ్మ !
సౌఖ్యమున్బొందఁగాలేదు ♦ సరసఁజేరి
బిడ్డలన్ గాంచఁగాలేదు ♦ ప్రేమమైనఁ
దేలలేదిట్టిదని జాల♦మేల నాథ !
సౌఖ్యమొందఁగనెత్తిన ♦ జన్మమయ్య !
సాయమెవరయ్య ? నీకిది ♦ న్యాయమయ్య !
యకట ! లోకమునెఱుఁగని ♦ యబలనయ్య !
నీవె దిక్కని తలఁచిన ♦ నెలతనయ్య !
మార్గమెఱుఁగను భయమయ్య ♦ మరలుమయ్య !
చేయిబట్టుక ధైర్యంబు ♦ చెప్పుమయ్య !
రావొ ? పోతివొ ? రాలేవొ ? ♦ ప్రాణనాథ !
వినఁబడవొ ? నాదుప్రార్థనల్ ♦ వేగరాఁగ
నేను నీవెంటవచ్చెద ♦ నిలుము ! నిలుము !

* * * *

అనుచు నాబాల భర్తకై ♦ యడలి యడలి
వేయివిధముల వాపోయి ♦ వెతలనొంది
యింక నీజన్మమేల యం♦చెంచి మదిని
విషముచేఁబోలు యసువుల ♦ విడిచెనపుడె !

* * * *

విషముఁదినకున్న నట్టుల ♦ వెఱ్ఱిచూపు
కన్నులరమోడ్పఁగల్గునె ? ♦ కాంతకకట !
కలుగకుండెనె ? విషవార్త ♦ కాంతవినెను
ప్రణయపూరితహృదయంబు ♦ ప్రాణములకు
నాసఁజెందునె పతిఁబాసి ♦ యైహికసుఖ
జాలమున్బొందఁజూచునె? ♦ చాలు చాలు !
ప్రణయమెంతైనఁ జేయించుఁ ♦ బ్రాణములను
సడలుటాకవింతకాదు ! వి♦షాదమగును.

—వసంతుఁడు

## అర్ధనారీశ్వరము *

ఇది 'స్త్రీవిద్యావసరము నుపేక్షించిన దత్తమండల వాస్తవ్యుల'ను బోధించుటకై, బాలకవి కసిరెడ్డి వేంకట సుబ్బారెడ్డిగారు రచించిన పద్యోపన్యాసము. పరమేశ్వర మూర్తియందుబలె సంఘమునందును స్త్రీ పుంవ్యక్తులు రెండును సమానప్రాముఖ్యమును వహించినవనియు, నట్లగుట విద్యావిషయమున స్త్రీలను దప్పఁజూడరాదనియు వీరి ప్రధానవాదము. గ్రంథనామకరణమునకుఁగూడ నిదియే యుద్దేశమని మనమూహింపవచ్చును. ఆ యాదిమ దంపతులను దొల్తనుతించి, తరువాత నిరువదిపద్యములవఱకు స్త్రీవిద్యాభ్యాసమును గూర్చి ప్రాచీనతాపాశబద్ధులు వేయు ప్రశ్నాభాసములకుఁ దగిన యుత్తరము లొసంగి, మరియిరువదినాల్గుపద్యములచే దానియావశ్యకతను స్థిర పఱుచు కారణముల వివరించి, యాపై నందుచే సంఘమునఁ బరిణమింపఁగల మధురమధుర ఫలములను నోరఁ జవులూరఁ జర్చించి, "మీతరుణీజనంబు విఖ్యాతికి నీతికిం జదువఁగాఁ గృషిసల్పుఁ"డని మనలఁ బ్రార్థించి రెడ్డి

* ఈగ్రంథము వలయువారు కడపజిల్లా ప్రొద్దుటూరు తాలూకా పర్లపాడు గ్రామమునందున్న గ్రంథకర్తగారికి వ్రాయవలెను. వెల రు. 0-3-0.

గారు గ్రంథమును నిర్వహించినారు.

సామాన్యముగ నిందలి యేపద్యమును జదివినను, యతిప్రాసలదాడికిలోనై పెడత్రోవలఁదిరుగక, యార్జవము రక్షించుకొను ధారాళత యీకవికిఁ గలదని నిజముగాఁ జెప్పవచ్చును. "అమరీసుమగాత్రి సమేతము" "అప్పుడ దేశమాత నయనాంచల నిర్భరఘుంఘుమార్భటీక్, జిప్పిలు హర్షబాష్పములు" మొదలగు ప్రయోగము లొండురెండు గీర్వాణభాషయందలి యపక్వపరిచయమును సూచించుచున్నను, నేటియాంధ్రలేఖకులలో ననేకులకన్న నెక్కువగనే వీరికందు నివేశముగలదని యూహింపఁగలను.

ఏశాఖయందైనను బరిశ్రమించువాఁడందలి కాలానుగతములగు పరిణామములను గమనించి నడుచుట తప్పనివిధి. కల్పనాప్రధానమగు ప్రబంధరచనకుఁ గావలసిన నూతనసృష్టిసామర్థ్యము విశాలావకాశము లేమిచే నడుగంటఁగా, నాంధ్రవాఙ్మయము మఱింత హీనదశకు పాల్పడినది. నియమాధీనమగు పదముల పొందికయే కవిత్వమను నభిప్రాయము విధిలేక వ్యాపించినది. పద్యరచనకును వచనరచనకును విషయవిభేదము నాంధ్రులేర్పఱింపలేకపోయిరి. పద్యములయల్లికయే కవిచేయవలయు ప్రధానకార్యమగుటచే నెట్టివిషయమైనను కవిత్వమునకు లక్ష్యముగాఁ బరిణమించినది. భూషణము, దూషణము, ముఖస్తుతి, ఆశుధార, అవధానము, ఉపన్యాసము మొదలగునన్ని విషయములందును కవితప్రవేశింపవలసివచ్చినది. ప్రకృతగ్రంథకర్తగారును నైప్రపంచమునుండి యింకను వెలుపడలేదు. ఆంగ్లేయ విజ్ఞానవిమర్శమును, ప్రాచీన భారతకవితాప్రపంచ పరిశోధనమును గల యాధునిక మహనీయులనేకులీతప్పుఁదలఁపుల నొకప్రక్కసంస్కరించి త్రోవఁజూపుచున్నను, మనరెడ్డిగారివంటి నూతనోత్సాహసంభృతులగు 'బాలకవు' లింకను బాలకవులుగనే యుండుట యాశ్చర్యముగదా! పాశ్చాత్యనాగరకత సోఁకిననాఁటినుండి యెందరో సంస్కారకులు నోరునొచ్చునట్లు సభాభవనములు మాఱుమ్రోయునట్లు పన్యసించి, లేఖినులు మొద్దువాఱుదాఁక వ్రాసి, చాలించుకొనుచున్న యీస్త్రీవిద్యాభ్యాస విషయమునే నేఁడు పద్యరూపమున విమర్శింపఁదొరకొనుటకంటె వేఱొక నిరర్థకకార్యముగలదా? కవితాప్రపంచమున నేమాత్రమును జోటులేని యీవిషయముఁ దీసికొని 'కవిఃకుశఃప్రార్థి' యగుటకంటె, నుపన్యాససంఘమునఁ జేరి వచనరూపమున నీవిషయము ప్రజలకు బోధింపఁ బ్రయత్నించి యుండిరేని, మనకవిగారు ఈయిరువదిపద్యములకై బలివెట్టినంతకాలములో నిట్టివిషయముల మఱి పదింటిని మరింతసుగమముగ సుకరముగ చర్చించి యుండి సఫలతరప్రయత్నులయియుందురు.

కావుననే యీగ్రంథ ముపన్యాసమునుగాక కవితయునుగాక నిజముగ నర్ధనారీశ్వరమే యైనది. ఉపన్యాసదృష్టిచే విమర్శించినను ఇందు విశేషమేమియు లేదు. అభిప్రాయములన్నియుఁ జర్వితములు; వినివిని చాలించుకొన్నవి. అర్ధశ్రోత్రియభావములుకొన్ని, మఱికొన్ని సంపూర్ణముగ నవనాగరకతా పరిణామములు. 'విధువలకుఁబసపిచ్చి వితంతులను ప్రబోధమొనరించుట' స్త్రీలువిద్యావంతులగు ఫలమట. ప్రబోధ మేరూపము? మరలఁ బెండ్లాడవలయుననియా, లేక బ్రహ్మచారిణులుగానుండుఁడనియా? మామిత్రులు వివరింపలేదు. మఱియు 'చిత్రనైపుణి' 'కుట్టుపని' స్త్రీవిద్యాఫలములు. ఇది పాశ్చాత్య నాగరకతాభాసదర్శనమాత్ర భ్రాంతులగువారి యభిప్రాయము. 'అహర్నిశములంబతినోమఁగ నేర్చుట' 'భర్తను శ్రీహరిగాఁగ నేలుట' మొదలగు ఫలములు పురుషుల స్వార్థైకతత్పరతను జాటునట్టివి. ప్రాణిసామాన్యదుర్లభములగు శుశ్రూషా శ్రవణ గ్రహణధారణాది బుద్ధిగుణములు పురుషులకుఁబోలె వారికిని భగవంతుఁడనుగ్రహించి యుండుటచే- నతని యుద్దేశము జిత్తప్రచ్ఛక, తత్ఫలముగ, మానవవిధినిర్వర్తించుటకై, స్త్రీలు విద్య నేర్వవలయునుగాని 'నాయానుకూల్యమునకై, నన్ను సంతోషపఱుచుటకై, నాభార్యవిద్య నేర్వవలయు' ననుట కేవలము కుక్షింభరిత్వము. మఱియు స్త్రీలువిద్య నేర్చినచో 'బాలవితంతుసంహతిలబాలబలుండ' వఁట! 'త్రాఁగుఁబోతులై చెడర'ట! నిజముగ విద్యకును వైరెండింటికిని సంబంధమేమాత్రమేని గలదా? వితంతువుల 'లబాలబ'లు నశించుటకు పునరుద్వాహములో విరక్తియో కారణమగునుగాని విద్యయాకారణము? లేక విద్య

నేర్చినమాత్రాన భర్తలకు నాయున్నాత్రయు గట్టిపడు నా? త్రాగుబోతులైనను విద్యావిహీనులగు హిందూస్త్రీలోనున్నదో, లేక, విద్యావంతులగు పాశ్చాత్యస్త్రీపురుషులయు తదనుసరణధన్యంమన్యులగు హిందువులయు సమాజమునఁ బ్రబలుచున్నదో పరీక్షించినఁగదా తెలియును? ఇట్టిదోషములు కొంతవఱకు నశించుటకు సాంఘికమో రాజకీయమో యగు నిర్బంధము పనికివచ్చునుగాని, కేవల విద్యవలన నేమాత్రమును బొసఁగదని యెంచితిమిగాని స్త్రీలకు విద్య యనావశ్యకమని వాదించువారము గాము. విద్యకు విద్యయే ఫలముగాని వేఱొక్కన నేరయఁగావు. 'ముద్రణసౌలభ్యమునకై గ్రంథకర్తగారీ గ్రంథమునింత 'సంక్షిప్తావస్థలో' వెలువరించిరఁట. 'ద్వితీయ ముద్రణమావశ్యకమైనప్పుడు విస్తరము చేయఁగలదఁట'. ఈ గ్రంథపు ద్వితీయ ముద్రణావశ్యకత యింగారి కేమైనఁ గలుగఁగలదేమోకాని యాంధ్రవాఙ్మయమున కీ ప్రథమ ముద్రణమే చాలునని నాయభిప్రాయము.

రెడ్డిగారు 'ఇరువదిరెండు సంవత్సరముల వయస్సున 'సారసారస్వతోల్లసత్ క్షీరకంఠు' లగావున విమర్శ లేఖినీ కాఠిన్యమునకు విసుగునో విద్వేషమునో వహింపక నిజమగు కవితాప్రపంచమునఁ జరించి యాంధ్రుల పొగడ్తలు వడయుదురని యాశించుచున్నాము. పడయఁగల శుభోదర్కమును దప్పక సూచించునట్టి వారి పద్యములు రెండింక్రింద నుదహరించెదము. చదువరులు చవిచూతురుగాక:—

ఉ. 'అంగనలన్ గళాకలితలైనయెడ
న్మగవారి దక్షి చి
క్కుంగద' యంచుఁ గొందరనరో!
పనులింపగ నింట, బైట, రొ
ట్టెం గొనసాఁగుగాక! యకటా! యిపుడే
గడకొత్తిరాత్రిఁ బెం
పుంగనఁ జంద్రరేఖ, యెటుపట్టును
భంగము కర్మసాక్షికిన్?

ఉ. అలవసివాఁడుగాక, వరియు భర
ణాదులఁజూచి కాక, దు
ర్బలునకుఁగాక, వృద్ధునకుఁ బండనుఁగాక
గుణాభిజాత్యముల్
తెలిసి వధూవరుల్ వలపు దెల్పినమీఁద
మనస్సువచ్చి పెం
డిలి జరిగించు పద్ధతులనే నెలకొల్పఁగ
నేర్వవచ్చుఁబో. (రా. అ.)

## గ్రంథాలయములు-గ్రామములు

ఎల్లవిధముల మానవులు అభివృద్ధినొందుటకు విద్యయే ముఖ్యసాధనము. నాగరికతనొందిన దేశీయులెల్లను నిర్బంధశాసనములను జేసికొని ప్రాథమికవిద్యను ప్రజలకుచితముగా నొసంగుచున్నారు. కీర్తిశేషులగు గోఖలే మహాశయు లెంతొ ప్రయత్నించినను, వారికట్టి యదృష్ట మబ్బలేదు. అయినను నానాట విద్య క్రమాభివృద్ధి నొందుచునేయున్నది.

ముందుగ గ్రామముల స్థితిగతులు బాగుగా విచారించి చక్కబఱచినగాని దేశమభివృద్ధికి రానేరదు. ఉన్నతవిద్య నభ్యసింపగల పట్టణవాసుల సంగతి యటుంచి, ప్రాథమికవిద్య నభ్యసించు పల్లెలలోనివారి సంగతి ముఖ్యముగా విచారించవలయును. వీరికి ఉన్నత విద్య నభ్యసించుటకు గల సౌకర్యములు లేవు. తాము నేర్చిన స్వల్పవిద్యను అభివృద్ధినొందించుకొనుటకును పల్లెలయందు ఇతర అవకాశములులేవు. అందుచేత మార్పునెరుగని వ్యవసాయాదివృత్తులలో ప్రవేశించి శాస్త్రీయముగా నభివృద్ధిపరుచుకొనలేకపోగా నేర్చిన కొద్దిచదువును నయితము పోగొట్టుకొని, నిరక్షరకుక్షులతో సమానులగుచున్నారు. ఇట్టి స్థితిగతులుమారి, గ్రామములు అభివృద్ధిజెందుటకు గ్రంథాలయస్థాపనమే పరమోత్కృష్టసాధనమైయున్నది.

ఎన్ని అంతరాయములొచ్చినను చలించని స్వమతాభిమానులను భక్తాగ్రేసరులను నాటపట్టిన పేరొందిన భారతదేశమున, గ్రామదేవరకో శివకేశవులకో అథవా మొక దేవాలయమైనను లేని గ్రామము కానుపింపదు. దీనిని పవిత్రస్థలముగా నెంచి, ప్రార్థనలు, మొక్కులు, కైంకర్యములు, ఉత్సవాదులు జరుపుచు నెల్లరనాకర్షింపచేయగలుగుచున్నారు. ఉపధూపనైవేద్యాది ఉత్సవములు స్థిరముగా జరుగుటకు మాన్యముల నిచ్చుటచే అవి నిరాటంకముగా జరుగునట్లేర్పరుపబడినవి.

ఇదేరీతి నవీనశతాబ్దమున కావలసిన విద్యాధిదేవతయగు శారదాదేవికి స్థిరత్వమేర్పడుటకుగాను నిలయములను నిర్మింపవలెను. స్వంతభవనమును నిర్మించుటతో స్థిరత్వము సంపూర్ణము కాజాలదు. శాశ్వతముగా నిలుచుటకు భూములను సంపాదించుట అత్యవసరము. అర్చకులవలె గ్రంథభాండారికులకు జీతబత్తెములుగాని, వడి మాన్యములుగాని కల్పించిన బాగుండునని తోచుచున్నది. దేవాలయములు భక్తాగ్రేసరులవలన నిర్మింపబడినట్లు యీకార్యములు దేశాభిమానులవలన కొనసాగింపబడవలసియున్నవి. తాను పుట్టి పెరిగి, తినుటకును, పనుటకును తుదకు గిట్టుటకును ఆధారభూతమైన మాతృదేశముపై భక్తిగలవారెందరో గలరు. తుదకొక్కరయినను ప్రతియూర దొరకరనుట కల్ల. ఈ నూతనాలయంబులయందు గ్రంథపఠనము మాత్రము జరిగిన చాలదు. సాంఘిక వర్తమాన రాజకీయ విషయములనుగూర్చిన ఉపన్యాసములిప్పించుటయు పరికరసహాయముచే వివిధదేశవార్తలను తెలుపుటయు-ఇవియే నిర్వర్తింపవలెను. చిత్రప్రదర్శనములను, శరీరసాధక వ్యాయామములను ఇవియే నెలకొల్పవలెను. జాతీయపండుగలను ఉత్సవములను జరుపుచు, జనులనందర నాకర్షింపజేసి నూతనజవసత్వంబుల నొసంగుటకు గ్రంథాలయములు ప్రయత్నింపవలెను.

నేటిస్థితినిబట్టి వార్తాపత్రిక ప్రచారమునకును గ్రంథప్రచారమునకును గ్రంథాలయములు సహకారిగానుండలేదను వారున్నను అట్లనుట సమంజసము కానేరదు. ఎల్లెడల విరివిగా గ్రంథాలయములు స్థాపింపబడినచో, మిక్కిలి లాభకరముగానుండును. మాతృభాషాభివృద్ధియే మాతృదేశాభివృద్ధికి మూలమగుటచే గ్రంథకర్తలకును, పత్రికాధిపతులకును తగినంత ప్రోత్సాహమిచ్చుటకు విరివిగా గ్రంథభాండాగారముల నేర్పర్చవలసియున్నది.

స్వపరిపాలనావిధానము దేశీయులకు సులభముగా బోధపడుటకుగూడ గ్రంథాలయములు తోడ్పడగలవు. గ్రంథభండాగార పరిపాలనకొరకు కార్యనిర్వాహకసంఘ మేర్పర్చుకొనవలసియున్నది. అందు ప్రతినిధుల నెన్నుకొనుటయు, తగినవారిని ఉద్యోగులుగ నియమించుకొనుటయు అగత్యమైనప్పుడెల్ల సభలు చేర్చి తీర్మానములు చేసికొని ఆప్రకారమాచరించుటయు చందాలు, విరాళములు, వేలములు మొదలగు వివిధముల ధనము పన్నులవలె లెక్కకు తాము విధించుకొని ఖర్చునెట్టుటయు మొదలగు విషయముల నేకములు నిర్వర్తింపబడుచుండును. ఇందువలన స్వపరిపాలకర్తలని నిరూపింపగల అలవాటును అనుభవము సులభముగా నలవడును.

దేశీయుల వాంఛితములు పరిపాలకులకు నివేదించుటకై యేర్పడిన దేశీయమహాసభకు శాఖాసభలుగ రాష్ట్రీయ జిల్లాసభలుమాత్రమె యేర్పరుపబడినవి; గాని తాలూకా గ్రామసభలు నెలకొల్ప ఎంత ప్రయత్నించినను పూర్ణముగా సిద్ధింపదయ్యె. ఈగ్రంథభాండాగారోద్యమమువలన అట్టికొరంతయు తీరగలదు.

ఇటుల గ్రంథాలయస్థాపనము జరిగినకొలదిని గ్రామములలోని అంతఃకలహములు క్రమముగా నశించును. గ్రామస్థులు వివేకులై దేశసేవయందు అభిరుచికలవారగుదురు. స్వల్పతగవులకు సయితము న్యాయసభలకేగి వృథా వ్యయప్రయాసలకులోను గాకుండుటయు కలుగగలదు.

పల్లెలలోనిజనులకు వ్యవసాయమె ముఖ్యవృత్తి కావున పట్టణవాసులవలెగాక యొండొరుల సహాయసంపదల కలవడినవారగుటచే గ్రామముయొక్క మంచిచెడ్డలు తమసంఘమునకు చెందినవేయని గ్రంథభాండాగారికుల హితబోధచే ఐకమత్యము నలవరచుకొని పంచాయతి సభల నేర్పాటుగావించుకొనెదరు. పట్టణములలో పారిశుద్ధ్యసంఘమువారు చేయునటుల గ్రామస్థులు సంఘీభవించిన బురదవీథుల రాలబాటలు చేయుటకును చీకటి రాత్రులలో ముఖ్యప్రదేశముల దీపములు పెట్టుటకును పగలు బాలబాలికలకును రాత్రులు జానపదులకును బీదపాటకజనమునకును పాఠశాలల పెట్టించి విద్యగఱుపుటకును, దేవళములు, చెఱువులు, బావులు, సత్రములు మున్నగువాటిని బాగుపరుచుటకును గ్రామస్థులు పూనుకొనవచ్చును. ఇట్టి పూనికకలుగుటకు గ్రంథాలయములు మిక్కిలి తోడ్పడగలవు.

రొయ్యూర్వారు రామచంద్రప్రసాదరావు

# శ్రీ సుజనరంజనీసమాజము, పొట్లపూడిగ్రామము

## సంగ్రహచరిత్ర.

శ్రీలచెలువొందు విద్యావి - శిష్టులార
దేశభాషాభిమానవ - ర్ధిష్ణులార
సరసకవితాప్రపోషణో - త్సాహులార
కార్యదీక్షానుసంధాన - కరణులార
ప్రీతిసద్బోధలొనరించు - పెద్దలార
వినుత సద్గుణులార క - వీంద్రులార
ఈ "సుజనరంజనీ" సమా - జముచరిత
మార్యులగుమీరు వినిచెద - నయ్యలార
దయను నాలింపుడీగుణ - ధన్యులార
వరపరీధావినామసం - వత్సరమున
మాఘమాసముకృష్ణ ప - క్షంబునంబు
నవమిగడియలుగడచిన - నంతమీఁద
దశమిస్థిరవాసరంబు ను - త్తమదినంబు
కమలహితుఁ డస్తగిరిఁజేరు - కాలమందు
మువురుచెలికాండ్ర మొక్కచో - ముదమువీరఁ
జేరి యామాట యీమాట - చెప్పుకొనఁగ
దేశకాలనాగరకతఁ - దెలసినడుచు
మనుజ జన్మంబుసార్థకం - బనుచుఁదెలిపి
ఇపుడు మనదేశమున విద్య - లేమిఁజేసి
బహుళకష్టంబులెల్ల సం - భవములయ్యె
మున్ను మనపెద్దలొనరించు - చున్నయట్టి
శిల్పములుఁజేతి పనులు న - శించిపోయె
మనధనంబెల్ల పరదేశ - ములకుఁజేరె
నన్నిటికిఁగారణంబు వి - ద్యావిహీన
మనుచు మాముప్వురందు ప - ట్టాభిరామ
రెడ్డిగారువచింప హ - ర్షించియిందు
కేమిసదుపాయమనివారి - నేయడుగఁగ
మనమొకసమాజముగఁజేరి మాసమునకు
కొంతచందాను వేసి చే - కొనిరయమున
దేశభాషను వెల్గు ప - త్రికలు కొన్ని
వ్రాసి తెప్పించి చదువవా - రలకు నిచ్చి
చదువబోధించి క్రమముగా - శక్తికొలఁది
గ్రంథముల సేకరింపఁగా - గడగవలయు
ననుచుబోధింప నిదిమంచి - దనుచునపుడె
సరవిదీనికి "సుజనరం - జనీ" సమాజ
మనుచుఁ బేరిడి శక్తిచం - చనములేక
బోధనము సేయుచుండ మా - పోషకులగు
ఘనయుదారస్వభావులై - దనరు పోసక
సుబ్బరామయ్య గ్రంథముల్ - సారదినుంచు
కొనుటకుగృహంబు బీరువా - యును నొసంగి
ఇంకవలసిన సాహాయ్య - మెంతొచేసె
ములనొసంగెను సమ్మదా - మోదగరిమ
నంతిపఠనమందిర పుస్త - కాలయంబు
సారశాలయు నేర్పరిం - పంగనయ్యె
రహిని వేదము వేంకట - రాయశాస్త్రి
గారియుమను బ్రదర్శించి - నారవలన
నాద్వితీయాబ్దమందున - నఖిలదిశల
చాలఁగాఁగీర్తిగొన్న గో - పాలకృష్ణ
గోఖలేగారిపేరను, క్రొత్తయూరఁ
బఠనమందిరపుస్తక - భవనమొండు
స్థాపనముఁజేసితిమి ప్రస్తు - తంబునందు
శ్రీయుతుండగు నా "కాట - శేషరెడ్డి"
గృహము నొసఁగెను, బలరామ - రెడ్డిగారు
నాదిగాఁగొందరందు సా - హాయ్యపడిరి
ఈతృతీయాబ్దమందు న - వీనముగను
పగలుపనికేగుచుండెడు - బాలకులకుఁ
గాను నొకరాత్రిబడి విలు - కానిపల్లె
నింకనొకబడి పోట్లపూ - డిని జరుగఁగ
నేర్పరచినార మందందు - నేగి ప్రతి
వీథులనుపన్యసించియు - విదితముగను
నెలమి గరపత్రములు మూడు - నిండుప్రేమ
బంచితిమియంతటను శుభ - ప్రదముగాఁగ
నప్పుడప్డు సమావేశ - మై తదయు
సభను విద్యాయుసంఘు సం - స్కరణమాది
పలుతెరంగులుపన్యాస - ములనొసఁగి
అంచితామోదమున బ్రద - ర్శించినార
మరసితగుకీర్తి సారంగ - ధరునిచరితఁ
బరగఁ గ్రొత్తూరిపుస్తక - భవనమునకుఁ
బొల్పుమీఱంగ మందిరం - బునురచింప
రహిని గడచినసంవత్స - రంబునందు
శంకుస్థాపనమొనరించి - సభను భవన
మప్పుడే కట్టెదమటంచు - నందరెదుటఁ
జెప్పినారము తద్రీతి - సేయలేమి
కెంతగానో వంత బొగిలితి - మేమిఫలము
మీరలీ కారణంబుగ - న్నారుగాదె
పత్రికాముఖమున నంత - నైన వారు
మన్ననపుఁ బత్రికనుబంప - మరలనిపుడు
నెప్పటి విధంబుగానుండ - నొప్పుకొంటి
మింక నైవత్సరంబున - దీనిఁబూర్తి
సేయ యత్నించితిమి భవ - దీయకరుణ
శిష్టజనులార కలదివ - చించినాము
కార్యక్రమమెల్లనిందు సం - గ్రహముగాగ
నమలమతిగూర్చుమాయుద్య - మములకెపుడు

3౮౹A

## శ్రీ సుజనరంజనీసమాజము—పొట్లపూడి.

3౮౹A




వార్షికోత్సవసమయమున దీయబడిన పటము. పటమునందు వెనుకభాగమున సమాజముయొక్క స్వంతభవనము కానవచ్చుచున్నది.

ఈ సమాజమునకు సంస్థాపకులగు



శ్రీ పొణకా పట్టాభిరామారెడ్డిగారు.



# శ్రీ సత్యనారాయణ వరప్రసాద గ్రంథాలయము

## చినపులిపాక - బొడ్డపాడు.

### తృతీయవార్షిక వృత్తాంతము.

పూర్వము బొడ్డడు, పులిగాడు అను యాదవసోదరులిరువురు తమ మేకలను కాచుకొను చుండిరనియు, వారిలో వారికి భాగములవిషయమై వివాదమొంది అది తీర్చుకొనుటకు వీలులేక పెక్కు ఇడుములపాలై వేరు వేరు స్థలములయందు నిదురించుచుండగా ఆ అజసమూహము విడిపోయి సోదరుల సమీపమున వేరై చేరి పండుకొనియుండెననియు, ఆమరునాడు యాదవసోదరులు మేకలు వేరై పండుకొనినప్రకారము భాగములు పంచుకొని బొడ్డడు బొడ్డపాడనియు, పులిగాడు పులిపాకఅనియు పల్లెల నేర్పరచుకొనిరనియు గాథకలదు. ఈ గ్రామములు పురాతనమైనవని చెప్పుటకు జలనాహినివరకును పాటిమన్నుండుటయు భూమిని త్రవ్వినపుడు శిలాకుడ్యములు వెలువడుటయు నిదర్శనములైయున్నవి.

కృష్ణామండలములోని పులిపాక, బొడ్డపాడు వాస్తవ్యులు కొందరు ౧౯౧౩సం॥రం జనవరి ౧ తారీఖున కొన్ని పుస్తకములను సంపాదించి పుస్తకభాండాగారమును నెలకొల్పిరి. ఈగ్రామాదులు సౌతు వల్లూరు ఎష్టేటులోచేరియుండినవై కీర్తిశేషులయిన శ్రీ భాష్యకార్లనాయుడు బహద్దరు జమీందారుగారి భాగమునకు రాబడినవి. వారిచే కొద్దికాలముమాత్రమే యష్టేటుపాలింపబడినను ప్రజలయందు శ్రీ వారు కనుపర్చిన ప్రేమ అపారమైనదని చెప్పగలము. వారు ఏకపుత్రుని విడచి దివికేగిరి. కావున మాపరిపాలకులగు శ్రీ మైనరు రాజాగారిపేర అనగా శ్రీ సత్యనారాయణ వరప్రసాద పుస్తకభాండాగారము అను నామముతో గ్రంథాలయమును నెలకొల్పితిమి. శ్రీ మైనరు రాజాగారు గడచిన ఆనంద సం॥ర దసరాపండుగకు వల్లూరు దయచేయు సందర్భమున మాగ్రంథాలయమునకు విజయముచేసిరి. అట్టితరి శ్రీ వారిని వివిధవాద్యములతో భాండాగారమునకు తీసుకొనివచ్చి స్వాగతిపత్రికను జదివితిమి. శ్రీ వారు తామపుడు మైనరుగానుంటిమనియు పట్టాభిషిక్తులయినవెంటనే ఈ గ్రంథాలయమునకు ఎక్కువ సహాయమును చేయగలమని తమ అభిమానమును వెల్ల మాకు ఎక్కువ ఉత్సాహము నొసంగిరి.

ఈగ్రంథభాండాగారపక్షమున ఈసం॥రము ప్రజనసభలును అప్పుడప్పుడు కార్యనిర్వాహకసభ జరుపబడినవి. ఆంధ్రదినపత్రిక కృష్ణాపత్రికలును తబజారు పత్రికయును వచ్చుచున్నవి. విజ్ఞానచం గ్రంథమండలియొక్కయు ఆంధ్రప్రచారిణీ గ్రంథ యొక్కయు గ్రంథములను తెప్పించుచున్నాము. త్తముమీద నేటికి ౧౬౧ ఆంధ్రగ్రంథములను స గ్రగలిగితిమి. ఈగ్రంథభాండాగారమునకు ప్రతిది వచ్చి చదివెడివారి సంఖ్య ౬గురు మాత్రమే అయిన తృప్తికరముగాలేదు. ఈ గ్రంథభాండాగారమునకు తరగతి చందాదార్లు ౨౧ రును ౨వ తరగతి చంద ర్లు ౪ రును మొత్తము ౨౫ మందిచందాదార్లు కలిగి న్నారు. కావున నెల ౧కి రు ౫-౧౨-౦ లు ఆద ముగలదు. ఈసంవత్సరము ప్రత్యేకముగ గృహ అద్దెకుతీసికొని అందు ఈగ్రంథభాండాగారమును కొల్పితిమి. మాసమాజము యొక్క అగ్రాసనాధి గారు ప్రతినిత్యమును పురాణశ్రవణమును జేసి పెక ప్రేక్షకులను చదువరులను రప్పింపగలిగిరి. ఈవ ము చందాలవలన విరాళములవలనను రు ౧౫౭-౭- వసూలయినవి.

వ్యయము:—

| | |
|---|---|
| పుస్తకములు తెప్పించినందున | రు ౪౯-౧౩ |
| వార్తాపత్రికలకు | ౧౧-౩ |
| ఇంటిఅద్దె | ౭-౦ |
| పరిచారికకు | ౨-౨ |
| చిల్లరఖర్చు | ౧౨-౧౨ |
| శ్రీ రాజాగారు వచ్చినప్పుడు ఉత్సవమునకుగాను తెచ్చినఅప్పుతీర్చినది. | ౭-౦ |
| వెరశిఖర్చు | ౯౦-౧౪ |
| గాకనిల్వ | ౬౭-౭ |

బొడ్డపాటి హనుమంత రావు,

కార్యదర్శి.

# పాణిని

ఇపుడు మనము మనకు దొరకఁగల యన్నివిషయముల విమర్శించి నిగ్గుతేల్చికొందము. ప్రథమముగ మహావైయాకరణుఁడగు పాణిని మహామునిని మఱియొక మహాకవిని జూచుచున్నారము. 'ఆఫ్రెట్' పండితుఁడు పాణినియను కవికలఁడని తొలుదొలుతఁ దెలిపినాఁడు. మఱియు 'మనచే నింతవఱకు, పాణినిపేర విఖ్యాతుఁ డగు నిబంధకర్తయొక్కఁడే యెఱుఁగఁబడుచుఁగాని మఱియొక్కఁడు తెలిసికొనఁబడలేదు' అనియు వ్రాసినాఁడు. తరువాతఁ బాణినిపేర విశ్రుతులైన నిబంధకర్త లిద్దఱా? లేక యొకపాణినియే నిబంధద్వయకర్తయా? యను ప్రశ్నమునకు నింతవఱకు సదుత్తరము రాలేదు. ఈవిషయమై లోకప్రవాదమైనను భండారుఖండమున నేమూలనైనను గానరాదు. 'ఆఫ్రెట్' పండితుఁడు వారిద్దఱొకరేయని యభిప్రాయపడలేదు. కాని 'సముక్తి కర్ణామృతము'ను గ్రంథమునుండి యీక్రిందిశ్లోకమును అనుమానించుటకుఁ బ్రమాణముగా నిచ్చియున్నాఁడు.

"సుబంధౌ భక్తిర్నః క ఇహ రఘుకారే నరమతే
ధృతిర్దాక్షీపుత్రే హరతి హరిచన్ద్రోఽపి హృదయమ్
విశుద్ధోక్తిః శూరః ప్రకృతిమధురా భారవిగిర
స్తథాఽప్యన్తర్మోదం కమపి భవభూతిర్వితనుతే"

ఈశ్లోకమునం దుపయోగింపఁబడిన 'దాక్షీపుత్ర' శబ్దము, పాణిని కవికి, పాణినిమునికి, నైక్యమాపాదింపఁ గొంచెమనుకూలముగా నున్నదని 'ఆఫ్రెట్' పండితుని యాశయము. మఱియు రాజశేఖరకృతమయిన హారావళి సూక్తిముక్తావళియను గ్రంథములందుఁగల యీక్రిందిశ్లోకముచే వారిద్దఱొకరే యనిస్పష్టమగుచున్నది.

'స్వస్తిపాణినయే తస్మై యస్యరుద్రప్రసాదతః
ఆదౌ వ్యాకరణమ్, కావ్యమను జాంబవతీజయమ్"

(ఎవనికి, ఈశ్వరానుగ్రహముచే దొలుత వ్యాకరణమును దరువాత జాంబవతీజయమును రచింపనాయెనో అట్టిపాణినికి నమస్కారము)

'పిషెల్' పండితుని మతమునందు, ఆనందవర్ధనునికంటెఁ బూర్వకాలమున నెవఁడును పాణిని కవికృత నిబంధనమునుండి, ఉదాహరణమును గైకొనలేదు. ఆనందవర్ధనుఁడు స్వగ్రంథమున

"ఉపోఢరాగేణ విలోలతారకం
తథా గృహీతం శశినా నిశాముఖమ్
యథా సమస్తం తిమిరాంశుకం తయా
పురోఽపి రాగాద్గలితం న లక్షితమ్"

అనునిశ్లోక ముదాహరింపఁబడినది. 'పిషెల్' పండితుఁడా సంశక్తిగోలఁది పాణినివృత్తమును రెండు పత్రములలో వ్రాసి తుదకుఁ బాణిని కవికిని పాణిని మునికిని ఐక్యమునే యాపాదించినాఁడు. భండారకార ప్రభృతులు పాణినికవి యొనరించిన శ్లోకములరీతి శుష్కమై వ్యాకరణలేఖిని నుండి యెప్పుడును నిస్సృతము కాదని వారికి భేదమునే చెప్పుదురు.

నామలింగానుశాసనకర్త యగు రుద్రటుని కావ్యాలంకారము గ్రంథపుఁటీకయందు చ్యుతసంస్కారదోషప్రకరణమున, పాణినికవిప్రోక్తమగు 'పాతాళవిజయ' మను మహాకావ్యమునుండి 'మహాకవుల కృతులయందును, చ్యుతసంస్కారదోషము ఘటించును' అని చూపుకొనుచు, ఈశ్లోక ముదాహరింపఁబడ్డది.

గతేఽర్ధరాత్రే పరిమందమందం
గర్జన్తి యత్ప్రావృషికాలమేఘాః
అపశ్యతీవత్సమివేందుబింబం
తచ్ఛర్వరీ గౌరవ హుంకరోతి"

ఇంతియకాక, 'జాంబవతీ విజయ'మను మఱియొక మహాకావ్యమును వినఁబడుచున్నది. దానినుండి అమరకోశటీకలో రాయముకుటునిచే నీసగముశ్లోక ముదాహరింపఁబడ్డది.

'పయఃపృషన్తిభిః స్పృష్టా
వాన్తి వాతాః శనైః శనైః"

మఱియు పండితనారాయణమూలజీయచ్చొత్తించిన చిన్నకాముదియందు, కొన్నిచోటుల పాణిని కృతమగు జాంబవతీ విజయమునుండియు, పాతాళవిజయము నుండియు, కొన్నిశ్లోకపాదములెత్తివ్రాయఁబడినవి. ఈ

జాంబవతీ విజయము పాతాళవిజయము నొకటియేయని యూహింపనయ్యెడిని. ఏలన జాంబవద్విజయముకొఱకు పాతాళము ప్రవేశించిన శ్రీకృష్ణునకు జాంబవతికిని బరిణయమునుగూర్చియే చెప్పుటవలన రెండు నొకటియే యని తోఁచెడిని. పాణినికృతములగు కొన్ని శ్లోకములు నిచట నుదాహరించినచో మునికృతములా కవికృతములా యనుసంకోచము తీరునని యటు లొనరించుచున్నాఁడను

"అసౌగిరిః శీతలకందరస్థః
పారావతో మన్మథచాటుదక్షః
ఘర్మాలసాంగీం మధురాణికూజన్
సంవీజతే పక్షపుటేన కాంతామ్॥

ఉద్బుద్ధేష్వ సుదూరంషున జనిత తమః పూరితేషు ద్రుమేషు ప్రోద్గ్రీవం పశ్యపాదద్వయనమితభవః శ్రేణయః ఫేరవాణామ్। ఉల్కాలోకైఃస్ఫురద్భిర్నిజ వదన దరీ సర్పిభిర్వీక్షితేభ్యః శ్చ్యోతత్సాంద్రం వసాభ్యః కుధితశవ వపుర్మండలేభ్యః పిబన్తి॥ చంచత్పక్షాభిఘాతం జ్వలితహుత వహ ప్రౌఢధామ్నశ్చితాయాః । క్రోడాద్వ్యాకృష్టమూర్తేరహమహమికయా చండచంచుగ్రహేణ సద్యస్తప్తం శవస్య జ్వలదివపిశితం భూరిజగ్ధ్వాఽర్ధ దగ్ధమ్ పశ్యాంతః ప్లుష్యమాణః ప్రవిశతి సలిలం సత్వరమ్ వృద్ధగృధ్రః॥ కహ్లారస్పర్శగర్భైః శిశిరపరిచయాత్ కాంతిమద్భిః కరాగ్రైః శ్చంద్రేణాలింగితాయా స్తిమిరనివసనేస్రంసమానే రజన్యాః। అన్యోన్యాలోకినీభిః పరిచయ జనితప్రేమ నిస్యందినీభి ర్దూరారూఢే ప్రమోదే హసితమివపరిస్పష్టమాశాసఖీభిః॥ పాణౌశోణతలేతనూదరి దరక్షామాకపోలస్థలీ। విన్యస్తాంజన దిగ్ధలోచనజలైః కిమ్మ్లానీమానీయతే। ముగ్ధే! చుంబతు నామ చంచలతయా భృంగః క్వచిత్కందలీ । మున్మీల న్నవమాలతీ పరిమళః కింతేన విస్మర్యతే॥

ముఖానిచారూణి ఘనాః పయోధరా
నితంబపృథ్వ్యో జఘనోత్తమశ్రియః
తనూనిమధ్యానిచయస్యసోఽభ్యగాత్
కథంనృపాణాం ద్రవిడీజనోహృదః॥

ఇట్టిరసవంతములగు శ్లోకములు పాణిని మునికృతములేయగుచో మూలఁబడిపోయి యుండవని నాతలంపు కాని శుద్ధవైయ్యాకరణునినోటనిట్టి రసవత్తరములగుశ్లోకములుపుట్టునాయని సంకోచించు రామకృష్ణభండార్కరుగారి తలంపుకాదు. సమస్తశబ్దజాల మెఱిఁగినవాఁడు అర్థము నెఱుఁగఁడా రసము నెఱుఁగఁడా! ఎఱుఁగనని చెప్పుచో నామాట కర్థమున్నది కాని 'ఎఱుఁగఁడు అనుటలోఁ బూర్వజన్మజ్ఞానము కావలయును. 'ఎఱుఁగు ననుటలోమాత్రము ప్రమాణముకలదాయనుశంకకు, దృఢమగు ప్రమాణము గొరుకునంతవట్టును ప్రత్యుత్తరము లేదనుటయే సమాధానము. 'రసవంతములగు నీశ్లోకము లెవరివయినను, ఏలబయటికి రాలేదు'? అనుచో నిక్కము రసవంతములయినవి యెన్ని మూలఁబడిపోవలేదు! వానిలో నివి యేవియును పాణినిమునివియేయగుచో నిట్టిదుస్థితికి బాలుగావని నాయభిప్రాయము.

## ఉపసంహారము.

నేఁటికాలమున శబ్దజాలమునకంతకుఁ బ్రామాణ్యమ వహించిన యీమహామునిచరిత్ర మింతచిన్న వ్యాసములో అంతయు వ్రాయ వీలుపడదు కావున నిప్పటి కీకొలఁది యెల్లలఁజూపివిరమించి ముందుమహాభాష్యకారుఁడగు పతంజలి చరితమును జర్చింపనెంచెదను.

(ముగింపబడినది)

—వేలూరి శివరామశాస్త్రి

# ఆర్షపుస్తకభాండాగారము, విశాఖపట్నము.

శ్రీపరవస్తు వేంకటరంగాచార్యులవారు సుప్రసిద్ధసంస్కృతపండితులు. వారు గతసిద్ధాద్రినామసంవత్సరమున "వైన్నకోపడితూ ప్రీటాలికా" యను నాంగ్లగ్రంథమును చూచి సంస్కృతమున కట్టి గ్రంథమును రచింపుమకట్టి 'శబ్దార్థసర్వస్వ'మను పేర నారంభించిరి. శబ్దములు వాని అర్థములు వీని సర్వస్వమును ఇందుగ

గాన పేరు సార్థకము. ఆగ్రంథమును ప్రారంభించి ‘ఆ’ అను నక్షరముల ఆదియందుగల భాగములుమాత్రము ముద్రింపించి వికారిసంవత్సరమున స్వర్గస్థులైరి. గ్రంథకర్తకై వారు స్వయముగ వ్రాసియును వ్రాయించియును వెలకు కొనియును అపూర్వములును దుర్లభములును అముద్రితములు నగు అనేక వ్రాతగ్రంథములను సేకరించి యుండిరి. ఇంతియకాక విశేషముగ ద్రవ్యము వ్యయముచేసి ఈదేశమునను దేశాంతరములలోను ముద్రింపబడిన గ్రంథములనుగూడ సంపాదించిరి. ఆవ్రాతప్రతులకెల్ల జాబితాను గవర్నమెంటు ఆర్టుకాలేజి రంగాచారిగారు మద్రాసు గవర్నమెంటువారి యాజ్ఞానుసారముగా అచ్చొత్తించి రిపోర్టు పుస్తకమునందు ౫౫౭ - ౫౮౬ పేజీలయందు ప్రకటించి యున్నారు. ఇంతియకాక వారి సోదరులగు గీతాభాష్యప్రియసారార్థ్యనేక గ్రంథనిర్మాతలగు శ్రీనివాస జగన్నాథస్వామి అయ్యవారలు అనేక గ్రంథములను సంపాదించి ద్విగుణముచేసిరి.

ఇట్లు సంపాదింపబడిన గ్రంథములకెల్ల “ఆంధ్ర పుస్తకభాండాగార”మని పేరిడి విద్యాసక్తిగలవారెల్లవచ్చి చదివికొని యుపయోగపడుచున్నట్లు ప్రస్తుతమేర్పాటు చేయబడినది. వారిపౌత్రుల ప్రయత్నములచే నేటివరకు సంపాదింపబడిన గ్రంథములసంఖ్య యతివృద్ధియగుచున్నది.

ఈగ్రంథాలయమునందుగల అచ్చుపుస్తకముల సంఖ్య ౧౫౪౮; వ్రాతప్రతుల సంఖ్య ౧౧౨౫. చెన్నపురి గవర్నమెంటువారు ప్రచురించుచున్న గవర్నమెంటు ఓరియంటలు సంస్కృతగ్రంథములను, ఓరియంటల్ లైబ్రరి కాటలాగులను, మ్యానుస్క్రిప్టు రిపోర్టులను ఈగ్రంథాలయమునకు ఇచ్చుచున్నారు. ‘గవర్నమెంటు ఓరియంటల్ లైబ్రరీసిరీస్’ అను పేర మైసూరు గవర్నమెంటువారు భట్టభాస్కరీయ వేదభాష్యము మొదలగు అనేకాపూర్వ మహాగ్రంథముల నచ్చొత్తించుచు లోకోపకారము చేయుచున్నారు. వానినెల్ల ఈగ్రంథాలయమునకు ఇచ్చుచున్నారు. తిరువాన్కూరు గవర్నమెంటువారు ‘త్రివేంద్రమ్‌సాన్‌స్క్రిట్‌సిరీస్’ అను పేర అనేక సంస్కృత మహాగ్రంథములను ప్రచురించుచున్నారు. వారును వానినెల్ల దీనికిచ్చుచున్నారు. బొంబాయినగరమునందున్న నిర్ణయసాగర ముద్రాక్షరశాలయందు ప్రచురింపబడుచుండిన ‘కావ్యమాల’ యను గ్రంథమాలలోని అనేక గ్రంథములను నానాటికి

జయపూర్ (రాజపుతానా) నివాసియునగు పండిత కేదారనాథ సాహిత్యాచార్యులుగారు ఇచ్చినారు. రావుబహదూరు కందుకూరి వీరేశలింగం పంతులవారు వారిచే రచింపబడిన పుస్తకములను ప్రకటించిన ప్రాచీన గ్రంథములనెల్లను దయచేసినారు. శ్రీమాన్ వనస్వారకం అనంతాచార్యులవారు వారి వైజయంతీ ముద్రాక్షరశాలలో ముద్రితములైన భగవద్భాష్యాదులగు నాగరగ్రంథములనొసంగియున్నారు. ఆనందముద్రాశాలాధికారులైన వేమూరువారు భారతభాగవతాది గ్రంథములనెల్ల నెన్నె ‘యెడిషన్లు’ వేసిన నన్నిటిని ఒసంగుచున్నారు. అడయార్ లైబ్రరీవారు వారిచే ప్రచురింపబడుచున్న సంస్కృత గ్రంథములనెల్ల దయచేయుచున్నారు. కేంబ్రిడ్జి నగరమున ప్రకటింపబడుచున్న ‘హార్వర్డు ఓరియంటల్ సీరీజ్’ అను పుస్తకమాలను ఆయూనివర్సిటీవారు ఈపుస్తకభాండాగారమునకు ఇచ్చుచున్నారు.

ఈగ్రంథాలయములోని అనేక యముద్రితగ్రంథములకు వ్రాతప్రతులను మద్రాసుగవర్నమెంటు లైబ్రరీవారు వ్రాయించి ఆలైబ్రరీలో నుంచియున్నారు. పూనానగరమందున్న ‘డక్కన్ కాలేజి లైబ్రరి’ నిమిత్తము కొన్ని గ్రంథములయొక్క ప్రతులను వ్రాయించుకొనిరి. హార్వర్డు ఓరియంటల్ సీరీజ్, బొంబాయి సాన్‌స్క్రిట్ సీరీస్, బనారసులోని చౌకంబా సాంస్క్రిట్ సీరీస్, మద్రాసులోని ‘ఆనందాశ్రమ గ్రంథమాల’, కంచిలోని శాస్త్రముక్తావళీ- మొదలగునవి ఈలైబ్రరీ నుండి నాకరగ్రంథములను తెప్పించుకొని ప్రమాణముగా శోధించి తమ గ్రంథములను ప్రకటించుకొనిరి. ఈగ్రంథాలయమునందలి గ్రంథముల నాధారముగాబట్టి పూనానగరములోనున్న ‘ఇండియన్ ఆంటిక్వేరి’లోను కలకత్తానగరములోని ‘ఏషియాటిక్ సొసైటీజర్నల్’లోను ఇంక ననేక సంస్కృత పత్రికలలోను గ్రంథకర్తలను గూర్చియు గ్రంథములంగూర్చియు చర్చలు ప్రచురింపబడియున్నవి.

లండన్ నగరములోని ‘ఇండియా ఆఫీస్ లైబ్రరి’ నుండియు ఆక్స్‌ఫర్డు నగరములోని ‘బోడ్లియను లైబ్రరి’నుండియు ‘ట్యూబింగన్’ (జర్మని) నగరములోని యూనివర్సిటీ లైబ్రరీనుండియు, ప్యారిస్ (ఫ్రాన్సు) నగరములోని ‘నేషనల్ లైబ్రరి’నుండియు, బనారస్, బొంబాయి, కలకత్తానగరములలోనున్న ఇండియా గవర్నమెంటువారికి లెక్ష్ననుసారము డమ్ము అనేకాపూర్వ మహాగ్రంథములకు ప్రతులను మహానుభావులు గ్రంథకర్తలు తెప్పించి ఈగ్రంథాలయమునకు వ్రాయించి ఇచ్చియుండినారు.

1 అహింస:—ఇందు మాంసభక్షణము, మద్యపానము, జాతరలు, మున్నగు దురాచారములు ఖండింపబడినవి. 2 నారీరత్నములు. 3 రామమోహన తారావళి.

ఈమూడు పుస్తకములు రు 0-2-6 లు పోష్టుబిళ్ళలు పంపువారికి పంపబడును. వలయువారిట్లు వ్రాయవలెను:—కార్యదర్శి రామమోహన మిషన్, బెజవాడ.

## ఉచితము

పోష్టు ఖర్చులకుగాను రు 0-2-6 ల బిళ్ళలను పంపు ఆంధ్రగంథాలయము లన్నిటికిని ఈక్రింది గ్రంథములు ఉచితముగా పంపబడును:—

౧ శ్రీధర్మబోధిని, ౨ శ్రీనీతికథామంజరి—మంగిపూడి వేంకటశర్మగారిచే రచియింపబడినవి. 3 గ్రాంథికభాష-గ్రామ్యభాష: కూచినరసింహముగారు. ౪ వ్యావహారికభాషాసాంప్రదాయవిమర్శనము: ఉండవల్లి నాగభూషణంగారు. ౫ కన్యాశుల్క-స్థగ్రామ్యభాషావాదవిమర్శనము: కాశీభట్ట బ్రహ్మయ్యగారు. ౬ విమర్శాదర్శ (మొదటిభాగము) ౭ విమర్శాదర్శ (రెండవభాగము) ౮ విమర్శాదర్శ (మూడవభాగము) ౯ క్రొత్తతెలుగు- మంచితెలుగు, పులులదండలు-పూలదండలు.

10 A brief account of agitation against modern Telugu.

వలయువారిట్లు వ్రాయవలెను:—ఆంధ్రదేశ గ్రంథభాండాగారసంఘ కార్యదర్శి, బెజవాడ.

## ౧ మనోరమావిజయసేనము

(ఐదు అంకముల నూతననాటకము)

అయ్యంకి కుటుంబరాయ విరచితము. వెల రు ౦—౮—౦.

ఇందలి కథ దేశవిఖ్యాతచారిత్రుడగు రమేశచంద్రుని "మనోరమ" యను నవల ననుసరించి వ్రాయబడినది. అస్సాముదేశములోని తేయాకుతోటలలో పనిచేయుటకై జనులను మోసపుచ్చి తీసికొనువెళ్లు విధమును, అచ్చట ఆకూలిజనులను పెట్టుబాధలను లోకమునకు వెల్లడించుటకై రమేశచంద్రదత్తుగారు నవలను వ్రాసియుండిరి. నాటకరచన కనుకూలముగ నుండుటకై స్వల్పముగ కథ మార్చి వ్రాయబడినది. శైలి రసవంతముగనున్నది. వెల రు ౦—౮—౦.

## ౨ మతసంఘవిషయకోపన్యాసములు

ఇందు స్వదేశప్రోత్సాహము, వితంతూద్వాహము, సంఘ సంస్కరణయొక్క ఆవశ్యకత, మాంసభక్షణము మొదలగు విషయములు మిక్కిలి చక్కగ చర్చింపబడినవి. వెల రు ౦-౮-౦.

## 3 మహర్షిదేవేంద్రనాథ ఠాకూరుగారిధర్మోపదేశములు

ఉపనిషదుద్ధృతములును, సర్వమతసమ్మతములును, భక్తజనాహ్లాదకరములును, దేశవిఖ్యాత మహర్షి దేవేంద్రనాథ విరచితములును నగు 25 ధర్మోపదేశములు మొదటిసారి తెలుగున ప్రచురింపబడినవి. వెల రు ౦—౮—౦.

☞ ఈమూడు గ్రంథములును ఒకేసారి కొనువారికి ఒకరూపాయకే ఇయ్యబడును. వలయువారిట్లు వ్రాయవలెను. కార్యదర్శి రామమోహన ధర్మపుస్తక భాండాగారము, బెజవాడ.

RS VMOIA104
3ు౬౪

# కలాభివర్ధనీగ్రంథనిలయము

శ్రీకృష్ణదేవరాయని చిత్రపట ముచితము

ఈగ్రంథనిలయమునుండి చక్కని బైండుచేయఁబడిన నవలలు సంవత్సరమునకు నాలు ప్రకటింపఁబడును. చందాదారులకు 100 పుటలకు పోస్టేజిగాక రు 0-4-0; ఇతరులకు రు0-6-( చొ॥ ఈయఁబడును. చందాదారులకు ప్రవేశరుసుము రు 0-4-0.

## వార్షికోపాయనము

మా ఆంధ్రసోదరులకును, విశేషించి మాచందాదారులకును వినోదమునకై ప్రతి( వత్సరమును విజయదశమి పండుగులలో వార్షికోపాయన మను నొక బహుమతీ గ్రంథమును ప్ర( టింపఁ బోవుచున్నాము. అందు మనోహరములగు రెండు కథలును, కవిత్వము, సంగీతము, చి( లేఖనము, చరిత్ర, వాణిజ్యము, అర్థశాస్త్రము మున్నగు విషయములనుగుఱించి పండితులచే( యఁబడిన వ్యాసములు, వివిధములగు చిత్రపటములును ఉండును. ఆగ్రంథము మా చందాదా( లకు ఉచితముగను, ఇతరులకు పోస్టుకూలిగాక రు ౦-౬-౦ లకును ఒసఁగఁబడును. ఆంధ్ర( బాంధవులు మాకు సర్వవిధములఁ బ్రోత్సాహము గలిగింపఁ బ్రార్థించుచున్నారము.

### వెనుకటి గ్రంథములు.

| | చం॥లకు | ఇతర్లకు | | చందాదారులకు. | ఇతరు( |
|---|---|---|---|---|---|
| నాటకత్రయము | ౧-౦-౦ | ౧-౪-౦ | వీరపూజ (భారతీయవీరుల చరిత్ర) క్యాలికో | ౦-౧౨-౦ | ౧-౦-౦ |
| మిధునానురాగము(నవల) | ౦-౮-౦ | ౦-౮-౦ | ,, రేపరు బైండుది | | ౦-౧౨-( |
| పాణిగృహీతాశ్రవణానంద శృంఖల (విమర్శగ్రంథము) | ౦-౪-౦ | ౦-౬-౦ | | | |

### అనుబంధములు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| కడపటిముద్దు | ౦-3-౦ | ౦-౪-౦ | అనాథబాలిక | ౦-3-౦ | ౦-౪-౦ |
| మోహాలేఖ (గీతమాలిక) | ౦-౦-౬ | ౦-౦-౬ | జలక్రీడ (గీతమాలిక) | ౦-౦-౬ | ౦-౦-౬ |
| ఉత్తరకుమార ప్రజ్ఞ | ౦-౦-౬ | ౦-౧-౦ | | | |

3569

### ఇతర గ్రంథములు.

| | | | |
|---|---|---|---|
| విజయనగరరాజుల కథలు | ౦-3-౦ | చిత్తూరు రాజులకథలు | ౦-3-౬ |

వలయువారు:—మల్లిడి సత్తిరెడ్డిగారు, మానేజరు—కలాభివర్ధనీ,

రాయవరము, రామచంద్రపురముపోస్టు, గోదావరి జిల్లా.

---

ఆంధ్రదేశ గ్రంథభాండాగారసంఘమునకు సంచారకార్యదర్శి కావలసియున్నారు. వారు ఆంగ్లేయభాషయం దు "మెట్రిక్యులేషన్"పరీక్షయం దుత్తీర్ణులయి, ఆంధ్రసారస్వతమునందు పరిచయముకలిగినవారయి యుండవలెను. నెల( కు పదునైదుదినములైన సంచారముచేయుచు, మిగిలినకాలమున ఈ సంఘముయొక్క కార్యస్థానమునందుండి పనులన నిర్వహింపవలసియుందురు. ఈపదవి నభిలషించువారందరును సెప్టెంబరు నెల 15 వ తేదీలోగా "ఆంధ్రదేశ గ్రంథభాండా గారసంఘ" కార్యదర్శిగారి పేర "బెజవాడ"కు దరఖాస్తుల నంపవలెను. సమర్థతనుబట్టి జీతము నిర్ణయింపబడును.

ఇట్లు విన్నవించు విధేయుఁడు, అయ్యంకి వేంకటరమణయ్య, కార్యదర్శి.

| | |
|---|---|
| | మనసు ఫౌండేషన్<br>పుస్తకాల పరిశీలనాపట్టిక |

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A 104 |
| పుస్తకం పేరు | గ్రంథాలయ సర్వస్వము |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 109 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | 334A, 362B, 388B |
| లేని పేజీలు | 1 to 294 |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | PRAGATHI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | No |
| పరిస్థితి | Good |